# Am'maṅgi vēṇugōpāl sāhitya vyāsālu - vimarśaka vyaktitvaṁ

A Dissertation submitted to the University of Hyderabad in partial fulfillment of the degree of

**MASTER OF PHILOSOPHY**

In

Telugu

By


**GADDAMIDI MALLESHAM**

**(Reg. No. 20HTHL08)**


**Supervisor**

**Prof. PILLALAMARRI RAMULU**


**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad – 500046**


**December – 2022**

# అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య వ్యాసాలు – విమర్శక వ్యక్తిత్వం

ఎం. ఫిల్., పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం


పరిశోధన

**గడ్డమీది మల్లేశం**

**(Reg. No: 20HTHL08)**

పర్యవేక్షణ

**ఆచార్య పిల్లలమర్రి రాములు**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

గచ్చిబౌలి, హైదరాబాద్ — 500046

తెలంగాణ


డిసెంబర్ — 2022

# CERTIFICATE

This is to certify that the dissertation entitled **“Am'maṅgi vēṇugōpāl sāhitya vyāsālu - vimarśaka vyaktitvaṁ”** submitted by **Mr. Gaddamdi Mallesham** bearing Registration No.20HTHL08 in partial fulfillment of the requirements for the award of **Master of Philosophy in Telugu** is a bona fide work carried out by him under my supervision and guidance.

The Dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Further the student has passed the following courses towards fulfillment of course work required for M.Phil. (Recommended by the Doctorial Committee) on the basis of the following courses passed during his M.Phil. programme.

**Publications:**

Parts of this dissertation have been: (NOT EXACT PARTS) discussed in the following papers have been presented elaborately in the dissertation.

1. **“Am'maṅgi sahr̥daya sāhitya vimarśa - vihaṅga vīkṣaṇaṁ” (ISSN 2457-0796).** Vol: 25. Issue: 10, Mūsi Magazine. Pg. No. 51-53. August- 2022, Chief Editor ‘Dr. SAGI KAMALAKARA SHARMA’, 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad – 13, Pin: 500013. Telangana.

| Course Code | Name of the Course | Course credit | Pass/Fail |
|---|---|---|---|
| HT700 | Research Methodology | 4 | Pass |
| HT701 | History of Telugu Research | 4 | Pass |
| HT702 | Specialized Area | 4 | Pass |
| HT703 | Broad Field | 4 | Pass |

**Prof. Pillamarri Ramulu**
Research Supervisor

**Head, Department of Telugu** **Dean, School of Humanities**

# DECLARATION

I, **Gaddamidi Mallesham** hereby declare that this Dissertation entitled **“Am'maṅgi vēṇugōpāl sāhitya vyāsālu - vimarśaka vyaktitvaṁ”** submitted by me under guidance and supervision of **Prof. Pillamarri Ramulu** is my bona fide research work and is free from plagiarism. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

Date: **Gaddamidi Mallesham**

(Regd. No.20HTHL08)

# విషయ సూచిక

**కృతజ్ఞతలు**

**ప్రవేశిక** **పుట.**

**మొదటి అధ్యాయం**

**అమ్మంగి వేణుగోపాల్ – జీవన సాహిత్య రేఖలు (1 – 25)**

1.0. పరిచయం 1

1.1. జననం 1–2

1.2. విద్యాభ్యాసం 2–6

1.2.1 ఉన్నత విద్యాభ్యాసం

1.3. ఉద్యోగ జీవితం 6–8

1.4. కుటుంబం వైవాహిక జీవితం 8–9

1.5. సాహితీ వ్యక్తిత్వం – రచనా వ్యాసంగం 9–17

1.5.1. సృజనాత్మక రచనలు

1.5.1.1. వచన కవిత్వం

1.5.1.1.1. చీకటిలో బతుకునీడ

1.5.1.1.2. మిణుగురు

1.5.1.1.3. పచ్చబొట్టు పటంచెరు

1.5.1.1.4. భరోసా

1.5.1.1.5. గంధంచెట్టు

1.5.1.1.6. తోటంత పువ్వు

1.5.1.2. అమ్మంగి వేణుగోపాల్ కథానికలు

1.5.1.3. అమ్మంగి వేణుగోపాల్ నాటికలు

1.5.2. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన గ్రంథాలు 17–18

1.5.3. అనువాదకులుగా కృషి 18–21

1.5.3.1. అన్య భాషల నుండి అనువదించిన గ్రంథాలు

1.5.3.2. అన్య భాషల అనువాదంలో అమ్మంగి కవిత్వం

1.6. సంపాదకులుగా కృషి 21–23

1.7. గౌరవాలు – పురస్కారాలు 23–24

1.8. పరిశోధనలు 25

**రెండవ అధ్యాయం**

**సాహిత్య ప్రక్రియలపై విమర్శ ( 26 –59)**

2.0. పరిచయం 26

**2.1. నవలలపై విమర్శ 26–41**

2.1.1. మునెమ్మ – కేశవరెడ్డి 28–30

2.1.2. పథేర్ పాంచాలి – భిభూతి భూషన్ బంధోపాధ్యాయ 30–31

2.1.3. త్రిపురనేని గోపీచంద్ – నవలలు 31–34

2.1.4. కొలిమంటుకున్నది – అల్లం రాజయ్య 34–36

2.1.5. పాకుడురాళ్ళు – రావూరి భరద్వాజ 36–39

2.1.6. దగాపడిన తమ్ముడు – బలివాడ కాంతారావు 39–42

**2.2. కథలపై విమర్శ 42–59**

2.2.1. స్త్రీ, దళిత కథలపై విమర్శ 42–48

2.2.2. కుటుంబ ఇతివృత్తం గల కథలపై విమర్శ 48–51

2.2.3. మనో వైజ్ఞానిక కథలపై విమర్శ 51–54

2.2.4. ప్రాంతీయ అస్తిత్వ కథలపై విమర్శ 54–56

2.2.5. వ్యవసాయ సంబంధమైన కథలపై విమర్శ 56–58

2.2.6. గాలివాన – పాలగుమ్మి పద్మరాజు 58–59

**మూడవ అధ్యాయం**

**కవులు, విమర్శకులు, పరిశోధకులపై విమర్శ (60 – 97)**


| | |
|---|---|
| 3.0. పరిచయం | 60 |
| 3.1. హేతువాద కవిపై విమర్శ | **60–65** |
| 3.1.1. త్రిపురనేని రామస్వామి చౌదరి | |
| 3.2. అభ్యుదయ కవులు–సాహిత్యం పై విమర్శ | **64–68** |
| 3.2.1. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) | |
| 3.2.2. దాశరథి కృష్ణమాచార్యులు | |
| 3.3. విప్లవోద్యమ కవులపై విమర్శ | **68–76** |
| 3.3.1. శివసాగర్ | |
| 3.3.2. వరవరరావు | |
| 3.3.3. అలిశెట్టి ప్రభాకర్ | |
| 3.3.4. గద్దర్ | |
| 3.4. అనుభూతివాద కవిపై విమర్శ | **76–78** |
| 3.4.1. వేగుంట మోహనప్రసాద్ | |
| 3.5. విమర్శకులపై విశ్లేషణ | **78–82** |
| 3.5.1. రాచమల్లు రాంచంద్రారెడ్డి | |
| 3.5.2. బాలగోపాల్ | |
| 3.5.3. నాగసూరి వేణుగోపాల్ | |
| **3.6. జానపద సాహిత్య పరిశోధకులపై విమర్శ** | 83–94 |
| 3.6.1. బిరుదురాజు రామరాజు | |
| 3.6.1.1. కాలగర్భంలో కవిహృదయం | |
| 3.6.1.2. జ్ఞానపద వీధుల్లో వేసటే లేని వెర్రి అన్వేషణమ్ము | |
| 3.6.1.3. పరిశోధనే ప్రాణంగా జీవించిన రామరాజు | |
| 3.6.1.4. ఆచార్య బిరుదురాజు రామరాజు | |
| 3.6.2. జయధీర్ తిరుమల రావు | |

**3.7. యాత్రా చరిత్రకారునిపై విమర్శ** **94-97**

## నాల్గవ అధ్యాయం

## పీఠికలు-ముందుమాటల విశ్లేషణ (98 – 123)

4.0. పరిచయం 98-1000

4.1. అమ్మంగి ముందుమాటల విశ్లేషణ **100-123**

**4.1.1. నవలలకు రాసిన ముందుమాటలు**

4.1.1.1. మనోయాత్ర : అంపశయ్య నవలకు ముందుమాట

**4.1.2. కథా సంపుటాలకు రాసిన ముందుమాటలు**

4.1.2.1. తారుమారు కథల సంపుటి

4.1.2.2. బెత్తెడు జాగ కథల సంపుటి

**4.1.3. కవితా సంకలనాలకు – సంపుటాలకు రాసిన ముందుమాటలు**

4.1.3.1. ఈ నేల వెన్నెల కాయనీ : కవితా సంపుటి

4.1.3.2. మిన్నంటి ఎగరటానికి : కవితా సంపుటి

4.1.3.3. గంగాళం : కవితా సంపుటి

4.1.3.4. తట్టెడుమట్టి – పిడికెడు పుణ్యం : కవితా సంపుటి

4.1.3.5. నివురు : కవితా సంపుటి

4.1.3.6. విహారం : దీర్ఘ కావ్యం

4.1.4. పద్యకవితా సంపుటానికి రాసిన ముందుమాట

4.1.5. పరిశోధన గ్రంథానికి రాసిన ముందుమాట

4.1.6. అనువాద గ్రంథాలకు రాసిన ముందుమాటలు

## ఐదవ అధ్యాయం

## అమ్మంగి వేణుగోపాల్ – విమర్శక వ్యక్తిత్వం (124 – 150)

5.0. పరిచయం 124

5.1. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో కవితాత్మక శైలి 125-127

5.2. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో విశ్లేషణ 128–130

5.3. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో పరిశోధనాత్మక దృష్టి 131–132

5.4. వివిధ ప్రక్రియలలో కనిపించే పరిశీలనా దృష్టి 132–138

(అ). నవల

(ఆ). నాటకం

(ఇ). కథ

(ఈ). కవిత్వం

(ఉ). వ్యాసం

(ఊ). మినీ కవిత

5.5. ప్రాంతీయవాద సాహిత్య విమర్శ 138–150

5.5.1. రామదాసు (కంచర్ల గోపన్న)

5.5.2. కవల పిల్లలతల్లి హైదరాబాద్!

5.5.3. దాశరథి కృష్ణమాచార్యులు

5.5.4. కాళోజీ నారాయణరావు

5.5.5. సి. నారాయణరెడ్డి (సినారె)

5.5.6. సామల సదాశివ

5.5.7. శంకరయ్య

5.5.8. పెన్నా శివరామకృష్ణ

**సింహావలోకనం** -------------------------------- 151–152

**ఉపయుక్త గ్రంథసూచి** 153–155

**అనుబంధం – 1** 156–160

**అనుబంధం – 2** 161–165

**అనుబంధం – 3** 166

★★★★★

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి నా అభ్యున్నతి కోసం అహోరాత్రులు శ్రమించి పిల్లలే జీవితంగా గడుపుతూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించిన అమ్మ రుక్కమ్మకు, నాన్న కొమరయ్యకు, నానమ్మ శంకరమ్మకు పాదాభివందనాలు...

**"అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య వ్యాసాలు – విమర్శక వ్యక్తిత్వం"** అంశంపై ఎం. ఫిల్ పరిశోధన చేసేందుకు అంగీకరించిన హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి, ఎం. ఏ స్థాయి నుండి మాకు పాఠాలు బోధించి, నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యతలు వహించి, పరిశోధనలో తగురీతిలో సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహించి, పరిశోధన పట్ల అవగాహన కల్పించిన గురువు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన గురువులు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

ఎం. ఏ స్థాయిలో పాఠాలు బోధించి, నా వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన అధ్యాపకులు పూర్వ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య అరుణకుమారి గారికి, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి గారికి, పూర్వ శాఖాధ్యాక్షులు, డీన్ ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య డి. విజయలక్ష్మి గారికి, ఆచార్య ఎం. గోనా నాయక్ గారికి, కీ.శే. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, డా. బాణాల భుజంగరెడ్డి గారికి, పరిశోధనకు ఉపయోగపడే పూర్వ పరిశోధన సిద్ధాంత గ్రంథాలు అడగగానే ఇచ్చిన ప్రోత్సహించిన డా. డి. విజయ కుమారి గారికి నా

ఎం. ఫిల్ పరిశోధన మీ విమర్శనా వ్యాసాలపై చేయాలనుకుంటున్నా సార్ అని అడగనానే అందుకు అనుమతినిచ్చి, పరిశోధనకు అవసరమైన పుస్తకాలను ఇచ్చిన కవి, పరిశోధకులు, విమర్శకులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

నా ఉన్నతిని ఎల్లవేళలా కాంక్షిస్తూ నా వెన్నంటే ఉండి నన్ను ముందుకు నడిపించే కుటుంబ సభ్యులు అన్న వదినలు ఆనంద్ కుమార్–అనూష, మహేందర్–సౌజన్య, రమేష్–ఉమలకు, అక్క బావ లక్ష్మణ్–మహేశ్వరిలకు...

పరిశోధన ప్రారంభం నుండి వివిధ సందర్భాలలో వచ్చిన సందేహాలను ఎప్పటికప్పుడు తీర్చి నా పరిశోధన పూర్తికావడంలో ప్రధాన భూమిక పోషించిన డా. మంత్రి మల్లేశ్–అనిత దంపతులకు, డా. ఘనపురం సుదర్శన్, శ్రీపతి మారుతి అన్నలకు ప్రత్యేక ధన్యవాదాలు

అనుకోని అతిథులుగా నా జీవితంలోకి వచ్చి అన్ని సందర్భాలలో నా ప్రయాణంలో తొలి అడుగుగా ఉండి, చదువులో సదా నన్ను ప్రోత్సహించే కృష్ణవేణి, శ్రీనివాస్, వినోద్ లకు, నర్సింహులు సార్–సంతోష దంపతులకి, ఎం. ఏ స్థాయి నుండి నాతోపాటు చదువుకుని నాకు అన్ని వేళలా తోడుగా ఉన్న బాలసైదారావు(బాలు), వెంకటేష్, శ్రావణ్ లకు కృతజ్ఞతలు.

నన్ను అభిమానించి, అన్ని సమయాలలో నాకు సహకరించే మధుసూధన్ రెడ్డి, మధుమోహన్, చంద్రకాంత్, ఈర్ల కమలాకర్ అన్న, నూనె మహేష్, పెద్దగల్ల రాజీవ్ అన్నకు, ఇమ్మిడి మహేందర్ అన్నకు, ప్రత్యేకంగా కావలసిన సమయంలో టైపింగ్ కోసం లాప్ టాప్ ఇచ్చిన రోహిత్ కి, దేవేందర్ రెడ్డికి, నా తోటి మిత్రులందరికీ, పరిశోధన సమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ ధన్యవాదాలు...

**మీ**

**గడ్డమీది మల్లేశం**

# ప్రవేశిక

ఒక గ్రంథంలోని ఔచిత్య, అనౌచిత్య విషయాలను, ధ్వని విశేషాలను, శయ్యా సౌభాగ్యాలను, వస్తు నిర్మాణ సౌష్ఠవాన్ని, పాత్రపోషణ, సన్నివేశ కల్పనలు మొదలైన గ్రంథంలోని సర్వ విషయాలను కూలంకషంగా చర్చించి సాహిత్యంలో ఆ గ్రంథానికి ఉన్న స్థానాన్ని నిర్ణయించడాన్ని సాహిత్య విమర్శగా పేర్కొనవచ్చు. ప్రతి విమర్శకుడికి ప్రధానంగా ఉండాల్సిన లక్షణం సహృదయత. సహృదయత అంటే వైయక్తికమైన ప్రశంసలకు, స్వీయ వ్యక్తిత్వానికి, పక్షపాతానికి గురికాకుండా రచయిత పయనించిన బాటలోనే పయనించి, రచనలోని సౌందర్యాత్మకమైన విషయాలను వెల్లడించి పాఠకుల హృదయాలలో భావానుభూతిని కలిగించడం. ఈ లక్షణం ప్రగాఢంగా గల సాహిత్య విమర్శకుడు ఏ సందర్భంలో కూడా స్వీయ ఆవేశాలకు లోనుకాకుండా సమతౌల్యంతో భావావేశరాహిత్యంగా తన విమర్శను కొనసాగిస్తాడు. అమ్మంగి వేణుగోపాల్ గారి సాహిత్య విమర్శలో ప్రధానంగా కనిపించే లక్షణాలు రెండు. మొదటిది సహృదయత. రెండవది నిరాడంబరత. ఈ పరిశోధన ద్వారా ఈ రెండు లక్షణాలతో పాటు వారి విమర్శక వ్యక్తిత్వాన్ని కూడా తెలుసుకునేందుకు ఆస్కారం ఉంది.

**"అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య వ్యాసాలు – విమర్శక వ్యక్తిత్వం"** అన్న పరిశోధనాంశాన్ని పరిశోధన పరిధి దృష్ట్యా మొత్తం ఐదు అధ్యాయాలుగా విభజించుకున్నాను. ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశీలించి, పరిశోధించిన అంశాలను కింద పొందుపరచాను.

మొదటి అధ్యాయం **"అమ్మంగి వేణుగోపాల్ – జీవన సాహిత్య రేఖలు"**. ఈ అధ్యాయంలో అమ్మంగి వేణుగోపాల్ గారి బాల్యం, విద్యాభ్యాసం, వైవాహిక జీవితం, ఉద్యోగ జీవితం, సాహితీ వ్యక్తిత్వం, రచనా వ్యాసంగాన్ని పరిచయం చేస్తూ, అనువాదకులుగా, సంపాదకులుగా అమ్మంగి గారి కృషిని తెలియజేశాను. అదేవిధంగా వారి పరిశోధనలను గురించి వివరించి, సాహిత్య ప్రస్థానంలో వారు పొందిన గౌరవ పురస్కారాలను ఉటంకించాను.

రెండవ అధ్యాయం **"సాహిత్య ప్రక్రియలపై విమర్శ"**. ఇందులో తెలుగులో ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథలపై అమ్మంగి గారు రాసిన వ్యాసాలను గురించి చిన్న చిన్న ఉప విభాగాలుగా

విభజించి పరిశీలించే ప్రయత్నం చేశాను. కథానికలను విశ్లేషించే క్రమంలో స్త్రీ, దళిత, మనోవైజ్ఞానిక, ప్రాంతీయ అస్తిత్వ, వ్యవసాయ సంబంధమైన కథలను విమర్శించేటప్పుడు అమ్మంగి గారి విమర్శక వ్యక్తిత్వం ఎలా ఉంటుందనే విషయాన్ని వివరించాను.

మూడవ అధ్యాయం **"కవులు, విమర్శకులు, పరిశోధకులపై విమర్శ"**. ఈ అధ్యాయంలో విమర్శకులుగా అమ్మంగి కవులు, విమర్శకులు, పరిశోధకుల దృక్పథాలను ఏ విధంగా అర్థం చేసుకున్నారనే విషయాన్ని తెలిపాను. కవులలో హేతువాద, అభ్యుదయ, విప్లవ, అనుభూతివాద కవులను, వారి సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు అమ్మంగి విమర్శనా దృష్టి ఏ కోణంలో సాగింది. విమర్శకులను, విమర్శనా గ్రంథాలను విమర్శించేటప్పుడు కూడా అమ్మంగి పాటించిన సహృదయ దృష్టిని వివరించాను. అదేవిధంగా జానపద సాహిత్య పరిశోధకుల పట్ల అమ్మంగి భావన ఎలా ఉందనే అంశాన్ని ఈ అధ్యాయంలో చర్చించాను.

నాల్గవ అధ్యాయం **"పీఠికలు – ముందుమాటల విశ్లేషణ"**. ఈ అధ్యాయంలో పీఠిక లక్షణాలను తెలుపుతూ, తెలుగు సాహిత్యంలో పీఠికల ప్రాచుర్యాన్ని తెలిపి, దాని స్థానాన్ని వివరించడం జరిగింది. అదేవిధంగా అమ్మంగి గారు నవలలకు, కథలకు, కథానికలకు, కవితా సంకలనాలకు–సంపుటాలకు, పద్య కావ్యాలకు, పరిశోధన గ్రంథాలకు, అనువాద గ్రంథాలకు రాసిన ముందుమాటలను గురించి స్థూలంగా విశ్లేషించి చెప్పడం జరిగింది.

ఐదవ అధ్యాయం **"అమ్మంగి వేణుగోపాల్ – విమర్శక వ్యక్తిత్వం"**. ఈ అధ్యాయంలో అమ్మంగి వేణుగోపాల్ గారి విమర్శక వ్యక్తిత్వాన్ని పరిశీలించాను. ప్రతి విమర్శకునికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. ఆ వ్యక్తిత్వం రచయిత దృష్టిని, రచనలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకుని విశ్లేషించినప్పుడు స్పష్టమవుతుంది. అమ్మంగి గారి విమర్శన వ్యాసాలలోని కవితాత్మక శైలిని వివరిస్తూ, విమర్శలో విశ్లేషణకు ఎంత వరకు ప్రాధాన్యతను ఇచ్చారో తెలిపాను. అదే విధంగా అమ్మంగి విమర్శన వ్యక్తిత్వంలో ప్రధానమైన పరిశోధనాత్మక దృష్టిని గురించి, పరిశీలన దృష్టిని సూక్ష్మంగా పరిశీలించి, ప్రాంతీయ సాహిత్యం, విమర్శ పట్ల అమ్మంగి గారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయనే విషయాలను తెలిపే ప్రయత్నం చేశాను.

## అనుబంధాలు

అమ్మంగి గారి సాహిత్య విమర్శనా కృషికి అనుబంధంగా, ఆధునిక విమర్శ పట్ల వారి అభిప్రాయాలను తెలుసుకునే విధంగా ప్రశ్నావళిని రూపొందించుకున్నాను. **మొదటి అనుబంధంలో** కవి, విమర్శకుడు అమ్మంగి వేణుగోపాల్ గారితో జరిపిన ఇంటర్వ్యూను పొందుపరచాను.

**రెండవ అనుబంధంలో** అమ్మంగి వేణుగోపాల్ గారి విమర్శపై చేస్తున్న పరిశోధనలో భాగంగా వారి విమర్శ వ్యాసాల సంపుటాలపై నేను రాసిన, పత్రికలో ప్రచురితమైన పరిశోధనా వ్యాసాన్ని పొందుపరచాను.

**మూడవ అనుబంధంలో** అమ్మంగి వేణుగోపాల్ గారితో ఇంటర్వ్యూ జరిపిన తరువాత తీసుకున్న ఛాయాచిత్రాన్ని పొందుపరచాను.

# అధ్యాయం – 1

# అమ్మంగి వేణుగోపాల్ – జీవన సాహిత్య రేఖలు

## 1.0. పరిచయం

సమకాలీన తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలలో అభ్యుదయభావజాలమే ప్రధాన లక్ష్యంగా రచనలు చేసినటువంటి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ గారు తెలుగు సాహితీ క్షేత్రంలో అగ్రగణ్యులు. కవిగా, పరిశోధకుడిగా, సాహిత్య విమర్శకుడిగా, నాటికల రచయితగా, కథా రచయితగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా వివిధ ప్రక్రియలలో రచనా వ్యాసంగం చేస్తూ తెలుగు భాషా సాహిత్యాలను సుసంపన్నం చేశారు. తెలుగు భాషాభివృద్ధికి, తెలంగాణ సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన ప్రముఖ వ్యక్తులను, సాహితీవేత్తలను గురించి వివరిస్తూ, సమకాలీన సమాజానికి అనుగుణంగా సాహిత్య విమర్శను కొనసాగిస్తున్నారు.

## 1.1. జననం

డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ 1948 జనవరి 20 న వికారాబాద్ జిల్లా కేంద్రానికి మైలు దూరంలో ఉన్న ఆలంపల్లి గ్రామంలో మదనయ్య, రుక్మిణమ్మ దంపతులకు జన్మించారు. అమ్మంగి వంశం వారు చాత్తాద శ్రీవైష్ణవ సామాజిక వర్గానికి చెందినవారు. వీరి పూర్వికులు తమిళనాడు రాష్ట్రం శ్రీరంగ పట్టణం నుంచి క్రీ.శ. 1880 ప్రాంతంలో వికారాబాదులోని ఆలంపల్లి గ్రామానికి వలసవచ్చి జీవనోపాధి, ప్రజాసేవకై ఆయుర్వేద వృత్తిని నిర్వర్తించారు.

అమ్మంగి పితామహులు కొంత కాలం పాటు కాన్గీ బడులు (వీధి బడులు) నడిపేవారని, వీధి భాగోతాలు ఆడించేవారని సమాచారం. వీరి తాతా తండ్రులు వారి చుట్టు పక్కల గ్రామాలైన వికారాబాదు, కొత్తగడి, గిరిగెంటిపల్లి, అనంతగిరి పల్లి మొదలైన గ్రామాలకు వెళ్ళి ఆయుర్వేద వైద్యం అందించి రోగుల క్షేమ సమాచారాలు తెలుసుకునేవారు. వేణుగోపాల్ పెద్దనాన్న హకీం రామకృష్ణయ్య మంచి ఆయుర్వేద వైద్య నిపుణులు. ఆయన దగ్గరికి చుట్టుపక్కల గ్రామాల నుంచి చాలామంది రోగులు వచ్చేవారు. ఆయన హస్తవాసి చాలా మంచిదని వికారాబాదులోని ముద్ద

మల్లప్ప వంటి ధనవంతులు రామకృష్ణయ్య గారిని ఇంటికి పిలిపించుకొని వైద్యం చేయించుకునే వారని, ఈ విధంగా వారి పూర్వీకులు ఆయుర్వేద వైద్యంలో మంచి పేరు ప్రఖ్యాతులు పొందారని సమాచారం.

వేణుగోపాల్ గారి తాత రామయ్య. ఈయనకి నలుగురు కుమారులు. వారిలో మొదటి కుమారుడు హకీం రామకృష్ణయ్య, రెండవ కుమారుడు రామచంద్రరావు, మూడవ కుమారుడు నంబయ్య, నాల్గవ కుమారుడు మదనయ్య ఈ మదనయ్య కుమారుడే వేణుగోపాల్. అమ్మంగి వేణుగోపాల్ తండ్రి అందరి కంటే చిన్నవాడు. మదనయ్య వికారాబాదులోనే నాల్గవ తరగతి (చారుమ్) వరకు ఉర్దూ మీడియంలో చదువుకున్నారు. ఆ కాలంలోనే భట్టు రామరాజు పంతులు గారి కాన్గీ బడిలో (వీధి పాఠశాల) తెలుగు వాచకాలు, పెద్ద బాలశిక్ష ఇతర వాచకాలు చదివారు. చదువు పూర్తయిన తరువాత మదనయ్య మొదట వికారాబాదు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గుమస్తాగా పనిచేశారు. కొంత కాలానికి అనివార్య కారణాల వల్ల ఆ ఉద్యోగం పోయింది. ఆ తరువాత మదనయ్య తన మిత్రుడు భూపేందర్ సింగ్ సహాయంతో పది రూపాయల నెల జీతానికి మెదకు జిల్లా నారాయణఖేడ్ తహశీల్దారు కార్యాలయంలో మరలా గుమాస్తాగా నియమితులయ్యారు. అక్కడి నుండి వారి ప్రయాణం సాగుతూ జహీరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రలోని నీలంగా, బాల్కీ, ఉద్గిర్ లలో గుమాస్తాగా పనిచేస్తూ ఎన్నో చోట్లకు బదిలీ అయ్యాడు.

మహారాష్ట్ర, ఉద్గిరులలో ఎక్కువ కాలం పనిచేయడం మూలంగా అమ్మంగి వేణుగోపాల్ గారు మరాఠీ మీడియం చదవాల్సి వచ్చింది. మదనయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇంట్లో పెద్ద కుమారుడే అమ్మంగి వేణుగోపాల్, వేణుగోపాల్ గారి తమ్ముడు చక్రపాణి. ఈయన ఆర్టీసీలో యు.డి.సి. గా ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. అమ్మంగికి ఇద్దరు చెల్లెళ్ళు. వీరిది ఉమ్మడి కుటుంబం కావడం మూలంగా అమ్మంగి వేణుగోపాల్ గారు బాల్యంలో ఎంతో సంతోషంగా గడిపేందుకు అవకాశం దొరికింది.

## 1.2. విద్యాభ్యాసం

మరాఠీ మీడియం మూలంగా వేణుగోపాల్ చదువు పాడై పోతుందని భావించిన మదనయ్య ఆ తరువాత కొంత కాలానికి ఆలంపల్లిలోని భట్టు రామరాజు గారి కాన్గీ బడిలో చేర్పించాడు. ఇక్కడనే

వేణుగోపాల్ గారి చదువుకు పునాదులు పడ్డాయి. ఆ పై తరగతులు పెదనాన్న నంబయ్య ప్రోత్సాహంతో వికారాబాదులోని ధర్మ విద్యాలయంలో చదివారు. వేణుగోపాల్ మూడో తరగతికి వచ్చేసరికి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు మూలంగా మదనయ్యకు మరలా నారాయణఖేడుకు బదిలీ అయ్యింది. దాంతో అమ్మంగి కూడా నారాయణఖేడుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ వీరేశం అనే ఉపాధ్యాయుడి మెప్పుతో అమ్మంగి నాల్గవ తరగతిలో చేరాడు. నారాయణఖేడులో అమ్మంగి తన మిత్రులతో ఆటపాటలలో ఎక్కువ సమయం గడిపేవారు. అలా హెచ్.ఎస్.సి వరకు నారాయణఖేడులోనే సాగింది. అమ్మంగి వేణుగోపాల్ ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు దామోదరరావు అనే ప్రధానోపాధ్యాయుడు వచ్చారు. ఆయన హైదరాబాదులోని సిటీ కళాశాలలో డిగ్రీ చేసి వచ్చారని అమ్మంగి  తెలుసుకున్నారు. ఆయన ఖాళీ సమయంలో పిల్లలకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు పెట్టే వారని వారి మూలంగానే వ్యాసాలు చదవడం, రాయడం, పత్రికలు చదవడం అలవడ్డాయని చెప్పారు.

వేణుగోపాల్ తొమ్మిదవ తరగతిలో ఉన్నప్పుడు వేములవాడకు చెందిన నందగిరి అనంతరాజశర్మ గారు తెలుగు పండితులుగా ఆ పాఠశాలకు వచ్చారు. వీరి దగ్గరే అమ్మంగి తొలి సాహిత్య పాఠాలు నేర్చుకున్నారు. వీరే అమ్మంగికి తేటగీతి, ఆటవెలదిలో పద్యాలల్లడం, కవిత్వం రాయడం నేర్పించారు. పండుగల సందర్భాల్లో ప్రతి పండుగకు ఆ పండుగ మీద నాలుగు ఐదు పద్యాలు రాయమని ప్రోత్సహించేవారని అలా వేణుగోపాల్ తొలిసారి సంక్రాంతి పండుగ పైన పద్యాలు రాశారు. అవే "పిల్లలే ఎగరేతురు గల్లులందు/  రంగు రంగుల తోక పతంగులెల్ల" అన్న పాదాలు మొట్టమొదట అమ్మంగి వారి కలం నుంచి జాలువారాయి. ఈ పద్య పాదాలు అమ్మంగికి ఇంకా జ్ఞాపకం ఉండడం విశేషం.  అందుకే అనంతరాజశర్మ గారిని అమ్మంగికి తొలి సాహిత్య పాఠాలు నేర్పిన గురువుగా చెప్పవచ్చు.

అనంతరాజశర్మ మూలంగానే వేణుగోపాల్ గారు చందమామ పత్రికకు చందా కట్టి ఆ పత్రిక చదవడం ప్రారంభించారు. అదే చందమామ పత్రికకు తనకు నచ్చిన కథలను గూర్చి అభిప్రాయాలను లేఖలు రాసి పంపేవారు.  ఒక సారి దాశరథి గారు నందగిరి అనంతరాజశర్మ గారికి "మహేంద్రోదయం" అన్న ఖండకావ్యాన్ని పోస్టులో పంపించారు. ఆ ఖండకావ్యాన్ని అమ్మంగి

అనంతరాజశర్మ గారి ప్రోత్సాహంతో చదివారు. అప్పుడే అమ్మంగికి దాశరథి సాహిత్యంతో తొలి పరిచయం ఏర్పడింది.

ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే రుక్మయ్య గారు హిందీ పండితులుగా వచ్చారు. రుక్మయ్య గారి స్వగ్రామం మెదక్ జిల్లాలోని నర్సాపూర్. గాంధీగారి అభిమాని. తెలుగు వారే అయినా హిందీ మాత్రమే మాట్లాడేవారు. ఈయన స్వాతంత్రోద్యమం గురించి పిల్లలకు తరగతి గదిలో పాఠాలతోపాటు చెప్పేవారు. వీరు పాఠశాల గ్రంథాలయ ఇంచార్జీగా ఉంటూ వేణుగోపాల్ గారికి విలువైన పుస్తకాలు ఇచ్చి చదువుమని ప్రోత్సహించే వారని, వీరి మూలంగానే అమ్మంగికి పదో తరగతికి వచ్చేసరికి పుస్తకాలు చదవడమే ఒక వ్యసనంగా మారిపోయిందని అమ్మంగి వివరించారు. అందుకే అమ్మంగి "తనలో నిజమైన సాహిత్యాభిరుచిని కలిగించి, ఆధునిక సాహిత్యం పట్ల అభిరుచిని పెంచింది మాత్రం రుక్మయ్య గారేనని" ఎప్పుడూ తలుచుకుంటుంటారు. రుక్మయ్య గారే ప్రేమ్ చంద్, శరత్, ఠాగూర్, గోర్కీ, టాల్ స్టాయ్, విక్టర్ హ్యూగో వంటి హేమాహేమీల అనువాద సాహిత్యం చదివించారన్నారు. వీరి మూలంగానే ఈ సాహిత్య పరిజ్ఞానం అలవడిందని అమ్మంగి బలంగా నమ్ముతున్నారు.

### 1.2.1. ఉన్నత విద్యాభ్యాసం

1963లో హెచ్. యస్. సి పరీక్షలో ద్వితీయ శ్రేణిలో పాసయి పి.యు.సి(డిగ్రీ) చదివేందుకు హైదరాబాదు వెళ్ళారు. నిజాం కళాశాలలో పి.యు.సిలో(12 వ తరగతి) ప్రవేశం పొందారు. పి. యు. సిలో అమ్మంగికి పాఠాలు చెప్పిన గురువులు కె. గోపాలకృష్ణారావు, కుటుంబరావు, సీతాకళ్యాణి. వేణుగోపాల్ నిజాం కళాశాలలో చేరిన సంవత్సరమే కళాశాలలో డైమండ్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఆ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, కవితా రచన పోటీలలో అమ్మంగి మొదటి స్థానంలో నిలిచారు. అందుకుగాను విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'ఏకవీర, చెలియలికట్ట' నవలలను బహుమతిగా గెలుచుకున్నారు.

నిజాం కళాశాలలో పి.యు.సి పూర్తయిన తరువాత ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో బి. ఏ డిగ్రీలో చేరారు. ఆచార్య సి. నారాయణరెడ్డి గారు బి. ఏ. మూడేళ్లు, ఎం. ఏ రెండేళ్ళు పాఠాలు చెప్పారు. నారాయణరెడ్డి గారంత గొప్పగా తెలుగు సాహిత్యాన్ని బోధించడం ఎవ్వరికీ సాధ్యం కాదని

వారి గురువు గురించి జ్ఞాపకం చేసుకున్నారు. వీరు ఆర్ట్స్ కళాశాలలో లబ్ధప్రతిష్ఠులైన దివాకర్ల వెంకటావధాని, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, మాధవశర్మ, నాయని కృష్ణకుమారి వంటి గురువుల వద్ద విద్యను అభ్యసించారు.

బి. ఏ. లో అమ్మంగి వేణుగోపాల్ గారి సహాధ్యాయి చెన్న కేశవరెడ్డి. ఈయన అప్పటికే సాహిత్యం చదువుకున్నవారు. వీరి నుండే వేణుగోపాల్ మొదటిసారి వచన కవిత్వం గొప్పదనాన్ని తెలుసుకున్నాడు. బి. ఏ. నుండి ఎం. ఏ కు వెళ్ళేసరికి అమ్మంగికి చెన్న కేశవరెడ్డికి మధ్య స్నేహం బలపడింది. ఎం. ఏ మొదటి సంవత్సరంలో అమ్మంగికి 'సృజన' పత్రికతో పరిచయం ఏర్పడింది. సృజన పత్రికలో వచ్చే కవిత్వాలను, వ్యాసాలను అమ్మంగి ఎంతో ఆసక్తితో చదివేవారు. ఒక సారి సృజన పత్రిక ఆంధ్రప్రదేశ్ లోని కళాశాలల విద్యార్థులకు రాష్ట్రస్థాయి కవితారచన పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటన ఇచ్చింది. తప్పకుండా ఈ రచనా పోటీలో పాల్గొనాలని అమ్మంగి నిర్ణయించుకున్నారు.

నిజాం కళాశాలలో చదివే రోజుల నుండే దివ్యాంగ విద్యార్థులతో అమ్మంగికి మంచి మైత్రి ఉండేదని, వారితో ఉన్న స్నేహబంధాలే వేణుగోపాల్ చేత 'అంధులు' వస్తువుగా "చీకటిలో బతుకునీడ" అన్న కవిత రాసేలా చేసాయని చెప్పుకొచ్చారు. ఆ కవితను 'సృజన' పత్రిక చిరునామాకు పోస్టులో పంపించిన రెండు నెలల తర్వాత అమ్మంగికి ఒక ఇన్ లాండ్ లెటర్ వచ్చింది. ఆ లేఖలోని దస్తూరీ 'సృజన' పత్రిక ఎడిటర్ వరవరరావు గారిది. ఆ లేఖలో అమ్మంగి రాసిన "చీకటిలో బతుకునీడ" అన్న కవితకు మొదటి బహుమతి లభించినట్టు రాసివుంది. ఆ వార్తతో అమ్మంగికి పట్టలేని సంతోషం కలిగింది. సృజనలో వెలువడ్డ చీకటిలో బతుకునీడ కవితను చదివిన పి.లక్ష్మినారాయణ అమ్మంగిని వెతుక్కుంటూ వచ్చి కలిసి అభినందించారు. ఇదే కాలంలో అమ్మంగికి ఎంతో మంది కవులతో, సాహితీవేత్తలతో పరిచయం ఏర్పడింది. అందులో ఒకరైన జి. వెంకటేశ్వర్లు అనే కవి 'ఆర్తవిపంచి, బతుకులోకి' అన్న కవితా సంపుటాలు రాశాడు. ఆయన పరిశోధన చేసి ప్రచురించిన "కుందుర్తి వచనకవిత" అన్న ఎం. ఫిల్ లఘు సిద్ధాంత గ్రంథాన్ని అమ్మంగికి అంకితం ఇవ్వడం గొప్ప విశేషంగా చెప్పవచ్చు.

1981లో అమ్మంగి వారికి ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్. డి చేసేందుకు అవకాశం లభించింది. పిహెచ్. డి పరిశోధన డాక్టర్. బి. వి. కుటుంబరావు పర్యవేక్షణలో "నవలా రచయితగా గోపీచంద్" అనే అంశం పైన చేశారు. అతి తక్కువ కాలంలోనే అమ్మంగి పరిశోధనను సమగ్రంగా అధ్యయనం చేసి 1984లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్. డి పట్టా పొందారు. ఆ పరిశోధన 1988 లో అచ్చయి గ్రంథంగా వెలువడింది. అమ్మంగి వారిలో ఉన్నటువంటి నిశిత పరిశీలనా దృష్టి, పరిశోధన పట్ల ఆసక్తి వారిని ఈ పరిశోధనలో విజయులను చేసిందని చెప్పాలి.

ఈ విధంగా ప్రారంభమైన వేణుగోపాల్ కవిత్వ, పరిశోధనా ప్రస్థానం నేడు తెలుగు నేలంతా ప్రవహించింది. వారికృషే తెలుగు సాహిత్యంలో, తెలంగాణ సాహితీకారులలో కవిగా, విమర్శకుడిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించి పెట్టింది.

## 1.3. ఉద్యోగ జీవితం

అమ్మంగి వేణుగోపాల్ ఎం. ఏ పూర్తి కావడంతోనే ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టారు. మొట్టమొదట పి. జి.(పోస్ట్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన వారికోసం ఉద్దేశించి పెట్టినటువంటి ఎంప్లాయ్మెంట్ ఎక్స్ ఛేంజిలో తన పేరును రిజిష్టరు చేసుకున్నారు. ఆ ఆఫీసు లక్డీకపూల్లో ఉండేది. అందులో నమోదు చేసుకున్న కొద్ది రోజులకే ప్రభుత్వ అనువాద కార్యాలయంలో జూనియర్ అనువాదకుల ఖాళీలు ఉన్నాయని, ఆ ఖాళీ పోస్టులకు మౌఖిక పరీక్షలు జరుగుతున్నాయని తెలుసుకుని ఆ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అమ్మంగివారి ప్రతిభకు తగ్గట్టుగానే వేణుగోపాల్ గారికి ఉద్యోగం వచ్చింది. అయితే ఈ పోస్టులు పూర్తిగా తాత్కాలికమైనవి. అసెంబ్లీకి ఒక నెల ముందు, అసెంబ్లీ నడిచే రోజులు, ఆ తర్వాత మరో నెల మాత్రమే ఉండేవి. మిగిలిన సమయం మొత్తంలో అమ్మంగి అధ్యాపక వృత్తిలో చేరడం కోసం అని నాలుగైదు కళాశాలల్లో దరఖాస్తు చేశారు.

అందులో మొదటిది న్యూ సైన్సు కళాశాల, రెండవది పాతబస్తీలోని ధర్మవంత్ జూనియర్ కళాశాల, మూడవది కొడంగల్ లోని ఓరియంటల్ కళాశాలలో దరఖాస్తులు ఇచ్చాడు. అన్ని కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఆ మధ్య కాలంలోనే ఉన్నత విద్యాశాఖ వారు జూనియర్ లెక్చరర్ పోస్టుల నియామక ప్రకటన విడుదల చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అమ్మంగి

వేణుగోపాల్ ఆ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగానికి విషయ నిపుణుడిగా, పర్యవేక్షకులుగా వచ్చిన రాయలసీమ వ్యక్తి అమ్మంగికి తెలుగు సాహిత్యంపట్ల ఉన్న ఆసక్తిని, పరిజ్ఞానాన్ని గుర్తించి మెచ్చుకొని అభినందించారు. అదే సమయంలో మిగతా మూడు కళాశాలలో కూడా ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. మొత్తం మీద కొద్ది రోజుల కాల వ్యవధిలోనే మూడు ఉద్యోగ నియామక ఉత్తర్వులు వచ్చాయి. ఒకటి ధర్మవంత్ కళాశాల వాళ్లు పంపింది, రెండోది కొడంగల్ ఓరియంటల్ కళాశాల వారు పంపింది, ఇక మూడవది ఉన్నత విద్యాశాఖ డైరెక్టరు నుండి హుజూరాబాదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరమని. ఇన్ని నియామక ఉత్తర్వులు ఒకేసారి రావడంతో ఎందులో చేరాలో అమ్మంగికి తోచలేదు. అప్పుడు దివాకర్ల వెంకటావధాని గారి సలహామేరకు ప్రభుత్వ ఉద్యోగం అయిన కరీంనగర్ జిల్లా హుజూరాబాదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 28.04.1970 నాడు విధి నిర్వహణలో చేరారు. ఈ విధంగా అమ్మంగి వారి ఉద్యోగ జీవితం ప్రారంభమయ్యింది.

అమ్మంగి వేణుగోపాల్ గారి ఉద్యోగ జీవితం ఎంతో సాఫీగా సాగిపోయింది. హుజూరాబాదు తర్వాత సదాశివపేట, అక్కడినుండి భువనగిరి, ఆ తర్వాత గద్వాలలో పనిచేశారు. గద్వాల కళాశాల నుండి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి తెలుగు ఉపన్యాసకులుగా బదిలీ అయ్యారు. వీరి ప్రయత్నం మూలంగానే తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రం వచ్చింది. ఈ కేంద్రం సమన్వయకర్తగా అమ్మంగి చాలా కాలం పనిచేశారు. కళాశాలలో పాఠాలు బోధించడంతోపాటుగా విద్యార్థులను సాహిత్య సృజనకు ఎంతగానో ప్రోత్సహించేవారు. విద్యార్థులలో సాహిత్యంపట్ల చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో "తారక" అనే పేరుతో గోడ పత్రికను ప్రారంభించారు. అదే సమయంలో 'హిమజ్వాల' (ఇరివెంటి వెంకట రమణ) సహకారంతో 'సాహితి' పేరుతో లిఖిత త్రైమాసిక పత్రికను విద్యార్థుల చేత వెలువరింపజేశారు.

అనంతరం వేణుగోపాల్ గారికి తారా కళాశాల నుండి జహీరాబాదు డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యింది. జహీరాబాదు వెళ్లిన తరువాత కొంత కాలానికే వేణుగోపాల్ గారు కళాశాల ప్రిన్సిపాల్(FAC) బాధ్యతలు స్వీకరించి ఏడేళ్ల పాటు కొనసాగారు. జహీరాబాదులో ప్రధానాచార్యులుగా(FAC) విధులు నిర్వర్తించిన తరువాత అమ్మంగికి మరలా సంగారెడ్డిలోని తారా

ప్రభుత్వ కళాశాలకు బదిలీ అయ్యింది. అక్కడ కొంతకాలం పని చేసిన తరువాత పదోన్నతి పై ప్రధానాచార్యులుగా జహీరాబాదు ప్రభుత్వ కళాశాలకే వెళ్ళారు. అక్కడే వాణిజ్య శాస్త్ర ఉపన్యాసకులుగా పనిచేస్తున్న అనంతయ్యగారి సహాయ సహకారాలతో జహీరాబాదు కళాశాలను అన్నివిధాల అభివృద్ధి చేయించారు. కళాశాలలో సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ విధంగా అమ్మంగి గారి ఉద్యోగ జీవితం అన్ని విధాలుగా ఎలాంటి ఆటుపోట్లు లేకుండా ప్రశాంతంగా సాగింది.

## 1.4. కుటుంబం – వైవాహిక జీవితం

అమ్మంగి వేణుగోపాల్ గారి ఉన్నత విద్య అంతా హైదరాబాదులోనే సాగడం మూలంగా ఆయనకు ప్రభుత్వ ఉద్యోగంపట్ల ఆసక్తి పెరిగింది. అందుకే విద్యార్థి దశనుండే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షించే గుణాన్ని అలవాటు చేసుకున్నారు. ఉన్నత విద్య పూర్తిచేసి ఉద్యోగం సంపాదించే వరకు అమ్మంగి వివాహం చేసుకోలేదు. 1970లో కరీంనగరులోని హుజూరాబాదు ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగం సంపాదించి విధులు నిర్వహిస్తున్న కాలంలో 1972లో హుజూరాబాదుకు చెందిన విజయలక్ష్మిగారిని వివాహం చేసుకున్నారు. వీరి సంతానం ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద అమ్మాయి కవిత, రెండో అమ్మాయి మృదుల (రాధిక), అబ్బాయి ఉదయ్ కిరణ్ చిన్నవాడు. ఇద్దరమ్మాయిల చదువు మెదక్ జిల్లాలోని సదాశివపేటలో ప్రారంభం అయ్యింది. అబ్బాయి చదువు నల్గొండ జిల్లా భువనగిరిలో జరిగింది.

అమ్మంగి వేణుగోపాల్ గారి సతీమణి విజయలక్ష్మి గారు వివాహనికి ముందు ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. వివాహానంతరం ఓపెన్ యూనివర్సిటీలో బి. ఎస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత మెరిట్ లో బి. ఎడ్ లో సీటు సంపాదించి స్వయం ప్రతిభతో కుటుంబ భారాన్ని మోస్తూ బి. ఎడ్ పూర్తి చేశారు. అమ్మంగి వారు జహీరాబాదులో పని చేస్తున్నప్పుడు విజయలక్ష్మి ఎస్.జి.టి (ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు) ఉద్యోగం పొందారు. వీరు సైన్సు బోధనలో మంచి ప్రావీణ్యం గలవారు కావడం వల్ల విద్యార్థులలో మంచి ఉపాధ్యాయులుగా పేరు పొంది 'అమ్మ టీచర్' అనే బిరుదును పొందారు. విజయలక్ష్మిగారు 2011లో ఉద్యోగ విరమణ పొందారు. విజయలక్ష్మిగారిని స్ఫూర్తిగా తీసుకుని తమ పిల్లలంతా కూడా బి. ఎస్సీ చదివి, బి. ఎడ్ పూర్తి చేసి

కుమార్తెలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్నారు. పిల్లలకు అమ్మంగి వారు అందించే చేయూతనే బలాన్ని ఇచ్చింది.

అమ్మంగివారు వివాహం జరిగిన తొమ్మిది సంవత్సరాల తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్. డిలో ప్రవేశం పొంది "నవలా రచయితగా గోపీచంద్" అనే అంశంపై పరిశోధన చేసి 1984లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్. డి పట్టా పొందారు. వీటన్నింటికీ అమ్మంగి వారిలో ఉన్నటువంటి విస్తృతమైన జీవితానుభవము, నిరంతర అధ్యయనమే కారణం. అవే వారిని ఈనాడు సహృదయ దృక్పథం కలిగిన సాహితీవేత్తగా మలిచి, తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానం సంపాదించేలా చేసాయి.

## 1.5. సాహితీ వ్యక్తిత్వం – రచనా వ్యాసంగం

అమ్మంగి వేణుగోపాల్ తెలుగు సాహిత్యరంగంలో భిన్న ప్రక్రియలలో రచనలు చేస్తున్నారు. వీరి రచనా ప్రస్థానం పాఠశాల స్థాయి నుండి విద్యార్థి దశలోనే ప్రారంభమయ్యింది. పాఠశాల స్థాయిలో అమ్మంగి వేణుగోపాల్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అప్పటి ప్రధానోపాధ్యాయులు దామోదరరావు, తెలుగు అధ్యాపకులు నందగిరి అనంతరాజశర్మగారు, హిందీ పండితులు రుక్మయ్యగారు. వీరు అందజేసిన ప్రోత్సాహమే అమ్మంగిలో పఠనాభిలాషను, సాహిత్యసృజన పట్ల ఆసక్తిని పెంచాయి. చందమామ, భారతి, సృజన సాహిత్య పత్రికల పఠనం ద్వారా సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. ఆ ఆసక్తితోనే 'సృజన పత్రిక నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితా రచన పోటీలో పాల్గొన్నారు. ఆ పోటీలో రాసిన "చీకటిలో బతుకునీడ" అన్న కవిత ద్వారా 1967లో మొదటి బహుమతి పొందారు. ఆ 'చీకటిలో బతుకునీడ' కవిత వారికి దివ్యాంగులతో ఉన్న అనుబంధం నుంచి పుట్టుకొచ్చింది కనుకనే రా. రా(రాచమల్లు రామచంద్రారెడ్డి) వంటి ఎంతో మంది సాహితీవేత్తల మన్ననలు పొందింది. ఈ విధంగా ప్రారంభమైన అమ్మంగి కవితా ప్రస్థానం ఉద్యోగంలో చేరిన తరువాత మరింత సమగ్రతను పునాదిగా చేసుకుని బలపడింది.

అమ్మంగి వారిలో ఉన్నటువంటి పఠనాసక్తి మూలంగా కళాశాలలో ఉపాధ్యాయులుగా ఉన్నప్పుడు కూడా యూనివర్సిటీ గ్రంథాలయంలోనే ఎక్కువ సమయం గడిపేవారు. ఆ సమయంలో శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని వీలైనప్పుడల్లా చదివేవారని, ఆ కవితలలోని ఆవేశం, పేదలపట్ల ఉండే

అంకితభావం, ఆధునికత అమ్మంగిని కట్టిపడేసేవట. సురవరం ప్రతాపరెడ్డిగారు రచించిన "ఆంధ్రుల సాంఘీక చరిత్ర", కె. వి. రమణారెడ్డి రచించిన "మహోదయం" వేణుగోపాల్ గారిని చరిత్ర వైపు, సాహిత్య విమర్శవైపు పయనించేలా చేశాయన్నారు. అనువాద నవలలు, డిటెక్టివ్ నవలలు కూడా విశేషంగా చదివారు.

అమ్మంగివారి రచనలనన్నింటినీ ఒకే భాగంలో వివరించడం సాధ్యపడదు. అందుకే వారి రచనలను సృజనాత్మక రచనలు, విమర్శన గ్రంథాలు, అనువాద గ్రంథాలు అని చిన్న చిన్న భాగాలుగా విభజించి విశ్లేషించే ప్రయత్నం చేశాను. మొదటగా అమ్మంగి సాహిత్య ప్రస్థానం ప్రారంభమైన సృజనాత్మక రచనల గురించి చర్చించుకుందాం.

### 1.5.2. సృజనాత్మక రచనలు

సృజనాత్మక రచనలు అనే విభాగంలో అమ్మంగి వేణుగోపాల్ గారు కవిగా, కథకుడుగా, నాటికా రచయితగా చేసినటువంటి రచనలను గురించి వివరించదలచాను.

#### 1.5.2.1. వచన కవిత్వం

ఆధునిక కవిత్వ ప్రక్రియగా భావింపబడుతున్న వచన కవితా ప్రక్రియ తెలుగులో 1930లో ప్రారంభం అయ్యింది. అంటే సుమారు తొంభైయ్యేళ్ళ చరిత్ర కలిగిన వచన కవిత్వం నేడు తెలుగు సాహిత్యంలో విశిష్ట ప్రక్రియగా సాహితీకారులను సుప్రసిద్ధులను చేస్తుంది.

"తెలుగులో సాంప్రదాయికంగా ఉన్న పద్య లక్షణాలకు ఒదగకుండా, సాధారణంగా ఉండే వచనం కంటే భిన్నంగా ఉండి, ఆధునికంగా ప్రాచుర్యంలోకి వచ్చిన కవితా రూపానికి వచన కవిత్వం"[1] అని ప్రముఖులు నిర్వచనం ఇచ్చారు. ఈ విధంగా వచన కవిత్వం అనేది ప్రముఖ విశ్లేషకుల చేత ఖ్యాతి పొందింది.

##### 1.5.2.1.1. చీకటిలో బతుకునీడ

అమ్మంగి వేణుగోపాల్ గారు తాను ఎం.ఏ చదువుతున్న రోజుల్లో 1967 లోనే 'సృజన' సాహిత్య పత్రిక ద్వారా సాహిత్యరంగ ప్రవేశం చేశారు. ఈ 'చీకటిలో బతుకునీడ' కవితకు సృజన

---

[1] వచన కవిత: రూప పరిశీలన : ఆచార్య చేకూరి రామారావు, ఆచార్య సంపత్కుమారాచార్య; సంపాదకుడు ఎన్.ఎస్. రాజు, శ్రీ సత్య ప్రచురణలు, హైదరాబాదు, 2006, సంపాదకీయం, పుట. సంఖ్య. 2

పత్రిక కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితా రచన పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది.

ఈ కవితలో అమ్మంగి వేణుగోపాల్ గారు తాను జీవించిన సామాజిక వాతావరణాన్ని తనకు దివ్యాంగ స్నేహితులతో ఉన్నటువంటి స్నేహానుబంధాన్ని ఇతివృత్తంగా చేసుకుని జీవన వేదనను కవిత్వీకరించారు.

### 1.5.2.1.2. మిణుగురు

అమ్మంగివారి మొదటి కవితా సంపుటి 'మిణుగురు'. 1967 నుండి 1980 వరకు రాసిన 38 కవితలను కలిపి 'మిణుగురు' అన్న పేరుతో ప్రచురించారు. ఈ కవితా సంపుటిని అమ్మంగి తన ఆత్మీయ గురువైన ఆచార్య సి. నారాయణరెడ్డి గారికి అంకితం ఇచ్చారు. ఈ సంపుటికి సుప్రసిద్ధ మార్క్సిస్టు విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డిగారు "మంచిమాట" పేరుతో, ప్రముఖ పోస్ట్ మోడ్రన్ కవి, అనుభూతివాద కవి వేగుంట మోహన్ ప్రసాద్ "కిరణం–కిర్మీరం" పేరుతో ముందుమాటలు రాశారు.

'మిణుగురు' కవితా సంపుటిని గురించి విశ్లేషణాత్మక వ్యాసం రాసిన ప్రొఫెసర్. పి. లక్ష్మీనారాయణ 'చిన్నారి మిణుగురును గురువుగా, ఆచార్యునిగా, ఆదర్శంగా ఎంచుకొని చుట్టుముట్టిన చీకటిని ఎదిరించి తన హృదయంలోని వెలుగును ప్రజ్వలింపజేసి జీవన ప్రయాణాన్ని సాహసంతో సాగించాలి. మిణుగురు నిజంగా మానవునికి పాఠ్యాంశం, ఆదర్శం, శిరోధార్యం'[2] అంటూ అమ్మంగి కవితా సంపుటిలోని మిణుగురు ఇతివృత్తాన్ని మనిషికి అన్వయింపపజేసి ఎంతో అద్భుతంగా వివరించారు. ఇందులోని బిచ్చగాడు కవితను ప్రసిద్ధ అనువాదకులు 'ఎలనాగ' ఆంగ్లంలోకి అనువదించగా, దాన్ని ఇంటర్ బోర్డు వారు 2022 లో మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేయడం విశేషం.

### 1.5.2.1.3. పచ్చబొట్టు పటంచెరు

అమ్మంగి వేణుగోపాల్ గారి కవితలలోకి పాఠకుడు ప్రవేశిస్తే భావవిన్యాస సంబంధమైన అద్భుతాలు ఎన్నో దొరుకుతాయి. 1980లో మిణుగురు కవితా సంపుటి వెలువరించిన తరువాత

[2] అమ్మంగి సాహిత్య స్వర్ణోత్సవం సంచిక. పాలపిట్ట మాస పత్రిక. 2018. పుట. సంఖ్య. 16

పందొమ్మిది సంవత్సరాలకి అమ్మంగి 1999లో 'పచ్చబొట్టు పటంచెరు' అన్న కవితా సంపుటిని వెలువరించారు. ఈ కవితా సంపుటిని ఆనాడు పారిశ్రామికీకరణ మూలంగా పటాన్ చెరులో కలుషితమైపోయిన వాతావరణాన్ని చూసి చలించిపోయి వెలువరించారు. పచ్చబొట్టు పటంచెరులోని కవితలన్నీ కూడా ఫ్యాక్టరీల కుళ్ళుతో, పారిశ్రామికీకరణ విషపు కోరల్లో చిక్కుకొని కలుషితమైపోతున్న సమాజాన్ని, భూగర్భ జలాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి.

ఈ కవితా సంపుటిలో 1981 నుండి 1999 వరకు రాసిన 28 కవితలు ఉన్నాయి. అమ్మంగి ఈ సంపుటిని తన ఆత్మీయ మిత్రుడు అయిన కన్నసామి గారికి అంకితం ఇచ్చారు. 'తీరాన్ని తాకే అలలు' పేరుతో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంగ్లశాఖ ఆచార్యులు పి. లక్ష్మీనారాయణగారు ముందుమాట రాశారు.

## 1.5.2.1.4. భరోసా

అమ్మంగి వేణుగోపాల్ గారు కవిత్వం ద్వారా పాఠకులకు, ప్రజలకు, సాహితీవేత్తలకు, ఉద్యమకారులకు, తెలంగాణ ప్రజలకు ఈ కవితా సంపుటి ద్వారా భరోస ఇస్తున్నారు. ఈ కవితా సంపుటి ద్వారా అమ్మంగి సంక్షుభిత జీవితాల అస్తిత్వానికి ఆలంబనగా నిలిచారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో అంటే 2004 నుండి 2008 వరకు రాసిన 29 కవితలను "భరోసా" అన్న శీర్షికతో పాఠకుల ముందుకు తీసుకువచ్చారు. అమ్మంగి ఈ కవితా సంపుటిని తన జీవితంలో సగభాగమై ఎల్లవేళలా వెన్నంటే ఉండి భరోస ఇచ్చిన అర్ధాంగి విజయలక్ష్మిగారికి అంకితం ఇచ్చారు. ఈ కవితా సంపుటిలోని కవితలు అన్నీ అత్యధికంగా సాంద్రతరమౌతూ, సంక్షిప్తంగా ఒదిగి ఉన్నాయి. అమ్మంగి తన కవిత్వం ద్వారా 'భూమికి ఉండే గురుత్వాకర్షణ శక్తిలాగే ఉద్యమాల పట్ల కవి కలం కూడా ఆకర్షణకు గురికావాలని, పేదల పీడనను వ్యతిరేకించే శక్తులు అన్నింటి సమాహారంగా సాహిత్యం ఉండాలని' ఆధునిక సాహిత్యోద్యమకారులకు పిలుపునిస్తున్నారు. ఈ సంపుటిని 2010 లో తెలుగు విశ్వవిద్యాలయం వారు ఉత్తమ గ్రంథంగా ఎంపిక చేసి ఉత్తమ వచన కవితా పురస్కారం అందజేశారు.

### 1.5.1.1.5. గంధం చెట్టు

ఈ 'గంధం చెట్టు' కవితా సంపుటిలో ఎక్కువభాగం కవితలు తెలంగాణ ఉద్యమకాలంలో రాసినవే ఉన్నాయి. ఈ సంపుటిలో మొత్తం 23 కవితలున్నాయి. 'గంధం చెట్టు' కవితా సంపుటిలో అమ్మంగి తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని పాఠకుల కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

'గంధం చెట్టు' కవితా సంపుటి 2015 లో వెలువడింది. ఈ కవితా సంపుటిని అమ్మంగి వీర తెలంగాణ ఉద్యమాన్ని అసమాన సాహసంతో నడిపించిన వాడు సహృదయుడు, జయ మిత్రుడు అయిన వేణు సంకోజుకు అంకితమిచ్చారు. ఉద్యమ స్ఫూర్తి బలంగా ఉన్నటువంటి డాక్టర్. నాళేశ్వరం శంకరం 'గంధం చెట్టు' కవితా సంపుటికి 'కవిత్వమంతా ఉద్యమ గంధమే' అన్న శీర్షికతో విస్తృతమైన, సమగ్రమైన పీఠికను రాసారు.

"గంధం చెట్టు పచ్చదనానికి, సేవకు ప్రతీక. గంధం చెట్టు త్యాగానికి ప్రతీక. తెలంగాణ తల్లి చేసినన్ని త్యాగాలు సమకాలీన చరిత్రలో ఎవరూ చేసి ఉండరు"[3] అంటూ శీర్షికకు ఉద్యమస్ఫూర్తికి ఉన్నటువంటి సంబంధాన్ని అమ్మంగి వేణుగోపాల్ వివరించారు.

### 1.5.1.1.6. తోటంత పువ్వు

ఈ కవితా సంపుటి 2015 సంవత్సరంలో వెలువడింది. వస్తువైవిధ్యం, వ్యంగ్యం కలగలసిన పూలదోట లాంటిది ఈ 'తోటంత పువ్వు' కవితా సంపుటి. ఇందులో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల మీద పదునైన కవితలున్నాయి. సార్వజనీన, సార్వకాలీన అంశాల మీద కూడా రాసిన కవితలున్నాయి.

### 1.5.1.2. అమ్మంగి వేణుగోపాల్ కథానికలు

తెలుగులో కథానిక ప్రక్రియ 1910 కాలంలో గురజాడ అప్పారావుగారు రాసిన 'దిద్దుబాటు' కథానిక ద్వారా వెలుగులోకి వచ్చింది. దిద్దుబాటునే తెలుగులో తొలి సమగ్ర లక్షణాలు కలిగిన కథానికగా విమర్శకులు భావిస్తున్నారు. మరికొంత మంది విమర్శకులు 1900 ప్రాంతంలో బండారు అచ్చమాంబ రచించిన 'స్త్రీ విద్య' అనే కథను తొలి తెలుగు కథగా పేర్కొంటున్నారు. ఆంగ్లంలో 'short story' అనే మాటకు సమానార్థకంగా తెలుగులో 'కథానిక' అని పిలుస్తున్నారు.

---

[3] పాలపిట్ట, 2018. ముఖా ముఖి, పుట. సంఖ్య. 55

'కథ్' అనే ధాతువు నుండి కథ అనే పదం పుట్టింది. కథ అంటే అర్థం సంభాషించటం, చెప్పడమని అర్థం. కథానికలోని భాగాలను గురించి, కథానిక ప్రక్రియ గురించి, లక్షణాలను గురించి 'అగ్నిపురాణం' లో స్పష్టంగా పేర్కొనబడి ఉంది. ఇతివృత్త భేదాన్ని బట్టి సంస్కృతంలో కథ, ఆఖ్యాయిక, ఖండ కథ, పరి కథ, కథానిక అనే ఐదు భాగాలు ఉన్నాయని 'కావ్యాదర్శ' వ్యాఖ్యాత జీవానంత విద్యాసాగర భట్టాచార్యులు తెలిపారు.

కథానిక అనే పేరును తెలుగు సాహిత్యంలో మొట్టమొదట ఉపయోగించింది ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. వస్తువు, పాత్ర చిత్రణ, చిన్న చిన్న వర్ణనలు, ఎత్తుగడ, ముగింపు, శైలి అనేవి కథానికలో ప్రధాన అంగాలుగా ఉంటాయి. కథానిక అనేది వస్తుపరమైన వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది.

తొలి రోజుల్లో బండారు అచ్చమాంబ, మాడపాటి హనుమంతరావు, గురజాడ అప్పారావు, కరుణ కుమార, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారు కథా రచనలు చేశారు. వీరి తరువాత వచ్చిన సాహితీ వేత్తలు కథానిక ప్రక్రియను వేగవంతం చేసి కథానిక అభివృద్ధికి విశేష కృషి చేశారు.

అమ్మంగి వేణుగోపాల్ గారు కవిత్వంతో పాటు కథానిక రచన కూడా చేశారు. అయితే తక్కువ సంఖ్యలో కథానికలు రాసినా తెలుగు కథానిక ప్రక్రియలో మిన్నగా నిలిచేటటువంటి కథానికలను ఆయన రాశారు. మొత్తం పది కథానికలు రచించగా ప్రస్తుతం ఏడు కథానికలు మాత్రమే లభిస్తున్నాయి. అవి :

1. వంచన (1970)
2. పూవులో ముళ్ళు (1972)
3. పిచ్చితల్లి (1979)
4. విలువలు (1979)
5. పువ్వురాలు కాలం (2012)
6. బూలచ్చి నవ్వింది (2016)
7. గుడినీడ (2019)

అమ్మంగి వేణుగోపాల్ గారు మానవ జీవితంలోని పార్శ్వాలను, సంఘటనలను, కేంద్రంగా చేసుకుని కథానికలు రచించారు. మానవ జీవితంలోని వైరుధ్యాలను ప్రతిబింబిస్తూ, అద్భుతమైన

చిత్రీకరణతో కథానికలు సాగుతుంటాయి. అమ్మంగి కథలు చదువుతూ ఉంటే మనని మనం అర్థం చేసుకోగలుగుతాం. తన కథల ద్వారా పాఠకుల మనసులలో బలమైన సాహిత్య ముద్రను వేసే విధంగా కథారచన కొనసాగించారు. తెలంగాణ జీవితచిత్రణ ఈ కథల్లో అడుగడుగునా దర్శనమిస్తుంది.

### 1.5.1.3. అమ్మంగి వేణుగోపాల్ నాటికలు

ప్రేక్షకుల ముందు ప్రదర్శన యోగ్యమయ్యే కాల్పనిక లేదా వాస్తవిక రూపాలను నాటకం లేదా నాటిక అని అంటారు. సంస్కృతంలో నాటక ప్రక్రియ అత్యంత ప్రాచీనమైనదయినప్పటికీ, తెలుగులోకి మాత్రం ఈ ప్రక్రియ ఆంగ్లం నుండి ప్రవేశించింది. ప్రాచీన కవులు ఎంతో మంది నాటకానికి నిర్వచనాలు చెప్పి నాటకానికి ఉండవలసిన లక్షణాలను కూడా వివరించారు. ఆదికవి నన్నయ మహాభారతంలో "ఉదాత్త కావ్య నాటకాలు పెక్కు చూచితని" అన్నారు. దశ రూపకాలను గురించి మొట్టమొదట పేర్కొన్న భరతుడు తన 'నాట్యశాస్త్రం' అనే అలంకార శాస్త్ర గ్రంథంలో దశ రూపకాలు, ఉప రూపకాలను గురించి వివరించాడు.

"నాటకం– ప్రకరణం – అంకో వ్యాయోగ ఏవ చ
భణః సమవకారశ్చ వీధి ప్రహసనం డిమః
ఈహా మృగశ్చ విజ్ఞేయో దశమో నాట్య లక్షణే"

అని దశరూపక భేదాలను వివరించాడు.

ఇంకా కావ్యేషునాటకం రమ్యం అని, నాటకాంతం హి సాహిత్యం అని సంస్కృత పండితులు పేర్కొన్నారు.

'నాట్య ప్రధానమై పద్య గద్యాత్మకమైన గ్రంథ విశేషముగా[4]' శబ్ధరత్నాకరం నాటకాన్ని గురించి వివరిస్తుంది.

ఈ విధంగా ప్రాచీన కవులు అక్కడక్కడా నాటక ప్రస్తావన చేసినప్పటికి 1860 నుండే తెలుగు సాహిత్యంలో నాటకాలు రావడం మొదలయ్యాయి. తెలుగు సాహిత్య రంగంలో వెలువడ్డ తొలి

---

[4] శబ్ద రత్నాకరం, సీతారామాచార్యులు బహుజనపల్లి, విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ, తృతీయ ముద్రణ, సెప్టెంబరు, 2007.

స్వతంత్ర నాటకం కోరాడ రామచంద్రశాస్త్రిగారు రచించిన మంజరీ మధుకరీయం. ఇదే తెలుగులో తొలి నాటకమని విమర్శకులు భావిస్తున్నారు.

దశ రూపకాలలో మొదట పేర్కొనదగినది 'నాటకం' అయితే ఉప రూపకాలలో మొదట పేర్కొనేది నాటిక. తెలుగులో వెలువడ్డ తొలి నాటిక 1930 లో పి. వి. రాజమన్నారు గారు రచించిన 'తప్పెవరిది'. ఇదే తొలి తెలుగు నాటిక అని పరిశోధకులు అభిప్రాయం.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో పనిచేసిన డాక్టర్ పాలకుర్తి మధుసూధన రావు, డాక్టర్.కె.బి. గోపాల్ గార్ల ప్రోత్సాహంతో రేడియో నాటికలు రాయడానికి పూనుకున్నారు. రేడియోలో ప్రసారమైన తొలి తెలుగు రూపకం సామినేని ముద్దుకృష్ణ రచించిన 'అనార్కలి'. అమ్మంగి వేణుగోపాల్ గారు శ్రవ్య ప్రధాన రేడియో నాటికలను రచించారు. ఈ నాటికలు అన్ని కూడా "అమ్మంగి వేణుగోపాల్ నాటికలు" పేరుతో 2008 లో ప్రచురించబడ్డాయి. ఈ నాటికల సంపుటిని జయమిత్ర సాహిత్య సాంస్కృతిక సంస్థ వారు ప్రచురించారు.

అమ్మంగి వేణుగోపాల్ గారు మొత్తం ఐదు రేడియో నాటికలు రచించారు. రేడియో నాటిక అనేది శ్రవ్య ప్రధానమైనది. నాటికలో పాత్ర ధారుల గళమే నాటకానికి జీవం పోస్తుంది. రేడియో నాటికలో సంభాషణకే ప్రథమ స్థానం ఉంటుంది. అందుకే అమ్మంగి రేడియో నాటికా రచనల ద్వారా శ్రోతలలో విశేష ప్రాచుర్యం సంపాదించుకున్నారు. నేటి కాలంలో నాటకంతో సమానంగా రేడియో నాటికలు కూడా విశిష్ట ప్రక్రియగా గుర్తింపు తెచుకున్నాయి.

అమ్మంగి వేణుగోపాల్ రాసిన నాటికలు అన్నీ కూడా 1993-2017 మధ్యకాలంలో రాశారు.

1. ప్లాట్లు అమ్మబడును. 1993
2. జంతువు. 1994
3. ఆపరేషన్ వంకాయ. 1997
4. వికృత శిశువు. 1998
5. పూలమ్మిన చోట. 2000
6. తెలంగాణ భారతి (నృత్యరూపకం) 2016
7. గోల్కొండ వైభవం (చారిత్రాత్మక నాటకం) 2017

'తెలంగాణ భారతి' నృత్య రూపకం వైతాళికులకు సంబంధించింది. 'గోల్కొండ వైభవం' కుతుబ్ షాహీ రాజుల పాలన, పోషణ, నిర్మాణాత్మక కృషికి సంబంధించింది.

### 1.5.2. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన గ్రంథాలు

అమ్మంగి వేణుగోపాల్ గారు సాహితీ రంగంలోకి ప్రవేశించిన 1968 కాలంలోనే విమర్శ రంగంలోకి ప్రవేశించారు. ఆ సమయంలో ఎదిరె చెన్న కేశవులు రాసిన "పొట్టకోసం" కథాసంపుటికి అమ్మంగి వారు సమీక్షా వ్యాసం రాసారు. ఆ వ్యాసం 'ఆంధ్ర జనత' దినపత్రికలో అచ్చయింది. ఆ విధంగా కవితా రచనతో పాటే సాహిత్య విమర్శకు బీజాలు పడ్డాయి.

"తెలుగులో మనోవైజ్ఞానిక విమర్శ, మార్క్సిస్టు విమర్శ, విప్లవవాద విమర్శ, దళితవాద విమర్శ, ఆధునికోత్తర వాదం ఉధృతంగా ఉన్న సమయంలో విమర్శకుడిగా రంగప్రవేశం చేశారు అమ్మంగి వేణుగోపాల్"[5] అని అమ్మంగి గారిపై సమగ్ర పరిశోధన చేసిన రాయరావు సూర్య ప్రకాశరావు అన్నారు.

సూర్య ప్రకాశరావు అన్నట్లుగా కవిత్వోద్యమాల ఉద్యమ స్ఫూర్తిని కేంద్రంగా చేసుకునే అమ్మంగి విమర్శ రంగంలోకి వచ్చారు. వారి మొదటి విమర్శనా వ్యాసం సంఘసంస్కర్త గురజాడ అప్పారావు రాసిన "సంస్కర్త హృదయం" మీద రాసిన పరిశోధనా వ్యాసం. ఈ వ్యాసం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రిక వారు ప్రచురించారు. ఈ విమర్శనాత్మక పరిశోధనావ్యాసం నుండి ప్రారంభమైన అమ్మంగి విమర్శా ప్రస్థానం మొత్తం నాలుగు విమర్శనా గ్రంథాలు వెలువరించే స్థాయికి చేరుకుంది. అవి:

1. **అవినాభావం.** (సాహిత్య వ్యాసాల సంపుటి.1990).

   1987-89 మధ్యకాలంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యానుబంధంలో ప్రచురితమైన తొమ్మిది సాహిత్య వ్యాసాలను వేణుగోపాల్ అవినాభావం పేరుతో 1990 లో ప్రచురించారు. ఈ సంపుటిలో గురజాడ, కుటుంబరావు, చలం, చాసో, ఆరుద్ర, సినారె, పి. శ్రీదేవి, బలివాడ కాంతారావుల రచనలమీద విమర్శనాత్మక సమీక్షా వ్యాసాలున్నాయి.

2. సాహిత్య సందర్భం-సమకాలీన స్పందన. (89 సాహిత్య వ్యాసాల సంపుటి, 2012)
3. వట్టికోట ఆళ్వారు స్వామి రచనలు – ఒక పరిశీలన (2014)

---

[5] అమ్మంగి వేణుగోపాల్ రచనలు – సమగ్ర పరిశీలన. సూర్య ప్రకాశరావు. రాయరావు.

4. సహృదయ సాహిత్య విమర్శ – వైవిధ్యం (2018)

(62 సాహిత్య విమర్శనా వ్యాసాల సంపుటి 2018)

'సాహిత్య సందర్భం– సమకాలీన స్పందనలోని' వ్యాసాలలో సింహభాగం 'సూర్య' దినపత్రిక సాహిత్యానుబంధం 'అక్షరం'లో అచ్చయినవే. అమ్మంగివారి చిరకాల మిత్రుడు సీనియర్ పత్రిక సంపాదకులు జి. శ్రీరామమూర్తిగారి ప్రోత్సాహ ప్రోద్బలంతో అమ్మంగి రెండు సంవత్సరాలకు పైగా 'దస్తూరి' కాలమ్ నిర్వహించారు. మిగిలిన వ్యాసాలు ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, వార్త, నమస్తే తెలంగాణ, సాక్షి, పాలపిట్ట, నేటినిజం మొ॥న పత్రికలలో వచ్చాయి. అమ్మంగి వేణుగోపాల్ గారు తమ విమర్శలో విస్తృతమైన అధ్యయనం చేయడమేగాక, అధ్యయనంలోంచి ఏర్పరుచుకున్న అభిప్రాయాలను అందంగా నిర్మించి, స్పష్టంగా సూత్రీకరణలు చేస్తారు.

### 1.5.3. అనువాదకులుగా కృషి

ఒక భాషలో రాసిన రచనను మరొక భాషలోకి మార్చి అర్థమయ్యేలా చెప్పడమే అనువాదం. మూల భాషలో ఉన్న అంశాన్ని లక్ష్య భాషలోకి మార్చడమే అనువాదం. స్వేచ్ఛానువాదం సులభం అనే మాట ఒకటుంది. కాని ఇది ఒక నిగ్రహంతో కూడుకున్న పని. మూల కవిని అర్థం చేసుకోవడం ఒక ఎత్తయితే అనువదిత భాషలోకి దాన్ని చేర్చేటప్పుడు తాను అందులో ప్రవేశించకుండా జాగ్రత్తపడాలి. అలాగని కవితా మూల్యాలు లేని పొడి అనువాదం చేస్తే తేలిపోతుంది. కాబట్టి కవితా మూల్యాలకు మూల వ్యక్తిత్వానికి నష్టం వాటిల్లకుండ తన స్వభావ సిద్ధమైన కవితా లౌల్యం అనువదితాంశాలలోనికి ప్రవేశించకుండా అనువాదకుడు జాగ్రత్తపడాలి.

అమ్మంగి వేణుగోపాల్ గారి బాల్యం అంతా కూడా మహారాష్ట్రలోని నీలంగా, బాల్కీ, ఉద్గిర్, నారాయణఖేడ్ లలో సాగింది. వారు చదువుకున్న ప్రాథమిక విద్య కూడా ఆ ప్రాంతంలోనే ఉండడం మూలంగా వారికి చిన్నతనం నుండే మరాఠి, ఉర్దూ, కన్నడ వంటి తదితర భాషలతో అనుబంధం ఏర్పడింది. అనువాదం గురించి ఎంతో మంది పరిశోధకులు ఎన్నో నిఘంటువులు అనేక రకాల అర్థాలు వచ్చేలా నిర్వచనాలు ఇస్తున్నాయి.

**1. శబ్దరత్నాకరం**

"ఒకరు చెప్పిన దానిని మరలా జెప్పటం".[6]

**2. రాచమల్లు రామచంద్రారెడ్డి**

"ఒక భాషలో ఉన్న విషయాన్ని మరొక భాషలోకి మార్చడాన్ని అనువాదం"[7] అని పేర్కొన్నారు.

**3. బూదరాజు రాధాకృష్ణ**

'ఒక వాగ్రూప సంకేతంలో ఉన్న భావాన్ని సమానమైన మరో వాగ్రూప సంకేతంలో తెలపడమే అనువాదం.'[8]

ఎవరు ఎన్ని నిర్వచనాలు ఇచ్చిన అనువాదం అంటే వచ్చే అర్థం మూల భాషలోని సమాచారాన్ని లక్ష్య భాషలోకి అనువర్తించడం. ఇది ఎంతో కష్ట సాధ్యమైన పని. చాలామంది పరిశోధకులు, విమర్శకులు అనే మాట ఏమిటంటే ఒక గ్రంథాన్ని ఒక భాషలో నుండి మరొక భాషలోకి అనువదించడం కన్నా తన సొంత భాషలో సొంత కావ్యం రాయడం సులభమంటారు. అంటే వేరే భాషలోని గ్రంథాన్ని అనువదించడమే కష్టమైన పని. అనువాదం కావడం మూలంగా కావ్యాలకు దేశం నలుమూలలా గుర్తింపు లభిస్తుంది. కాని కావ్యంలోని అన్ని భావాలను అనువాదంలో వ్యక్తపరచడం సాధ్యం కాదు. అందులో ముఖ్యంగా చెప్పుకో దగ్గవి మాండలిక పదాలు. కొన్ని మాండలిక వాడుక పదాలకు నిఘంటువులలో సైతం అర్థం ఉండదు. అలాంటి పదాల అర్థాలను వ్యక్తీకరించడంలో అనువాదకులు విఫలమవుతారు. మూల భాషలోని సంస్కృతి సంబంధమైన విశేషాలను అనువదించటం కూడా కష్టమే. ఇందుకు అనువాదకునికి ప్రత్యేక అధ్యయనం అవసరం.

అమ్మంగి వేణుగోపాల్ అనువాదంపట్ల కొంత అనుభవం కలిగి ఉన్నారు కనుకనే ఇతర భాషలలోని గ్రంథాలను అనువాదం చేయడానికి పూనుకున్నారు. అమ్మంగి ఎం. ఏ పూర్తి చేసిన కొంత

---

[6] శబ్దరత్నాకరం, సీతారామాచార్యులు బహుజనపల్లి.

[7] అనువాద సమస్యలు, రాచమల్లు రామచంద్రారెడ్డి, పుట: 44.

[8] అనువాద పాఠాలు, రాధాకృష్ణ బూదరాజు, పుట: 07.

కాలానికి ఉపాధ్యాయ వృత్తిలో చేరకముందు ప్రభుత్వ అనువాద కార్యాలయంలో పనిచేశారు. ఆ అనుభవమే వారికి గ్రంథాలను అనువాదం చేయడంలో సహకరించింది. అనువాదకులుగా పనిచేసే సమయంలోనే అనువాద పద్ధతులను, అనువాద సిద్ధాంతాలను, సూత్రాలను, మెలకువలను నేర్చుకున్నారు. అనువాదకులుగా ఆయన శాస్త్ర గ్రంథాల అనువాదంలోను, సాహిత్య గ్రంథాల అనువాదంలోను సమప్రతిభను కనబరుస్తున్నారు.

### 1.5.3.1. అన్య భాషల నుండి అనువదించిన గ్రంథాలు

అమ్మంగి వేణుగోపాల్ గారు మూడు గ్రంథాలు అనువదించారు. ఆంగ్లంలో డాక్టర్. పి. వి. సుబ్రహ్మణ్య శాస్త్రి, డాక్టర్.ఎన్.ఎస్. రామచంద్ర మూర్తి గార్లు తెలుగు లిపిపై పరిశోధించి రచించిన "TELUGU SCRIPT – Origin and Evolution" (3rd Century .B. C. నుండి 16th Century. A. D) అన్న గ్రంథాన్ని తెలుగులోకి **"తెలుగు లిపి: ఆవిర్భావ వికాసాలు"** అనే పేరుతో అనువదించారు.

అమ్మంగి ఈ శాస్త్ర గ్రంథాన్ని అనువాదం చేసేటప్పుడు స్వేచ్ఛానువాదానికి ఎలాంటి అవకాశం కల్పించకుండా మూల గ్రంథంలో ఉన్న ప్రతి అంశాన్ని యథాతథంగా అనువదించే ప్రయత్నం చేశారు. ఈ **"తెలుగు లిపి: ఆవిర్భావ వికాసాలు"** అన్న అనువాద గ్రంథాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయం వారు 2012 లో ప్రచురించారు.

2012 నాటి గవర్నర్ శ్రీ తివారీ గారి కోరిక మేరకు మహమ్మద్ జహీరుద్దీన్ బాబర్ ఉర్దూ కవితా సంపుటిని **'జాతీయ సమైక్యతానాదం'** పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ గ్రంథాన్ని తెలుగు అకాడమీ వారు 2009 లో ప్రచురించారు.

మఖ్దూం మొహియుద్దీన్ గారి కవిత్వంపై ఉర్దూలో 'సయ్యదా జాఫర్' గారు కేంద్రసాహిత్య అకాడమి వారికోసం మూల గ్రంథాన్ని ఉర్దూలో రచించారు. ఈ గ్రంథాన్ని 'నిషాత్ జైది' గారు ఆంగ్లంలోకి అనువాదం చేశారు. ఈ ఆంగ్లానువాద గ్రంథాన్ని ఆధారంగా చేసుకుని అమ్మంగి వారు మఖ్దూం మోహియుద్దీన్ గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. ఈ గ్రంథాన్ని 2022 లో కేంద్రసాహిత్య అకాడమీ న్యూ ఢిల్లీ వారు ప్రచురించారు.

### 1.5.3.2. అన్య భాషల అనువాదంలో అమ్మంగి కవిత్వం

అమ్మంగి వేణుగోపాల్ గారు అన్య భాషలలోని కావ్యాలను, గ్రంథాలను తెలుగులోకి అనువదించినట్టే అమ్మంగివారు రాసిన తెలుగు కవితా సంపుటాలు కూడా ఆంగ్లం, హిందీ మొదలైన భాషలలోకి అనువదించబడ్డాయి. అవి:

1. అమ్మంగి రచించిన కవితలలో ప్రసిద్ధమైన 50 తెలుగు కవితలను ప్రసిద్ధ అనువాదకులు 'ఎలనాగ' 2016 లో ఆంగ్లంలోకి "Faded leaves and Fire flies" పేరుతో అనువదించారు. ఎలనాగ అనేది వీరి కలం పేరు. వీరి అసలు నామం డాక్టర్ సురేంద్ర.
2. సుప్రసిద్ధ హిందీ అనువాదకులు డాక్టర్. ఎమ్. రంగయ్య గారు అమ్మంగి రచించిన సుమారు 50 కవితలను "అంధేరే మే జీవన్ ఛాయా" అనే శీర్షికతో అనువదించారు. ఈ అనువాద గ్రంథం 2018 లో వెలువడింది.
3. అమ్మంగివారికి గుర్తింపు తెచ్చినటువంటి 'భరోసా' కవితా సంపుటిని శ్రీ నారాయణరావు 2018 లో హిందీలోకి అనువాదం చేసారు. 2018లోనే ఆ సంపుటిని ప్రచురించారు.
4. తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు వారు ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పుస్తకంలో అమ్మంగి వేణుగోపాల్ గారు రచించిన 'బిచ్చగాడు' కవితను (ఎలనాగ 'The Beggar' అన్న పేరుతో అనువాదం చేశారు) పాఠ్య భాగంలో చేర్చారు.

## 1.6. సంపాదకులుగా కృషి

సంపాదకత్వాన్ని ఆంగ్లంలో 'Editing' అంటారు. పత్రికా సంపాదకులను అయితే Editor అంటారు. లిఖిత రూపంలోని ప్రతిని ప్రచురణ రూపంలోకి తీసుకురావడానికి వీలుగా అవసరమయ్యే మార్పులు చేర్పులు చేయడం తప్పులను సరిచేయడాన్ని 'ఎడిటింగ్'గా పేర్కొంటారు. "Edit- To prepare the copy for publishing by arranging, correcting and changing it."[9] లిఖిత రూపంలో ఉన్న సమాచారాన్ని ప్రచురించి పుస్తక రూపంలోకి తేవడంలో సంపాదకులు ప్రధాన

[9] Public Relations Editing and Production of Corporate Publications-2, BPR-4, Dr. B. R. Ambedkar Open University, Hyderabad, 2005, Page No.54

పాత్రను పోషిస్తారు. సంపాదకుల మూలంగానే లిఖితపూర్వకంగా ఉన్న సమాచారం ప్రచురించబడి గ్రంథం రూపం పొందుతుంది.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఏడు గ్రంథాలకు సంపాదక బాధ్యతలు నిర్వర్తించారు. వారి సంపాదకత్వంలో వచ్చిన అన్ని గ్రంథాలు కూడా స్వభావ రీత్యా వైవిధ్యం కలిగినవి. అమ్మంగి సంపాదకత్వం వహించిన గ్రంథాలు, సదస్సులు.

1. మెదక్ జిల్లా రచయితలు రాసిన **"వ్యాస మంజీర"** అనే ఏడు వ్యాసాల సంకలనానికి సంపాదకులుగా వ్యవహరించారు. ఈ గ్రంథాన్ని మంజీరా రచయితల సంఘంవారు 1990లో ప్రచురించారు. ఈ సంకలనంలో అమ్మంగివారు రాసిన '**నవలా రచయితగా కుటుంబరావు: ఒక పరిచయం**' అన్న వ్యాసం కూడా ప్రచురించబడింది.
2. హైదరాబాదు నగరం ఏర్పడి 400 సంవత్సరాలు నిండిన సందర్భంగా 1993లో తెలుగు – ఉర్దూ, ఉర్దూ – తెలుగు ద్విభాషా కవితా సంపుటయిన '**మరో కొత్త వంతెన – ఏన్ ఔర్ నయాపూల్**'కి సంపాదకులుగా ఉన్నారు
3. మరొకటి **"మజహర్ మెహది – మరో ప్రపంచం"**(2009) అన్న శీర్షికతో మజహర్ మెహది రచించిన కవిత్వం నుండి ఎంపిక చేసిన 32 ఉర్దూ కవితలను అనువాదం చేయడంలో అమ్మంగి సంపాదకులుగా వ్యవహరించారు. '**మరో కొత్త వంతెన–ఏక్ ఔర్ నయాపూల్**' (1993), **"మజహర్ మెహది–మరో ప్రపంచం"**(2009) అనే రెండూ అనువాద గ్రంథాలను జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, హైదరాబాదు సంస్థవారు ప్రచురించారు. ఈ రెండు పుస్తకాలకు కూడా అమ్మంగి వారే ముందుమాటలు రాశారు.
4. ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనాలకు దాదాపు 25 సంవత్సరాలుగా వివిధ భాషల కవితలను అనువదిస్తున్నారు.
5. రాత ప్రతులను పరిరక్షించి, అధ్యయనం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 1967లో ప్రాచ్య లిఖిత గ్రంథాలయాన్ని ఏర్పరచింది. 1975లో ఈ సంస్థ పరిశోధనాలయంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయంవారు

ప్రచురించిన **"తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్ర"** (2012) అన్న గ్రంథాన్ని వెలువరించారు. ఈ గ్రంథానికి వేణుగోపాల్ గారు సంపాదకులుగా ఉన్నారు.

6. శ్రీరంగం శ్రీనివాసరావుగారి శత జయంతి నివాళి సందర్భంగా వెలువరించిన **"ప్రజల పక్షాన ప్రతిజ్ఞ"** (2010) అన్న సంకలనానికి సహ సంపాదకులుగా ఉన్నారు.
7. ప్రసిద్ధ కవి వి.ఆర్. విద్యార్థిగారి సాహిత్య కృషికిగాను వెలువరించిన అభినందన సంచిక **"అద్దంలో విద్యార్థి"** కి (2012) సహ సంపాదకత్వం వహించారు.
8. వట్టికోట ఆళ్వారుస్వామి శతజయంతి సదస్సు పత్రాల సంకలనానికి కూడా అమ్మంగి వేణుగోపాల్ గారు సంపాదకత్వం వహించారు. ఈ సదస్సు పత్రాలను కేంద్ర సాహిత్య అకాడమీ వారు 2016 లో ప్రచురించారు.
9. డా. నోముల సత్యనారయణగారి స్మారక సంచిక **"నోముల యాదిలో"** (2020) సంపాదక వర్గంలో అమ్మంగి ఉన్నారు.
10. అమ్మంగి వేణుగోపాల్, జి. చెన్నకేశవరెడ్డి, పి. లక్ష్మీనారాయణల సంపాదకత్వంలో దేవులపల్లి కృష్ణమూర్తి గారి 82వ జన్మదినం సందర్భంగా **'బతుకు పుస్తకం'** అనే అభినందన సంచికను జయమిత్ర సాహిత్య, సాంస్కృతిక వేదిక తరపున వెలువరించారు.
11. తెలంగాణ సాహిత్య కళావేదిక ప్రచురించిన **'మిర్గం'** (2018) కవితా సంపుటికి సంపాదకత్వం వహించారు.

## 1.7. గౌరవాలు – పురస్కారాలు

మిణుగురు కవిత్వంతో సాహితీ ప్రపంచంలోకి అడుగుపెట్టిన అమ్మంగి వేణుగోపాల్ గారు తన సాహిత్య ప్రస్థానంలో ఎన్నోరకాల ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు.

అమ్మంగి వేణుగోపాల్ గారు అందుకున్న పురస్కారాలలో మొదటగా పేర్కొనదగినది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మకమైన పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు పురస్కారం. ఈ పురస్కారాన్ని కాళోజి నారాయణ రావుగారి జయంతి సందర్భంగా 09 అక్టోబర్ 2015 నాడు అందుకున్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావుగారి తొలి పురస్కారం పొందిన

కవిగా అమ్మంగి వేణుగోపాల్ గారు ప్రసిద్ధికెక్కారు. వీరి సాహిత్య కృషికిగాను తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన అత్యున్నత గౌరవం ఇది. దీనిని అమ్మంగి జీవన సాఫల్య పురస్కారంగా భావించారు.

**ఇతర పురస్కారాలు :**

1. తెలుగు విశ్వ విద్యాలయం ప్రతిభా పురస్కారాన్ని 2001లో అందుకున్నారు.
2. తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించే ఉత్తమ వచన కవితా పురస్కారం 2010లో **'భరోసా'** కవితా సంపుటికి లభించింది.
3. 1994 జనవరిలో లక్నోలో జరిగిన ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనంలో తెలుగు కవిగా, తెలుగు భాషా ప్రతినిధిగా అమ్మంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.
4. 2009 నుండి 2011 వరకు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి సభ్యులుగా పనిచేశారు.
5. 2012 నుండి 2017 వరకు కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులుగా వ్యవహరించారు.
6. తేజ ఆర్ట్ క్రియేషన్స్ వారు 24.08.2015 న 'జీవన సాఫల్య పురస్కారం' ప్రదానం చేశారు.
7. 02.07.2015 నాడు రంగారెడ్డి జిల్లా ఉత్తమ రచయితగా తెలంగాణ ప్రభుత్వ పురస్కారం అందుకున్నారు.
8. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ (పి.జి) పాఠ్య ప్రణాళికా సంఘం సభ్యులుగా 2002–2004 వరకు పనిచేశారు.
9. అమెరికాలో ప్రవాస సాహిత్య సాంస్కృతిక సంస్థ 'తేనా' ప్రతి ఏటా అందజేసే పురస్కారాల కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.
10. తెలంగాణ సారస్వత పరిషత్తువారు 26.07.2022 నాడు 'డా.సి. నారాయణరెడ్డి సాహిత్య పురస్కారం' అందజేశారు.

**1.8. పరిశోధనలు**

1. 'నవలా రచయితగా గోపీచంద్' అన్న అంశం మీద పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1984లో పిహెచ్. డి పట్టా పొందారు.

2. గోపీచంద్ జీవిత సాహిత్యాలు. (ఆధునిక తెలుగు సాహిత్య వారసత్వం త్రిపురనేని గోపీచంద్) అన్న అంశంపై శతజయంతి నివాళి సందర్భంగా మోనో‌గ్రాఫ్ రచించారు.
3. 'మ్రోయుతుమ్మెద–నారాయణ రావు', 'తెలంగాణలో కవిసమ్మేళనాలు' వంటి అనేక పరిశోధన వ్యాసాలు రచించారు.

# అధ్యాయం

# సాహిత్య ప్రక్రియలపై విమర్శ

## 2.0. పరిచయం

తెలుగులో కొన్ని శతాబ్దాలుగా మానవ చేతనలో, మానవ సంబంధాలలో వేగంగా వస్తున్న మార్పులను చిత్రిస్తూ సృజనాత్మక సాహిత్యం విస్తృతంగా వస్తున్నది. దాంతోపాటుగానే ఆంగ్ల సాహిత్యం కూడా ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలను ప్రభావితం చేసింది. ఆ విధంగానే ఆంగ్ల సాహిత్యంలో నూతనంగా వస్తున్న విమర్శ దృక్పథాలు తెలుగు విమర్శకులకు మార్గదర్శకాలుగా నిలిచాయి. ఆ సాహిత్యాన్ని విశ్లేషించే రీతిలో విమర్శ కొనసాగుతుంది. వారి విశ్లేషణ మూలంగానే విమర్శక వ్యక్తిత్వం బహిర్గతమవుతుంది. జీవితంలోను, సాహిత్యంలోను కనిపించే బహుళ సాంస్కృతిక స్థితిని విశ్లేషించే అధ్యయనం అమ్మంగి విమర్శలోని ప్రధాన లక్షణంగా చెప్పవచ్చు. ఈ లక్షణాల ఆధారంగానే అమ్మంగి ఆధునిక సాహిత్య ప్రక్రియలపై పరిశీలనాత్మక అధ్యయనంతో విమర్శ కొనసాగించారు. ఈ అధ్యాయంలో ప్రధానంగా అమ్మంగి నవలలపై, కథలపై చేసిన విమర్శ గురించిన విశ్లేషణను గమనించవచ్చు.

## 2.1. నవలలపై విమర్శ

నవలా ప్రక్రియపై అమ్మంగి పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించిన సంగతి తెలిసిందే. సాహిత్య ప్రక్రియగా నవల తీరుతెన్నులు, లక్షణాలు, నిర్మాణ రహస్యాలు పరిశోధకులుగా వారికి బాగా తెలుసు. ఆయన నవలపై చేసిన విమర్శను గురించి ఈ విభాగంలో చర్చించాను. ప్రత్యేకించి నవలలపై విమర్శ లేదా సమీక్ష చేయదలుచుకున్నవారు ఎదో ఒక కోణం నుంచి మాత్రమే సూక్ష్మాతి సూక్ష్మ అంశాలతో కావ్యాన్ని విశ్లేషించడానికి ప్రయత్నిస్తారు. అయితే కొత్త కోణంలో వినూత్న ఎత్తుగడలతో వ్యాసాన్ని రచించడం ద్వారా పాఠకులకు విలక్షణ పరిచయ వ్యాసాన్ని అందించవచ్చునన్న విషయం అమ్మంగి వారికి బాగా తెలుసు. అందుకే సహృదయ మార్గాన్ని అవలంభించి నవలా విమర్శను కొనసాగించారు. అందులో భాగంగానే అమ్మంగి వేణుగోపాల్

నవలలపై చేసినటువంటి పరిశోధనలో నవలలోని ప్రత్యేక సంఘటన, సన్నివేశాలు, ఇతివృత్తాన్ని కేంద్రంగా చేసుకొని నవల విశిష్టతను తెలియజేస్తూ నవలాకారుని శైలి, విన్యాసాలను వివరించారు.

సాహిత్యాన్ని సమాజంతో అనుసంధానించే సాహితీ ప్రక్రియ నవల. ఆధునిక తెలుగు సాహిత్యంలో కథ, కథానిక, నాటకం, వ్యాసం, విమర్శ మున్నగు ప్రక్రియలతో పాటు నవల కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావంతో ఏర్పడింది. ఆంగ్ల సాహిత్య విమర్శ సూత్రాలనే ఆధునిక సాహితీ ప్రక్రియల విమర్శకు ప్రమాణంగా గ్రహిస్తున్నాం. సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియల్లో నవల ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. కల్పనా సాహిత్య ప్రక్రియల్లో అత్యధిక విస్తృతిని కలిగినది, అత్యంత జనాదరణను పొందినది, సాహిత్యలోతులు చూపించగలిగినది నవలా ప్రక్రియ మాత్రమే.

వాస్తవికతను సమపాళ్ళలో రంగరించి నిర్దిష్ట జీవిత దృక్పథాన్ని అందించేది నవల. "నవ్య సాహిత్యమునందు ప్రముఖ స్థానము నాక్రమించిన నవలా సాహిత్యముపై విమర్శ గ్రంథములు స్వల్పముగానున్నవని"[10] ఎస్.వి. రామారావు అన్నారు. ఎందుకంటే నవలలు వచ్చినంతగా నవలా విమర్శలు రావడం లేదు. తెలుగు సాహిత్యంలో కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి గారిని తొలి తెలుగు నవలా విమర్శకులుగా భావించి, వీరి 'విగ్రహతంత్ర విమర్శనం' అనే గ్రంథాన్ని తొలి తెలుగు నవలా విమర్శనా గ్రంథంగా చెప్పుకుంటారు.

అమ్మంగి నవలా సంబంధమైన విమర్శన వ్యాసాలను వస్తువును బట్టి గమనిస్తే సాంఘిక, చారిత్రక, పౌరాణిక, చైతన్య స్రవంతి, మనోవైజ్ఞానిక, హాస్య, ప్రతీకార ధోరణిగల నవలలపై సమీక్షలు, విశ్లేషణలు ఉన్నాయి. నవలలను లోతుగా పరిశీలించి, పరిశోధించి, సమీక్షించిన ఈ వ్యాసాలు నవలా విమర్శలో ప్రత్యేక స్థానంలో నిలుస్థాయని చెప్పవచ్చు.

తెలుగులో విమర్శ అత్యధికంగా వస్తు పరిశీలన రూపంలోనే సాగుతుంది. నవలాకారుడు తన నవలలో చేసే జీవిత చిత్రణలో సామాజిక అంతశ్చేతన ఏ దశలో ప్రస్ఫుటం అయ్యిందనే అంశం కూడా ప్రాముఖ్యం వహిస్తుంది. అదేవిధంగా రచయిత సరైన అవగాహనతో జీవితాన్ని చిత్రిస్తున్నాడా? అసంకల్పితంగా తనకు తోచిన సామాజిక స్థూల బాహిర రూపాన్నే సృష్టిస్తున్నాడా?

---

[10] రామారావు, ఎస్. వి. తెలుగులో సాహిత్య విమర్శ. పుట. 232.

తప్పుడు భావజాలంతో వర్తమాన సమాజాన్ని వక్రంగా చూపుతున్నాడా? అన్న విషయాలను నవలా విమర్శకులు, పరిశోధకులు తమ పరిశోధనలో తేల్చవలసిన విషయం.

సామాజిక వాస్తవికత అనేది భౌతిక విషయాల సమాహారం మాత్రమే కాదు, భౌతిక స్వరూప నిర్మాణానికి ఆలంబనమైన మూల సూత్రాలకు ఆధారం. నవలా విమర్శకు ఏ ప్రమాణాలను, సూత్రాలను ఎంచుకున్న చిట్టచివరి గీటురాయి నవలలోని సామాజిక వాస్తవికత నిరూపణేనని విమర్శకుల అభిప్రాయం.

అమ్మంగి నవలా  సాహిత్యంపై రాసిన విమర్శన వ్యాసాలను పరిశీలించేముందు మొదటగా కేశవరెడ్డి రచించిన 'మునెమ్మ' నవలపై రాసిన వ్యాసాన్ని విశ్లేషించాలి.

### 2.1.1. మునెమ్మ – కేశవరెడ్డి

తెలుగు కాల్పనిక సాహిత్యంలో రచనాపరంగా, వస్తువు విషయంలోనూ, శైలి విన్యాసంలోనూ ప్రయోగాలు చేసిన రచయితలలో ముందువరుసలో ఉండేటటువంటి డాక్టర్ కేశవరెడ్డి రచించిన 'మునెమ్మ' నవలపై అమ్మంగి రాసిన వ్యాసాన్ని పరిశీలిస్తే **"పశు ప్రవృత్తి ఏమైనా మునెమ్మది వాత్సల్యమే"**[11] అన్న శీర్షికతో మునెమ్మ నవలలో కేశవరెడ్డి చిత్రించిన మునెమ్మ పాత్ర చిత్రణను, బొల్లిగిత్త స్వభావాన్ని, బొల్లిగిత్త మీద మునెమ్మకు ఉన్నటువంటి ప్రేమను గురించి విశ్లేషించి నవలలో ప్రస్ఫుటమైనటువంటి ప్రతీకార ధోరణిని, స్త్రీ శక్తిని గురించి వివరించారు.

కేశవరెడ్డి "మునెమ్మ" నవలలో ఒక స్త్రీ పాత్రను కేంద్రంగా చేసుకొని సమాజంలో భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న మహిళ జీవితాన్ని చిత్రించారు. స్త్రీని అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్న పురుషుల అంతరంగాల్ని పాఠకుల ముందు ఆవిష్కరించారు. మాతృస్వామ్యంపై పెత్తనం చెలాయించే పితృస్వామిక భావాల వికృత స్వరూపాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. అమ్మంగి నవలా రచయిత వ్యక్తపరచిన అంశాలతో విభేదించకుండా విమర్శకులుగా నవల అంతరార్థాన్ని తెలిపారు. "బొల్లిగిత్త మునెమ్మ పట్ల ప్రదర్శించింది లైంగిక కామమా? కాదా?" అన్న పాఠకుల సందేహాన్ని నివృత్తి చేసేందుకు నవలలో మునెమ్మ, బొల్లిగిత్తల మనస్తత్వాలను పాఠకులకు

[11] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 106

తెలిసే విధంగా "పశు ప్రవృత్తి ఏమైనా మునెమ్మ మాత్రం బొల్లిగిత్తను వాత్సల్యంతోనే చూసింది"[12] అంటూ ఆ రెండు పాత్రల మధ్య ఉన్నటువంటి అనుబంధాన్ని గురించి ఎంతో సహజాతి సహజంగా వివరిస్తూ మునెమ్మ నవలా నాయిక కాగా, నవలకు ఆరు సంవత్సరాల బొల్లిగిత్త నాయకుడుకాని నాయకుడు అంటూ బొల్లిగిత్తనే నాయకుడు అనే రీతిలో ప్రతిపాదన చేశారు.

వాస్తవానికి అమ్మంగి ప్రతిపాదనతో పాఠకులు కూడా ఏకీభవిస్తారు. ఎందుకంటే నవలా ప్రారంభం నుండి బొల్లిగిత్త మునెమ్మపట్ల కాముకతను ప్రదర్శించడం, అందుకు జయరాముడి కోపానికి బలై శిక్షను అనుభవించి సంతలో అమ్ముడుపోవడం, గొడ్ల వైద్యుడిని ప్రాణాంతకంగా పొడిచి ఇల్లు చేరడం, దళారీ తురగలోడిని చంపడం, చివరకు కుటుంబ పోషణ భారాన్ని మోయడంవంటి ప్రతి ఘట్టంలో బొల్లిగిత్త ప్రధాన పాత్రను పోషించడం వంటి సంఘటనలు అమ్మంగి ప్రతిపాదనలకు సమగ్రతను చేకూర్చుతున్నాయి.

అదే విధంగా నవలలోని పాత్రలలో ప్రతీకారవాంఛ ప్రధానంగా కనిపిస్తుందని అమ్మంగి తెలియజేశారు. అందుకు తగిన ఆధారాలను కూడా పాఠకులకు వివరించారు. నవలలో కనిపించే ప్రతీకారవాంఛ అనేది వారసత్వంగా వచ్చిందన్నారు. జయరాముడి తండ్రికి ఉన్న ఆవేశమే జయరామునికి వచ్చిందని, బొల్లిగిత్త చేసిన చిన్న నేరానికే దాని వొళ్ళు కమిలిపోయేల కొట్టి అంగట్లో అమ్మడానికి తీసుకెళ్లడంలో ప్రతీకారం తీర్చుకున్న క్రమం అర్థమవుతుంది. జయరాముడు హత్యకు గురికావడంతో అతని మరణానికి కారణమయిన వారిని మట్టుపెట్టడంలో మునెమ్మలోని ప్రతీకారవాంఛ కనిపిస్తుంది. ఇట్లా ప్రధాన పాత్రల మనస్తత్వాలను విశ్లేషించిన అమ్మంగి నవలలోని ఈ ప్రతీకార ధోరణే నవలను నడిపించే శక్తి కావటంవల్ల మునెమ్మ పాత్రలోని మొరటుతనంలో ఎటువంటి అసహజత్వం కనిపించదని సూత్రీకరించారు. మునెమ్మను ఒక మూసపాత్రగా గాక భిన్నమైన స్త్రీ శక్తిగా అర్థం చేసుకోవాలంటున్నారు. ఇట్లా నవల అంతరార్థాన్ని అందులోని ప్రతీకార ధోరణి గురించి వివరించారు.

ఈ నవలలో దేహ భాష కొంత ప్రధాన పాత్రను పోషించిందని వివరించారు. ఈ నవల విషయంలో అమ్మంగివారు నిశితమైన పరిశీలనా దృష్టి ద్వారా తులనాత్మక విశ్లేషణ చేశారు. ఈ

[12] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 106

"మునెమ్మ నవలకు 'బింగేజ్ ఐత్ మాతోవ్' రచించినటువంటి 'జమీల్యా' నవలకు మధ్య కొన్ని బహిరంగమైన పోలికలు కనిపిస్తాయని"[13] తులనాత్మక దృష్టితో పరిశీలించి, మునెమ్మ నవలకు 'జమీల్యా' నవలకు మధ్యనున్న ప్రధాన పోలికలను గురించి వివరించిన తీరు అమ్మంగి పరిశీలనా శక్తికి ప్రతీకలుగా చెప్పాలి.

"పురుషుడు మాత్రమే బలమైనవాడు, బుద్ధికుశలుడు, అన్యాయాలని సరిదిద్దగల్గిన వాడు, కథని తన ఉనికితో ముందుకి నడిపించగల్గినవాడు, పురుషుడే నాయకుడు.. పోరాటయోధుడు... అన్న పాపులర్ దృక్పథం నించి విడివడి... మునెమ్మ లాంటి సాధారణ స్త్రీలోని అసాధారణ శక్తిని బయటకు తీసి కథని నడిపిస్తారు రచయిత"[14] అంటూ ముందుమాట రాసిన జయప్రభగారి భావాలతో అమ్మంగి విమర్శ సంలీనమైపోయిందని చెప్పవచ్చు. అంటే ఇక్కడ ఇద్దరు కూడా స్త్రీ శక్తిని, స్త్రీ పాత్రలోని ఔన్నత్యాన్ని వివరించిన విధానం అవగతమవుతుంది.

'మునెమ్మ' నవలను అన్ని కోణాలనుండి పరిశీలించిన అమ్మంగి తీరు వారి ప్రత్యేకమైన విమర్శన శైలిగా గుర్తించవచ్చు. ఈ విమర్శలో సూత్రీకరణలు అర్థవంతంగా ఉండి, వ్యాసం విషయ పరిపూర్ణతతో కూడి నవలకు ప్రాణం పోసే విధంగా ఉందని చెప్పవచ్చు. ఇందులో అమ్మంగి విశ్లేషించినటువంటి ప్రతీకార ధోరణి నవలను చదివిన ప్రతి పాఠకుడిలో మెదులుతుంది.

### 2.1.2. పథేర్ పాంచాలీ నవల – బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ

అమ్మంగి వేణుగోపాల్ గారి నవలా విమర్శన దృష్టి ఒక్కొక్క సందర్భంలో ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఆయన నవలలపై రాసిన విమర్శన వ్యాసాలలో కొన్నింటిలో ఆరంభం ప్రధాన పాత్రను పోషించగా, మరికొన్ని వ్యాసాలలో ముగింపు అగ్ర స్థానాన్ని ఆక్రమిస్తుంది. నిశితంగా పరిశీలించి చూస్తే వ్యాస ఆరంభంలోనే అమ్మంగి వ్యాసాన్ని అమూలాగ్రం చదివించేటటువంటి శైలిని అనుసరించారని చెప్పవచ్చు. పాఠకుడిలో ఆలోచనా ధోరణిని పెంచేందుకే వారి వ్యాస ఆరంభం అంత అద్భుతంగా సాగుతుందని చెప్పాలి. ఇటువంటి శైలినే ప్రధానంగా చేస్తూ రాసిన విమర్శన

---

[13] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 109

[14] కేశవరెడ్డి, మునెమ్మ. 2007. హైదరాబాదు బుక్ ట్రస్ట్. ముందుమాట.

వ్యాసం బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ బెంగాలిలో రాసినటువంటి 'పథేర్ పాంచాలి' (1929) నవలపై రాసింది.

'పథేర్ పాంచాలి' నవలపై **"పాలపుంతలు తొక్కిన నవల పథేర్ పాంచాలి"**[15] అనే శీర్షికతో రాసిన వ్యాసంలో నవల ప్రత్యేకతలను, నవలలో ఉన్నటువంటి భావుకతను గురించి వివరించారు. వ్యాస ఆరంభంలో మూడు మరణాల మీదుగా నడిచివచ్చిన నవల, మూడు కాలాలను అర్ధనగ్న శరీరాల మీద నడిపించిన నవల, కాలం సోమరిగా ప్రవర్తించిన ఆ రోజుల్లో అక్షరాలా ప్రకృతి ఒడిలో ఒదిగిన నవలని, నవల అంతరార్థాన్ని తత్త్వాన్ని ఎంతో స్పష్టంగా పాఠకులకు తెలియజేశారు. ఈ నవలను మద్దిపట్లసూరి 1960 లో తెలుగులోకి అనువాదం చేసారు. మరలా 2008 లో ఈ తెలుగు నవల పునర్ముద్రణ కావడమనేది సంతోషించదగ్గ విషయమన్నారు. పథేర్ పాంచాలి నవల ముగింపుకు వచ్చేసరికి పాఠకుడిలో ఒక సశేష భావనను కలుగజేస్తూ పూర్తవుతుందని వివరించారు. చలన చిత్రంగా నిర్మించటానికి ఈ నవలలో సత్యజిత్ రాయ్ ను ఆకర్షించిన శక్తి ఏదన్న భావన పెద్ద ప్రశ్నగా మిగిలిపోతుందన్న పంక్తులు విమర్శకులు అమ్మంగి నవలలోని జీవితంతో ఎంతగా మమేకమైపోయారో తెలియజేస్తుంది.

ఈ నవలలోని ప్రత్యేకతలను సూత్రీకరించటం గొప్ప పరిశీలన. అదేవిధంగా రచయిత ఈ కవి సంకల్ప దృష్టిని కూడా గుర్తించి ప్రకృతిని ఒక బలమైన పాత్రగా చూపిస్తూ, సహజ కష్టసుఖాలను కళాత్మక వాస్తవికతతో ప్రదర్శించటం ద్వారా మానవత్వానికి పెద్దపీట వేయాలన్నదే వారి సంకల్పమని చెప్పే వాక్యాలు విమర్శకుని నిశిత పరిశీలనా దృష్టికి అద్దంపట్టే వాక్యాలుగా భావించవచ్చు. అందుకే ఈ వ్యాసంలో అమ్మంగి ప్రకృతికే ప్రముఖ స్థానం కల్పించి ముగించటం కనిపిస్తుంది.

### 2.1.3. త్రిపురనేని గోపీచంద్ – నవలలు

అనేక వాదాలతో వివాదపడుతూ, తత్త్వాలతో దాగుడుమూతలాడుతూ, సంతృప్తిలోనూ అసంతృప్తిలోనూ ఆనందాన్నే అనుభవిస్తూ జీవయాత్ర కొనసాగించిన గోపీచంద్ గారి శతజయంతి సందర్భంగా అమ్మంగి "త్రిపురనేని గోపీచంద్ మజిలీలు, మైలురాళ్ళు" అనే శీర్షకతో వ్యాసం

[15] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 139

రాసారు. అమ్మంగి ఈ వ్యాసం కోసం భిన్న ఇతివృత్తాలు గల నవలలను ఎంచుకుని పరిశీలించారు. అంటే సాంఘిక, మనోవైజ్ఞానిక, మార్క్సిస్టు నవలలలోని విభిన్న కోణాలను ఎన్నుకుని చక్కగా విశ్లేషించారు.

వ్యాస శీర్షికను చదివితేనే వ్యాసంలోని అంతరార్థం అర్థమయ్యేలాగా **"త్రిపురనేని గోపీచంద్ మజిలీలు, మైలురాళ్ళు"**[16] అని పెట్టారు. అమ్మంగి ఈ వ్యాసంలో గోపీచంద్ గారి గొప్పతనాన్ని మరియు నవలా రచయితగా వారి ప్రయాణం ఏ విధంగా సాగిందన్న విషయాలను ఇందులో వివరించారు. 'పాత కొత్తల మేలు కలయిగా అన్నది నిరంతర ప్రక్రియ, కొత్త భావం పాత భావాన్ని సవాల్ చేసే పరిస్థితి ఎప్పుడూ ఉంటుంది. మేధావి అయిన రచయితను ఈ పరిస్థితి వెంటాడినప్పుడు సంఘర్షణ తప్పదు. సంఘర్షణనుంచే తనదైన బాటను వెతుక్కుంటూ మలుపుల వద్ద మైలురాళ్ళను నాటుకుంటూ వెళ్ళిన వారు గోపీచంద్'[17] అంటూ వ్యాసం ఆరంభంలోనే వ్యాస పరమార్థాన్ని వివరించారు.

పాత కొత్తల మేలు కలయిక అనడంలోనే గోపీచంద్ గారు జీవితంలో ఎన్నో రకాలైన ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రతి అనుభవాన్ని ఒక సవాలుగా స్వీకరించి ముందడుగు వేసి ఒక గొప్ప రచయితగా ఎదిగిన సంఘటనలు పాఠకుల కళ్ళకు కట్టినట్లు అర్థమయ్యేలా వివరించారు. ఈ వాక్యాలు ఇంత అద్భుతంగా చెప్పడం, గోపీచంద్ గారిని ఇంతలా అర్థం చేసుకుని విశ్లేషించడం అనేది 'నవలా రచయితగా గోపీచంద్' అన్న అంశం మీద పిహెచ్. డి పరిశోధన చేయడమే ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. సునిశితమైన పరిశీలనా దృష్టితో గోపీచంద్ గారి మజిలీలు, మైలురాళ్ళను గురించి ఈ వ్యాసంలో వివరించారు.

గోపీచంద్ గారు తండ్రి త్రిపురనేని రామస్వామిచౌదరి హేతువాదం, ఎం.ఎన్. రాయ్ నవ్య మానవతావాదం పట్ల ఆకర్షితులైనారని వివరించారు. ఆ ప్రభావాలతోపాటు, ఇతర గ్రంథాలను విస్తృతంగా అధ్యయనం చేయటం మూలంగానే వారి రచనలలో హేతువాదం, మార్క్సిజం, నవ్య మానవ వాదం, మనోవిజ్ఞాన శాస్త్ర సంబంధమైన అంశాలు ప్రదర్శించబడ్డాయని అంచనా వేశారు.

[16] వేణుగోపాల్ అమ్మంగి. సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట.94

[17] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 94

గోపీచంద్ రాసినటువంటి కొన్ని నవలలను గురించిన విశ్లేషణలో భాగంగా ముందుగా 'అసమర్థుని జీవయాత్ర' (1946) అనే నవలను గురించి వివరిస్తూ 'ఈ నవల ఆలోచనాధారకు, స్పృహకూ, ప్రవర్తనకు మధ్య ఉన్న స్పష్టాస్పష్ట సంబంధాలను, కథనం చేస్తుంది'[18] అని పాత్రల అంతరంగంలో జరిగే అంతర్మదనాన్ని రచయిత ప్రదర్శించారని అన్నారు. ఈ మనోవైజ్ఞానిక దృక్పథం మూలంగానే అంతకు ముందు రచయితలు ప్రకటించడానికి ఇబ్బంది పడ్డ లైంగిక భావాలను కూడా స్వేచ్ఛగా తన రచనలో గోపీచంద్ వెల్లడించారని ఒక్కమాటలో నవలలో ఉన్నటువంటి ఇతివృత్తాన్ని పాత్రల మధ్య ఉన్న స్పష్టాస్పష్ట సంబంధాలను గురించి వివరించిన తీరు చాలా అద్భుతంగా ఉంది. జీవితం జీవించటం కోసమే తప్ప సిద్ధాంతాల కోసం కాదు అన్న ఒక ప్రాథమిక సత్యాన్ని ఈ నవల ఆవిష్కరిస్తుంది.

'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' నవల అభ్యుదయ భావాలు గల కేశవమూర్తి అనే పాత్రని నాయకునిగా నిలుపుతుంది. స్వార్థపూరితమైన వ్యక్తుల మధ్య అతని జీవిత పోరాటం ఎలా ఉందో విశదీకరిస్తుంది. ఈ నవలలో మార్క్సిస్టు భావజాలం పుష్కలంగా కనిపిస్తుంది. ఈ నవలను గురించి వివరిస్తూ గోపీచంద్ గారి మీద అరవిందుల ప్రభావం ఉంది అనడానికి ఈ నవల తిరుగులేని నిదర్శనమని చెప్తున్నారు. భౌతికవాదం నుంచి ఆధ్యాత్మికవాదం వైపు గోపీచంద్ చేసిన ప్రయాణం స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. వివాహ వ్యవస్థ మీద గోపీచంద్ గారి అభిప్రాయం ఏ విధంగా ఉందని తెలియడానికి ఆయన రచించిన 'శిథిలాలయం' అనే నవల అద్దం పట్టేలా ఉందని వివరించారు. ఈ నవల ద్వారా గోపీచంద్ ఇచ్చిన సందేశాన్ని బాగా విశ్లేషించారు. స్త్రీ మనోభావాలకు విలువ ఇచ్చినప్పుడే వివాహబంధానికి విలువ ఉంటుంది అన్న గోపీచంద్ భావాన్ని పాఠకుల చెంతకు సమర్థవంతంగా చేర్చారు అమ్మంగి. గోపీచంద్ గారు రాసిన కొన్ని నవలలకు అదివరకే వారు రాసినటువంటి కథలలోని ఇతివృత్తాలు ఆధారమని కూడా నిదర్శనపూర్వకంగా అమ్మంగి వారు నిరూపించారు.

గోపీచంద్ గారి సాంఘీక నవలలను గురించి ఆర్.ఎస్. సుదర్శనంగారు ఈ విధంగా అన్నారు: 'మెరుపుల మరకలు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' రాసిన తరువాత గోపీచంద్

[18] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 95

దృక్పథం ఆధ్యాత్మిక హిమవత్ శిఖరాల నుంచి సహనమూ, క్షమా, సానుభూతి, విశ్వాసమూ జలధారలుగా పర్వత సానువుల్లో ప్రవహిస్తూ సామాన్య మానవుడనే పల్లపు నేల నుండి గంగా ఝరిగా అవతరించింది. ఈ భావాలను చెప్పటానికే గోపీచంద్ నవలలు రచించారు. అందుకే వేరువేరు పేర్లతో ఆయా నవలల్లో తాను కనిపించాడు. “హేతువాదం, మార్క్సిజం, ఎం.ఎన్.రాయ్ నవ్యమానవతావాదం, మనోవిజ్ఞానశాస్త్ర ప్రభావం అన్న మజిలీలు కడచి, ఆధ్యాత్మికవాదంలో ఆశ్రయం పొందిన గోపీచంద్ సాహిత్యరంగానికి చేసిన సేవ గొప్పది”[19] అన్న అమ్మంగి మాటలు రెండూ కొంత ఒకేవిధంగా తోస్తున్నాయి. అంటే ఇద్దరు విమర్శకులు కూడా గోపీచంద్ గారి ఆధ్యాత్మిక భావం గురించి నవలలో ఉన్న హేతువాదం గురించి చర్చించారని నిర్ధారణ అవుతుంది. సాంప్రదాయిక నైతిక విశ్వాసాల మీద నిలబడ్డ వివాహవ్యవస్థలోని శైథిల్యాన్ని శిథిలాలయంలో వివరించాడని అమ్మంగి భావించారు.

“ఎంతో ముడిసరుకుతో సాహిత్యరంగంలో అడుగుపెట్టిన గోపీచంద్ కు నవలా రచన నల్లేరు మీద నడక అయింది” అన్న అమ్మంగి వాక్యాలు గోపీచంద్ సాహిత్యం మొత్తానికి ప్రాణం పోస్తున్నాయి. అమ్మంగి వేణుగోపాల్ గారు తమ కవితా శక్తినీ, పాండిత్య ప్రకర్షను, భావుకతనూ గోపీచంద్ గారి నవలలను విశ్లేషించడంలో ఉపయోగించి గోపీచంద్ గారి యొక్క అంతరంగపు లోతులను దర్శించారు. ‘మెరుపుల మరకలు’లో భౌతిక, ఆధ్యాత్మికవాదాల సమన్వయం సాధించటానికి చేసిన కృషి, పండిత పరమేశ్వరశాస్త్రిలో అరవిందుని భావ ఔన్నత్యాన్ని చెప్పడానికి గోపీచంద్ ప్రయత్నించినట్లు చెప్పారు. అమ్మంగి తాను పొందిన రాసానుభూతిని, నవలలలోని కొత్త కోణాలను, గోపీచంద్ గారి శైలిని సామాన్య పాఠకులకు అర్థమయ్యే విధంగా ఎంతో సరళ భాషలో వివరించారు. నవలల ద్వారా తాను పొందిన రసానుభూతిని పాఠకులలో కలిగే విధంగా ఈ వ్యాసం రాశారు.

### 2.1.4. కొలిమంటుకున్నది – అల్లం రాజయ్య

తెలంగాణ గ్రామీణ జన జీవిత సంఘర్షణలను, ఆరాట పోరాటాల చరిత్రగతిని, ఉత్పత్తి సంబంధాల నేపథ్యంలో సమాజాన్ని, మానవ సంబంధాలను అర్థం చేసుకునేందుకు దారిని

[19] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 97

చూపేటువంటి సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అందించినటువంటి అల్లం రాజయ్యగారిని గురించి ఆయన సాహిత్యంలోని విప్లవోద్యమ స్ఫూర్తిని గురించి పాఠకులకు తెలియపర్చాలనే దృఢ సంకల్పంలో అమ్మంగివారు రాజయ్యగారిపై **"పాఠకుణ్ణి పాత్రను చేసే సృజన శక్తి అల్లం రాజయ్య"**[20] అనే శీర్షికతో విమర్శనా వ్యాసం రాసారు. ఇందులో రాజయ్య గారి గురించి మాత్రమే కాకుండా ఆయన రచించినటువంటి "కొలిమంటుకున్నది" నవలలో దళిత బహుజనులు సాధించిన రాజ్యాధికారం, విప్లవోద్యమ దృష్టిని గురించి విశ్లేషించారు.

అల్లం రాజయ్య సాహిత్య ప్రస్థానం 'శివసత్తి–శక్తి' అనే కథతో మొదలైంది. తెలంగాణాలో వట్టికోట ఆళ్వారుస్వామి తరువాత సజీవమైన చరిత్రకు అక్షరరూపం ఇచ్చి సృజనాత్మకత సాహిత్యరూపంగా మలచిన సాహిత్య శిల్పి రాజయ్య. ఆయన రచనలు గ్రామీణ దోపిడి, అణచివేత అసంబద్ధ సంబంధాలు, ప్రజాపోరాటాల, అమానవీయ, అప్రజాస్వామిక సంఘటనలకు చారిత్రక సాక్ష్యాలు. అంతేకాదు అవి అడవి పొడగున పరుచుకొన్న మట్టితీగల రక్త సింధూరాలు. అక్షరాల్ని తూటాగ పేల్చిన అనుభవాల అగ్నికణాల రక్త జలపాతాలు. అల్లం రాజయ్య ఒక శ్రమజీవి, ఒక ఉద్యమకర్త, పీడితజనం తరుపున కలంపట్టిన గొప్ప సాహిత్యకారుడు. ముప్పై ఏండ్లపాటు ఉదృతంగా రచనోద్యమాన్ని భుజానికెత్తుకున్న అలుపెరుగని కలం యోధుడాయన.

అంతటి ఉద్యమ వ్యక్తిత్వం కలిగిన రాజయ్యను అమ్మంగి "అన్యాయం-ఆయుధం ఒక దిక్కు, న్యాయం-నినాదం మరొక దిక్కు మోహరించిన కాలంలో తన సాహిత్య స్తూపాన్ని గుండె గడియారంగా అమర్చిన అల్లం రాజయ్య జాతీయ స్థాయిలోనే ఎన్నదగిన రచయిత"[21] అన్నారు. రాజయ్యగారు రాసిన నవలలన్నింటిలో కూడా **'కొలిమంటుకున్నది'** నవల విశిష్టమైనదంటూ నవల అంతరార్థాన్ని వివరించారు. రాజయ్య నవలల్లో సంభాషణల్లోని వాక్కు, బలమైన ప్రాంతీయత, మౌఖిక సంప్రదాయం పదునుదేరి ఉండడం మూలంగా గ్రామీణ దైనందిన జీవన యుద్ధ క్షేత్రంలోకి పాఠకుడిగా అడుగు పెట్టినవాడు పాత్రగా మారక తప్పదని, నవలను చదవని పాఠకులలో చదవాలనిపించే విధంగా నవల ఇతివృత్తాన్ని అద్భుతంగా వర్ణించారు. నవలను చదివే పాఠకుడు

---

[20] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 152.

[21] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 152

నవలలోని సంఘటనల మూలంగా ఇతివృత్తానికి ఉద్వేగం చెందుతారని చెప్తున్నారు. "గ్రామాల నుండి క్రూరమైన, అభివృద్ధి నిరోధకమైన దొరలను తరిమేసిన ఒకానొక చారిత్రిక ఘట్టాన్ని కొలిమిలోని బొగ్గులు, నిప్పురవ్వ అంటుకొని మండిన కాలానికి ఈ నవల సాక్ష్యం. ఊపిరి. ఉత్తేజం. రాసింది నేనే అయినా – ఈ నవలలోని ప్రతి ఘట్టం, మాట, తిరుగుబాటు రైతాంగం, రైతు కూలీలది. వాళ్లను నడిపిన విప్లవోద్యమానిది. కార్యకర్తలది. ఇది నేపథ్యం అని కవి తానే స్వయంగా ఒక ముఖాముఖిలో చెప్పుకున్నారు"[22].

'కొలిమంటుకున్నది' నవలలో ప్రధాన ఇతివృత్తం కరెంటు, భూస్వామ్యం, దొరల దౌర్జన్యం. ఈ మూడింటినీ వ్యతిరేకిస్తూ వీటికి విప్లవ ధోరణిని జోడించడంతో నవల తారాస్థాయికి చేరుకుంది. నవలలో వచ్చే భూ సంబంధాల పోరాటాలను అమ్మంగి మహా భారతంలోని కురుక్షేత్ర సంగ్రామంతో పోల్చి వర్ణించిన క్రమం పాఠకులలో యుద్ధ వాతావరణాన్ని దర్శింపజేస్తుంది. మొదట భూమికోసం విషసర్పంతో పిపీలికంలా దొరతోని పోరాడి ఓడిపోయిన నర్సింహం, నవల ముగింపుకు వచ్చేసరికి పిపీలకాలనన్నింటిని ఏకంచేసి విష సర్పాన్ని నగరానికి పారద్రోలే నాయకుడుగా ఎదిగిన క్రమాణ్ణి అమ్మంగి గుర్తించిన విధానం అభినందనాత్మకంగా ఉంది.

కొలిమంటుకున్నది చిన్న, చిన్న చితుకులతో, బొగ్గు ముక్కలతోనే, కాని కరుగుతున్నది మాత్రం ఉక్కుచక్రమంటూ నవలలో దళిత బహుజనులకు రాజ్యాధికారం అనే ఉక్కు సంకల్పం నెరవేరే రోజు ఎంతో దూరంలో లేదన్న ఆశావహ దృక్పథాన్ని అమ్మంగి పాఠకులకు ప్రభోదించారు.

"1970 దశకపు తెలంగాణ చారిత్రక పరిస్థితులకు సంబంధించిన ఒక సృజనాత్మకమైన డాక్యుమెంటు ఈ కొలిమంటుకున్నది నవల. ఇంత విశిష్టమైన నవల ఇతర భాషల్లోకి అనువాదం కాకపోవడం విచారించవలసిన విషయం"[23] అని అమ్మంగి కలత చెందారు. ఈ నవలను విమర్శించే క్రమంలో అమ్మంగి కూడా ఒక విప్లవోద్యమ విమర్శకుడిగా రూపాంతరం చెందిన క్రమాణ్ణి ఈ వ్యాసంలో చూడవచ్చు.

---

[22] కొలిమి. ప్రత్యామ్నాయ కళా సాహిత్య సాంస్కృతిక వేదిక, 'కొలిమంటుకుననేది' నవల నేపథ్యం– ప్రాసంగికత– ఉపకరణాలు – 2, జూన్ 2019

[23] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 155.

## 2.1.5. పాకుడురాళ్ళు – రావూరి భరద్వాజ

సాహిత్యం జీవిత చిత్రణతోపాటు జీవిత విమర్శ కూడా చేస్తుంది. చిత్రణ బహిర్ముఖంగా, విమర్శ అంతర్ముఖంగా సాగటం ఉత్తమ సాహిత్య లక్షణం. అమ్మంగి గారి విమర్శ కూడా అంతర్ముఖంగానే సాగుతుందని చెప్పడానికి ఒక ఉదాహరణగా "పాకుడురాళ్ళు" నవలపై చేసిన విమర్శనే చెప్పుకోవచ్చు. ఈ నవలకు గాను 2013లో రావూరి భరద్వాజగారు భారతదేశపు అత్యున్నత సాహిత్య పురస్కారమైన "జ్ఞానపీఠ అవార్డు" అందుకున్న సందర్భంగా అమ్మంగి పాకుడురాళ్ళు నవలలోని అంతర్ముఖీన భావాలను బయటి ప్రపంచానికి తెలిసే విధంగా **"పాకుడురాళ్ళ–మట్టి వాసన"**[24] శీర్షకతో విమర్శనా వ్యాసం రాసారు.

సామాన్య కుటుంబంలో జన్మించి, పెద్దగా చదువుకోకపోయినప్పటికీ తెలుగు సాహిత్యరంగంలో తనదైన శైలిలో రచనలు చేసి, అసమాన్యమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన మహోన్నత సాహితీవేత్త డాక్టర్ రావూరి భరద్వాజ. మనుషుల భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలురాసే భరద్వాజ శైలి సరళసుందరమైనది. పాత్ర చిత్రీకరణలో సన్నివేశాలు, సంఘటనలను పరిచయం చేయడంలో ఆయన ప్రత్యేకత వేరు. నేలవిడిచి సాముచేయకుండా, వాస్తవిక జీవితాలను ఆధారంగా చేసుకొని రచనలు చేయడం ద్వారా పాఠకులకు స్ఫూర్తిని కలిగించే రచనలే ఉత్తమమైనవని భావించే సహృదయుడు రావూరి భరద్వాజ. నిజాన్ని నిజంగా నిజాయితీగా చెబుతున్నప్పుడు ఏ రచనకైనా పేరు వస్తుందని నమ్మి, ఇతరులకు భోధించినవాడు. నేటి ధనస్వామ్య వ్యవస్థ యొక్క క్షీణ సాంస్కృతిక విలువలు ప్రతిబింబమైన సినీ వ్యవస్థలోని బీభత్సాన్ని పాకుడురాళ్ళు నవలలో బట్టబయలు చేశారు.

పాకుడురాళ్ళు నవల భరద్వాజగారికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. చలనచిత్ర పరిశ్రమ కథా వస్తువుగా వచ్చిన ఈ నవల ఎంతో మంది విమర్శకుల మెప్పు పొందింది. నవల అంతా కూడా మంజరి (మంగమ్మ) పాత్ర చుట్టే తిరిగినప్పటికీ కథా సంవిధానంలో ప్రదర్శించిన ప్రతిభ మూలంగా తారాస్థాయికి చేరుకుంది. నవలను గురించి విశ్లేషించే క్రమంలో అమ్మంగి ఏ సందర్భంలో కూడా విమర్శకుడిగా మంజరి పాత్రను తక్కువ చేసే విధమైన వాక్య ప్రయోగాలు

[24] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. 194

చేయలేదు. వ్యాసం చదువుతున్నంత సేపు నవలలోని ఏ పాత్రను గురించి కూడా వివరించకుండా మంజరి పాత్రకు మద్దతుగా నిలబడ్డారేమో అన్న సందేహం కలుగుతుంది. నవలను చదివిన ప్రతి పాఠకుడు మంజరి వ్యక్తిత్వాన్ని, తన జీవితాన్ని గురించి కొంత అసభ్యకరంగా ఆలోచించేందుకు అవకాశం లేకపోలేదు. ఎందుకంటే ఆ పాత్ర చిత్రణ అలాంటిది. కాని అమ్మంగి ఏ ఒక్క సందర్భంలో కూడా మంజరిలోని లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేయలేదు. పైగా సినీ సంస్కృతికి సంబంధించి మంజరికి జరిగిన మోసాలకు కొంత కలత చెందారేమో అన్న భావన కలుగుతుంది. అందుకేనేమో 'ఎదుటివాళ్ళను నమ్మక తప్పని పరాధీనతత్వం వున్న మంజరి కుడి యెడమల దగా కోరులున్న ప్రపంచం చేతిలో ఓడిపోక తప్పలేదు' అని అన్నారు.

ఈ వ్యాసంలో నవలను విశ్లేషించిన ప్రతీ సందర్భంలో కూడా సినీ జగత్తు, ధనిక వర్గ దురాగతాలను గురించి, మోసపూరితమైన స్నేహ భావాలను గురించి మాత్రమే వివరించారు. "కుటుంబంలోనూ, సమాజంలోనూ, సినిమారంగంలోనూ– పురుషాధిక్య సమాజం, డబ్బువలలు పన్ని నటీమణులను బలి పశువుల్ని చేస్తున్నాయన్నారు. మాటలతో ఉచ్చులు పన్నే గిరీశం వంటి బతకనేర్చిన నక్కలు, తోడేళ్ళు సినిమా రంగంలో కోకొల్లలు"[25] అంటూ పలికిన వాక్యాలలో మాటలతో మాయలు చేసే గిరీశం పాత్రతో పోల్చి మరీ వివరించిన తీరులో స్త్రీల పట్ల, స్త్రీ పాత్ర చిత్రణపట్ల అమ్మంగికి ఉన్న అభిమానం ప్రస్ఫుటమవుతుంది.

ప్రేమ రాహిత్యం అన్నది స్త్రీకి ఆత్మహత్యా సదృశమని తన అంతంకోసం నటనా చాతుర్యంకోసం, డబ్బుకోసం నటించే వాళ్ళ మధ్యన ఖైదీగా మగ్గిపోయిన క్రమాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించారు. నా అనేవాళ్ళు లేకపోతే ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందన్న విషయాలను నవల నుండి సేకరించి ఇలా అంటున్నారు. జీవితంలో విషాదం డబ్బులేక పోవడం కాదు; మనల్ని ప్రేమించేవాళ్ళు లేకపోవడం. మనం ప్రేమించటానికి ఎవ్వరూ దొరక్కపోవడమంటూ నమ్మిన వ్యక్తి దొరకక మంజరి పడ్డ బాధను గురించి వివరించిన విధానం సహృదయ స్థాయిని మించిపోతుంది. నటీమణుల బతుకు తెరమీద మోదాంతం, తెరవెనుక విషాదాంతం అన్న వాక్యాలు పరిశీలిస్తే నేటి ఆధునిక సినీజగత్తులోని నటీమణులను జీవితాలను ఆనాడే చిత్రించినట్లు ఉంది. ఏ మాత్రం కూడా ఈ వ్యాసం

[25] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట.194

నవలకు రాసిన విమర్శనా వ్యాసం అనే విధంగా తోచకుండా ప్రస్తుత సమాజంలోని సినీమాయకు ప్రతిబింబంగా అనిపిస్తుంది.

ఎంతో మంది విమర్శకులు భరద్వాజగారిపై చలం ప్రభావం ఉందని చెప్పుకుంటూ వచ్చారు. కాని అమ్మంగి మాత్రం ఈ నవలలో మంజరి అనుభవించింది చలం ఆశించిన స్వేచ్ఛావాదం కాదని ఖండించారు. "నిజానికి భరద్వాజ చలం కన్నా ధనికొండ హనుమంతరావు ఆలోచనలకు దగ్గరివాడు అంటున్నారు"[26]. ఈ పాకుడురాళ్ళు నవలలో ఆనాటి సమాజపు భౌతిక జీవితమూ, సినిమా పరిశ్రమకు సంబంధించిన కృత్రిమ జీవితమూ ఎంత బలంగా ఉన్నాయో, మంజరి మానసిక జీవితమూ అంతే బలంగా ఉందనడంలో మంజరి పాత్రను అర్థం చేసుకున్న తీరు స్పష్టమవుతుంది.

### 2.1.6. దగాపడిన తమ్ముడు – బలివాడ కాంతారావు

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంటే 1945—1952 వరకు ఆంధ్ర దేశంలో రైతులు ఎదుర్కొన్న కడగండ్ల నేపథ్యంలో వెలువడ్డ నవల **'దగాపడిన తమ్ముడు'**. ఈ నవలపై **"సంధి దశలో సామాన్యుడు దగాపడిన తమ్ముడు"**[27] అనే శీర్షకతో అమ్మంగి సమీక్షా వ్యాసం రాశారు. "ఈ నవలను బలివాడ కాంతారావుగారు వాస్తవికతను ప్రదర్శించేటట్టుగా రాసారు. సామాజికంగా భూస్వామ్య స్వభావం త్వరితగతిన  అంతమవుతూ, పెట్టుబడిదారీ స్వభావం బలపడుతున్నటువంటి కీలక సంధి దశలో రాజకీయ సామాజిక ఆర్థికశక్తులు ఒక కుటుంబం మీద ఎలాంటి ప్రభావం చూపాయన్న ప్రశ్నకు తిరుగులేని జవాబే ఈ దగాపడిన తమ్ముడు" అంటున్నారు. అందుకే ఈ వ్యాసానికి "సంధి దశలో సామాన్యుడు దగాపడిన తమ్ముడు" అనే శీర్షికను పెట్టారని చెప్పవచ్చు. సంధి దశలో సామాన్యుడు అని అనడానికి ప్రధాన కారణం భారతదేశంలో 1945–1952 వరకు ఏడు సంవత్సరాలు ఆర్థికంగా ఆర్థికమాంద్యం స్థానాన్ని ద్రవ్యోల్బణం ఆక్రమించిన కాలమది. ఆ సంధిదశలో సామాన్యుల పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయి, సామాన్యులను కరువు కాటకాలు ఏవిధంగా అధోజగత్తుకు దిగజార్చాయి అన్న విషయాన్ని స్పష్టం చేసేందుకు ఈ శీర్షికను పెట్టారు.

---

[26] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. 196

[27] వేణుగోపాల్. అమ్మంగి, అవినాభావం. పుట. 75

ఒక నిర్దిష్ట చారిత్రక నేపథ్యంలో పుల్లయ్య అనే సామాన్యుడి కుటుంబం ఎన్నిరకాల ఆటుపోట్లకు గురైందో సమగ్రంగా రచయిత ఈ నవలలో ప్రదర్శించిన క్రమాన్ని అమ్మంగి విమర్శనా దృష్టితో పరిశీలించారు.

ఈ వ్యాసంలో అమ్మంగిలోని మార్క్సిస్టు విమర్శనా ధోరణి కనిపిస్తుంది. నవలా నాయకుడు పుల్లయ్య భూస్వాముల దోపిడి మూలంగా తలెత్తిన భూమి సమస్యలు అతని సంసారాన్ని ఏ విధంగా కుప్ప కూల్చాయి. నీతిగా న్యాయంగా బతుకుతున్న పుల్లయ్య రైతుస్థాయి నుంచి కూలీగా దిగజారి, దొంగగా పతనమైన క్రమాన్ని వివరించడంలో ముందుగానే లక్ష్యాలను నిర్ణయించుకుని విశ్లేషణషించడం మూలంగా విమర్శకులుగా అమ్మంగి సాఫల్యం చెందారు.

నవల అంతా కూడా పుల్లయ్య, నీలి, రాజీనాయుడు అనే ప్రధాన పాత్రల చుట్టూ తిరుగుతుంది. భూస్వామి రాజీనాయుడు కొంతమంది పెత్తందారులతో కుమ్మక్కై ఎత్తుకు పైఎత్తులు వేసి పథకం ప్రకారం పుల్లయ్య జీవితాన్ని పతనం చేస్తాడు. ఆ పథకాలు సఫలం కావడానికి ప్రధాన కారణం ఆనాటి కరువు పరిస్థితులు, ఆర్థికమాంధ్యం. నవల 1945-47 మధ్య యుద్ధ కాలాన్ని చిత్రించినప్పటికి నవలలో భారతదేశ జాతీయోద్యమం ప్రస్థావన ఎక్కడా రాలేదంటారు అమ్మంగి. అంటే నవలాకారుడు ఆ కాలంలో గ్రామీణ నిరుద్యోగం అనే అంశం మీదనే తన దృష్టిని కేంద్రీకరించటం మూలంగా జాతీయోద్యమం వైపు దృష్టి సారించలేదన్నారు. అక్కడక్కడా స్వాతంత్ర్యం రాకముందు పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా వారి పరిపాలనలో తేడా ఏమీ లేదని వివరించే సందర్భాలు లేకపోలేదు. 1952 కాలంనాటి ఎన్నికలను గురించి వివరిస్తూ ఎన్నికలలో ఎవరు గెలిచినా సామాన్యుడి నిరాశను పెంచారే తప్ప తగ్గించలేక పోయారన్న రచయిత మనోభావాన్ని చాలాబాగా పసిగట్టారు అమ్మంగి.

నవలలో ఉన్న 'దున్నే వాడిదే భూమి' అన్న నినాదాల మూలంగా నెలకొన్న కమ్యూనిస్టు భావాలను కూడా మార్క్సిస్టు ధోరణిలో అమ్మంగి విమర్శించారు. పుల్లయ్య పతనం వెనకాల వర్గకసి స్పష్టంగా కనిపిస్తుందంటారు. 'భూస్వాముల దోపిడీల మూలంగా నిర్జీవమవుతున్న ఊళ్లు, జనజలమయమవుతున్న నగరాలు సమాజంలో ఏర్పడ్డ సంక్షోభానికి నిదర్శనంగా

ఉన్నాయన్న'[28] వాక్యాలు చదివే పాఠకుల మనస్సులలో కరువు రూపం కళ్లముందు మెదలాడుతుంది. ఈ జనమయమవుతున్న నగరాలు అన్న సందర్భంలో భాషా భాగంలోని పదచిత్రాలు దర్శనం ఇస్తున్నాయి.

మొదటినుంచీ పుల్లయ్య ఇతివృత్తాన్నే కేంద్రంగా చేసుకుని విశ్లేషించిన అమ్మంగి వ్యాసం ముగింపుకు వచ్చేసరికి వైవిధ్యాన్ని కనబరిచారు. నవలా నాయకుడు పుల్లయ్యనే అయినా పుల్లయ్య భార్య నీలి పాత్ర సమగ్ర చిత్రణ వల్లే నవలకు జీవితం సిద్ధించిందని పలికిన వాక్యాలు పుల్లయ్య కంటే నీలికే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అనిపిస్తుంది. నీలి సాంప్రదాయిక నేపథ్యంలో పాతివ్రత్యమూ, దానశీలమూ అలవరుచుకొని, నైతిక దృష్టి బలపరుచుకుంది. ఎన్ని కష్టాలు ఎదురైనా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసిందే తప్ప నిరాశ, నిస్పృహకు గురి కాలేదు. నీలి వ్యక్తిత్వమే పుల్లయ్యకు మార్గదర్శకమైందన్న వాక్యాలు పరిశీలించినప్పుడు నవలలో పుల్లయ్య కంటే నీలే గొప్పదన్న భావన కలగకమానదు. ఎక్కువ వ్యాసాలు అమ్మంగి స్త్రీ చైతన్యం పై రాసి, స్త్రీ మనస్తత్వాన్ని చిత్రించి ఆమెను సమాజానికి శక్తిగా భావించారు. ఇంకా సామాజిక స్థాయిలో ఎగుడు దిగుడులున్నా, నీలి నైతిక స్థాయి మాత్రం నిత్యం ఎదుగుతూ వచ్చిందని, పుల్లయ్య నైతిక స్థాయి మాత్రం నీలికి విరుద్ధంగా దిగజారుతూ వచ్చిందని తెలిపిన విషయాలు నీలి పాత్రను ఉన్నత స్థాయిలో నిలబెడతాయి. తన అదుపులోలేని సాంఘిక ఆర్థిక రాజకీయ శక్తుల చేతిలో కీలుబొమ్మ పుల్లయ్య అంటున్నారు. నీలి తన వ్యక్తిత్వం మూలంగా పూర్తిగా పరివర్తనం చెందిన భర్తను తిరిగి గెలుచుకోగలిగింది అనడంలో నీలినే నవలలో ప్రధాన పాత్రగా గుర్తించిన క్రమం అర్థమవుతుంది. అందుకే పుల్లయ్యను 'సంధి దశలో సామాన్యుడు దగాపడిన తమ్ముడు' అంటూ సామాన్య పాత్రగానే పేర్కొన్నారు.

అమ్మంగి నవలలపై రాసిన విమర్శనా వ్యాసాలు అన్నీ కుడా స్త్రీ పాత్రను కేంద్రీకృతం చేసుకుని, స్త్రీ శక్తిని వివరిస్తూ, వారి అభ్యున్నతి చైతన్యాన్ని కోరుతున్న క్రమం అర్థమవుతుంది. అందుకే అమ్మంగి ప్రధానంగా నవలలో స్త్రీ పాత్రలలోని మనస్తత్వాన్ని మాత్రమే విశ్లేషించే ప్రయత్నం

[28] వేణుగోపాల్. అమ్మంగి, అవినాభావం. పుట. 84

చేసారు. అమ్మంగి నవలపై రాసిన వ్యాసాలను చదివిన ప్రతి పాఠకుడికి ఈ భావన తప్పక స్ఫురిస్తుంది.

## 2.2. కథలపై విమర్శ

గురజాడ అప్పారావు 1910లో రచించిన 'దిద్దుబాటు' కథనే తెలుగులో తొలి కథఅని సాహిత్య విమర్శకులు చాలా కాలం భావించారు. అయితే ఆ భావనను వ్యతిరేకిస్తూ ఆచంట వెంకటసాంఖ్యాయన శర్మ రచించిన 'లలిత', బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య' మొదలైన కథలు గురజాడ 'దిద్దుబాటు' కంటే ముందే వచ్చాయని కొత్త ప్రతిపాదనలు రాసాగాయి. కొంతమంది విమర్శకులు కథలోని ఆధునికతను దృష్టిలో ఉంచుకొని విశ్లేశిస్తే, మరికొంత మంది కవులు ప్రాంతీయాభిమానంతో విమర్శించారు. మరికొందరు భండారు అచ్చమాంబ రాసిన కథను తెలంగాణ ప్రాంత కథ అనే నెపంతో కూడా విమర్శించడం జరిగింది. ఎంతమంది ఎన్ని విషయాలు తెలియజేసిన అన్ని కథలను ఆధునికతా దృష్టితో చూసినప్పుడు కథలకు సమగ్రత చేకూరుతుందని చెప్పవచ్చు.

కథల మీద విమర్శ చేసేటప్పుడు అమ్మంగివారి విమర్శనాత్మక శైలి ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఈ విభాగంలో అమ్మంగి వేణుగోపాల్ గారు కథలపై రాసినటువంటి విమర్శనాత్మక వ్యాసాలను పరిశోధించదలచాను. ముందుగా అమ్మంగి వారు రాసినటువంటి మొట్ట మొదటి విమర్శనా గ్రంథంలోని పరిశోధనాత్మక వ్యాసాలను గురించి చర్చించే ప్రయత్నం చేశాను.

### 2.2.1. స్త్రీ, దళిత కథలపై విమర్శ

అమ్మంగి వేణుగోపాల్ గారు కథలపై, కథానికలపై విమర్శ చేసే క్రమంలో భిన్న ఇతివృత్తాలకు సంబంధించిన కథలను ఎంచుకున్నారు. అందులో స్త్రీ, దళిత కథలు కూడా ఉన్నాయి. స్త్రీ దృక్పథం గల కథలలో స్త్రీ సమాజంలో తన కంటూ ఒక గుర్తింపు పొందేందుకు చేసే ప్రయత్నం ఉంటుంది. దళత కథలలో అయితే సంఘంలో దళితులు అభ్యున్నతిని సాధించి సమసమాజ నిర్మాణం కావాలనే ఆకాంక్ష ఉంటుంది. అవే అంశాలను అమ్మంగి కూడా క్షుణ్ణంగా పరిశీలించి, సమీక్షించే ప్రయత్నం చేశారు.

అభివృద్ధి చెందిన సమాజంలో స్త్రీ పురుషుల మధ్య స్నేహభావం మానవ సంబంధంగానే మొదలవుతుంది. అదే మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇద్దరు వ్యక్తులు పరిచయమైన క్షణం నుంచి యువతీ యువకుల మధ్య స్త్రీ పురుష స్పృహే రాజ్యమేలుతుందంటారు అమ్మంగి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలకు రెండింటికి మధ్య ఉన్న తేడాను గుర్తించి విశ్లేషించారు.

నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రాంత వాసులు ఎంతో అణచివేతకు గురయ్యారు. ఈ నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసిన గొప్ప వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. పత్రికా సంపాదకుడు, పరిశోధకుడు, పండితుడు, రచయిత, ప్రేరకుడు, క్రియాశీల ఉద్యమకారుడుగా తెలంగాణ మూలాలను పరిరక్షించినటువంటి సురవరం ప్రతాపరెడ్డిగారి కథలను గురించి **"స్త్రీకి అగ్రస్థానమిచ్చిన కథకుడు సురవరం"**[29] అన్న వ్యాసంలో వివరించారు. సురవరం ప్రతాపరెడ్డిగారు వారి కథానికలలో స్త్రీలకు, స్త్రీ పాత్రలకు ఇచ్చినటువంటి ప్రాధాన్యతను గురించి అమ్మంగి ప్రత్యేకంగా చర్చించారు. వ్యాసారంభంలోనే తెలంగాణ కథానిక రచయితల్లో సురవరం ప్రతాపరెడ్డిగారు ప్రముఖమైన వారని, తెలంగాణ సాహిత్యంలో వారి స్థానాన్ని పేర్కొన్నారు. నిద్రాణ సమాజంలో చైతనాన్ని కోరి గోల్కొండ పత్రికను ఏ విధంగా అయితే నిర్వహించారో, కథానికా రచనను కూడా అంతే చైతన్యంతో నడిపించారు. అందుకే సామాజిక చిత్రణలో వాస్తవికతకు ప్రాముఖ్యతనిచ్చారని అమ్మంగి పేర్కొన్నారు. సురవరంగారి కథల్లో స్త్రీ పాత్రలకు ఎంత ప్రాధాన్యతను అయితే ఇచ్చారో హాస్య, వ్యంగ్యాలకు కూడా సన్నివేశపరంగాను, సంభాషణాత్మకంగాను సముచిత స్థానం కల్పించారు.

"స్త్రీలకు, శూద్రులకు మన మతమందు హక్కులేనాడు తగ్గెనో నాటి నుండియు మతము క్షీణించి పోయెననుటలో సందేహము లేదు" అన్న ఇరవయ్యో శతాబ్దపు తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డివారి సాహిత్యంలోని స్త్రీ, దళితవాద దృక్పథాన్ని అమ్మంగి ఈ వ్యాసంలో ఎంతో అద్భుతంగా విశ్లేషించారు. అమ్మంగి సూత్రీకరించిన లక్షణాలన్నీ కూడా ప్రతాపరెడ్డిగారి కథా రచనా శైలికి అద్దం పడుతున్నాయి.

---

[29] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 18

సురవరం ప్రతాపరెడ్డి గారి కథానికలలో సుకుమార, సుందరమైన కథానాయికలను కాకుండా ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని కల్గిన శ్రామిక స్త్రీ పాత్రలను కథానాయికలుగా చిత్రించి, శ్రామిక స్త్రీల ఆత్మాభిమానాన్ని, స్థిరచిత్తాన్ని చాటి చెప్పారు. సురవరం వారి గురించి, వారి కథానికలను గురించి పరిశీలనాత్మకంగా రాసిన వ్యాసం అమ్మంగివారి నిశిత పరిశీలనా దృష్టి పరిపూర్ణతను చేకూర్చుతుంది.

ఈ కథానికలలో స్త్రీ మానసికమైన ప్రేమతోపాటు, దైహికమైన అవసరాలకు సంబంధించిన విషయాలకు పెద్దపీట వేశారు. ప్రతాపరెడ్డిగారు స్త్రీల పాతివ్రత్య మహిమను తెలిపే కథానికలు కూడా రాశారు. అలాగే సంప్రదాయ వ్యతిరేకత మూలంగా మనిషిలో జరిగే పెనుమార్పును గురించే వివరించే కథానిక "బారిష్టర్ గోపాల కిషన్ రావు". ఇంగ్లండులో బారిష్టరీ పూర్తిచేసి వచ్చిన కిషన్ రావు భారతీయ సంప్రదాయ విలువలను మరిచి పరదేశ సంస్కృతికి అలవాటుపడి భార్యను వదిలి స్వతంత్రంగా ఉంటాడు. బారిష్టరు కిషన్ రావు డబ్బుమీద కన్నేసిన సాహెబు ఒక వేశ్యను బ్రాహ్మణ పిల్ల అని కిషన్ రావుకు పరిచయం చేసి పెళ్ళాడేటట్టు చేసి చివరికి మోసం చేస్తాడు. అన్నీ అయిపోయిన తరువాత ఊహాప్రపంచం నుంచి వాస్తవ ప్రపంచలోకి వచ్చిన తరువాత పశ్చాత్తాపం చెంది కిషన్ రావు ఇల్లుచేరి భార్యను ప్రేమగా చూసుకుంటాడు.

ఈ కథానికలో కృత్రిమ నాగరికతను సంప్రదాయ జీవితాన్ని ఎదురెదురు నిలిపి అజ్ఞానానికి, ప్రపంచ జ్ఞానానికి మధ్య తేడాను, పడుపువృత్తికి, పాతివ్రత్యానికి మధ్య భేదాన్ని అనుభవంలోకి వచ్చేలా రచించిన సురవరం కథానికను తన పరిశీలన ద్వారా అమ్మంగి పాఠకులకు తెలియజేసాడు. అదే విధంగా **"మెహ్దీ బేగమ్"** కథలో ఒక పురుషుని ప్రేమలో పడి మోసపోయిన ఒక యువతి కథను కరుణ రసాత్మకంగా రాసారన్నారు.

మానవ స్వభావంలోని నీతినీ లేదా దుర్నీతినీ వాస్తవంగా చిత్రించి, ఒకోసారి పక్క పక్కన నిలిపి చూపటం సురవరం కథలలో, కథారచనలో పాటించే పద్ధతి అన్నారు. పరిస్థితుల వల్ల మగవాడి వల్ల స్త్రీకి జరిగే అన్యాయం ఆమెను వేశ్యా వృత్తిలోకి నెట్టివేసిన కథానికలు కూడా సురవరంవారు రాశారని అందుకే వారు సమాజంలోని సంఘటనలను, స్త్రీ చైతన్యాన్ని కేంద్రంగా చేసుకుని కథానికలు రాశారు. "స్త్రీకి ఉన్నత స్థానం ఇవ్వటం ద్వారా మానసిక సంస్కారంతో మెలిగే వ్యక్తిగా, స్త్రీని

చిత్రించడంలో సురవరం కథానికా రచయితగా విజయం సాధించారు"[30] అన్న అమ్మంగి వాఖ్య సురవరంగారి రచనా వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తున్నది. సురవరంవారి కథారచనా శైలి తెలంగాణలోని తరువాత తరం వారైనా పొట్లపల్లి రామారావు వంటి వారికి ఆదర్శమైందన్నారు.

**"వ్యక్తిత్వ సాధనలో ఆధునిక స్త్రీ"**[31] అనే వ్యాసంలో స్త్రీవాద కవయిత్రి కుప్పిలి పద్మగారి **"మంచుపూల వాన"** (2008) కథానికల సంపుటిలోని స్త్రీవాద ఛాయలను పరిశీలించారు. ఈ సంపుటిలోని కథానికలలో రచయిత్రి వ్యక్తిత్వం ఏదో ఒక రూపంలో దర్శనం ఇస్తుందన్న విషయాన్ని వివరించారు. ఈ కథలలో వ్యక్తిత్వానికి సంబంధించి జీవలక్షణాన్ని గాయపర్చేటటువంటి హింసాత్మక సంఘటనలు ఎన్నో ఉన్నాయన్న భావన ఈ వ్యాసం ద్వారా అర్థమవుతుంది. యాంత్రికత మూలంగానే నేటి సమాజంలో సృజనాత్మకత  కనుమరుగైపోతున్నదని అంటున్నారు.

**'మంచుపూల వాన'** కథానికా సంపుటిలోని అన్ని కథలలో కూడా కుప్పిలి పద్మగారు విభిన్న సంఘర్షణల మధ్య ధైర్యంగా ముందుకుసాగిన ఆధునిక స్త్రీని చూపించే ప్రయత్నం చేశారని అమ్మంగి పేర్కొన్నారు. కొన్ని సందర్భాలలో రచయిత్రికి జీవిత చిత్రణ పట్ల ఉన్న ఆసక్తి, బలవంతపు సంఘటనాత్మక పరిష్కారాలలో లేకపోవటం గమనార్హమని పలికిన వాక్యాలలో రచయిత్రి తన కథలలో స్త్రీల సమస్యలను చిత్రించడంలో ఎంతో మెలకువను ప్రదర్శించినప్పటికీ ఆ సమస్యలను పరిష్కరించేందుకు ఉండే మార్గాన్ని చూపించలేకపోయారన్న భావన స్పష్టం అవుతుంది.

ప్రతి వ్యక్తి వ్యక్తిత్వ సాధనలో తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉండేందుకే జీవన సమరం చేస్తుంటారు. అదే విధంగా ఆధునిక స్త్రీ కూడా యాంత్రిక సమాజానికి ప్రభావితుడైన పురుషుని కాముకత్వానికి బలైపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అదే విషయాన్ని కుప్పిలి పద్మగారు వారి మంచుపూల వాన ద్వారా వ్యక్తీకరించే ప్రయత్నం చేశారు. ఆ సారాంశాన్నే అమ్మంగి వారు తమదైన శైలిలో స్త్రీకి అగ్రస్థానమిచ్చే విధంగా వారి విమర్శనా మార్గాన్ని కొనసాగించారు. ఈ వ్యాసంలో విమర్శకుడిగా అమ్మంగి కథలలో ఉన్నటువంటి సమకాలీన ప్రాసంగికతను పాఠకులకు తెలియజేసే ప్రయత్నం చేశారు.

---

[30] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 21

[31] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 156

స్త్రీల పట్ల జరిగేటటువంటి అన్ని రకాల శోషణలను తెలిపేందకు ముదిగంటి సుజాతారెడ్డి గారు ఎన్నో రకాల కథలను రచించారు. వారు ప్రకటించినటువంటి అన్ని కథానికలలో కూడా ఎంతో వైవిధ్యం ఉంటుంది. అటువంటి ముదిగంటి సుజాతారెడ్డి గారి కథలలో అమ్మంగి **'తెలంగాణ రచయిత్రుల కథానికలు అల్లుకున్న ఆకాశ పందిళ్ళు'**[32] అనే వ్యాసంలో **"9/11 లవ్ స్టోరీ"** (2004) అన్న కథానికను గురించి విమర్శనాత్మకంగా విశ్లేషించారు. ఈ వ్యాసంలో తెలంగాణ ప్రాంతంనుండి వెలువడిన వివిధ రకాల కథానికలను వివరించే క్రమంలో సుజాతా రెడ్డిగారి "91/11 లవ్ స్టోరి" కథానికలో కథానాయిక సుష్మ అనే యువతి పాత్రలో ఉన్న సమయస్ఫూర్తి, సాహస కృత్యాలను గురించి చర్చించారు. సుష్మ మహాసముద్రాల అవతల మనదికాని నేలమీద, దేశంకాని దేశంలో, భయానక విధ్వంసనాత్మక సంఘటనలనుండి తన బాస్ ను కాపాడుకుని వివాహం చేసుకున్న సన్నివేశాలను అమ్మంగి ఎంతో స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశారు. ఇందులో రచయిత్రి అంతర్జాతీయంగా ప్రాముఖ్యం వహించిన ఒక మహా సంఘటన నేపథ్యంలో స్త్రీ ప్రదర్శించినటువంటి సాహసోపేతమైన కృత్యాలను వివరించిన క్రమం ఎంతో పరిశీలనాత్మకంగా ఉన్నది.

**"స్త్రీ, దళితవాదాల సంగమం"**[33] అన్న వ్యాసంలో స్త్రీవాదం, దళితవాదం రెండూ కూడా సమాజంలో తీసుకొచ్చిన మార్పులను గురించి, సాహిత్య ఉద్యమాల గురించి ఎంతో అద్భుతంగా విశ్లేషించారు. ఈ వ్యాసంలో ఆత్మగౌరవ పోరాటంలో భాగంగా కులచైతన్యంతో వస్తున్న సాహిత్యం తెలుగుకు నిస్సందేహంగా నిండుదనాన్ని ఇస్తున్నదంటున్నారు.

భూస్వామి కిరాతకాలకు వ్యతిరేకంగా తెలంగాణలో వచ్చిన రైతాంగ పోరాటమే తెలుగులో తిరుగుబాటు కథానికలకు మూలకారణం అయ్యిందన్న వ్యాఖ్య తిరుగుబాటు తత్వాన్ని అనుభవంలోకి తెస్తుంది. ఈ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని దళిత ఉద్యమంలో భాగంగా **"నల్లరేగటి సాల్లు"** అన్న కథా సంకలనం 2006లో వచ్చిందని చెప్పారు. ఈ కథా సంకలనంలో దళితుల వ్యధలు మాత్రమే కాకుండా స్త్రీల వలపోతలకు, హృదయానుభూతులకు అక్షరరూపం

---

[32] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట.83

[33] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన పుట. 226

ఇచ్చిన పార్శ్వాలు చాలానే ఉన్నాయన్నారు. పాత్రకు వ్యవస్థకు మధ్య జరిగిన ఘర్షణలను ఆవేశపూరితంగా చెప్పటం మూలంగా ఈ కథాసంకలనం వాడెక్కింది అన్న భావనను అమ్మంగి తెలియజేసారు.

అమ్మంగి పేర్కొన్నట్టు ఈ కథాసంకలనంలోని అన్ని కథలలో కూడా దళిత ఉపకులాలకు చెందిన స్త్రీలు తమ అస్తిత్వానికి సంబంధించిన అంశాలతోపాటు, ఈ దౌర్జన్య  సమాజం నుండి ఎదుర్కొంటున్నటువంటి ఘర్షణలను గురించి, కథలలో చిత్రించినటువంటి గ్రామీణ జీవితాన్ని గురించి విశ్లేషించిన తీరు చైతన్యదాయకంగా  సాగింది.

తెలంగాణ రచయిత్రులు రాసిన ఉత్తమ కథలను గురించి వ్యాఖ్యానించడంలో అమ్మంగి విశ్లేషణాత్మక విమర్శనా దృక్పథం దర్శనం ఇస్తుంది. జాజులగౌరి రాసిన **"మన్నుబువ్వ"** (2004) కథాసంపుటిలోని మన్నుబువ్వ కథలో మొత్తం సజీవ తెలంగాణ భాష మట్టిలాగా పరుచుకుని ఉందన్నారు. అంటే కథ మొత్తం కూడా తెలంగాణ ప్రాంతంలో ఉన్న సంఘటనలనన్నంటిని ప్రదర్శించేవిధంగా ఉండి కరువు ఇతివృత్తాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించారని చెప్పారు.

ఈ 'మన్నుబువ్వ' కథ దళిత కుటుంబంలోని దారిద్ర్యము, దాని తోబుట్టువు అయిన ఆకలిని గురించి వివరించే క్రమంలో పాఠకుల హృదయాలలో ఆర్ద్రతా భావాన్ని నింపుతుంది. కథలో ప్రధాన పాత్రగా సాగే పదేళ్ళు కూడా లేని పాప దళిత కుటుంబంలో జన్మించిన కారణంగా ఆకలికి తట్టుకోలేక ఆకలి చల్లారే దాకా చెట్టు కిందికి పోయి మట్టిని తిని తరువాత ఇంట్లోకి వెళ్ళి నీళ్ళు తాగి నేలమీద పడుకుంటుంది. ఈ సంఘటన ప్రభుత్వాల ప్రగతి నివేదికను ప్రశ్నిస్తున్నట్లే ఉన్నది. ఈ దుస్థితి మనలో క్రోధం ఆక్రోశం రగిలిస్తుందన్న అమ్మంగి మాటలు 'మన్నుబువ్వను'  ఆకాశమంత ఎత్తుకు చేరుస్తున్నాయి. ఊహల్లో నుంచి పుట్టికొచ్చిన కథను ఊహలల్లి వ్యాఖ్యానించవచ్చు, కానీ ఆకలిలో నుండి పుట్టుకొచ్చిన కథకు ఊహకందని ముగింపు ఉంటుందన్నారు.

ఈ విధంగా స్త్రీ, దళిత వాదాలను చిత్రించిన కథలను గురించి అమ్మంగి తన సహృదయ దృష్టితో పరిశీలించి సాహిత్య పాఠకులకు తెలియజేస్తున్నారు. అట్లా తెలిపే క్రమం కథపై ఆసక్తి పెంచే విధంగానే ఉంటుంది తప్ప కథలో ఉన్న సౌందర్య శిల్పాలకు అడ్డు తగిలే విధంగా ఉండదు.

**"కథారచయితగా నెల్లూరి కేశవస్వామి"**[34] అనే శీర్షికతో రాసిన వ్యాసంలో కేశవస్వామి రచించిన **"అభిమానం"** కథలో చిత్రించబడిన దళిత సామాజిక దృక్పథం, అభ్యున్నతిని గురించి అద్భుతంగా వివరించారు. ఈ 'అభిమానం' కథలో 1960 ప్రాంతం నాటి హైదరాబాదు వాతావరణం దర్శనం ఇస్తుందన్నారు అమ్మంగి. కథానాయకుడు వెంకటరావు దళిత సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో బాల్యం నుండి యవ్వన దశ దాకా ఎన్నో అవమానాలను ఎదుర్కుంటూ వస్తాడు. ఉద్యోగం వచ్చిన తరువాత కూడా ఎవరితోను తన కులాన్ని గురించి చర్చించే ప్రయత్నం చేయడు. కాని ఒకరోజు దినపత్రికలో దళితులకు రిజర్వేషన్ ప్రకారం ఆఫీసర్ గా ఉద్యోగం ఇస్తారనే ప్రకటన చూడగానే ఎంతో ఉత్తేజితుడై తోటి ఉద్యోగులకు తన కులాన్ని వర్గాన్ని గురించి తెలిపి ఆ ఉద్యోగాన్ని సంపాదించి తనలో ఉన్న నిరాశాభావం నుండి విముక్తి పొందుతాడు.

శతాబ్దాలుగా దళితులకు జరుగుతూ వచ్చిన అన్యాయాలు, అక్రమాలు, వివక్షల నుండి బయటికివచ్చి ఆత్మాభిమానపూరిత జీవన విధానాన్ని ప్రారంభించాలని కథకుడు ఇచ్చిన సందేశాన్ని అమ్మంగి పాఠకలోకానికి సహృదయతతోనే తెలియజేశారు. ఈ కథలోని సమగ్ర ఇతివృత్తం దళితులు ఆర్థిక స్వావలంబన పొంది, సమానత్వాన్ని సాధించి సమాజంలో చైతన్యం పొందాలని కథకుడు 1960 దశకంలోనే ఆలోచించిన తీరు అద్భుతంగా ఉంది. ఈ విధంగా అమ్మంగిగారు ఎంచుకున్న కథలన్నీ అన్నీ కూడా స్త్రీ, దళితవాద దృక్పథాలను విశ్లేషించిన తీరు బాగుంది.

### 2.2.2. కుటుంబ ఇతివృత్తం గల కథలపై విమర్శ

జీవితానికి దగ్గరగా ఉండే కథా వస్తువును ఎంపిక చేసుకుని, దానికి సహజమైన సంవిధానంతో రూపం ఇచ్చి మధ్యతరగతి మనుషుల జీవితాలను చిత్రించిన కథలను కుటుంబ ఇతివృత్తంలో సాగే కథలుగా చెప్పుకోవచ్చు. కథా ఇతివృత్తం అంతా కూడా కుటుంబ వాతావరణం, కుటుంబంలో జరిగే అవకతవకలు, సంఘటనల చుట్టూ తిరుగుతుంది. ఈ కథలలో భార్యాభర్తలు తల్లిదండ్రుల మధ్య జరిగే సంఘర్షణ కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది.

---

[34] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. పుట. 103

**"నిరాడంబర కథకుడు"**[35] అనే శీర్షికతో రాసిన వ్యాసంలో అమ్మంగి వేణుగోపాల్ గారు గూడూరి సీతారాం రాసిన కథలలో చిత్రించబడినటువంటి కుటుంబ ఇతివృత్తాలను గురించి విశ్లేషించారు. భార్యాభర్తల మధ్య ఉండాల్సిన సంబంధాన్ని గురించి రాసిన పెళ్ళి–ప్రేమ' అనే కథ పాఠకులకు  భార్యను భర్త, భర్తను భార్య ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియజేస్తుంది. ఈ కథ భార్యాభర్తల మధ్య అహంకారానికి ఏమాత్రం స్థానం కల్పించకూడదనే సందేశం ఇస్తుంది.

మరో కథ **'రాజమ్మ రాజరికం'** ఈ కథలో కూడా అసమతౌల్యత మూలంగా జీవితాన్ని కోల్పోయిన రాజమ్మ అనే కథానాయిక జీనితాన్ని చిత్రించాడు. కథలో విలాసవంతమైన జీవితానికి ఆకర్షింపబడి మోసపోయి బిచ్చగత్తెగా రూపాంతరం చెందిన స్త్రీ గురించి వివరిస్తూ గ్రామీణ జీవనానికి దగ్గరి సంబంధం గల పాత్రలు, సన్నివేశాల ద్వారా కథా ఇతివృత్తాన్ని చిత్రించిన క్రమం పాఠకుల హృదయాలను కదిలించేలా ఉంది. రాజమ్మకు చిన్నతనంలోనే వివాహం జరగడం మూలంగా తనకు భర్తతో ఏవిధంగా ఉండాలనే విషయం ఏ మాత్రం తెలియవు. ఆమె తన భర్తలో ఉండే అపరిశుభ్రతను మాత్రమే గమనిస్తుంది.

ఆధునిక పోకడల మూలంగా కొంత కాలానికే భర్తకు దూరమై పుట్టింటికి చేరుకుంటుంది. తల్లిలేని రాజమ్మను తండ్రి పెంచడం వల్ల రాజమ్మలో స్త్రీల పట్ల ఏవిధంగా ప్రవర్తించాలి, కుటుంబంతో ఎలా మమేకమవ్వాలో తెలియవు.  తండ్రి కూతురు బాధను అర్థం చేసుకునే స్థాయిలో లేడు. మొదట ఎంతో దూషించి దెబ్బలు కూడా కొడతాడు. తండ్రి చేష్టలను సహించలేని రాజమ్మ తండ్రిని వదిలి వెళ్ళి ఒక బిచ్చగత్తెగా రూపాంతరం చెంది మళ్ళీ తన ఊరికే వచ్చి అడుక్కుంటుంది. చివరలో ఈ బిచ్చెగత్తెగా మారిన స్థితి కథలో శిల్పానికి నిదర్శనమని చెప్పవచ్చు. ఈ కథలో శృగార వర్ణనలు దట్టించటానికి అవకాశం ఉన్నా అందుకు పూనుకోకపోవటం గ్రామీణ నైతికతకు నిదర్శనం అంటున్నారు. అంటే ఇక్కడ అమ్మంగి కథలోని గ్రామీణ జీవితాన్ని, కథకుడు చిత్రించిన ఇతివృత్తాన్ని రెండింటినీ పరిశీలించారని చెప్పాలి.

---

[35] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 235

**"ఒక మనస్వి అంతరంగ చిత్రాలు"**[36] అన్న వ్యాసంలో ఆర్.యం. చిదంబరం రాసిన **'అక్కయ్య'** అనే కథలో తమ్ముని కోసం అక్క చేసినటువంటి ప్రయాణాన్ని త్యాగాలను అమ్మంగి విశ్లేషించారు. ఈ కథ మొత్తం శీర్షికకు తగ్గట్టుగానే తమ్ముని దృక్కోణం నుండి సాగిందని చెప్పారు. అక్కయ్య పాత్రను భిన్న కోణాలలో అర్థం చేసుకునే విధంగా చిత్రించబడింది. పెళ్ళి తర్వాత ఆడబిడ్డ భర్త విముఖత్వం తట్టుకోలేక తల్లిదండ్రుల చెంతకు చేరుతుంది. ఛాందసవాది అయిన తండ్రి కూతురు చేసిన పనిని ఏమాత్రం సహించక ఇంట్లో నుండి వెళ్ళగొడతాడు. ఒంటరితనాన్ని భరించలేక ఒక మనస్వి అయిన డాక్టరుతో జీవితం పంచుకుంటుంది. అతను గుండెజబ్బుతో మరణించడం మూలంగా డాక్టరు స్నేహితుడికి చేరువవుతుంది. ఇవన్నీ కూడా తన తమ్ముడిని ఉన్నత చదువులు చదివించాలనే ఉద్దేశంతో చేసినవే అయినా చివరికి తమ్ముడు కూడా అక్కయ్యను అర్థం చేసుకోకపోవడంతో తాను ఆత్మహత్యకు పాల్పడుతుంది. తండ్రి పితృస్వామ్యం, భర్త పురుషాధిక్యం తమ్మునిలో ప్రకోపించటమే ఆమె ఆత్మహత్యకు కారణం అయ్యాయంటూ మధ్యతరగతి కుంటుంబంలో విచ్ఛిన్నమవుతున్న సంప్రదాయ విలువలను గురించి, వివాహిత విషయంలో కుటుంబ సంబంధాలలో జరిగే వైఫల్యాలను  గురించి ఎంతో అద్భుతంగా విశ్లేషించారు.

"అక్కయ్య కథలో అక్కయ్య వంటి మధ్యతరగతి చందమామను సంప్రదాయ మేఘాలు తరిమినప్పుడు అమావాస్య తప్పలేదు. వివాహిత విషయంలో కుటుంబ సంబంధాల వైఫల్యం కొత్త సంబంధాలకు దారితీస్తుందని, అది మృత్యువుతో కూడా కావొచ్చున్నది రచయిత అభిప్రాయం" అన్నారు అమ్మంగి. ఇక్కడ అమ్మంగి రచయితతో మమేకమైపోయి రచయిత ఉద్దేశాన్ని వెలిబుచ్చారు. రకరకాల మానవ ప్రవర్తనలను ఆయా పరిస్థితుల్లో పరిశీలించి వివరంగా రాయడం చిదంబరం గారి కథలలో ఉన్న వైవిధ్యంగా చెప్పవచ్చు.

**"మధ్యతరగతి మనసెరిగిన కన్నసామి కథలు"**[37] వ్యాసంలో కన్నసామి రచించిన "నేను ఆఫీసుకు పోతున్నా" అన్న కథలో చిత్రించబడిన ఉమ్మడి కుటుంబ వాతావరణం గురించి అమ్మంగి ఎంతో సహజంగా వివరించారు. ఈ వ్యాసం రాసే క్రమంలో అమ్మంగి ఉమ్మడి కుటుంబ జీవితం

[36] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట.135

[37] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. 160

వైపుకు పయనించి పరిశీలించారనిపిస్తుంది. ఉమ్మడి కుటుంబ వాతావరణంలో తాత్కాలిక వియోగ సంగమాలు, తీయని చికాకులు, అంతే మధుర సంఘర్షణల సహజాతి సహజ వర్ణ చిత్రమే ఈ కథానిక అంటారు. పైన తెలిపిన విమర్శనా వ్యక్తిత్వం ఈ వ్యాసంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

### 2.2.3. మనోవైజ్ఞానిక కథలపై విమర్శ

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. 'హితేన సహితం సాహిత్యం' అన్నారు మన లాక్షణికులు. సమాజ హితాన్ని కోరుకొనే సాహిత్యం మనిషి వ్యక్తిత్వాన్ని అమూలాగ్రం చిత్రిస్తుంది. దీన్ని పరిశీలించవలసిన అవసరం విమర్శకునికి ఏర్పడింది. మనిషి మనస్తత్వాన్ని బాగా అర్థం చేసుకొని, పాత్రలను సజీవంగా తీర్చిదిద్దడంలో తెలుగు రచయితలు ఏ భాషా సాహిత్యంలోని రచయితలకు తీసిపోరు. తెలుగు రచయితలు కథలలో మనిషి మనస్తత్వాన్ని అద్భుతంగా కళ్లకు కట్టినట్లు చూపించారు. పాత్రల అంతర్గత పొరల్లోకి వెళ్ళి కథలను చిత్రిస్తున్నారు. ఈ రకమైన అధ్యయనాన్ని మనోవైజ్ఞానిక అధ్యయనం అంటారు. ఈ ధోరణిలో సాగిన కథలను అమ్మంగి వేణుగోపాల్ గారు కూడా మనోవైజ్ఞానిక దృష్టితోనే పరిశీలించారు.

**"అపరిచిత ప్రపంచం"**[38] అనే వ్యాసంలో రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించినటువంటి **"కార్నర్ సీటు"** (1953) కథానికలో "కథ వైరుధ్యంతో ప్రయాణం ప్రారంభించి, ఊహించని మలుపు తిరిగి మనోవైజ్ఞానిక శాస్త్రం పోలిమేరలలోకి వెళ్ళి తాత్వికస్థాయిని అందుకున్న క్రమాన్ని అమ్మంగి విశ్లేషించారు."[39] కథలో రాజు పాత్రలో చిత్రించినటువంటి మనోవైజ్ఞానిక దృష్టిని గురించి అమ్మంగి ఈ వ్యాసంలో వివరించిన క్రమం పాఠక హృదయాలలో ఉత్తేజాన్ని కలిగించే విధంగా ఉంది. కథను వివరించే క్రమంలో ప్రతి సన్నివేశంలో కూడా రాజులో వ్యక్తమైనటువంటి మానసిక ప్రక్షాలనను గురించి విశ్లేషించారు. 'ఆర్థిక, సామాజిక, మానసిక కారణాల వల్ల మృత్యువు పొలిమేరల్లో బతుకీడుస్తున్న లక్షలాది దీనుల హీనుల ప్రతినిధిగా రూపొందిన పచ్చకోటువాడి గూర్చి ఏమి చెప్పకుండానే అంతా చెప్పటం ఈ కథానిక శిల్పం'[40] అన్నారు. ఆర్.ఎస్. సుదర్శనం మాత్రం

[38] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 53

[39] అదే. పుట. సం. 53

[40] అదే. పుట. సం. 54

"కార్నర్ సీటు కథలో అస్తిత్వవాద లక్షణాలు ఉన్నాయని"[41] పేర్కొన్నారు. కాని అమ్మంగి వివరించిన కథా ఇతివృత్తంలో ఎక్కడ కూడా అస్తిత్వ లక్షణాల ప్రస్తావన జరుగలేదు. బహుశ అమ్మంగి కథానాయకుడు రాజు పాత్రలోని మనోవైజ్ఞానిక దృష్టిని మాత్రమే పరిశీలించదలచారేమో అన్న భావన సుదర్శనం గారి అభిప్రాయాన్ని పరిశీలించినప్పుడు అర్థమవుతుంది. ఈ జీవితంలో ఎట్టి బాధల్ని చూడలేక, భరించలేక, సహించలేక చివరికీరోజు పచ్చకోటువాడు ప్రాణాల్ని తీసేసుకున్నాడు కదా అని రాజు తనలో తాను పడిన మనోవ్యధలోని మనోవైజ్ఞానికతను అమ్మంగి విమర్శనాత్మకంగా పరిశీలించారు. రాజులాంటి కఠినాత్మునిలో ఈ సంఘటన కరుణార్ద్ర విషాదాంత నాటకాలను చూసే ప్రేక్షకుడిలో కలిగే మానసిక ప్రక్షాళన లాంటిదని అమ్మంగి తెలిపారు.

ఆర్.యం. చిదంబరం కథలపై అమ్మంగి **"ఒక మనస్వి అంతరంగ చిత్రాలు"**[42] అనే వ్యాసం రాసారు. ఈ వ్యాసంలో చిదంబరం కథలలోని కోణాలను పరిశీలించే ప్రయత్నం చేసారు. చిదంబరం రాసిన కథలలో రచయిత పాఠకుడు ఊహించే విధంగా కథను ముగించటం తనకు ఇష్టం ఉండదని చెప్పుకున్నారు. కానీ చాలావరకు సంఘటనల ప్రధానంగా సాగే కథల్లో ఈ లక్షణం రాణించినంతగా, మనస్తత్వ చిత్రణ ప్రధానంగా సాగే కథల్లో రాణించదు. "ముగింపు దొరికింది" కథలో చిదంబరం చిత్రించిన ముగింపు పాఠకులను ఆశ్చర్యానికి గురిచేసే విధంగా ఉందని కథారచయిత అనుభవ దృష్టిని గురించి వివరించారు. ఈ కథలో గోపీ పాత్రలో చిత్రించబడినటువంటి అపరాధ భావం, ఆత్మన్యూనత, సంశయ చిత్తం మనోవైజ్ఞానిక దృష్టిని ప్రదర్శించే విధంగా ఉన్నాయి, కాని విమర్శకులుగా అమ్మంగి ముగింపు గురించి మాత్రమే విశ్లేషించే ప్రయత్నం చేశారు. కాని గోపీ పాత్రలో మమేకమై చిత్రించబడిన మనోవైజ్ఞానిక దృక్పథం గురించి వివరించలేకపోవడం గమనార్హం.

**"నిరాడంబర కథకుడు"**[43] అనే వ్యాసంలో గూడూరి సీతారాం రచించిన కథల గురించి విశ్లేషణ ఉంది. అమ్మంగి సీతారాం కథలలోని నూతన ప్రయోగాలను, పాత్రల మనస్తత్వ చిత్రణకు

---

[41] సాహిత్య నేపథ్యం (వ్యాసావళి), ఆర్.ఎస్. సుదర్శనం, పుట. సం. 126

[42] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 135

[43] అదే. పుట. సం. 235

సంబంధించిన అంశాలను గురించి చర్చించారు. సీతారాం రచించిన **"రంగడు"** కథానికలో రంగని పాత్రలో అంతర్ముఖంగా చిత్రించబడినటువంటి మనోవైజ్ఞానికతను గురించి అమ్మంగి వివరించారు. రంగడు పాత్ర మొదట గ్రామంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని గ్రామాన్ని వదిలి భిలాయ్ వెళ్ళిపోతాడు. తరువాత చాలాకాలానికి ఒకానొక సందర్భంలో రంగన్ని దొర దెబ్బలనుండి రక్షించినటువంటి దొరసానిని చూడడానికి తిరిగి గ్రామానికి వస్తాడు. రంగడు ఊరికి వచ్చేసరికే దొరసాని చనిపోయిందని తెలియగానే ఎంతో మనోవ్యధకు గురై తనలో తాను అంతర్మధనానికి లోనైన సందర్భంలో ప్రదర్శితమైన మనోవైజ్ఞానిక దృష్టిని అమ్మంగి పాఠకులకు వివరించిన విధానం వైవిధ్యంగా సాగింది.

మనోవైజ్ఞానికం అంటే కథ మొత్తం ఒకే దృక్పథంతో సాగిన కథలనే కాకుండా కథలో పాత్రల అంతరంగంలో వచ్చిన మార్పుల మూలంగా వారిలో కలిగే ఆత్మన్యూనత భావాన్ని కూడా మానోవైజ్ఞానిక కథలుగా పరిగణించవచ్చు అన్న భావన కలిగించారు అమ్మంగి వేణుగోపాల్ గారు.

**"అస్తమించిన ప్రతిభామూర్తి వల్లపురెడ్డి బుచ్చారెడ్డి"**[44] అన్న వ్యాసంలో బుచ్చారెడ్డి గారు రచించిన **'పరాజితులు'** కథలో ఉన్నటువంటి ఆత్మన్యూనతా భావాన్ని, మనోవైజ్ఞానిక సన్నివేశాలను గురించి విశ్లేషించిన తీరు నిశిత పరిశీలనకు నిదర్శనం. 'పరాజితులు' కథ యదార్థజీవిత సంఘటనల ఆధారంగా నిర్మితమైనది. బుచ్చారెడ్డి తన సొంత అన్న జీవిత వృత్తాంతాన్ని ఆధారంగా తీసుకొని రాసిన కథ పరాజితులు. బుచ్చారెడ్డి అన్న నిజ జీవితంలో కుటుంబ భాంధవ్యాల మూలంగా పొందిన మనోవేదనను భరించలేక తాను అసమర్థుణ్ణని భావించి ఆత్మన్యూనతకులోనై ఆత్మహత్య చేసుకుంటాడు. కొడుకు మరణించడంతో తల్లడిల్లిన తండ్రి గుండెజబ్బుతో మరణిస్తాడు. చిన్నవాడయిన బుచ్చారెడ్డి ఒంటరిగా మిగిలిపోతాడు. ఈ యధార్థ గాథలను కథకుడు కథగా మలిచిన క్రమం గొప్పగా ఉంది. కథలో పెద్ద కుమారుడి పాత్రలో చిత్రించబడిన ఆత్మన్యూనత భావాన్ని విమర్శకుడిగా అమ్మంగి బాగా గుర్తించారు. కథలోని మనోవైజ్ఞానిక సన్నివేశాలను విశ్లేషించిన తీరు పఠనాసక్తిని పెంచేవిధంగా ఉంది. 'పరాజితులు' అనే కథ శీర్షకలోనే తెలియని నిరాశ, నిస్పృహలు ప్రస్ఫుటమవుతున్నాయి.

[44] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 120

**'మధ్యతరగతి మనసెరిగిన కన్నసామి కథలు'**[45] అన్న వ్యాసంలో కన్నసామి రాసిన "గతానుగతం" అన్న కథలోని మనోవైజ్ఞానిక లక్షణాలను గురించి విశ్లేషించారు. కథలో రామానుజరావు, సుందరీబాయి, సీత పాత్రలలోని మనోవిశ్లేషణాత్మక భావాలను గురించి వివరించిన క్రమం పాఠకులను కథా ప్రపంచంలోకి తీసుకుపోతుంది. సుందరీబాయి పాత్రలో మిళితమై ఉన్న మనోవైజ్ఞానిక దృష్టిని అమ్మంగి పరిశీలించారు.

### 2.2.4. ప్రాంతీయ అస్తిత్వవాద కథలపై విమర్శ

తెలంగాణ అస్తిత్వ ఉద్యమ సాహిత్యాన్ని పాఠకుల కళ్ళకు కట్టే విధంగా అమ్మంగిగారు తమ విమర్శను కొనసాగించారు. ఒక ప్రాంతంలో పుట్టి, పెరిగి, ఆ భౌగోళిక ప్రాంతాన్నే నమ్ముకుని జీవిస్తున్న ప్రజలపై, ఆ ప్రాంతానికి వివిధ కారణాల వల్ల వలస వచ్చి, క్రమేపీ అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్న వాళ్ళు స్థానికులపై ఆధిపత్యం చెలాయించడంతో స్థానీయత భావన నుండి ప్రాంతీయ భావన పుట్టుకొస్తుంది. అది ఉద్యమరూపం పొందిన తర్వాత ప్రాంతీయవాదంగా తీవ్రమవుతుంది. ఇలాంటి అంశాన్ని కేంద్రంగా చేసుకుని తమప్రాంతం గుర్తింపును దేశం నలుమూలలా ప్రసరింపచేయడానికి ప్రజలు చేసే ఉద్యమాన్నే అస్తిత్వ పోరాటం అంటారు. ఈ సందర్భంలో ఆ ప్రాంతం నుండి 'అస్తిత్వ సాహిత్యం' అనేది వెలువడుతుంది. ఆ కోణంలో సాగిందే తెలంగాణ ఉద్యమం. ఉద్యమకాలంలో తెలంగాణ జీవితాన్ని పెనవేసుకుని అన్ని రంగాల నుండి ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం వెలువడింది. ప్రాంతీయ దోపిడీని వ్యతిరేకించడమే ఈ సాహిత్య సిద్ధాంతం.

"ఒక ప్రాంతంలో జీవించే ప్రజల గురించి అక్కడి నైసర్గిక స్వరూపం, మానవ సంబంధాల తీరు, భాష, సంస్కృతి, భావ వ్యక్తీకరణ, సంభాషణ తీరు, ఆలోచనల తీరు. వాటితోపాటు వాటిని నిర్దేశించే, ప్రభావితం చేసే ప్రకృతి, పంటలు, వృత్తులు, ఆధునిక అభివృద్ధి, కులాలు, మతాలు, విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలు. వీటన్నిటి పరిణామాలు కలిసి ఒక ప్రాంతం యొక్క ప్రాంతీయ అస్తిత్వాన్ని, ప్రత్యేకతను, నిర్దిష్టతను, సంస్కృతిని తెలుపుతాయి. వీటన్నిటిని ఒక స్పృహతో,

---

[45] అదే. పుట. సం. 160

చైతన్యంతో చిత్రించిన కథలను, సాహిత్యాన్ని, ప్రాంతీయ స్పృహను, చైతన్యాన్ని చిత్రించిన సాహిత్యమని వర్గీకరించవచ్చు, పేర్కొనవచ్చు"[46].

తెలంగాణ జీవిత చిత్రణ ఇతివృత్తంగా వెలువడిన కథలన్నీ కూడా పరిశోధనలో ఉత్తమ సాహిత్య విలువలు కలిగి ఉన్నాయి. అస్తిత్వ పోరాట కథలు రచయితలు మాత్రమే కాదు, రచయిత్రులు కూడా రాస్తున్నారని **"తెలంగాణ రచయిత్రుల కథానికలు అల్లుకున్న ఆకాశ పందిళ్ళు"**[47] అన్న వ్యాసంలో వెల్లడయింది. రచయిత్రుల కథలలో చిత్రించబడిన తెలంగాణ జీవితాన్ని విమర్శకులుగా అమ్మంగి ఎంతో అద్భుతంగా విశ్లేషించారు. ఈ వ్యాసంలో పి. యశోదారెడ్డిగారు రాసిన **"మావూరి ముచ్చట్లు"** సంపుటి(1973) లోని **'మా పంతులు'** కథలో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ ప్రాంత ప్రజలు కోల్పోయిన స్థానీయతను, జీవితాన్ని గురించి అమ్మంగి పరిశోధించారు. ఈ కథలో రచయిత్రి యశోదారెడ్డి తెలంగాణ భాషలో భాగమైన సామెతలు, పదబంధాలు, మాటతీరు వంటి అంశాలను పాత్రోచితంగా, సన్నివేశపరంగా ప్రదర్శించారు. ఇట్లా ఆనాటి సాహిత్యకారులు ఎవ్వరూ కూడా ప్రదర్శించలేక పోయారని మా పంతులు కథలో చిత్రించబడిన స్థానీయత, ప్రాంతీయ భావనను గురించి అమ్మంగి తమ విశ్లేషణలో నిరూపించారు.

అమ్మంగి కొన్ని వ్యాసాలలో ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతం మీద వెలువడినటువంటి సాహిత్యం గురించే విశ్లేషించే ప్రయత్నం చేసారు. స్థానీయత బలంగా ఉన్న కథలను ఎన్నుకుని మరీ ఆ కథలపై సమీక్ష చేసే ప్రయత్నం చేశారు. అట్లాంటి సమీక్షనే **"నామవాచకాన్ని సర్వనామం చేసినవాడు"**[48] రాజేందర్ జింబో రాసినటువంటి **'మా వేములవాడ కథలు'** అనే కథా సంపుటిలోని స్థానీయతను ప్రదర్శించిన కథలను గురించి వివరించారు. మా వేములవాడ కథలు కథానికలు కావు. ఆత్మకథాత్మక రచనలు, స్థానీయత బలంగా ఉండే దొంతరలు. కథానిక కొంత, స్కెచ్ కొంత

[46] రాములు. బి. ఎస్. ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణ కథ నవల. పుట. సం. 5

[47] వేణుగోపాల్ అమ్మంగి. సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 83

[48] అదే. పుట. సం. 251

కలగలసిన వచన రచనలంటూ కథల సంపుటిలో ప్రదర్శితమైన జ్ఞాపకాలను గురించి అమ్మంగి అస్తిత్వవాదం ప్రస్ఫుటించే విధంగా వివరించారు.

"వేములవాడ కథలు" సంపుటిలోని **"తమ్మల సొన్నాయి"** కథ ప్రాంతీయ అస్తిత్వానికి సంబంధించి పాఠకులలో పెద్ద ప్రశ్నను లేవనెత్తిందని తమ్మల సొన్నాయి కథ ఇతివృత్తాన్ని వివరించాడు అమ్మంగి. తమ్మల సొన్నాయి తెలంగాణ ప్రాంత వాసుల అస్తిత్వానికి చిహ్నం. అలాంటి తమ్మల సొన్నాయి వాయిద్యం వినడానికి మోటుగా ఉందనే ఉద్దేశ్యంతో సీమాంధ్ర అధికారులు వేములవాడ దేవాలయంలో తమ్మల సొన్నాయి స్థానంలో వారి ప్రాంత వాయిద్యాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ దుశ్చర్య మూలంగా వారికి రెండు ప్రయోజనాలు చేకూరాయంటారు. మొదటిది స్థానిక సంప్రదాయ సంస్కృతులను దెబ్బతీయడం, రెండవది స్థానిక ఉద్యోగాలను, ఉపాధిని ప్రాంతేతరులకు కట్టబెట్టడం అని తమ్మల సొన్నాయి వాయిద్యం మూలంగా తెలంగాణా ప్రాంతంలో జరిగిన అస్తిత్వ చిహ్నలను వివరించారు. ప్రస్తుతం తెలంగాణ నేల మీద తమ్మల సొన్నాయి అనే వాయిద్యం ఉండేదని గుర్తించేందుకు కూడా ఆస్కారం లేనంతగా ఇప్పుడు ఆ వాయిద్యం కనుమరుగయిపోయింది.

ఇలాంటి వేలాది సంఘటనల మూలంగానే తెలంగాణ వాసులు తమ అస్తిత్వాన్ని కాపాడుకొనేందుకు ఉద్యమం చేసి తెలంగాణ మూలాలను పరిరక్షించుకున్నారు. ఉద్యమంలో సాహిత్యకారుల కృషి ప్రధానంగా ఉంది కాబట్టే అస్తిత్వ సాహిత్యం, అస్తిత్వ సాహిత్య విమర్శలు వెలువడ్డాయని చెప్పవచ్చు.

### 2.2.5. వ్యవసాయ సంబంధమైన కథలపై విశ్లేషణ

ఏ కథ అయినా జీవిత చిత్రణ నుంచే పుట్టుకొస్తుంది. ఊహాత్మక జీవిత చిత్రణకాక రచయిత అనుభవ పరిధిలో నుండి ఉద్భవించిన జీవిత చిత్రణలో విశ్వసనీయత ఎక్కువగా ఉంటుంది. స్థలకాలాలు, వాటి మూలంగా అమిరే వాతావరణంతో పాఠకుడు కథతో సులభంగా మమేకమవుతాడు. అలాంటి కథలను రాయాలంటే కథకుడు ఖచ్చితంగా గ్రామీణ సన్నివేశాలనే ఇతివృత్తంగా ఎంచుకోవాలి. గ్రామీణ ప్రాంతంలో ప్రధాన పాత్ర ప్రకృతిది. అందులో వ్యవసాయానిదేనని చెప్పాలి. అట్లాంటి ఇతివృత్తం గల కథలను గురించి అమ్మంగి విశ్లేషించిన వ్యాసాలను ఈ విభాగంలో వివరించడం జరుగుతుంది.

ఉద్యమ నేపథ్యాన్ని తమ కథల్లో శక్తివంతంగా చిత్రించినటువంటి తుమ్మేటి రఘోత్తమ రెడ్డి కథలు (2006) కథా సంపుటిపై అమ్మంగి **"పొరల కింది ప్రాణ స్పందనలు"**[49] అనే శీర్షికతో వ్యాసం రాసారు. ఈ విమర్శనా వ్యాసంలో రఘోత్తమరెడ్డిగారు కథలలో చిత్రించిన ఉద్యమ స్ఫూర్తిని కాకుండా భూమి పట్ల తనకున్న ప్రేమను భూతల్లినే తమ తల్లిగా భావించి చిత్రించిన పాత్రలను గురించి అమ్మంగి వివరించిన పద్ధతిని చూస్తే కథలలోని గ్రామీణ ఇతివృత్తం పట్ల ఎంత ప్రేమ ఉందన్న విషయం అర్థమవుతుంది. ఈ కథలలో ఆహ్లాదకరమైన ప్రకృతి సౌందర్యం ఉంది. కాని అది భూమినే నమ్ముకుని జీవించే శ్రమజీవి అనుభవంలోనికి వచ్చేసరికి రాక్షసి బొగ్గె రైతుల జీవితాలలో అగ్గి పెట్టిన క్రమాన్ని కథకుడు చిత్రించాడు.

ఈ విషాదపూరిత సంఘటనలు వ్యవసాయదారుల జీవితాలను విశదీకరించే కథలు రెండు అవి **'ఈ భూమి ఎవరిచ్చిను, ధిక్కారం'**. 'భూమి ఎవరిచ్చిను' కథలలో దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలిచి దొరల దుర్మార్గాలను, రాజ్యహింసను వ్యతిరేకించి చరిత్రలో నిలిచిపోయేవిధంగా కథకుడు ముసలోడి పాత్రను చిత్రించారు. ఇక 'ధిక్కారం' కథలో అయితే స్త్రీ అయిన రాయవెల్లి అప్పుకింద తీసుకున్న వడ్లను తిరిగి దొరసానికి చెల్లించడానికి వెళ్ళినప్పుడు దొరసాని తప్పుడు కొలమానాలతో రాయవెల్లిని మోసం చేస్తుంది. అది గుర్తించిన రాయవెల్లి దొరసానిని ఆమె కొడుకును ప్రతిఘటించిన సన్నివేశాలు వ్యవసాయదారులలో ప్రకృతినింపే ధైర్యాన్ని తెలియజేస్తుంది. ఈ శ్రామిక అభిజాత్యం, రాజ్యధిక్కారం భూ పోరాటాల మూలంగా జాగృతం అవుతుందంటారు అమ్మంగి. ఈ రెండు కథలలో, కథకుడు రఘోత్తమరెడ్డి చిత్రించిన రైతు జీవితాలను విమర్శకులుగా అమ్మంగి అద్భుంగా వ్యక్తీకరించే ప్రయత్నం చేశారు.

ప్రధానంగా వ్యవసాయ సంబంధమైన ఇతివృత్తాన్ని చిత్రించిన కథలలో ఖచ్చితంగా వాస్తవికత అనేది బలంగా ఉంటుంది. అమ్మంగి గ్రామీణ వ్యవసాయాన్ని చిత్రించిన కథలనే కాకుండా, వాస్తవికతను ప్రదర్శించిన కథలను గురించి కూడా విశ్లేషించారు. అందులో మొదట చెప్పుకోదగ్గ కథలు దేవులపల్లి కృష్ణమూర్తిగారు రాసినవి. **"పందిరిని అల్లుకుంటున్న కథానికలు"**[50]

---

[49] వేణుగోపాల్ అమ్మంగి. సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 67

[50] వేణుగోపాల్ అమ్మంగి. సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. పుట. సం. 210

అనే శీర్షికతో కృష్ణమూర్తి రాసిన కథానికలలో 'నరహరి సేద్యం' కథలోని వ్యవసాయ-జీవితం గురించి విశ్లేషించారు. కృష్ణమూర్తి దేశీయమైన వాతావరణంలో సహజమైన సన్నివేశాల మధ్య సంభావ్యత పుష్కలంగా వున్న సంఘటనలతో కథలను సృష్టిస్తారని వారి కథలలోని సంభావ్యతను అమ్మంగి వివరించారు.

తెలుగు గ్రామీణ జీవితం వెలుగు చీకట్లను ప్రతిబింబిస్తూ, తెలంగాణాలో సాహితీ సాగరమై నిలిచిన తెలంగాణ కథకులలోని మట్టివాసనల ప్రతిరూపాలను అమ్మంగి ఈ వ్యాసాలలో అద్భుతంగా విశ్లేషించారు.

### 2.2.6. గాలివాన కథ – పాలగుమ్మి పద్మరాజు

తెలుగు కథకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చినటువంటి **"గాలివాన"** కథలోని మనస్తత్వ చిత్రణకు దర్పణం పట్టేటువంటి సన్నివేశాలను గురించి అమ్మంగి సమగ్రంగా విశ్లేషించారు. ఈ గాలివాన కథను పాలగుమ్మి పద్మరాజుగారు రచించారు. ఈ కథకు అమ్మంగి **"బహిరంతరాలలో గాలివాన"**[51] అనే శీర్షికతో వ్యాసం రాసారు. ఈ వ్యాసంలో కథా ఇతివృత్త సన్నివేశాలను గురించి విశ్లేషించి కథలో కథకుడు పాఠకుడిని ఆటుపోట్లుకు అలవాటుపడుతూ నది నుంచి సముద్రంలోకి ప్రవేశించి పడవలాగా కాల్పనిక ప్రపంచం నుండి వాస్తవిక ప్రపంచంలోకి ప్రయాణించేలా చేస్తాడు. 'గాలివాన' కథలో పద్మరాజుగారు సమాజంలోని మానవ సంబంధాలకున్న విలువను అనుభవంలోకి తెచ్చారని అమ్మంగి కథలోని మానవ సంబంధాలను గురించి విశ్లేషించారు. 'సంప్రదాయం నిర్దేశించిన ఒకే రకం పాత్రలంటే మాకు విసుగు. మానస్తత్వాన్ని, మనిషి వ్యక్తిత్వాన్ని మేం మన్నిస్తాం. కుల, మత విషయాలకు మేం అట్టే ప్రాముఖ్యం ఇవ్వం. గనుక మేము సృష్టించిన పాత్రను పాఠకులు గుర్తుంచుకొని తాదాత్మ్యం చెందడం కొంచెం కష్టం' అంటూ తన రచనల గురించి తానే నిక్కచ్చిగా చెప్పుకున్న కథకుడు పాలగుమ్మి పద్మరాజు.

అమ్మంగి **'గాలివాన'** కథానాయకుడు రావు పాత్రలో ప్రస్ఫుటమైనటువంటి మనస్తత్వ చిత్రణను గురించి విశ్లేషించే ప్రయత్నం చేయలేదు. "గాలివాన కథలో అస్తిత్వవాద

---

[51] వేణుగోపాల్ అమ్మంగి. సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 50

లక్షనాలున్నాయని"[52] ఆర్.ఎస్.సుదర్శనం గారు పేర్కొన్నారు. కాని అమ్మంగి ఆ లక్షణాలను గురించి వివరించకపోవడం మూలంగా విమర్శలో, విశ్లేషణలో అస్పష్టత చోటుచేసుకుందని చెప్పవచ్చు.

**'గాలివాన'** కథలోని పాత్రలన్నింటిలో మానవ సంబంధ విలువల గురించి విశ్లేషణ ఉండవచ్చు. కానీ రావు పాత్రలో మాత్రం ఆరంభం నుండి ముగింపు వరకు ఆయన మనస్తత్వం నిత్యం మారుతూనే ఉంటుంది. కథానాయకుడు రావు మొదట డబ్బున్న పెద్దమనిషిలా, ఉపన్యాసకుడిగా పాఠకులకు దర్శనం ఇస్తాడు. వేదాంతం భోధించడానికి వేరే ప్రాంతానికి రైలులో ప్రయాణం చేయడం నుండి కథలో ఎన్నో మలుపులు తిరిగి బిచ్చగత్తెతో స్టేషనులో దిగేవరకు రావు మనస్సులో సమాజంలోని వ్యక్తులపట్ల, బిచ్చగత్తె పట్ల ఎన్నో ప్రశ్నలు మెదులుతూనే ఉంటాయి. ఈ సమయంలో రావు పాత్రలోని రంగుల్ని పాఠకులు గుర్తిస్తారు. తరువాత గాలివానలో ఒంటరిగా బిచ్చగత్తెతో ఉండాల్సి వచ్చినప్పుడు మొదట ఆమెను చాల అసహ్యించుకున్నప్పటికీ గాలివాన ఉధృతం అవుతున్న కొద్ది తన మనస్సులో తనకే తెలియని భావోద్వేగానికి లోనవుతాడు. ఈ సంఘటనలే రావు మనోప్రపంచంలో ప్రాణభీతిని కలిగించి బిచ్చగత్తె చెంతకు చేరేలా చేశాయి.

తీసుకోవటం తప్ప ఇవ్వటం తెలియని బిచ్చగత్తె రావు ప్రాణాలు నిలబెట్టే శక్తిగా మారటంతో రావులోని జ్ఞాన సంపద అంతాకూడా గాలివానలో కలసిపోయి సాటిమనిషే అన్న భావన కలిగే విధంగా చేసింది. చివరకు ఆమె ప్రాణాలు కోల్పోయినప్పుడు రావులో కలిగిన ఆర్ధ్రత తన వ్యక్తిత్వ మార్పుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ విధంగా పరిశీలిస్తే గాలివాన కథలో మానవ సంబంధాల చిత్రణకంటే ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనస్తత్వ విశ్లేషణ బలమైనపాత్ర పోషించిందని చెప్పవచ్చు. కానీ అమ్మంగి మానవ సంబంధాలకు సంబంధించిన అంశాలను గురించి మాత్రమే ఈ వ్యాసంలో చర్చించారు.

[52] సాహిత్య నేపథ్యం(వ్యాసావళి). ఆర్.ఎస్. సుదర్శనం, పుట. సం. 126

# అధ్యాయం–3

# కవులు, విమర్శకులు, పరిశోధకులపై విమర్శ

### 3.0. పరిచయం

విమర్శకుడిగా అమ్మంగి వేణుగోపాల్ రచయిత దృక్పథాన్ని గ్రహించి, ఆ దృక్పథం దృష్ట్యానే రచయిత ఎంతవరకు రాణించగలిగాడో ముందుగానే అంచనావేయడం వీరి ప్రత్యేక శైలిగా చెప్పవచ్చు. అలాగే రచయిత దృక్పథాన్ని విమర్శకుడిగా తన దృక్పథంతో చర్చించి విశ్లేషించడం గమనించవచ్చు. 'విస్తారమైన విజ్ఞానం, పాండిత్యం, సాహిత్య సంప్రదాయం, సమకాలీన జీవిత లక్షణ పరిజ్ఞానం, ఆధునికాంధ్ర సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్న పాశ్చాత్య సాహిత్యంతోటి గాఢ పరిచయం ఉండడమే ఉత్తమ సాహిత్య విమర్శకుని లక్షణాలని రాచమల్లు రామచంద్ర రెడ్డి(రారా) ప్రభోదించారు'.

### 3.1. హేతువాద కవిపై విమర్శ

హేతువాదం అనే పదం ప్రాచీన కాలంలో చార్వాకం, లోకాయత అనే వాటికి సమానార్థకంగా వాడేవారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. మానవుడే సర్వశక్తి సంపన్నుడని, మనిషి సత్యాన్వేషణలో ఆసక్తిని చూపాలని హేతువాదుల అభిప్రాయం. ఇతరుల ఆలోచనలకు బానిస కాకుండా కార్య కారణ సంబంధాన్ని వివేచన చేయాలనేదే హేతువాదుల లక్ష్యం.

ఆధునిక భావాల సూర్యరశ్మి సోకిన తర్వాత వ్యవస్థలో చాలా మార్పులు చోటుచేసుకోగలిగాయి. సాహిత్యంలో వేమన పద్యాలలో మొదటసారి హేతువాద ఛాయలు ప్రస్ఫుటమయ్యాయి. ఆ తరువాత కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామస్వామి చౌదరి మొదలైన వారు తెలుగు సాహిత్యంలో హేతువాద కవులుగా ప్రసిద్ధి పొందారు. వీరి భావాల నుంచే చాలా మంది ఆధునిక కవులు హేతువాద దృక్పథంతో రచనలు చేయడం ప్రారంభించారు. తెలుగులో హేతువాద సాహిత్య ప్రభావాన్ని దాని పరిణామాలను గురించి విశ్లేషిస్తూ

డా. కనుపర్తి విజయలక్ష్మి "తెలుగు సాహిత్యం హేతువాద భావాలు–ప్రభావాలు" అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించడం జరిగింది.

### 3.1.1. త్రిపురనేని రామస్వామి చౌదరి

హేతువాద దృష్టితో రచనలు చేసి తెలుగు సాహిత్యంలోనే సంచలనం సృష్టించిన త్రిపురనేని రామస్వామి చౌదరి గారి నాటకాలపై సమీక్ష చేస్తూ **"సంచలనం సృష్టించిన కవిరాజు నాటకాలు"**[53] అనే శీర్షికతో వ్యాసం రాయడం జరిగింది. ఈ వ్యాసంలో త్రిపురనేని రామస్వామిగారి హేతువాద దృష్టిని గురించి వివరిస్తూనే వారి నాటక శైలిని ప్రశంసిస్తూ, నాటక రచనలోని లోపాలను గురించి విశ్లేషించడం జరిగింది.

కందుకూరి వీరేశలింగం ప్రారంభించిన తిరుగుబాటు తత్వం క్రమంగా సంఘ సంస్కరణ రంగాల్ని బలోపేతం చేసింది. ఈ పునాదుల మీద తనదైన భావచైతన్యపు దారిని వేసుకున్న వారు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి. ఈయన తన అధ్యయనం ద్వారా వర్ణవ్యవస్థ మూలంగా సమాజ సాహిత్యాలలో చోటుచేసుకున్న తలకిందులు సత్యాలను హేతువాదపు వెలుగులో గుర్తించి మార్పుకోసం ఉద్యమించిన సంఘసంస్కర్త అని అమ్మంగి అన్నారు. 'సంస్కర్తలు తమ కాలంలో వ్యతిరేకతను ఎదుర్కోవటం అనివార్యం. ఉన్నది మార్చాలనటం సంస్కరణ. ఉన్నదానికి అలవాటు పడటం వల్లనో, ఉన్న స్థితి ఒక వర్గం వారికి సౌకర్యంగా ఉండటం వల్లనో, లేక సంస్కర్తలు కోరేదేమిటో సరిగ్గా గ్రహించలేకపోవటం వల్లనో ఈ సంస్కర్తలు ఎక్కువగానే తయారవుతారు'[54] అంటూ సంస్కర్తలుగా పేరుపొందిన వారు సమాజంతో ఎదుర్కొనే సమస్యలను గురించి చేరా వివరించారు. తెలుగు జాతికే ప్రశ్నించటం నేర్పారు అంటూ రామస్వామి గారి హేతువాద దృష్టిని పరిచయం చేశారు చేకూరి రామారావు.

హేతువాదపు దృక్కోణం నుంచి ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు ఎన్నో అహేతుక అసంబద్ధ ధోరణులు ప్రత్యక్షమవుతాయి. అదే దృక్కోణం నుంచి తన భావజాలాన్ని ప్రచారం చేయడానికి త్రిపురనేని రామస్వామిచౌదరి మూడు నాటకాలు రాసారు. అందులో మొదటిది

[53] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 327

[54] రామారావు. చేకూరి, చేరాతలు సాహిత్య విమర్శ–పరామర్శ. 1991. పుట. సం. 6.

**“కురుక్షేత్ర సంగ్రామం”**(1912). ఈ నాటకంలో రాజ్యంలో భాగం అడిగే హక్కు పాండవులకు లేదని; కౌరవులే రాజ్యపాలనార్హతను కలిగివున్నారని ప్రతిపాదించిన కవిరాజు నాటకంలో పాండవుల నీతి, కౌరవుల కౌటిల్యం రెండూ ప్రశ్నార్థకమయ్యాయంటూ సందేహభావనను వ్యక్తం చేశారు.

రెండవ నాటకం **“శంబుకవధ”** (1914–1917). వశిష్ఠుడు, రాముని పాత్రలలో కవిరాజు మానసిక అవస్థను సంస్కార సంబంధమైన అంశంగా పోషించటంతో వాద వివాదాలతో నడిచే నాటకానికి ఆర్ద్రతను సాధించి పెట్టినట్లయిందంటారు అమ్మంగి. ఈ వాక్యాలలో హేతువాది అయిన త్రిపురనేని సాహిత్యంపై కూడా అమ్మంగి సహృదయ దృష్టినే ప్రదర్శించిన విధానం అర్థమవుతుంది.

మూడవది **“ఖూనీ”** నాటకం (1935). ఈ నాటకంలో పాత్రల మనస్తత్వాలను పరిశీలించి హృదయమున్న వాడికి, హృదయం లేనివాడికి మధ్య ఉండే తేడాను వారివారి మాటలు, చేతల ద్వారా వ్యక్తం చేయటంలో కవిరాజు సఫలమయ్యారంటారు. ఈ ప్రతిపాదన కవిరాజు నాటక నిర్వహనలోని సామర్థ్యాన్ని వెల్లడి చేస్తుంది.

నిజానికి పక్షపాత దృష్టితో విశ్వనాథ రాసిన “వేనరాజు” నాటకాన్ని ఖండించటానికే కవిరాజు ఈ “ఖూనీ” నాటకాన్ని రాశారన్నారు. ఇక్కడ విమర్శకులు అమ్మంగి సంప్రదాయ కవి అయిన విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యంలోని పక్షపాత ధోరణిని వ్యతిరేకించిన క్రమం అవగతమవుతుంది. హేతువాది అయిన కవిరాజు నాటక శైలిని సమర్థించిన విధానం గోచరమవుతుంది. ఈ మూడు నాటకాలు హేతువాదం ద్వారా సత్యనిరూపణకై ఉద్దేశించినవే అన్నారు.

ఇక వ్యాస ముగింపును పరిశీలిస్తే వ్యాస ఆది, మధ్య భాగాలలో కవిరాజు శైలి సామర్థ్యాన్ని ప్రశంసించిన అమ్మంగి ముగింపులో కవిరాజు నాటక రచనలోని లోపాలను ఖండించారు. నిజానికి పద్య గద్యాత్మకంగా సాగిన కవిరాజు నాటకాలు కళాఖండాలు కావన్నారు. త్రిపురనేని వారి నాటక రచనా శైలి మరింత ఆధునికంగా ఉండి పద్యంలో కాక వచనంలో రాసి ఉంటే ఎంతోమంది పాఠకుల ఆదరణ లభించి ఉండేదని సహృదయ పూర్వకంగా విమర్శించారు. తిరుపతివెంకట కవుల పద్యరచనా శైలి ప్రభావం నుండి త్రిపురనేని బయటపడలేక పోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు.

## 3.2. అభ్యుదయ కవులు–సాహిత్యంపై విమర్శ

కాల్పనిక సాహిత్యంమీద విప్లవాత్మకమైన తిరుగుబాటుగా 1936లో తెలుగులో అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. సాహిత్యం ఒక భోగ వస్తువుగా పరిగణించే దృక్పథంపై అభ్యుదయకవులు తిరగబడ్డారు. వస్తువులోనూ, భావనలోనూ, భాషలోనూ, ఛందస్సులోనూ, సంవిధాన శిల్పంలోనూ, తాత్వికతలోనూ అభ్యుదయ కవిత్వం కొత్తదారులు తొక్కింది. అభ్యుదయ కవిత్వం చూపిన ప్రభావం మూలంగానే అప్పటి వరకు భావకవిత్వ ముసుగులో కూరుకుపోయిన ఎంతోమంది కవులు సమాజ హితంకోరి అభ్యుదయ కవిత్వంరాసి నూతన శకాన్ని నిర్మించారు. అంతకుముందు రచనల్లో శబ్ద వ్యక్తీకరణకు ప్రాధాన్యం ఏర్పడి, అర్ధ గాంభీర్యం అడుగంటిపోయింది. “పదాల పొందికపైనే దృష్టి ఏర్పడి, భావనాబలం సన్నగిల్లిపోయింది. ఆత్మవ్యక్తీకరణ ధోరణి నానాటికి ముదిరిపోయి సంఘ దృష్టి మరుగునపడిపోయింది. ఈ స్థితిలో భావకవిత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుచేసి, సరికొత్త ప్రయోగాలు చేసిన కవులే అభ్యుదయకవులని”[55] పరిశోధకులు అల్లూరి మస్తాన్ పేర్కొన్నారు. అభ్యుదయ కవులలో ముందుగా పేర్కొనదగినవారు శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ, దాశరథి, కుందుర్తి, సినారె మొదలైనవారు.

‘అభ్యుదయ రచయితలు సాహిత్యంలో ఒక తిరుగుబాటు తెచ్చిన మాట నిజం. ఈ విప్లవం దేనిమీద...? వీరు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు, రసాస్వాదనకు సంబంధించింది. సాహిత్యం ఒక భోగ వస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరగబడుతున్నారు. నేటి రచయితలకు ప్రజలే ప్రామాణ్యం. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్ళీ సారస్వతోముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటుబడుతున్నారు”[56] అని శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) గారు అభ్యుదయ సాహిత్య లక్షణాలను గురించి, అభ్యుదయ కవుల దృక్పథాలను గురించి వివరించడం జరిగింది. ఈ లక్షణాలనే అమ్మంగి కూడా అభ్యదయ కవులను విమర్శించి, పరిశీలించే క్రమంలో పాటించినట్లు అర్థమవుతుంది.

---

[55] రాచపాళెం సాహిత్య విమర్శ–చారిత్రక అధ్యయనం, మస్తాన్. అల్లూరి, పరిశోధన సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం. 2021. పుట. సం. 67

[56] శ్రీ శ్రీ సాహిత్యం–మూడు (వచన విభాగం), శ్రీ శ్రీ. 1990. పుట. సం. 200

### 3.2.1. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)

సమాజం మార్పు చెందుతున్న కొద్ది అందుకు అనుగుణంగా సాహిత్యం కూడా మార్పుకు లోనవుతుంది. ఈ మార్పు అన్ని ప్రక్రియలలో సమానంగా సాగినప్పటికీ అమ్మంగి మాత్రం కవితా ప్రక్రియలో ఈ మార్పు ముందుగా నమోదవుతుందంటున్నారు. ఆ మార్పు కవిత్వంలోనే అని నిర్వచించడానికి శ్రీశ్రీ కవిత్వంలో మహాప్రస్థానాన్ని నిర్వచిస్తున్నారు. తెలుగు అభ్యుదయ సాహిత్యంలో పెనుమార్పును సృష్టించిన మహాప్రస్థానం గురించి, శ్రీశ్రీ కవిత్వంలోని వస్తు శిల్పాలను గురించి విశ్లేషిస్తూ **"మహాప్రస్థానం : వస్తు శిల్పాలు"**[57] అనే శీర్షికతో అద్భుతమైన సమీక్షా వ్యాసం రాసారు. ఈ సమీక్షా వ్యాసాన్ని 26 జనవరి 2011న హైదరాబాదు సాహిత్య అకాడమీవారు శ్రీశ్రీ జయంతి సందర్భంగా నిర్వహించిన సదస్సులో పత్రసమర్పణ చేశారు.

కవితాలోకాన్ని మరోప్రపంచం వైపు వడివడిగా నడిపించటానికి ప్రయత్నిస్తూ, ఆధునిక తెలుగు కావ్యజగత్తులో అభ్యుదయ వాదానికి మహత్తరమైన స్థానాన్ని కల్పించి, చైతన్యం కలిగించిన మహాకవి శ్రీశ్రీ. విమర్శకుడుగా అమ్మంగి మొదట వ్యాసారంభంలో కవితా వస్తువును గురించి వివరిస్తూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని వస్తువు అభ్యుదయ దృక్పథమన్నారు. 'ఐ' అన్న కవితలో 'వైప్లవ్య గీతాన్ని నేను' అని శ్రీశ్రీ అన్నాడు. అదేవిధంగా శ్రీశ్రీ మహాప్రస్థానంలో మితవాద అభ్యుదయంకాక అతివాద అభ్యుదయమే ప్రధాన కవితా వస్తువన్నారు. అంటే స్వరాజ్య ఉద్యమంలో మితవాదులలాగా సమ్మెలు నిర్వహించి, నినాదాలు లేకుండా శాంతియుతంగా స్వరాజ్యం సాధించాలనే కాంక్షతో కాకుండా, అతివాదులలాగా ప్రభుత్వ వ్యతిరేకత, నిరాదరణ నినాదాల ద్వారానే స్వరాజ్యం సాధించగలమనే తత్వం మహాప్రస్థానంలోని కవితావస్తువు అంటున్నారు. ఈ వ్యాఖ్య ద్వారా జీవితాన్ని వ్యాఖ్యానించేదే కవిత్వం అన్న నిర్వచనాన్ని, జీవితాన్ని మార్చేదే కవిత్వం అన్న నిర్వచనంగా మార్చినవాడు శ్రీశ్రీ అన్న విషయం స్పష్టమవుతుంది.

అమ్మంగి శ్రీశ్రీ కవిత్వంలో తిరుగుబాటు ఒక తత్వంగా, లక్ష్యంగా కనిపిస్తుందంటున్నారు. శ్రీశ్రీకి సంధించిన తిరుగుబాటు భావాలు కళాత్మక స్థాయిని అందుకున్నాయి. కనుకనే పాఠకుడి

---

[57] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 31

అనుభూతి పరిధిలోకి గురితప్పకుండా వచ్చి నాటుకున్నాయన్నారు. కవితా విమర్శలో వస్తు విశ్లేషణ ఎంత ప్రధానమో రచనా శిల్పాన్ని విశ్లేషించడం కూడా అంతే ప్రధానం.

అమ్మంగి మొదట వస్తువును విశ్లేషించిన తరువాత మహాప్రస్థానంలోని శిల్పాన్ని విశ్లేషించారు. ఒక వస్తువును కవిత్వంగా మార్చేది శిల్పం. వస్తువు ఎదైనాకావచ్చు దాన్ని పాఠకుల చెంతకు చేర్చాలంటే శిల్పం ప్రధానం. శిల్పంలో అనేక అంశాలు ఇమిడి ఉంటాయి. శిల్పంలో రూపం, భాష, శైలి మొదలైనవి ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఏ కవి అయినా కొత్త భాషను సృష్టించడు. పూర్వ మాటలనే కొత్త అర్థాలతో, ప్రతీకలుగా ఉపయోగించుకుంటాడన్నారు. ఇది శిల్ప పరిధిలోని అంశమేనని శ్రీశ్రీ కూడా పద ప్రయోగంతో కవిత్వంలో సామాజికత ప్రస్ఫుటయ్యేలా తిరుగుబాటును, అభ్యుదయాన్ని ప్రతీకలుగా వాడుకున్నాడన్నారు.

శ్రీశ్రీ ఒక వ్యాసంలో తన కవితల్లో 'జ' గణాన్ని ఎక్కువ ప్రయోగించే వాడినని తనకు తానుగా చెప్పుకునే వరకు ఆ సంగతిని చాలా మంది విమర్శకులు గుర్తించలేక పోయారన్నారు. అమ్మంగి తన విమర్శనా శైలికి తార్కాణంగా మహాప్రస్థానంలో అందరు విమర్శకులు ఎంచుకునే కవితలనే విశ్లేషించేందుకు పూనుకోలేదు. ఇంతకుముందు ఎప్పుడూ ఎక్కువగా చర్చల్లో నలగని కవితలను ఎంచుకుని వస్తు శిల్పాలను, అభ్యుదయ దృక్పథాన్ని వివరించే ప్రయత్నం చేశానని అమ్మంగే స్వయంగా చెప్పుకున్నారు. 'సాహసి' కవితలో శ్రీశ్రీ రచనా శైలి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. శ్రీశ్రీ 'సాహసి' కవిత ద్వారా మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు నిర్వచించే మనిషి అంతరంగపు అరలలోకి అడుగుపెట్టి వెలుగును ప్రసరింపజేస్తున్నడన్నారు.

ఈ వ్యాసంలో అమ్మంగి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితా వస్తువు, శిల్పం గురించి వివరిస్తూనే శ్రీశ్రీలో దాగిన అభ్యుదయ దృష్టిని గురించి, ఆయన కవిత్వంలోని భావుకతను, కవితాశిల్ప ప్రయోగంలోని సానుకూల ధోరణిని గురించి ఎంతో అద్భుతంగా ఆవిష్కరించారు. ఎక్కడా కూడా అస్పష్టతకు స్థానం కల్పించకుండా మహాప్రస్థాన వైశిష్ట్యాన్ని, ఆధునిక సాహిత్యంలో శ్రీశ్రీ స్థానాన్ని విశ్లేషించటంలో కృతకృత్తులయ్యారు. ఈ వ్యాసంలో మహాప్రస్థానం కవితల్లోని వస్తు శిల్పాల మధ్యన శ్రీశ్రీ సాధించిన సమన్వయాన్ని కూడా నిరూపించారు.

### 3.2.2. దాశరథి కృష్ణమాచార్యులు

నిజాం నిరంకుశ ప్రజా వ్యతిరేక పాలనను, ప్రతిఘటిస్తూ, తన కలాన్ని కరవాలంగా ఝులిపించిన ప్రజాకవి దాశరథి. ఆయన కవిత్వమంతా బూజుపట్టిన నవాబుపాలన మీద, రజాకర్ల దౌష్ట్యాలమీద ధిక్కారస్వరం వినిపించింది. నిజాం రాజుకు సింహస్వప్నమై ప్రజల్ని విప్లవోద్యమంవైపు నడిపించిన అభ్యుదయ కవి దాశరథి. అక్షరాల్ని ఆయుధంగా చేసుకుని ప్రజాపోరాటాన్ని ముందుకు నడిపించిన కవితాయోధుడు దాశరథి కృష్ణమాచార్యులు. అటువంటి మహోన్నత సాహితీవేత్తని గురించి **"అతడు దాశరథి"**[58] అన్న వ్యాసంలో వివరించారు.

ఈ వ్యాసంలో దాశరథి జీవితం, కవిత్వానికి చెందిన కీలక అంశాలు, ఉద్యమస్ఫూర్తి, నిజాం నవాబుకి వ్యతిరేకంగా చేసిన పోరాటాలను గురించి స్పష్టంగా విశ్లేషించారు. అమ్మంగి మాటలలో 'చార్మినార్ ఔన్నత్యం, దాశరథి కవిత్వం– ఈ రెండూ తెలంగాణను చారిత్రకం చేశాయి. ఒకటి కుతుబ్ షాహీలను కీర్తించే చిహ్నం, మరొకటి అసఫ్ జాహీలను దించిన సైన్యం' అంటూ దాశరథి కవిత్యంలో దాగిన అగ్నిపూరిత శక్తిని, ఆత్మ విశ్వాసపు ఆయుధాన్ని తెలంగాణాకు అందించిన తీరును వివరించారు. సి. నారాయణ రెడ్డిగారు దాశరథి ఔన్నత్యాన్ని వివరిస్తూ 'తెలంగాణములో పుట్టిపెరిగి, నా తెలంగాణ కోటి రత్నాలవీణయని సగర్వముగా లోకమునకెలుగెత్తి వినిపించిన కవిధీరుడు దాశరథి. గట్టుమీద నిల్చుండి గానము చేయక, కడలిలోదూకి తరంగలము కెదురీది, కడకు తీరముచేరుకున్న విజయుడీతడు'[59] అని కొనియాడారు.

ఒక కవిని పరిచయం చేసే ప్రక్రియలో ప్రధానమైన స్థలకాలాలను పరిశీలించి, ఆ అంశాలను కవిత్వానికి అన్వయించి విశ్లేషించడంలో అమ్మంగి ప్రతిభావంతులు. 'కోపోద్రేకాలను, భావోద్వేగాలను ఛందస్సుల మెడలు వంచి సవారీ చేయించినవాళ్లు ఇద్దరే. అందులో ఒకరు జాషువా, మరొకరు దాశరథి'[60] అంటే ఇక్కడ ఇద్దరు కవుల భావాలను, సిద్ధాంతాలను, రచనా శైలిని పోల్చిన విధానం సహృదయపూర్వకంగా ఉంది. ఇద్దరు కవులు కూడా ఆధునిక యుగంలో పద్య కావ్యాలు

---

[58] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 27

[59] నారాయణ రెడ్డి, సింగిరెడ్డి. ఆధునికాంధ్ర కవిత్వము–సమప్రదాయములు: ప్రయోగములు. పుట. సం. 575.

[60] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 27

రాసి ప్రజలలో చైతన్యం  తెచ్చినవారు కవడం మూలంగా వారిని ఆదర్శంగా తీసుకున్న ప్రజలు ఉద్యమస్ఫూర్తిని పొందారని చెప్పవచ్చు.

మరోవైపు కవి జీవితంలోని తిరుగుబాటు సంఘటనలు, ఉద్వేగపూరిత సన్నివేశాలను ఉటంకిస్తూ అవి ఈనాటికీ ఎంత ప్రేరణను కలిగిస్తున్నాయో తెలియజేయడంలో అమ్మంగి సఫలీకృతులయ్యారు. పాటల రచయితగా సినిమా రంగంలోకి వెళ్ళినందుకు, 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని, విప్లవ పోరాటాలను సమర్థించడం మూలంగా దాశరథి అనేక విమర్శలెదుర్కొన్నాడని పేర్కొన్నారు. ఆధునిక కవిగా దాశరథిది శ్రీశ్రీ తర్వాత స్థానమే అయినా నిజాం వ్యతిరేక ప్రజా పోరాటాలలో ఆచరణాత్మకవైఖరి ప్రదర్శించినమేరకు దాశరథి  శ్రీశ్రీకి అందనంత గొప్పవాడని వ్యాఖ్యానించడంలో అమ్మంగికి తెలంగాణ ప్రాంతంపట్ల, కవులపట్ల, సాహిత్యం, ఉద్యమం మీదున్న అభిమానం ప్రస్ఫుటమవుతుంది.

దాశరథి ఉద్యమ స్ఫూర్తి శ్రీశ్రీ కంటే గొప్పదని చెప్పిన విధానంలో అమ్మంగికి తెలంగాణ, తెలంగాణ ప్రాంత కవులపై ఉన్న గౌరవం కనిపిస్తుంది. ఉద్యమ కవిగా దాశరథి సాధించిన అభ్యుదయ దృక్పథాన్ని యువతరం మార్గదర్శకంగా స్వీకరించి, ఒక వారసత్వ హక్కుగా కోరటం సమంజసమే అన్నారు.

గొప్ప కవులకు మాతృభాషతో పాటు సాహిత్య మాతృభాష కూడా ఉంటుంది. దాశరథి సాహిత్య మాతృభాష ఉర్దూ అని చెప్పిన తీరు ఆలోచనాత్మకంగా ఉంది. అమ్మంగి ఈ వాక్యాలు పలకడానికి కూడా ప్రధాన కారణం ఉంది. అది ఏమిటంటే దాశరథి తెలుగు వారికి గజల్ ప్రక్రియను పరిచయం చేయటమేగాక, గాలిబ్ గజళ్ళను 1961లో అనువదించి ప్రచురించాడు. ఆ అనువాదంలో మూలంలోని క్లుప్తతను, సమగ్రతను సాధించిన కవిగా దాశరథి విమర్శకుల మెప్పుపొంది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఉత్తమ అనువాద బహుమతిని అందుకున్నారు. అందుకే దాశరథిగారి సాహిత్య మాతృభాష ఉర్దూఅని భావించి పాఠకులకు తెలియజేసారు.

ఈ వ్యాసంలో కవి ఉద్యమ స్ఫూర్తిని వివరిస్తూనే, కవిలో దాగిన అభ్యుదయ శక్తిని గురించి విశ్లేషించడం జరిగింది.

ముదిగంటి సుజాతారెడ్డి గారు అభ్యుదయ కవుల ఆశయాలను గురించి వివరిస్తూ 'ప్రపంచ శాంతి, అంతర్జాతీయ సంఘటన, సర్వతోముఖమైన జాతీయాభివృద్ధి, కార్మికుల శ్రేయస్సు, సమానత సాధన, సోషలిస్టు సమాజ స్థాపన, మానవతా దృక్పథం, హేతువాదం, సాంఘీక సామరస్యం, జీవకారుణ్యం మొదలైనవి అభ్యుదయ రచయితల ఆశయాలు'[61] అని పేర్కొన్నారు. అభ్యుదయ కవులలో దాగిన ఈ లక్షణాలనన్నింటిని గురించి అమ్మంగి ఈ వ్యాసాలలో పేర్కొనడం జరిగింది. 'అభ్యుదయ కవులు వర్ణ వ్యవస్థను విమర్శిస్తూ, పేద, ధనిక వర్గాల తారతమ్యాన్ని నిరసిస్తున్నారు. ముష్కరులు, తస్కరులు లేని సత్యలోకం వస్తుందని భవ్యలోక స్వచ్ఛతను ఆశిస్తున్నారన్నారని'[62] జి.అరుణకుమారి వివరించారు.

## 3.3. విప్లవోద్యమ కవులపై విమర్శ

ఆంగ్లంలో 'Revolution' అనే మాటకు సమానార్థకంగా 'విప్లవం' అనే తెలుగు పదాన్ని ఉపయోగిస్తున్నాం. విప్లవమనగా అభివృద్ధి నిరోధకమైన ఒకానొక వ్యవస్థను ధ్వంసం చేసి, సమూలంగా కూలదోసి మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయటం. ఒక సాంఘిక వ్యవస్థలోని అన్ని విషయాలు నూటికి నూరుపాళ్ళు పూర్తి స్థాయిలో మార్పు జరిగితే అదే విప్లవం అవుతుంది.

వర్గశత్రువుల నిర్మూలనకై పోరాటాన్ని ముందుకు సాగించాలని, ప్రజలకు రాజకీయాలతో పరిచయం కలగజేసి, వేలాది సంవత్సరాలుగా దోపిడీకి, పీడనకు గురైన మానవుడు నేడు స్వేచ్ఛను, విప్లవాన్ని కోరుకుంటాడనీ, అధికారాన్ని పట్టుకోవాలని రాజకీయపుటాలోచనలే అతని ఆలోచన ప్రపంచంలో సంచలనం సృష్టిస్తాయని నమ్మిందే విప్లవోద్యమ సాహిత్యం. 1967లోని శ్రీకాకుళ ఉద్యమ పోరాటం తెలుగు నేలమీద సాగిన ఉద్యమాలన్నింటికన్నా గుణాత్మకంగా భిన్నమై తనకుతానై విప్లవ సాహిత్యోద్యమాన్ని సృష్టించిందని చెప్పవచ్చు. విప్లవోద్యమ సాహిత్యంతోపాటే విప్లవోద్యమ సాహిత్య విమర్శ కూడా ఆవిర్భవించింది.

---

[61] అభ్యుదయ సాహిత్య విమర్శ. సుజాతారెడ్డి. ముదిగొండ,. పుట. సం. 263.

[62] తెలుగు కవిత్వం–భవిష్యద్దర్శనం, అరుణకుమారి. జి, పుట. సం. 240.

### 3.3.1. శివసాగర్

విశాలమైన ప్రాతిపదికతో, విస్తృతమైన సమాచారంతో విషయ విశ్లేషణ చేసి, చారిత్రక తులనాత్మక దృష్టితో పరిశీలించి ఒక రచనని అంచనా వేయడం అమ్మంగి గారి విమర్శలో కనిపిస్తుంది. కవితలో ఆధునికత, విశ్వజనీనత, ఆర్ద్రత, స్పష్టత, సాంద్రత, క్లుప్తత వంటి సుగుణాలను తన కవిత్వంలో క్రోడీకరించి, ఉద్యమాన్నే ఊపింగా భావించి, ఉద్యమాలలో పోరాటాలనే కర్తవ్యంగా భావించిన విప్లవకారుడు శివసాగర్. రాజకీయ భావజాలానికి కాల్పనిక సౌందర్యాన్నిచ్చి తెలుగు కవిత్వం మీద తనదైన ముద్ర వేసినటువంటి శివసాగర్ గురించి ఆయన విప్లవసాహిత్య ధోరణిని గురించి, తిరుగుబాటును గురించి అమ్మంగి వేణుగోపాల్ గారు **"ఆయుధం ఒక్కటే-యుద్ధాలు అనేకం"**[63] అన్న వ్యాసంలో వివరించారు.

'ఆయుధం ఒక్కటే యుద్ధాలు అనేకం' అని శీర్షిక పెట్టడంలోనే శివసాగర్ కవిత్వంలోని విప్లవధోరణి అర్థమవుతున్నది. ఉద్యమంలో కవి ఆయుధం కలమే అయినా చేస్తున్నది మాత్రం విప్లవ పోరాటమంటూ శివసాగర్ వ్యక్తిత్వం ప్రస్ఫుటమయ్యేలా అమ్మంగి ఈ వ్యాసం రాశారు. కవికి కలాన్ని ఆయుధంగా అన్వయిస్తూ, కవిత్వమే తనలోని శక్తి అని నిర్వచిస్తూ శివసాగర్ గారి విప్లవ సాహిత్య కృషిని తెలియజేస్తున్నారు. అదేవిధంగా శివసాగర్ ఎప్పుడు గుర్తుకు వచ్చినా ఒక చేతిలో నెలవంకను, మరోచేతిలో కత్తిని ధరించిన వీరుడు కళ్లముందు కదలాడుతాడంటూ వ్యక్తిలోని రెండు పార్శ్వాలను నిరూపించారు.

'చరిత్ర చెక్కిలిని ముద్దాడిన మేధావి, విప్లవాన్ని ఊపిరిగా పీల్చిన సాహసి, గతమంతా అజ్ఞాత పోరాటాల్లో గడిపిన ఉద్యమకారుడు కవిత్వాన్ని భావప్రకటనా మాధ్యమంగా మలుచుకున్న మానవుడు శివసాగర్. అటువంటి శివసాగర్ కవిత్వాన్నంతా "శివసాగర్ కవిత్వం" అనే పేరుతో ఐదు సంపుటాలుగా వెలువడడం ఎంతో ఆనందదాయకమన్నారు.'[64] ఈ సంపుటాకి సంపాదకత్వం వహించిన సీతారాం గారిని అభినందిస్తున్నారు.

[63] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 87

[64] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 87

శివసాగర్ కవిత్వంలో అస్పష్టతగానీ, పాఠకుడి అందుబాటులోకిరాని ఊహలుగాని కనిపించవంటూ గురజాడ రాసిన 'పూర్ణమ్మ' కథలోని 'పూర్ణమ్మ' పాత్రతో "నాచెల్లి చెంద్రమ్మా" (1971) పాటలోని చంద్రమ్మ పాత్రకు మధ్య ఉన్న సారూప్య సంబంధాలను గురించి అమ్మంగి తులనాత్మకంగా పరిశీలించారు. శివసాగర్ కవిత్వంలో గొప్ప కవిత్వాభివ్యక్తి ఉందని, అది సరళాతి సరళమైన భాషలో ప్రస్ఫుటమయ్యిందన్నారు. రాజకీయ భావజాలానికి కాల్పనిక సౌందర్యాన్నిచ్చి తెలుగు కవిత్వం మీద తనదైన ముద్రవేసిన కవి శివసాగర్. అద్భుతమైన అనుభూతి సౌందర్యంతో రచనలు చేస్తూ, ఒకే కవిత్వ ఆయుధంతో అనేక యుద్ధాలు చేసిన కవి. చంద్రుణ్ణి, వెన్నెలనూ పిచ్చిగా ప్రేమంచిన శివసాగర్ పున్నముల పండుగవైపు నిబ్బరంగా అడుగులు వేస్తున్న సందర్భంలో 'వివిలా శివసాగరుడా' అంటూ అభినందనలు తెలిపిన సందర్భంలో విమర్శకునిలో దాగిన ఆశావాద దృక్పథం కనిపిస్తుంది. విమర్శకులుగా అమ్మంగి కవివైపు ఆశావాద దృక్పథాన్ని ప్రతిబింభించకుండా కవిత్వంలోని శిల్ప సౌందర్యానికి, విప్లవ ధోరణికి చలించిపోయిన సందర్భం ఈ వ్యాస ముగింపు వాక్యాలలో గమనించవచ్చు.

### 3.3.2. వరవరరావు

**'కవిగా వివి'**[65] వ్యాసంలో హేతుబద్ధమైన అభ్యుదయ దృక్పథం ఉన్న వరవరరావుగారి గురించి ఆయన 'వరవరరావు కవిత్వం' (1957-2007) అన్న సమగ్ర సంపుటిలోని కవితలను వరవరరావుగారి సామజిక విప్లవ దృష్టిని గురించి ఈ వ్యాసంలో విశ్లేషించారు.

'వరవరరావు కవిత్వం' అన్న సమగ్ర సంపుటి యాభైయ్యేళ్ళ సమకాలిన సామాజిక రాజకీయ చరిత్ర కలిగిన గ్రంథమని పోటెత్తిన పోరాటాల బంధమని అమ్మంగి పలికిన పంక్తులు కవిగా వరవరరావు సమాజంలో తెచ్చిన విప్లవ భావజాలాన్ని కళ్లముందు కదలాడుతుంది. వరవరరావు తన కవితల్లో భావాన్ని ప్రతీకాత్మకంగా కవిత్వీకరించడం, ఉద్దిష్ట శిల్పాన్ని ఆశ్రయించడంవంటి ధోరణులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అభ్యుదయ సాహిత్యోద్యమం బలహీనపడిన దశలో కవితా రంగంలోకి ప్రవేశించారు కనుకనే వరవరరావుగారి కవిత్వం ప్రతీకాత్మకత, ఉద్దిష్ట శిల్పాలను ఆశ్రయించిందని చెప్పవచ్చు.

---

[65] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 46

కవిత్వాన్ని వరవరరావు పనిగట్టుకొని రాసిన దశ లేకపోలేదని అందుకు వారు రాసిన తొలి సంపుటి 'చలినెగళ్ళు' (1968) ఒక ప్రతీక అని అమ్మంగి సూచించారు. కొన్ని సందర్భాలలో ప్రతి వ్యక్తిలో ఒకానొక చలనం కలుగుతుంది. అది సమాజంపట్ల కావచ్చు. ప్రకృతిపట్లా కావొచ్చు, ప్రణయం పట్లా కావొచ్చు. ఆ చలనమే వారిలో కవిత్వం రాయాలనే ఒక భావనను కలుగజేస్తుంది. మొదట ఆ కవితా పంక్తులు అంత ప్రగాఢంగా ఉండకపోయిన తరువాత కాలంలో వ్యక్తిని కవిగా మార్చి ఒక సాహితీవేత్తగా, విప్లవకారుడిగా తీర్చిదిద్దుతాయి. అలాంటి ప్రభావమే మొదట వరవరరావుగారిలో కలిగిందని చెప్పుకోవాలి.

కొన్ని సందర్భాలలో వరవరరావుగారి కవితలలో కాళోజీ ప్రతీకలు, గ్రాంథిక ఛాయలు, అంత్యప్రాసల మీద మోజు కనిపిస్తుందని, ఇంకొన్నిసార్లు ఆయన కవిత్వంలో కుందుర్తి తొంగి చూస్తాడని అమ్మంగి పేర్కొన్నారు. అలాగే తిలక్ (దేవరకొండ బాలగంగాధర్ తిలక్) కవిత్వమంటే వరవరరావుకి ఎంతో అభిమానమని కొన్ని కవితల్లో తిలక్ ప్రభావం కూడా కనిపిస్తుందని ఉదాహరణలతో సహా వివరించారు. అయితే తిలక్ కవిత్వంలోని వ్యంగ్యంకన్నా వరవరరావు వ్యంగ్యం విస్తృతమైందని చెప్పారు.

వి. వి (వరవరరావు) రాసిన **'సముద్రం'** (1983) దీర్ఘ కవిత ఒక రూపక కావ్యమని సముద్రం అంటే జన స్వామ్యమని జనానికి – సముద్రానికి వరవరరావు అభేదం చెప్పారని వివరించిన అమ్మంగి వారి వాక్యాలు వరవరరావు సాహిత్య శైలికి సమాజ దృక్పథంపై ఆయనకు ఉన్నటువంటి అభిప్రాయాలను వెల్లడించే విధంగా ఉన్నాయి. అంటే వరవరరావు జనాన్ని ఒక మహా సముద్రంతో పోల్చిన తీరులోని కవిత జీవలక్షణాన్ని కళ్లముందు ప్రతిఫలింపజేసాడు విమర్శకుడు.

అందుకే వ్యాస ముగింపులో 'వరవరరావులో అంతర్ బహిర్ లోకాలను చూసిన జీవితానుబంధం తనకుందని, వరవరరావులో కవిత్వం ఒకానొక చిన్న పార్శ్వం మాత్రమే కాని, ఉద్యమమే పెద్ద పార్శ్వం'[66] అని చెప్పారు.

[66] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. 49

### 3.3.3. అలిశెట్టి ప్రభాకర్

విప్లవోద్యమ దృష్టితో కాలాన్ని కవిత్వీకరించినటువంటి అలిశెట్టి ప్రభాకర్ గారి "అలిశెట్టి ప్రభాకర్ కవిత" అనే సమగ్ర సంపుటిపై **"అలిశెట్టి ప్రభాకర్ సృజన శక్తి"**[67] అన్న శీర్షికతో అమ్మంగి విమర్శనాత్మక వ్యాసం రాసారు. ఇందులో అలిశెట్టి కవిత్వంలోని విప్లవోన్ముఖ ప్రయాణం గురించి విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఈ వ్యాసం అలిశెట్టి ప్రభాకర్ జయంతి వర్ధంతి సందర్భంగా 2016 జనవరి 12 న ఆంధ్రభూమి దినపత్రికలో ప్రచురించబడింది.

ధ్వంసమైపోతున్న సమస్త మానవ విలువల్ని, హింసా రాజకీయాలను నిరసించిన కవిశేఖరుడు శేఖరుడు అలిశెట్టి ప్రభాకర్. అట్లే నిప్పుకణికలను కన్నీటి గుళికల్ని సిటీలైఫ్ పేరుతో పొద్దున్నే దినపత్రికలో భావకిరణాలుగా  ప్రసరింపజేసిన వాడు. అలిశెట్టి కవిత్వంలో అణచివేత, విప్లవం, త్యాగం, పోరాట సన్నాహాలన్నీ ఉన్నాయనీ 'ఎర్రపావురాలు'లోని 'అంకురం' కవితనే అందుకు నిదర్శనమని వివరిస్తూ..

'రగిలే ఒక అగ్నికణం / తాళలేక ఒకనాడు
నెత్తురు విత్తనాలు మొలకెత్తి
రేపటి సంగ్రామానికి
పెద్ద ఎత్తున ఆయత్తమయ్యే సత్తా'[68]గా

విప్లవాన్ని నిర్వచించారన్నారు. "ఒక్క క్షణానికి కూడా విరామమివ్వక కాలాన్ని కవిత్వీకరించినవాడు ప్రభాకర్. అతనికి లోకం తెలుసు, లౌక్యం తెలియదు. అతనికి కళ తెలుసు, కళను అమ్ముకోవడం తెలియదు. సమాజ రోగాలకు మందు తెలుసు, తన జబ్బును నయం చేసుకోవడమే తెలియదు. భార్యాబిడ్డలకు అపారమైన ప్రేమనిధిని పంచిచ్చినవాడు. పాఠకులకు అమూల్యమైన కవిత్వాన్ని రాసిచ్చిన వాడు ప్రభాకర్" అని ప్రభాకర్గారి మొత్తం జీవితం ప్రస్ఫుటం అయ్యేలా ప్రభోధించాడు. అదేవిధంగా ఆయన కవిత్వంలోని ప్రతీకాత్మక పరిభాషను కూడా కింది కవితలో గుర్తించి.

---

[67] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. 65

[68] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. .సం. 65

"ఒక్క మోదు పైనైనా వాలి

పాడే పక్షవై నిలవాలి". (సార్థకత) అంటాడు.

ఆంగ్ల సాహిత్యంలో వెలువడిన 'రొమాంటిక్ పోయెట్రీ' ని తెలుగులో కాల్పనిక కవిత్వంగా, ఆ తర్వాత భావకవిత్వంగా పిలిచారు. 1910 నుంచి 1935 వరకు భావకవిత్వం ఒక ఉద్యమంలా కొనసాగింది. వీరు చంద్రున్ని, వెన్నెలని ప్రకృతిలోని మధురానుభూతులుగా గ్రహించి వాటిని కవిత్వీకరించారు. తరువాత 1935 కాలంలో వచ్చిన అభ్యుదయ కవులు, 1965లో వచ్చిన దిగంబర కవులు, 1970లో వచ్చిన విప్లవ కవులంతా భావకవిత్వాన్ని ఏ మాత్రం కూడా సహించలేదు. అందరూ తిరస్కరించి వ్యతిరేకించారు. మొదట్లో కవిత్వం రాసేటప్పుడు అలిశెట్టిపై ఎవరి ప్రభావం లేదు. కానీ తర్వాత తర్వాత హైదరాబాద్ నుండి తెచ్చుకున్న పుస్తకాలు ప్రభాకర్ కు దిశానిర్దేశాన్ని నిర్ణయించాయి. విప్లవ కవులు చెరబండరాజు 'గౌరమ్మ కలలు'ను, శ్రీశ్రీ గారి 'మహాప్రస్థానం'ను కంఠస్థం చేసాడు. "శ్రీశ్రీ, శివసాగర్, చెరబండరాజులు కవిత్వమే ఊపిరిగా బతికే నేను ఉద్యమాలతో మమేకమై పోలేకున్నా" అని రక్తరేఖ (1985) చివరిమాటలో చెప్పుకున్నాడు ప్రభాకర్. విప్లవ కవులలో ఒకడైన ప్రభాకర్ కూడా 'చంద్రుని కాల్చేస్తా' అన్న కవితలో కాల్పనిక కవిత్వ(భావకవిత్వం) వ్యతిరేకించే ఛాయలు కనిపిస్తున్నాయి. శతాబ్దాలుగా సౌందర్యానికి చిరునామాగా ఆరాధిస్తున్న వెన్నెల రొచ్చుగుంటగా, చంద్రుడు చచ్చిన కప్ప వెల్లకిలా పడ్డట్టుగా కనిపిస్తున్నాడన్నాడు. దానికి ఉదాహరణగా "సూర్యుడే నా ముఖచిత్రం" కవితను వివరించారు.

"ఎన్నెన్ని / గాయపడిన ఉదయాల్ని

సంకలనంగా కూర్చినా / ఎవరెవరి

బాధామయ గాథల్ని / ఈ కలంతో జాలు వార్చినా

మిత్రుడా నిరంతరం / సూర్యుడే నా ముఖ చిత్రం"

(అలిశెట్టి. ప్రభాకర్ కవిత. పుట : 111 )

అని అనడంలో సమాజంలో ఉన్న వర్గకసితో విప్లవానికీ, చైతన్యానికీ ప్రతీక అయిన సూర్యుడే తన ముఖచిత్రమని, కవిత్వంలోని తిరుగుబాటు తత్వాన్ని పరిశీలిస్తే అందులో సమాజాన్ని చైతన్యపరచడం కనిపిస్తుంది. కవి భావాలను కాల్పనిక కవిత్వ వ్యతిరేకతను, విప్లవోద్యమ స్ఫూర్తిని

విమర్శకులుగా అమ్మంగి పరిశీలించిన తీరు సహృదయ పూర్వకంగా ఉంది. చంద్రున్ని, వెన్నెలను రొచ్చుగుంటగా భావించిన అలిశెట్టి సూర్యుణ్ణి మాత్రం చైతన్య ప్రతీకగా, శక్తిప్రదాతగా ప్రదర్శించటం ద్వారా వైరుధ్య శిల్పమార్గంలో ఒకడుగు ముందుకు వేశాడని వ్యక్తీకరించడం వలన అలిశెట్టి కవిత్వంలోని చైతన్య స్ఫూర్తి, విప్లవ ధోరణిని ప్రస్ఫుటించడంలో అమ్మంగి సఫలమయ్యారు. వరవరరావు అలిశెట్టి గురించి వివరిస్తూ "ఉద్యమంపై నిర్బంధం పెరిగిన క్రమంలో ప్రజలతో తనపై వచ్చే నిర్బంధానికి వెరవక విప్లవ వృక్షంగా నిలిచి తన కలాన్ని మరింత పదునెక్కిన సైనికుడు ఆయన"[69] అన్నారు.

నగర కవిగా ప్రసిద్ధి పొందినటువంటి పఠాభి (తిక్కవరపు పఠాభి రామిరెడ్డి) చంద్రుణ్ణి యాంత్రిక వాతావరణం నడుమ చూపించిన తీరును, అలిశెట్టి చిత్రించిన తీరును అమ్మంగి తులనాత్మకంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఇద్దరు కవులూ నగర జీవితాన్నే కవితా వస్తువులుగా స్వీకరించినప్పటికీ ఒకరు నగరంలోని చంద్రుణ్ణి కవితా వస్తువుగా స్వీకరిస్తే మరొకరు సమాజ చైతన్యంకోరి సూర్యుణ్ణి కవితా వస్తువుగా స్వీకరించారు. ఇద్దరి భావాలు వేరువేరుగా ఉన్నా నగరంలోని సంక్షోభాన్నే విశ్లేషించారన్నారు అమ్మంగి.

నగర జీవితంలోని యథార్థ దృశ్యాలను మన కళ్ల ముందు నిలుపుతూ, నగరపు మరో పార్శ్వాన్ని చూపుతూ, వాస్తవాలను కఠినంగా నిర్వచించిన అలిశెట్టి 'సిటీ లైఫ్' (1992) మినీ కవితల సంపుటిని ఎంతో సమగ్రంగా పరిశీలించే ప్రయత్నం చేశారు. ఈ కవితా సంపుటి ద్వారా మినీ కవితకు గ్రామరు, గ్లామరు రెండు ఏర్పడ్డాయని అనటంలో అతిశయోక్తి లేదు.

ఎన్ని వచన కవితలు రాసినా చిన్న కవితకు చిరునామాగా నాడూ, నేడు నిలిచేవాడు అలిశెట్టి ప్రభాకరేనని నిస్సందేహంగా వ్యక్తీకరించగలిగారు అమ్మంగి. మినీ కవితలో విభిన్న విన్యాసాలు ప్రదర్శించగల నేర్పూ, ఓర్పు ఆయన సొంతమన్నారు. ఇన్ని విధాలుగా అలిశెట్టి కవితా శక్తిని, సృజనాత్మకతను అమ్మంగి పరిశీలించి పరిచయం చేసిన తీరు అద్భుతంగా ఉంది. ఎక్కడా అస్పష్టతకు తావు ఇవ్వకుండా వ్యాస ముగింపుతో ప్రభాకర్ సాహిత్యానికి నూతన ఉత్తేజాన్ని కల్పించారు.

---

[69] నమస్తే తెలంగాణ దినపత్రిక – బతుకమ్మ, 2013 జనవరి 06. పుట.సం. 23

"రక్తమంత చిక్కగా, కన్నీళ్ళంత నిజాయితీగా వుండే కవిత్వంతోపాటు, కాలంతోపాటు పెరిగే విలువలను మనకు తన వారసత్వంగా ఇచ్చిపోయాడు ప్రభాకర్. అతని జీవితమూ సాహిత్యము అద్వైతసిద్ధిని పొందాయి. అందుకే ఆయన జయంతి వర్ధంతి ఒక్కరోజే కావడం యాదృచ్ఛికం కాదంటారు"[70] అమ్మంగి. సాహిత్యం ద్వారా అద్వైత సిద్ధిని పొందిన సాహితీవేత్త కాబట్టే జననం, మరణం ఒక్కటయ్యాయని సమర్థిస్తారు.

### 3.3.4. గద్దర్

జానపదుల బాణీలో పాటలు రాస్తూ, పాటలతో ప్రజలలో విప్లవ భావాలను బలోపేతం చేసిన కవి, గాయకుడు గద్దర్ విప్లవోద్యమ భావజాలం గురించి **"ఊపిరికి ఊపిరి పోరుపాటల రాపిడి"**[71] అనే వ్యాసంలో వివరించడం జరిగింది. గద్దర్ తన పాటలలో సిద్ధాంతాన్ని, ప్రకృతి ప్రేమను, శ్రమ దోపిడీని భోదించినవాడు. 'ఎందరు పాటలు రాసినా, మరెందరు పాడినా, సర్కస్ డేరాకు మధ్యన ఉన్న ఆధార స్తంభం లాంటివాడు గద్దర్' అనడంలో కవిగాయకుడిగా తన జీవితాన్ని ప్రజాజీవితంతో సమన్వయ పరచిన విప్లవకారుడుగా గద్దర్ ప్రత్యక్షమవుతాడు.

గద్దర్ పాటల్లోని వైవిధ్యం చెప్పుకోదగ్గ ప్రధానాంశం. ఆయన కార్మికవిషాదమంతా ఆ చరణాల పలుకుబడిలో దట్టించి, ప్రజలను చైతన్యపరచడంలో ముందుంటాడు. అందుకే గద్దర్ భాషా, శైలీ సంస్కారాల్లో తెలంగాణా తనానికి చేసిన సవా ఎంతో గొప్పదని అమ్మంగి ఈ వ్యాసంలో పేర్కొన్నారు.

గద్దర్ ప్రపంచంలోని శ్రమజీవుల ప్రతినిధిగా ఉంటూనే, తెలంగాణ ఉద్యమ ప్రతినిధిగా ఉన్నవాడు. తన పాటల ద్వారా తెలంగాణా ప్రజలను చైతన్యపరిచి తెలంగాణోద్యమంలో మమేకం చేసిన మహనీయుడు గద్దర్. తెలుగు సమాజంలో శతాబ్దాల క్రితంనుడే ఎంతోమంది వాగ్గేయకారులున్నారు, వారందరూ గేయాలు రాసుకుంటూ, పాడుకుంటూ పోయారుతప్ప ఎవ్వరూ కూడా ప్రజలను చైతన్యంచేసి విప్లవపోరాటంలో మమేకం చేసినవారు కారు. అందరిలో ప్రస్తుత ఆధునిక కాలంలో గేయం ద్వారా ఉద్యమంలో పాల్గొనేల చేసింది గద్దర్ ఒక్కడే అంటారు అమ్మంగి.

---

[70] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. పుట. సం. 69

[71] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 291

అందుకే ‘ఉద్యమమే ఊపిరిగా బతుకుతూ వచ్చిన గద్దర్ ప్రస్తుతం తెలంగాణఉద్యమ ప్రతీకగా ముందుకు సాగుతున్నాడు, సాగుతూనే ఉంటాడు’ అని గద్దర్ ఉద్యమ దృష్టిని గురించి వివరించాడు.

ఈ విధంగా విప్లవోద్యమంతో ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకుసాగిన విప్లవ సాహిత్యకారుల సాహిత్యాన్ని అమ్మంగి విప్లవ దృష్టితోనే పరిశీలించారు. కవిలోని ఉద్యమస్ఫూర్తిని వివరిస్తూనే కవిత్వ వస్తుశిల్పాల వైవిధ్యాన్ని వివరించిన విధానం సాహిత్యసృజనలో విమర్శకుని వ్యక్తిత్వాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

## 3.4. అనుభూతివాద కవిపై విమర్శ

అనుభూతి ప్రధానమైంది అనుభూతివాద కవిత్వం. ‘నువ్వు చెప్పేది ఏదైనా నీ అనుభవం నుంచి పుట్టుకురావాలని’ అన్న ప్రాథమిక సూత్రాన్ని అవలంభించే కవితా ధోరణి అనుభూతివాద కవిత్వం. ఈ కవిత్వం మొదట భావకవిత్వంలో భాగంగా వెలువడేది. తరువాత నూతన కవిత ప్రక్రియగా రూపాంతరం చెందింది. దేవరకొండ బాలగంగాధర తిలక్ తెలుగులో మొదటి అనుభూతివాద కవి. “భావకతా సంప్రదాయంతో వాస్తవిక జగత్తును సాక్షాత్కారింపజేయాలని ప్రయత్నించిన కవి బాలగంగాధర్ తిలక్. వీరు అందం ఆనందం కవితా పరమావధి అనే తత్త్వాన్ని సమర్థించారు. అనుభూతిని అక్షరబద్ధం చేసిన కవి తిలక్”[72] అన్నారు డా. జి. అరుణకుమారి గారు. ఆ తరువాత గుంటూరు శేషేంద్ర శర్మ, ఆర్.ఎస్. సుదర్శనం, ఇస్మాయిల్, వేగుంట మోహన ప్రసాద్, ఇంద్రగంటి శ్రీకాంతశర్మమొదలైనవారు అనుభూతి కవులుగా ప్రసిద్ధిపొందారు. ఈ అనుభూతివాద కవుల సాహిత్యంపై కూడా అమ్మంగి విమర్శనా వ్యాసాలు రాయడం జరిగింది.

### 3.4.1. వేగుంట మోహన ప్రసాద్

‘మో’గా సాహితీలోకంలో గుర్తింపు పొంది ఆధునిక యుగంలో నూతన పంథాకు నాంది పలికిన ప్రముఖ కవి, రచయిత, అనువాదకుడయిన వేగుంట మోహన ప్రసాద్ గురించి, ఆయన కవితా శైలి గురించి అమ్మంగి **“కవిగా పుట్టి కవిగా జీవించినవాడు మో”**[73] అన్న వ్యాసంలో ఎంతో

---

[72] తెలుగు కవిత్వం–భవిష్యద్దర్శనం, అరుణకుమారి. జి, పుట. సం. 280.

[73] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 219

స్పష్టంగా విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈ వ్యాసంలో అమ్మంగి కవితో ఉన్నటువంటి సాహిత్య అనుబంధాన్ని గురించి పాఠకులకు తెలియజేసాడు.

'మో కవిత ఒక నైరూప్య చిత్రం' అని అన్నారు. ఆయన కవిత్వంలో ఉండే అస్పష్టత వ్యాసాలలో కనిపించదంటే అర్థం మోహన్ ప్రసాద్ గారి కవిత్వం నేరుగా అందరు పాఠకులకు అంత సులభంగా అర్థం కాదని, కానీ మోహన్ ప్రసాద్ గారి వ్యాసాలు ఆ ధోరణికి చెందినవి కావని అవి ఎంతో సులభంగా పాఠక హృదయాలను చేరుకుంటాయని అమ్మంగి భావం.

మో కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే సామాన్య పాఠకులకు సాధ్యంకాదని ఆయన కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే కవి హృదయాన్ని మొదట అర్థం చేసుకోవాలన్నారు. 'మో' కవిత్వంలో అనేక షేడ్స్ తో పాటు మనోవైజ్ఞానిక దృష్టి ముఖ్యమైనదని చెప్పవచ్చు. ఇక్కడ అనేక షేడ్స్ అంటే పాఠకులను తికమక పెట్టే క్రమంలో మోహన్ ప్రసాద్ ఎన్నో రకాల విన్యాసాలను ప్రదర్శిస్తారని అర్థం. మో' కవిత్వంలో అనేక సందర్భాలలో మనోవైజ్ఞానికత దర్శనం ఇస్తుంది. కాని పరిశీలకులు 'మో' పోస్ట్ మాడ్రన్ కవి అని నిర్ధారించారు. కాని అమ్మంగి ఆ విషయాన్ని వ్యాసంలో ఎక్కడా కూడా ప్రస్తావించలేదు. కాని 'చితి – చింత'కు ముందుమాట రాసిన వారిలో ఒకరైన కె.వి. రమణారెడ్డి చెప్పిన అంశాలను వివరిస్తూ "ఈ స్వీయమైన ప్రతి అనుభవశకలాన్ని కవిత్వమయం చెయ్యగలిగిన ప్రతిభావంతుడని, తన కవిత్వంలో బాల్య, యవ్వన దశలలోని గ్రామీణ జీవనానికి సంబంధించి పదిమందికీ పరిచితమైన భావచిత్రాలను ఆశ్రయిస్తూన్నాడు" అని పలికిన వాక్యాలలో నాస్టాల్జియా దర్శనమిస్తుందన్నారు. అంటే అమ్మంగి కూడా మోహన్ ప్రసాద్ కవిత్వంలో చిత్రించిన బాల్య, యౌవన దృశ్యాలనే ప్రత్యేకమైనవిగా గుర్తించారని చెప్పాలి.

ప్రతి పాఠకుడిలో కలిగే సందేహాన్నే అమ్మంగి ఈ వ్యాసంలో పేర్కొన్నారు. వ్యాసంలో కొంత ప్రత్యేకతను కనబరుస్తూ మోహన్ ప్రసాద్ గారితో ఉన్నటువంటి సాహచర్యాన్ని సంఘటనలను పాఠకులతో పంచుకున్నారు. 1983 లో విజయవాడలో కలిసినప్పుడు 'మీ కవిత్వం అర్థం కాదని మిత్రులంటున్నారు' అన్నాను. 'ఏమోనండి.! నేను మాత్రం తెలుగులోనే రాస్తాను' అన్న మోహన ప్రసాద్ గారి చమత్కార సంభాషణను పాఠకులకు తెలియజేసారు. అయినా మోహన్ ప్రసాద్ గారికి స్పష్టమైనదాన్ని, అస్పష్టం చేసి పాఠకులను తికమక పెట్టడంలో ఏదో ఆనందం వున్నట్లు అనిపిస్తుంది.

మోహన్ ప్రసాద్ కవిత్వానికి అమ్మంగివారు ముగ్ధులైన సందర్భాలు లేకపోలేదు. కొన్ని సందర్భాలలో మోహన ప్రసాద్ కవితా శైలిని ఇష్టపడ్డారానే చెప్పాలి. అందుకు 'ఒక్క మాటలో చెప్పాలంటే మోది, హైలీ పర్సనల్ స్టైల్' అని మెచ్చుకున్న వాక్యాలు అందుకు ప్రత్యేక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఇంకో సందర్భంలో చేకూరి రామారావుగారు చెప్పిన వ్యాఖ్యలను పరిచయం చేస్తూ 'మో' తన కవితా పాదాలలో 'చితి చింత' కవితా సంపుటిలోని 'స్వప్నంలో సర్పాలు' అన్న ఖండికలో ఫ్రాయిడ్ ప్రకారం సెక్సుకు ప్రతీక అయిన పామును కలలో చూస్తున్నప్పటి మానసికానుభవాన్ని చిత్రించినట్టు చేరాతల్లో చేరా నిరూపించాడని అమ్మంగి పేర్కొన్నారు. కానీ చేరా నిరూపించిన సూత్రాలను అమ్మంగి వివరించడంలో కొంత అస్పష్టత చోటుచేసుకుందని చెప్పవచ్చు.

అదే విధంగా కవిని సమర్థిస్తూనే అమ్మంగి నైతిక విమర్శనా దృష్టికి నిదర్శనమైన విశ్లేషణ చేసారు. 'మో' కవిత్వంలో ఉండే అస్పష్టత వ్యాసాల్లో కనిపించదనడంలో విమర్శను మెచ్చుకున్న తీరు స్పష్టమవుతుంది. ఒకవేళ వ్యాసాలలో ఆ అస్పష్టత ఉండి ఉంటే వ్యాసాలు కూడా కవిత్వమై పోయేవని కవి ధోరణిలోనే చిద్విలాసంగా వ్యక్తీకరించారు.

## 3.5. విమర్శకులపై విశ్లేషణ

విమర్శకుడు అనేవాడు కేవలం ఏ ఒక్క సాహిత్య ప్రక్రియకో పరిమితమై విమర్శ కొనసాగించి సిద్ధాంత ప్రతిపాదనలు చేయడానికి అవకాశం లేదు. సాహిత్యం జీవితాన్ని వాఖ్యానిస్తే, సాహిత్య విమర్శ సాహిత్యాన్ని వ్యాఖ్యానిస్తుందనే అవగాహనతో సాహిత్య విమర్శ కొనసాగాలి. అలా సాగాలంటే ఎలాంటి సాహిత్య ప్రక్రియలకు పరిమితులను నిర్మించుకోకూడదు. అమ్మంగివారు కూడా సాహిత్య విమర్శలో కేవలం కథా, నవల, కవిత్వం మొదలైన ప్రక్రియలకే పరిమితం కాకుండా విమర్శపై, విమర్శకులపై కూడా విమర్శ చేశారు. విమర్శకులు ప్రతిపాదించిన సిద్ధాంతాలను పరిశీలించే ప్రయత్నం చేశారు.

### 3.5.1. రాచమల్లు రామచంద్రారెడ్డి

విమర్శ రంగంలో సూటిదనానికి, నిర్మొహమాటానికి అగ్రస్థానమిచ్చినటువంటి మర్క్సిస్టు విమర్శకులుగా ప్రఖ్యాతిగాంచిన రాచమల్లు రామచంద్రా రెడ్డి(రారా) గారి గురించి **"అభ్యుదయ**

**సాహిత్య శక్తి రారా"**[74] అన్న వ్యాసంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ వ్యాసంలో రారా గారి విమర్శనా దృష్టిని గురించి, సాహిత్య నేపథ్యం గురించి, సంపాదకుడిగా ఆయన సాధించిన ఘన విజయాలను గురించి విశ్లేషించారు.

'నిబద్ధత, నిర్భీకతలకు మారుపేరై కాలాంతరాన కూడా పాఠకులను ప్రభావితం చేయగలిగే రచయితలనే వ్యక్తిత్వం ఉన్న రచయితలుగా భావిస్తారని, వాటితోపాటు అభ్యుదయ దృక్పథం ఉన్న రాచమల్లు రామచంద్రారెడ్డి ఒక అరుదైన రచయిత'[75] అని అమ్మంగి పేర్కొన్నతీరు రారాగారి విమర్శనా దృష్టిని మాత్రమే కాకుండా ఆయన రచనలలో ఉన్నటువంటి అభ్యుదయ దృక్పథాన్ని కూడా వివరిస్తుంది. అదే విధంగా రారా గారి స్థిరమైన విశ్వాసాలను గురించి వివరిస్తూ 'మార్క్సిస్టు విమర్శ అవసరాన్ని దానికున్న శక్తినీ ప్రదర్శించి విమర్శకు నూతన ప్రమాణాలు ఏర్పాటు చేసిన వాడు రారా'[76] అన్నారు గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి.

మానవ నాగరికత, మానవ సంస్కారమూ పెరిగి ఒక దశకు చేరుకుంటే తప్ప వచనం పుట్టజాలదన్న రారా భావాన్ని పాఠకులకు తెలియజేసారు.

ఈ వ్యాసం అన్నింటినిమించి, విమర్శకుడి ప్రాపంచిక దృష్టిని, సాహిత్య దృక్పథాన్ని, అభిరుచిని చాలా వరకు నిర్ధారిస్తుంది. అలాగే సంపాదకుడిగానూ, సాహిత్య విమర్శకుడిగానూ సాధించిన కీర్తి ప్రతిష్ఠల కారణంగా కథకుడుగా రారా మరుగున పడ్డారన్న వాక్యాలు అమ్మంగి గారి వాస్తవదృష్టికి నిదర్శనం. వ్యాస ఆరంభం నుండి రారా గురించి అద్భుతంగా వివరిస్తూనే రారాగారు సంపాదకుడిగా, విమర్శకుడిగా ఎంతో విజయం సాధించారని తెలిపి వ్యాసాన్ని ముగించడం ఆహ్లాదకరంగా ఉంది.

"రారా కడప జిల్లా కమ్యూనిస్టు రాజకీయాల్లోకి ప్రవేశించినా, కథానికలు రాసినా, పత్రికలకు సంపాదకత్వం వహించినా, సాహిత్య విమర్శను చేపట్టినా, మాస్కో ప్రగతి ప్రచురణాలయంలో అనువాదకుడిగా పనిచేసినా, అనువాద సమస్యలు గ్రంథం రచించినా, పాత్రికేయ వృత్తి చేపట్టినా–

---

[74] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 202

[75] అదే. పుట. సం. 202

[76] బాలశ్రీనివాస మూర్తి. గుమ్మన్నగారి, సమకాలీన వాదాలు–సాహిత్య విమర్శ. పుట. సం. 102.

వీటిన్నింటి వెనకా అభ్యుదయ చైతన్యం ఒక చోదక శక్తిగా వారిని నడింపించింది"[77] అంటూ విమర్శకుని జీవిత వృత్తాంతాన్ని వివరించారు. ఈ ముగింపు చదువుతూ ఉంటే విమర్శకుడికి విస్తృతమైన సాహిత్యజ్ఞానం ఉండాలి అని పరిశోధకులు తెలిపిన సూత్రాలు అమ్మంగికి పుష్కలంగానే ఉన్నాయన్న విషయం అర్థం అవుతుంది. అమ్మంగి ఇంత అద్భుతంగా రా.రాను గురించి రాయడానికి ప్రధాన కారణం అమ్మంగి వారిపై రా.రా గారి ప్రభావం ఉండడమేనని చెప్పవచ్చు.

అమ్మంగిగారు రచయిత అంతరంగంలోకి చొచ్చుకుపోయి రచయిత ముఖ్య ఉద్దేశాన్ని, రచయిత మనోభావాలను శోధించి వెలికితీసి పాఠకులకు తెలియజేయడమే తమ ధ్యేయంగా భావిస్తారన్న విషయం ఈ విమర్శనా వ్యాసాలను గమనిస్తే అవగతమవుతుంది.

### 3.5.2. బాలగోపాల్

వ్యక్తులను ప్రభావితం చేసిన చరిత్ర, చరిత్రను ప్రభావితం చేసిన వ్యక్తులు ఈ రెండు విషయాలలోను వ్యక్తులే కేంద్ర బిందువుగా ఉంటారు. అలా అనేక విషయాలకు, విశ్లేషణలకు, మానవ పోరాటాలకు, వారి తాలుకూ హక్కులకు గొంతుగా ఉండి ఆపై అక్షరంగా సమాజంపైన ప్రేరణాత్మక ముద్ర వేసిన వ్యక్తులలో, విమర్శకులలో బాలగోపాల్ ముందువరుసలో ఉంటాడు.

ఒక పుస్తకాన్ని చదివి అందులోని అనేక విషయాలను క్రోడీకరించి సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో అలతి అలతి పదలతో సహృదయ పాఠకుల చెంతకు చేర్చడంలో అమ్మంగి సిద్ధహస్తులు. సాహిత్య విమర్శలో మార్క్సిస్టు నిబద్ధ విమర్శకులుగా గుర్తింపు పొందిన బాలగోపాల్ గారి **"రూపం–సారం"** అనే వ్యాస సంపుటిపై సమీక్ష చేస్తూ **"విమర్శకుడిగా బాలగోపాల్"**[78] అనే వ్యాసం రాశారు. పౌరహక్కుల పరిరక్షణ ఉద్యమాన్నే ఊపిరిగా భావించి జీవించిన బాలగోపాల్ గారిని అమ్మంగి హక్కుల పోరాట ఉక్కు మనిషిగా భావించారు. ముప్పైనాలుగేళ్ళ(34) ప్రాయంలోనే అనేక ప్రతిపాదనలతో తలలుపండిన మార్క్సిస్టు మేధావులను కూడా తలలూపేటట్లు చేసిన నిబద్ధ విమర్శకుడు బాలగోపాల్ అన్నారు.

[77] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 207

[78] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 110

మనిషి జీవితంపై, సమాజ జీవితంపై ప్రతి మలుపులోనూ వెలుగులు ప్రసరించి అన్ని పార్శ్వాలనూ మనకు చూపించగల శక్తి సాహిత్యానికి ఉందని నమ్మిన బాలగోపాల్ గారి విమర్శలలోని సిద్ధాంత ప్రతిపాదనలన్నీ కూడా నూతన సూత్రాలను నిర్మించేలా ఉంటాయి. ఆయన విమర్శ సూత్ర ప్రధానంగానే సాగినప్పటికీ అన్ని కోణాలలో శాస్త్రీయ పరిశీలనకు కొదవలేదంటారు అమ్మంగి. బాలగోపాల్ యండమూరి వీరేంద్రనాథ్ రాసిన 'తులసి దళం' నవలలోని మంత్రతంత్రాల పార్శ్వన్నీ, సైన్సును క్షుద్ర విద్యల స్థానానికి దిగజార్చినతీరును ఎంతో సునాయాసంగా ఖండించగలిగారన్నారు. వీరేంద్రనాథ్ లో ఉన్న సైన్స్ పరిజ్ఞానం, కేవలం డొల్ల తనంతో కూడిందేనని బాలగోపాల్ నిరూపించారన్నారు.

సాహిత్య విమర్శ చర్చల ద్వారా అభివృద్ధి చెందుతుంది కానీ, ప్రవచనాలు, ప్రాచీనుల గ్రంథాలనుంచి చేసే పునర్వచనాల ద్వారా పెరగదంటూ బాలగోపాల్ గారి విమర్శలోని చర్చా విశేషాలను గురించి 'రూపం-సారంకి' ముందుమాట రాసిన చేకూరి రామారావు (చేరా) వివరించారు. మరికొంత చర్చ జరగడానికి వీలైన ప్రతిపాదనలు చేశారు. విమర్శ రంగంలో ఉన్న బుద్ధిమంతులు చర్చించుకొని నిగ్గుతేల్చుకోవలసిన కొన్ని విషయాలను ఈ వ్యాసాలలో ప్రతిపాదించాడు'[79] అన్నారు.

ఈ పై వాక్యాలనే సమన్వయిస్తూ అమ్మంగి బాలగోపాల్ విమర్శ మొత్తంలో రాజీలేని మార్క్సిస్టు నిబద్ధత కనిపిస్తుందన్నారు. వీరి మేధాస్థాయిని తెలుగుదేశం గుర్తించకపోవడం విశాదకరమని, వీరి సాహసోపేతమైన కృషిని పాశ్చాత్య దేశాలలో చేసిఉంటే నోబెల్ లేదా దానితో సమానమైన పురస్కారానికి యోగ్యుడై ఉండేవారనడంలో నిరాశావాదం కనిపిస్తుంది. మొత్తం సమీక్షా వ్యాసంలో బాలగోపాల్ గారి విమర్శన శైలిని అభినందిస్తూనే వారి ఉద్యమస్ఫూర్తిని ఆదర్శంగా భావించారన్న విషయం అవగతమవుతుంది.

### 3.5.3. నాగసూరి వేణుగోపాల్

తెలుగు దేశంలో విభిన్న ప్రక్రియలలో కృషిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సాహితీవేత్త, మాధ్యమాల విశ్లేషకుడు, ఆకాశవాణి ప్రయోక్త అయిన నాగసూరి

[79] బాలగోపాల్. రూపం-సారం. పుట. సం. 316.

వేణుగోపాల్ గారి 'సాహితీ వీక్షణం' (2008) అనే విమర్శనా గ్రంథంపై అమ్మంగి సమీక్ష చేస్తూ **"విలక్షణ వీక్షణం"**[80] అనే శీర్షకతో వ్యాసం రాసారు. నాగసూరి వేణుగోపాల్ ఏ రంగంలో కృషి చేసినా అందులో సృజన, పరిశోధన, ప్రణాళిక, సామాజిక స్ఫూర్తి, మానవత, వైజ్ఞానిక దృష్టితో ఆకట్టుకునే గుణం విశేషంగా గోచరమవుతాయి.

శాస్త్ర సాంకేతిక రంగాలలో నిష్ణాతుడైన వాడు చేసే ప్రయోగం ఫలవంతమైనట్లే, అభ్యుదయ దృష్టితో జీవితాన్ని అర్థం చేసుకున్న సృజనాత్మక శక్తి సంపన్నుడు చేపట్టిన ప్రక్రియ కాలపరీక్షలో నెగ్గినట్టు 'సాహితీ వీక్షణం' ద్వారా నాగసూరి వేణుగోపాల్ పొందిన సాఫల్యతను గుర్తించవచ్చు అన్నారు. నాగసూరి తమ విమర్శనాత్మక శైలి ద్వారా కావ్యంలోని వస్తు శిల్పాలను పరిశీలిస్తూనే, బహుముఖ ప్రజ్ఞను కనబర్చుతూ, పాఠకులకు చిరకాలం గుర్తుండిపోయే వైజ్ఞానికాంశాలను కానుకగా ఇస్తున్నారన్నారు. నాగసూరి విమర్శలో శాస్త్రాన్ని, విజ్ఞానాన్ని రెండింటినీ ఒకచోట కలిపి పరిశీలించే పద్ధతి, విశ్లేషణ ఆశ్చర్యాన్ని కలుగజేస్తుందంటూ విమర్శకునిలోని వైజ్ఞాన సంబంధమైన లక్షణాలను గురించి వివరించారు.

పత్రికా మాధ్యమాలపట్ల అవగాహణ ఉండి, సాహిత్యంపై పట్టు సాధించి, విమర్శలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగసూరి వేణుగోపాల్ విమర్శపై సమీక్షా వ్యాసం రాసిన అమ్మంగి ఎక్కడా కూడా విమర్శకుని ప్రతిపాదనలను వ్యతిరేకించలేదు. విమర్శకుడిగా వేరొక విమర్శకుడిలోని లోపాలను ఎత్తి చూపాలనే దృష్టి కనబర్చకుండా 'సాహితీ వీక్షణం'లోని సాహిత్య విషయాలను గురించి సహృదయ దృష్టితో పరిశీలించి విమర్శకుని సిద్ధాంతాలతో ఏకీభవిస్తూ తన విమర్శ కొనసాగించారు. ప్రతీ విమర్శకుడు చేయాల్సింది సాహిత్య సిద్ధాంత పరిశీలననే కానీ వ్యక్తిత్వ పరిశీలనకాదన్న విషయాన్ని ఈ విమర్శనా వ్యాసం ద్వారా అమ్మంగి నిరూపించారు. ఈ విశ్లేషణాత్మక వ్యాసం ద్వారా అమ్మంగి బంగారానికి–అంగారానికి మధ్య ఉన్న అగాధాన్ని పాఠకుల అనుభవంలోకి తెచ్చారు.

అమ్మంగి విమర్శకులపై విమర్శ చేసేటప్పుడు కూడా వారి వ్యక్తిత్వం సహృదయపూర్వకంగానే ఉంటుందని ఈ వ్యాసాలను గమనిస్తుంటే అర్థమవుతుంది.

---

[80] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 255

## 3.6. జానపద సాహిత్య పరిశోధకులపై విమర్శ

జాతికి మూలం జానపదం. ప్రాంతీయ అస్తిత్వ ఛాయలు పదిలంగా ఉండాలంటే జానపద సాహిత్యసేవ ప్రధానం. లిఖిత సాహిత్యం మీద వచ్చినంత విమర్శ, పరిశోధనలు, జానపద సాహిత్యంపై రావడంలేదనే చెప్పాలి. కానీ లిఖిత సాహిత్యంతో సమానంగా పోటీపడే సాహిత్య సంపద జానపద సాహిత్యంలో ఉంది. కనుమరుగై పోతున్న కళలు, ఆచార వ్యవహారాలను తరువాతి తరాలకు అందించాలంటే జానపద సాహిత్యంపై పరిశోధనలు, విమర్శనా గ్రంథాలు వెలువడడం ఎంతైనా అవసరం.

ప్రాచీన కాలం నుండే జానపద సంపద పుష్కలంగా ఉన్నప్పటికీ వికాస యుగంలో టేకుమళ్ళ అచ్యుతరావు ఆంధ్ర పదములు–పాటలు(1924), శ్రీ హరి ఆదిశేషువుగారి "జానపద గేయ వాఙ్మయ పరిచయము" (1954), నేదునూరి గంగాధరం గారి 'జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి' (1961) గ్రంథాలు తెలుగుదేశంలో జానపద సాహిత్యానికి ఎంతో గుర్తింపు తెచ్చాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జానపద సాహిత్యంపై విస్తృత అధ్యయనం చేసి "తెనుగు జానపద గేయ సాహిత్యము" (1958) అనే సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించిన ఆచార్య బిరుదురాజు రామరాజు గారి మూలంగా విశ్వవిద్యాలయాల స్థాయిలో జానపద సాహిత్యంపై పరిశోధనలకు బీజాలు పడ్డాయి.

'తెనుగు జానపద గేయ సాహిత్యమనే సిద్ధాంత గ్రంథం ప్రాచ్య-పాశ్చాత్య లక్షణములను దృష్టిలో పెట్టుకుని, ప్రాచీన-నవ్య సాహిత్యములను లక్షముగా తెలుగు భాషా సమితి బహుకృతికి పాత్రమైనదని'[81] ఆచార్య. ఎస్.వి. రామారావుగారు పేర్కొన్నారు. జానపద సాహిత్యంపై ఎంతో సమగ్రంగా వెలువడిన ఈ సిద్ధాంత గ్రంథం తర్వాతి పరిశోధకులకు, విమర్శకులకు మార్గదర్శకమైందన్నారు. అమ్మంగి బిరుదురాజు రామరాజుగారి జానపద కృషిని గురించి వివరిస్తూ నాలుగు వ్యాసాలు రాయడం జరిగింది.

[81] తెలుగులో సాహిత్య విమర్శ. రామారావు. ఎస్.వి, 2017. పసిడి ప్రచురణలు. పుట. సం. 246.

### 3.6.1. బిరుదురాజు రామరాజు

తెలంగాణా మూలమూలలో దాగిఉన్న జానపద సాహిత్యాన్ని వెలికితీసి, అలిఖిత సాహిత్యానికి లిఖిత రూపం ఇచ్చి జానపద వాఙ్మయ బ్రహ్మగా గుర్తింపు పొందిన బిరుదురాజు రామరాజు గారిపై అమ్మంగి పరిశోధనాత్మక దృష్టితో ఎన్నో వ్యాసాలను రాయడం జరిగింది.

#### 3.6.1.1. కాల గర్భంలోని కవిహృదయం బిరుదురాజు

పరిశోధననే ప్రాణవాయువుగా భావించినటువంటి బిరుదురాజు రామరాజుగారి గురించి వారి జ్ఞానమార్గం గురించి విమర్శకులుగా అమ్మంగి వేణుగోపాల్ గారు అంతే అద్భుతంగా విశ్లేషించడం జరిగింది. ఏ వ్యక్తి అయినా అంత సులభంగా పరిశోధనకే పరిమితమై తన జీవితాన్ని అంకితం చేయలేరు. తమ ప్రాంతంలో దాగున్నటువంటి సాహిత్య పరిమళాలను నలుగురికి తెలియజేయాలని, తమ సాహిత్య గొప్పతనాన్ని దేశ నలుమూలలా వ్యాపింపచేయాలనే దృఢ సంకల్పం ఉన్నవారే ఈ కార్యానికి పూనుకుంటారు. అటువంటి పరిశోధకులలో ముందువరుసలో ఉంటారు బిరుదురాజు రామరాజు గారు. సాహిత్య అన్వేషణపట్ల ఎంతో పట్టుదల ఉన్నవారు మాత్రమే 'తెనుగు జానపద గేయ సాహిత్యము' వంటి గొప్ప గ్రంథాన్ని వెలువరించగలుగుతారు. రామరాజుగారి కృషిని **"కాల గర్భంలోని కవిహృదయం బిరుదురాజు"**[82] అనే వ్యాసంలో అమ్మంగి ఎంతో పరిశోధనాత్మకంగా వివరించారు.

'పల్లె పదాలు వెన్న ముద్దలు కాదు, మట్టి ముద్దలని, తెలుగమ్మకు ఫిర్యాదులు వెళ్తున్న దశలో, జానపద విజ్ఞాన విశ్వదర్శనం చేయించినవారు బిరుదురాజు రామరాజు' అని పలికిన వాక్యాలలో తెలుగుతల్లి మాత్రమే కాదు తెలుగుజాతి మొత్తం తలెత్తుకు నిలబడేలా చేసిన రామరాజుగారి కృషి కనిపిస్తుంది. ఆంధ్ర పాలకులు రాజ్యమేలుతున్న కాలంలో తెలగాణలో సాహిత్యమే లేదనే వాదాన్ని ఎదుర్కొని తెలంగాణ సాహిత్య ఖ్యాతిని నిరూపించిన సురవరం ప్రతాపరెడ్డిగారి గొప్పతనం అమ్మంగి వాక్యాలలో కనిపిస్తుంది. సురవరం ప్రతాపరెడ్డి గారు 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథాన్ని వెలువరించి తెలంగాణ సాహిత్య చరిత్రలో నూతన నిర్మాణానికి దారులు వేసిన కృషి బిరుదురాజుగారి పరిశోధనలో కనిపిస్తుంది.

[82] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 35

సాహిత్య రంగంలో తనకన్నా ముందు తరానికి చెందిన మానవల్లి కవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాపరెడ్డి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం వంటి కవి పండితుల కృషిని ఒక సంస్కారంగా రామరాజుగారు అందిపుచ్చుకున్నారనడంలో సాహిత్య సేవ, మరియు జానపద వాఙ్మయానికి చేసిన కృషి రెండు కనిపిస్తున్నాయి. అందరు కవి పండితులు లిఖిత సాహిత్యం మీద కృషి చేసిన వారయితే రామరాజు గారు వారినీ మార్గదర్శకంగా చేసుకుని అలిఖిత, మౌఖిక సాహిత్యాన్ని వెలుగులోనికి తెచ్చినవారు.

రామరాజుగారు జానపద సాహిత్యానికి చేసిన సేవ మాత్రమే కాక సంస్కృత సాహిత్యానికి చేసిన సేవ కూడా చాలా గొప్పదన్నారు అమ్మంగి. రామరాజుగారు పరిష్కరించినటువంటి శ్రీనాథుని 'శివరాత్రి మాహాత్మ్యం' గురించి వివరించి, సుభద్రా కళ్యాణం అనే ద్విపద కావ్యాన్ని రాసింది అన్నమాచార్యుల భార్య తిమ్మక్క కాదు తిమ్మప్ప అని నిరూపించిన రామరాజుగారి ప్రతిపాదనను తాపీ ధర్మారావుగారు కూడా సమర్థించారని అమ్మంగి పేర్కొన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలు రాసేది ఆంధ్రులు కావడం మూలంగానే ఈ ప్రతిపాదన నేటికీ సాహితీకారుల చెంతకు చేరలేదు.

రామరాజుగారు మరుగున పడిన మాణిక్యాలు, చరిత్రకెక్కని చరితార్థులు అనే గ్రంథాలలో తాళపత్రాలు, కాగితపు రాత ప్రతులతో మగ్గుతున్న ఎంతోమంది అజ్ఞాత కవి పండితులను, వారి కృతులను తెలుగు దేశానికి పరిచయం చేశారన్నారు అమ్మంగి.

శాసనాల సేకరణ, శాసనాలకు నకళ్ళు రాయటం పట్ల కూడా బిరుదురాజువారు ఆసక్తి చూపే వారు. వారి జీవిత కృషి మొత్తాన్ని అమ్మంగి చిన్నచిన్న పార్శ్వాలుగా విభజించి పరిశోధించారనే విషయం స్పష్టమవుతుంది. రామరాజుగారు పరిశోధకులుగా, గ్రంథపరిష్కర్తగా, శాసనాల లేఖకులుగా, ఉపాధ్యాయులుగా, ఆచార్యులుగా తెలుగు నేలలో చిరకాలం నిలిచిపోయే గొప్ప వ్యక్తి అని ఈ వ్యాసం పరిశీలిస్తే అర్థమవుతుంది.

### 3.6.1.2. జ్ఞానపద వీధుల్లో వేసటే లేని వెర్రి అన్వేషణమ్ము

పరిశోధక వ్యక్తిత్వంలో గ్రంథ పరిష్కరణ ఒక విలువైన పార్శ్వమని అమ్మంగి తెలిపారు. గ్రంథపరిష్కరణ చేయాలంటే పరిశోధకులకు రెండు మూడు వందల సంవత్సరాల నాటి లిపి తెలిసి ఉండాలి. గ్రంథాలను తులనాత్మకంగా పరిశీలించి తైపారు చేయగలగాలి. అక్షర దోషాలను సవరించి

శిథిల భాగాలను సమంజసంగా పూరించగలగాలని, దానికి పీఠికను సమకూర్చి ప్రామాణిక ప్రతి సిద్ధం చేయాలంటూ గ్రంథపరిష్కర్తకు ఉండాల్సిన లక్షణాలను తెలియజేశారు. లక్షణాలన్నీ పుష్కలంగా ఉన్నా చారిత్రక దృష్టి లోపిస్తే ప్రయోజనం శూన్యమే అన్నారు. సాహిత్య సంప్రదాయం పట్ల అధికారం ఖచ్చితంగా ఉండి తీరాలని అది కూడా గ్రంథ పరిష్కర్తకు ప్రధానమని వివరించారు. 'ఆంధ్ర యోగులు' అనే గ్రంథం పైన **'జ్ఞానపద వీధుల్లో వేసటే లేని వెర్రి అన్వేషణమ్ము"**[83] అనే వ్యాసం రాశారు. ఈ వ్యాసంలో అమ్మంగిలోని చారిత్రక విమర్శన ధోరణి కనిపిస్తుంది. మరుగున పడిన అజ్ఞాత కవుల గురించి పరిచయం చేసి వారి గ్రంథాలను పరిష్కరించిన రామరాజు గారి కృషిని అమ్మంగి చారిత్రక దృష్టితో పరిశీలించారు.

శోధించి సాధించినప్పుడే కొత్త సత్యాలు వెలుగులోకి వస్తాయని నమ్మిన రామరాజుగారి కృషికి చలించిపోయి తరించిపోయారు అమ్మంగి. పరిశోధనలో అన్ని ఫలితాలు అనుకూలంగా వస్తాయని చెప్పడానికి వీలుండదు. అదే చారిత్రక పరిశోధన అంటే మరింత కష్టం. నిద్ర ఆహారాలు మాని విశ్రాంతి అనేది లేకుండా సాహిత్య తవ్వకం చేయాలి. ఎంతో దీక్షతో సంవత్సరాల పాటు శోధిస్తే తప్ప సాహిత్య చరిత్రను తిరగరాయలేము. అందుకే రామరాజుగారి శోధనను **"వేసటే లేని వెర్రి యన్వేషణమ్ము"** అని అమ్మంగి అన్నారు. అంత అన్వేషణ చేశారు కనుకనే తెలుగు జానపద సాహిత్యానికి ప్రాణం పోయగలిగారు. కొంతమంది 'ఆంధ్రయోగుల' జీవిత విశేషాలను, వారి సాధనను గూర్చి ఎడతెరపి లేకుండా తిరిగి, పరిశోధించి అమూల్యమైన గ్రంథాలను రచించి ప్రచురించారు. డెబ్బైయ్యేళ్ల (70) వయసులో కూడా మండువేసవిలో కొండలు, గుహలు గాలిస్తూ పల్లె పట్టణమని తేడా లేకుండా ఆయన చేసిన కృషికి నిదర్శనమే 'ఆంధ్ర యోగులు' గ్రంథ పరంపర. ఎవరో అనామకుడు తెలుగులో యోగులు లేరేమో అన్న వాక్యాలు రామరాజు గారికి శూలంలాగా గుండెల్లో గుచ్చుకోవడంతో ఆంధ్రయోగుల జీవితాలను, వారి మాహాత్మ్యాలను ప్రకటించడమే తమ ధ్యేయంగా పెట్టుకొని తన శేష జీవితం మొత్తాన్ని అన్వేషణకోసం అంకితం చేశారు. వారి కృషి మూలంగానే త్రిలింగ స్వామి వంటి మహాయోగి పుంగవుణ్ణి గురించి తెలుగుదేశానికి తెలిసిందన్నారు

[83] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 211

అమ్మంగి. గ్రంథ పరిష్కరణకై రామరాజుగారు సురవరం ప్రతాపరెడ్డిగారి ఆంధ్రుల సాంఘిక చరిత్రను ఆధారంగా తీసుకొని ప్రతాపరెడ్డి గారిని గురువుగా భావించారు.

రామరాజు గారి పరిష్కరణ మూలంగా తెలుగు సాహిత్యంలో, సంస్కృత సాహిత్యంలో కొత్త కావ్యాలు వెలుగులోకి వచ్చాయి. వాటన్నింటిని కూడా రామరాజుగారు చారిత్రక ఆధారాలతో వివరించిన క్రమం అద్భుతంగా ఉంది.

'ఆంధ్ర యోగులు' ఆరు సంపుటాల గ్రంథం రామరాజుగారి శేష జీవితాన్ని సశేషం చేసిన బృహత్ రచనా వ్యాసంగంగా నిలిచిందని, ఇందులో పేర్కొన్న ప్రతి అంశం కూడా నూతన సాహిత్య చరిత్ర నిర్మాణానికి పునాదులు వేస్తుందన్నారు. ఈ గ్రంథాన్ని పూర్తి చేయడంకోసం ఆరోగ్యం దెబ్బతిని అస్వస్థతకు గురైనా వెనకడుగు వేయకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా ముందుకు సాగిపోవడం, కుల, మత ప్రాంతాలకు అతీతంగా సేకరించిన యోగుల జీవిత విశేషాలు రామరాజుగారి జీవితాన్ని సాఫల్యం చేశాయని చెప్పవచ్చు.

### 3.6.1.3. పరిశోధనే ప్రాణంగా జీవించిన రామరాజు

విశ్వవిద్యాలయ స్థాయిలో, జాతీయస్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో లెక్కలేనన్ని సెమినార్లు నిర్వహించి జానపద విజ్ఞాన వ్యాప్తికై తెలంగాణ ప్రాంతపు పరిశోధనా రంగంలో నిశ్శబ్దవిప్లవం తీసుకొచ్చిన చరితార్థుడు బిరుదురాజు రామరాజ. ఇల్లిల్లు వెతికి గోపాలుడు వెన్నను దొంగిలించినట్లు రామరాజుగారు తెలంగాణ మారుమూలల వెతికి జానపద గేయాలను సేకరించారని అమ్మంగి **"పరిశోధనే ప్రాణంగా జీవించిన రామరాజు"**[84] అనే వ్యాసంలో పేర్కొన్నారు. వెన్నను దొంగలించిన గోపాలుడు దేవుడైతే తెలంగాణ జానపద సాహిత్యాన్ని వెలికితీసిన రామరాజుగారు కూడా తెలంగాణ జాతికి దేవుడే అన్నారు. వీరి కృషి మూలంగానే ఎంతోమంది కాలగర్భంలో కలిసిపోవటానికి సిద్ధంగా ఉన్న తెలంగాణ సాహితీమూర్తులు వెలుగులోకి వచ్చారు. వీరి పరిశోధనల మూలంగానే తెలంగాణ అస్తిత్వ మూలాలకు ఊపిరులు అందించిన గొప్ప పరిశధకుడు బిరుదురాజు రామరాజు.

అమ్మంగివారు ఈ వ్యాసంలో పరిశోధననే ప్రాణంగా భావించి జీవించి వెలువరించిన **"చరిత్ర కెక్కని చరితార్థులు"** గ్రంథంపై సమీక్ష చేసి మూలమూలలలో దాగివున్న సాహిత్యపు పరిమళాలను

[84] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 310

పాఠక లోకానికి అందజేశారు. రామరాజు గారి పరిశోధన మూలంగానే చరిత్రకెక్కని వారంతా ఈ గ్రంథం ద్వారా సాహిత్య చరిత్రకెక్కి చరితార్థులయ్యారని రామరాజుగారి పరిశోధనలో ఉన్నటువంటి నిబద్ధతను వివరించారు.

రామరాజుగారికి మౌఖిక సాహిత్యంపై ఎంతైతే గౌరవముందో ప్రాచీన లిఖిత సాహిత్యం మీద వారికి అంతే స్నేహం ఉందన్నారు. వీరు ప్రాచీన లిఖిత సాహిత్యాన్ని పరిశోధించి పరిశీలించే క్రమంలో అందరిలాగా కవిత్రయం మీదనో, ప్రబంధ కవుల మీదనో పరిశోధించకుండా కాలగర్భంలో కలిసిపోవడానికి సిద్ధంగా ఉన్న తాళపత్ర గ్రంథాల కమ్మలపై మూలుగులు వినిపిస్తున్న కవుల మీద వారి దృష్టి పడిందన్నారు. అట్లా అజ్ఞాతంలో దాగిపోయిన కవుల మీద దృష్టి పడటానికి రామరాజుగారి తాత కృష్ణమరాజుగారి ప్రేరణ ప్రధానంగా ఉందనడంలో అమ్మంగి పరిశీలించిన క్రమం ఎంత తీక్షణంగా ఉందో అర్థమవుతుంది.

కావ్య మూల ప్రతిని నిర్ణయించడం లేదా శుద్ధ ప్రతిని రూపొందించడం గ్రంథ పరిష్కరణ విమర్శ ప్రధానలక్ష్యం. ఈ లక్ష్యం, లక్షణమనే రెండింటిని ఆధారంగా చేసుకొని రామరాజుగారు వారి పరిశోధనను కొనసాగించారు. సురవరం ప్రతాపరెడ్డిగారికి తాళపత్ర గ్రంథాల సేకరణ, శోధన అంటే ఎంతో ఆసక్తి. ఈ తాళపత్ర గ్రంథ సేకరణలో సురవరంగారు రామరాజుగారికి మార్గదర్శిగా ఉన్నారన్నారు. వారిద్దరు గురు శిష్యులుగా మమేకమై పోయారని అమ్మంగి వివరించారు. జి.వి.సుబ్రహ్మణ్యంగారు గ్రంథ పరిష్కరణ విమర్శ గురించి వివరిస్తూ 'గ్రంథ పరిష్కార విమర్శలో పరిష్కర్తలు భాషా పండితులు కావడం ప్రాథమిక అవసరం. వారు సాహిత్య విమర్శకులై కూడా ఉంటే ఈ విమర్శకు ఉభయతారకం' అన్నారు. అంటే గ్రంథ పరిష్కరణ చేసేవారికి భాషా పాండిత్యం చాలా అవసరం. రామరాజుగారు తెలుగుతోపాటు సంస్కృత సాహిత్యంలో విశేష కృషి చేసిన పండితులు కావడం వారికి ఎంతో సహకారమైందని చెప్పవచ్చు.

రామరాజుగారు చరిత్రకెక్కిన చరితార్థులు గ్రంథంలో భాషా సంబంధమైన పరిశీలనను కూడా గమనించవచ్చు. ఈ గ్రంథంలో తెలుగు విభాగంలో 22 మంది కవులను గూర్చి, వారి కావ్యాలను గురించి, సంస్కృత విభాగంలో 12 మంది కవులను గురించి, వారి కావ్యాలతో కలిపి

మొత్తం 34 మంది రచనల గురించి పరిశోధనాత్మకంగా చారిత్రక ఆధారాలతో ప్రకటించడం జరిగింది.

రామరాజుగారి పరిశోధన Primary source నుండి, సేకరించిన గ్రంథాల ఆధారంగా లేదా సమాచారం ఆధారంగా సాగడం వారి జీవ లక్షణమన్నారు వేణుగోపాల్. Primary source అంటే "A primary source is an original object or document - the raw material or first-hand information, source material that is closest to what is being studied" అని ఆంగ్లంలో నిర్వచనముంది. మూల ప్రతి నుండి సేకరించిన అంశమై ఉండి, ఇంతవరకూ ఎవ్వరూ పరిశోధించని సమాచారాన్ని ఆధారాలతో క్షుణ్ణంగా పరిశీలించడం రామరాజుగారి లక్షణం అంటున్నారు. ఈ చరిత్రకెక్కని చరితార్థులు, ఆంధ్రయోగులు, మరుగునపడిన మాణిక్యాల వంటి గ్రంథాలను చదువుతూ ఉంటే రామరాజు గారి తాళపత్ర గ్రంథ సేకరణ ఎంత సమగ్రంగా సాగిందో అర్థమవుతుంది.

తాళపత్ర గ్రంథ సేకరణ చేసే వ్యక్తికి గ్రంథాలను సేకరించే దశలో శ్రామికుడై, అధ్యయనం చేసే దశలో పండితుడై, విశ్లేషించే దశలో పరిశోధకుడై ఉండాలి. పరిశోధనా ఫలితాంశాలను ఒక మనస్విగా ప్రచారం చేయగలగాలి. అప్పుడే సాహిత్య చరిత్రకు ప్రయోజనం కలుగుతుంది. ఈ పై లక్షణాలన్నీ కూడా రామరాజుగారిలో ఉండవలసినంత కన్నా ఎక్కువే ఉన్నాయన్నారు. అందుకు నిదర్శనమే వారు వెలువరించిన గ్రంథాలని పాఠకలోకానికి తెలియజేసారు. అలాగే రామరాజు గారి అమూల్యమైన సొంత గ్రంథాలయం మన చేయిదాటి, తెలంగాణ హద్దు దాటి కడపకు చేరుకోవడం బాధాకరమైన విషయమని అమ్మంగి చింతించారు.

గ్రంథ పరిష్కరణలో భాగంగా దొరికిన పరశురామపంతులు లింగమూర్తిగారి 'ఆత్మారామ, గోవింద' శతకాలు తాను పరిశోధన చేసినంత వరుకు వెలుగులోకి రానందుకు రామరాజుగారు పొందిన వేదనను వివరిస్తూ పరశురామ పంతులు వారు సాహిత్య చరిత్రలో సుప్రసిద్ధులు. అట్లాంటి వారి రచనలు కూడా తాము చూసేదాకా వెలుగులోకి రానందుకు రామరాజుగారు చాలా బాధ పడ్డారన్నారు.

కవిసార్వభౌముడు శ్రీనాథుడు రచించిన 'శివరాత్రి మాహాత్మ్యం' సమగ్ర ప్రతిని, పండితారాధ్యోదాహరణమును రామరాజుగారు సేకరించి ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో ప్రకటించారు. ఇట్లాంటి రచనలను సేకరించి ప్రకటించే భాగ్యం కలిగినందుకు రామరాజుగారు సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు.

అటు జానపద విజ్ఞానానికి దోహదం చేస్తూ ఇటు చారిత్రక, సాహిత్య గ్రంథాలను వెలువరించి అప్పటివరకు వెలుగుచూడని కావ్యాలమీద రామరాజుగారు సూర్యరశ్మిని ప్రసరింపజేశారన్నారు. "వారిలో ఉన్న పురాతత్వ శాస్త్ర లక్షణాలకు పదునుపెట్టి వైయక్తిక జీవితాన్ని పణంగా పెట్టగలిగే త్యాగ గుణం ఉన్నందుకే తనకన్నా పూర్వం పరిశోధనలలో కృషి చేసిన మహానుభావుల సరసన తలెత్తుకొని నిలబడగలిగారని, సార్థక జీవితం గడిపి చరిత్రకెక్కిన చరితార్థుడు కాగలిగారని"[85] రామరాజుగారి జీవత గమ్యాన్ని, వారుపొందిన సాఫల్యతను గురించి ముగింపు వాక్యాలలో వివరించారు.

### 3.6.1.4. ఆచార్య బిరుదురాజు రామరాజు

**"ఆచార్య బిరుదురాజు రామరాజు"**[86] వ్యాసంలో రామరాజుగారి జీవిత వృత్తాంతాన్ని వివరించి వారి పరిశోధనా వ్యక్తిత్వాన్ని విశ్లేషించి, ఆయన వెలువరించిన గ్రంథాలను గురించి వివరించడం జరిగింది. అనాదృత పామర సాహిత్యంగా పేరున్న జానపద సాహిత్యానికి పండిత సభలలో ఆదరణ లభించేలా చేసిన రామరాజుగారి జానపద సాహిత్య కృషి కొనియాడారు. దక్షిణ భారత దేశంలోనే జానపద రంగంలో మొట్టమొదటి పరిశోధనా గ్రంథం వెలువరించిన ఘనత రామరాజుగారికి దక్కుతుంది. వీరి కృషి మూలంగానే తుళు, మలయాళం, తమిళం, కన్నడం వంటి దక్షిణాత్య భాషల్లో జానపద సాహిత్యం మీద పరిశోధనలు ఊపందుకున్నాయన్న విషయం నిత్య సత్యం.

జానపద సాహిత్య పరిశోధనకే కాకుండా, సాహిత్య తవ్వకాలతో ప్రతిభావంతులై ఉండి ప్రచారానికి నోచుకోని ప్రాచీన కవుల కావ్యాలను వెలుగులోకి తేవడంలో విశేష కృషి కనబరిచారు. జానపద సాహిత్య పరిశోధన ప్రారంభించడంకంటే మూడేళ్ళ ముందే 'మరుగున పడిన మాణిక్యాలు'

---

[85] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 320

[86] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 139

పేరుతో సాహిత్య పరిశోధన ప్రారంభించి దొరికిన వ్యాసాలను 1950 నుండి గోలకొండ పత్రికలో ప్రచురించేవారని అమ్మంగి పేర్కొన్నారు. ఈ వ్యాసంలో పూర్తిగా నైతిక విమర్శనా పద్ధతి కనిపిస్తుంది. పరిశోధకుని నైతికమైన ఆదర్శాలను ఆధారంగా తీసుకుని వారి పరిశోధనలోని ప్రమాణాలను వివరించడం జరిగింది.

అమ్మంగి రామరాజు గారిని ఉత్తమ స్థాయి గ్రంథ పరిష్కర్త అని పేర్కొన్నారు. ఎందుకంటే వారు సేకరించిన తాళపత్ర గ్రంథాలలోగాని ఇతరులు సేకరించిన తాళపత్ర గ్రంథాలలో గాని ఉత్తమ గ్రంథం కనిపిస్తే, దాన్ని నిర్దుష్టంగా పరిష్కరించి, విపుల పీఠికను రాసి ప్రచురించి పాఠక లోకానికి తెలియజేసే గుణం వారిలో ఉందన్నారు.

రామరాజుగారు నూతన గ్రంథాలను ప్రచురించడమే కాకుండా "పూర్వ పరిశోధకులు చేసిన పొరపాట్లను కూడా సవరించే బాధ్యతను తీసుకున్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ 'చాటుపద్య మణిమంజరి'లో చతురంగ విద్యలో శ్రీకృష్ణ దేవరాయలను మెప్పించిన బొడ్డుచర్ల తిమ్మనను, ప్రసన్నరాఘవ నాట్యప్రబంధ రచయిత అయిన బొడ్డుచర్ల తిమ్మయను ఒకరుగానే పొరపడ్డారు. కానీ ఈ ప్రబంధాన్ని 1962లో పరిష్కరించిన రామరాజుగారు వాళ్ళిద్దరు వేరువేరు వ్యక్తులని ఆధారాలతో నిరూపిస్తూ రాసిన **'ప్రరోచన'** పీఠిక ఎంతో విలువైనది"[87] అని అమ్మంగి తెలపడంలో గ్రంథాన్ని ఇంతకుముందు ఎప్పుడూ చూడని పాఠకులలో కూడా గ్రంథాన్ని ఒకసారి పరిశీలించాలనే ఆసక్తి కలుగిస్తుంది.

ఈ విధంగా అమ్మంగి ఏ ఒక్క అంశానికో పరిమితమై విమర్శ చేయకుండా గ్రంథంలోని సర్వ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రంథంలోని గుణదోషాలను, కవిలోని గుణదోషాలను వివరించడంలో కృతకృతులయ్యారు.

### 3.6.2. జయధీర్ తిరుమల రావు

తెలంగాణ మాండలిక భాషా సాహిత్యాల పరిరక్షణకోసం విశేష కృషి చేస్తూ, జానపద సాహిత్య మౌలిక పరిశోధనకై తెలంగాణలోని లోతట్టు గిరిజన ప్రాంతాలను, జనపదాల్లో కాళ్లరిగేలా తిరిగి ఆశ్రిత కులాల చరిత్రకు ఊపిరులు అందించినటువంటి జయధీర్ తిరుమలరావు గారి గురించి

---

[87] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 142

వారి పరిశోధనా లక్ష్యాలను గురించి **"అతనికి జీవితమంటే కొత్త మజిలీ!"**[88] అనే వ్యాసంలో అమ్మంగి ఎంతో అద్భుతంగా వివరించడం జరిగింది. తిరుమలరావుగారు వెలువరించిన 'జానపద చారిత్రక గేయ గాథలు' (1994) గ్రంథం విశ్వాసాల సంపుటి అంటున్నారు.

చరిత్ర రచనకు లిఖిత ఆధారాలు సరిపోవు. మౌఖిక రూపంలో ఉన్న అనేక జానపద గాథలు చరిత్రను పునర్నిర్మించటానికి, కొత్త వెలుగులో చూపించటానికి తోడ్పడతాయన్న ప్రగాఢ విశ్వాసంతో జానపదులపై పరిశోధన చేసినవారు తిరుమలరావని, తిరుమలరావుగారి పరిశోధక జీవితాన్ని అమ్మంగి వ్యాఖ్యానించారు.

ఆశ్రిత కుల గాయకుల గేయాల ద్వారా కుల చరిత్రతోపాటు, సామాజిక చరిత్ర కూడా నమోదౌతుందనే విశ్వాసంతో సంవత్సరాలపాటు శ్రమించి సేకరించిన పండుగ సాయన్న, బండ్లోల్ల కురుమయ్య, వెంగళరెడ్డి, మీరే సాబు- గేయ గాథలను జానపద చారిత్రక గేయగాథలు పేరుతో వెలువరించారు. ఈ గేయ గాథలను సేకరించటమే కాకుండా మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన దక్కలి బాలయ్య అతని సోదరుడిచేత పాడించి, కిన్నెర పాటలుగా తమ స్వరపేటికల్లో భద్రపరచి ఉంచడం విశేషమన్నారు అమ్మంగి. ఇక్కడ గ్రంథంలో భద్రపరచడం కంటే కూడా వారి స్వరపేటికలో దాచడమే గొప్పని భావించి ఆ పాటలు గేయ గాథలుగా ప్రాచుర్యం పొందిన క్షణాలను పసిగట్టారు విమర్శకుడు. అదేవిధంగా పుస్తకాలలో బంధించిన సమాచారం అయితే తడిస్తేనో, మరుగున పడితేనో శిథిలం కావొచ్చు. కానీ మనిషి మనసులో నింపుకుంటే అతను బ్రతికున్నంత వరకు ఆ గేయం పదిలంగా ఉండి తరువాతి తరాలకు ఆదర్శంగా ఉంటుందనే అర్థం వచ్చేలా వివరించారు.

తిరుమలరావుగారు 'పొది' గ్రంథానికి ఇచ్చిన సమాచారాన్ని మూలంగా తీసుకుని "మన సమాజంలో చరిత్ర పొడువునా ఆయా కులాలకు ఆత్మగౌరవం ఉంది. సమాజానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. చాకలి(రజకులు) వారి కులపురాణమైన మడేలుపురాణంలో చాకలి మడేలయ్య తన మూటతో వజ్రాయుధం కలిగిన ఇంద్రుణ్ణి కొట్టి ఓడిస్తాడు. ఇంతకంటే ఆత్మ గౌరవం ఏం కావాలి"[89]

[88] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం-సమకాలీన స్పందన. పుట. 64

[89] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం- సమకాలీన స్పందన. పుట. సం. 65

అని పరిశోధకుని అంతరంగాన్ని అమ్మంగి వివరించారు. ఈ వాక్యాలలో తిరుమలరావుగారు తెలిపిన అంశం ఆత్మ గౌరవం ప్రధానం.

ప్రతివ్యక్తి ఖచ్చితంగా సమాజంలో తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ఎంతవరకైనా తెగిస్తాడు. ఒకవిధంగా తెలంగాణ ఉద్యమాన్ని ఉదాహరణగా తీసుకుంటే తెలంగాణ ఉద్యమ పోరాటమంతా కూడా ఆత్మగౌరవ పోరాటమనే చెప్పాలి. తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని దించి సొంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అదే విధంగా మడేలుపురాణంలో చాకలి మడేలయ్య వస్త్రాయుధంతో, వజ్రాయుధం ఉన్న ఇంద్రునితో పోరాటం చేసి గెలిచాడు. ఇంద్రుని ఆయుధం వజ్రాయుధమైతే, మడేలయ్యాకు తన అస్తిత్వాన్ని నిదర్శనమైన బట్టల మూటనే ఆయుధమయ్యింది. అందుకే యుద్ధం చేసేది ఎంతటి బలశాలితో అయినా, బలహీనుడు చేసేది అస్తిత్వం కోసం కాబట్టి విజయం బలహీనుడినే వరిస్తుందన్న వాస్తవాన్ని మడేలు పురాణం, తెలంగాణ పోరాటం రెండూ నిరూపించాయి.

కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో "వేములవాడ భీమకవి ప్రాంగణంలో" 12 జనవరి 2008 న తెలంగాణ రచయితల వేదిక (తెరవే) తరపున జరిగిన నాల్గవ మహాసభలో జయధీర్ తిరుమల రావుగారు కూడా పాల్గొన్నారు. ఆ సభలోని ప్రసంగాలన్నింటి మీద సూక్ష్మంగా అమ్మంగి వారు **"దాచేస్తే దాగని సత్యాలను చరిత్రతో పంచుకున్న సాహిత్య సభలు"**[90] పేరుతో వ్యాసం రాసారు. ఈ వ్యాసంలోని అందరి ఉపన్యాసాలలోని ప్రధాన సందేశాలను తెలియజేస్తూ తిరుమలరావుగారి ప్రసంగాన్ని గురించి వివరిస్తూ లిఖిత సాహిత్య కవిని గౌరవించి, జానపద కవిని తక్కువ చేయటం మూలంగా జానపదానికి తీరని అన్యాయం జరిగిందని తెలిపిన వాక్యాలను అమ్మంగి వివరించారు. బిరుదురాజు రామరాజుగారు పరిశోధనలుచేసి, పర్యటనలు చేసి పరిష్కరించి మార్గం చూపిన జానపద సాహిత్యాన్ని నేటి ఆధునిక పండితులు, కవులు నిజంగానే చిన్నచూపు చూస్తున్నారనిపిస్తుంది. జనపదంలో పుట్టి పెరిగిన జానపద సాహిత్యం నేటి కవుల చెవులకు ఇంపుగా తోచడం లేదనే చెప్పాలి.

[90] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం– సమకాలీన స్పందన. పుట. సం. 131

కాలం మారుతున్న కొద్ది కవిత్వం మారుతుంది. కవితా ప్రక్రియలు మారుతాయి. కానీ కాలాంతరం వరకు జనుల నోట్లలో జానపద గేయాలు, కథలు, గాథలు పదిలంగానే ఉంటాయన్న విషయాన్ని మరిచిపోయి ప్రవర్తిస్తున్నారు. 'జాతికి మూలం జనపదం' అని పలికిన ఆచార్య ఎస్. గంగప్ప గారి మాటలను రోజు రోజుకు మరిచిపోయి ప్రవర్తిస్తుంది నేటి సమాజం ఇతర రాష్ట్రాల వారు తమ మాతృభాష ఏదైనా బతుకమ్మ పాటలను మాత్రం తెలుగులోనే పాడుకుంటారంటూ, అందుకు ఉదాహరణగా నాందేడ్ లోని మరాఠీ స్త్రీలను పేర్కొన్న సందర్భాన్ని కూడా అమ్మంగి వివరించారు. అంటే ఎవరి జాతి అస్తిత్వ సంపదను వారు కాపాడుకోవాలని ఇచ్చే సందేశం తిరుమలరావుగారి మాటల్లో వినిపిస్తుంది. ఇప్పటికీ విశ్వవిద్యాలయాలలో జానపద సాహిత్యంపై పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ జానపద సంపదను బహిర్గతం చేసే పరిశోధన గ్రంథాలు రావడం లేదని చెప్పాలి. అన్ని పరిశోధనలు కూడా పట్టాలవరకే పరిమితమవుతున్నాయే తప్ప జానపద పరిమళాలను వెదజల్ల లేకపోవడం విషాదకరమని చెప్పాలి.

ఈ విధంగా అమ్మంగి జానపద సాహిత్యంపై విశేష పరిశోధనలు చేసిన పరిశొధకులను గురించి వివరిస్తూ, విశ్లేషించడం జరిగింది.

## 3.7. యాత్రా చరిత్రకారునిపై విమర్శ

**"తెలుగువారి మహా యాత్రకుడు"**[91] అనే శీర్షికతో అమ్మంగి ఎం. ఆదినారాయణగారి 'భ్రమణ కాంక్ష' (రెండవ ముద్రణ) అనే యాత్రా చరిత్రను గూర్చి వివరంగా సమీక్షించారు. 'తెలుగువారి మహా యాత్రికుడు' అన్న శీర్షికను చూస్తేనే అర్థమవుతుంది అమ్మంగి ఆదినారాయణగారిని తెలుగుజాతికి చెందిన గొప్ప యాత్రికుడుగా పేర్కొన్నారని. అమ్మంగి యాత్రికున్ని ఏ మాత్రం కూడా నిరుత్సాహానికి గురికానీయకుండా అండగా ఉండి తన విమర్శను కొనసాగించారు. భ్రమణ కాంక్ష అంటే ఈ భూమి మీద తిరగాడాలన్న కోరిక. ఆ కోరిక మనలోని కవినీ, తాత్వికుడిని దగ్గరకు చేర్చడానికి ప్రయత్నిస్తుంది. చక్రాల్లాగా భూమంతా తిరగమనీ, కాలం మాదిరిగా అనంతంగా కదిలివెళ్ళమని, స్వేచ్ఛని కొత్తగా నిర్వచించమని మనల్ని జాము జాముకి

[91] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 38

జాగృతం చేస్తూనే ఉంటాడు ప్రయాణాల పండితుడు. అటువంటి పండితుని యాత్రాచరిత్రకు విశ్లేషణాత్మక విమర్శనా వ్యాసం రాయడం అమ్మంగి గొప్ప అదృష్టంగా భావించారు.

యాత్రా సాహిత్యాన్ని ఒక ఉజ్వలమైన భవిష్యత్తు వైపుగా ప్రయాణింపజేసిన తెలుగువారి మహాకావ్యం ఈ 'భ్రమణకాంక్ష'. ఇలాంటి యాత్రా చరిత్రలు ఇంకా రావాలని కాంక్షిస్తున్నారు అమ్మంగి. ఆదినారాయణ గారిది కవి హృదయం. వారు ఎంతో సరళంగా కవిత్వంలో వచనం రాస్తారు. యాత్రల్లో కనిపించే ప్రకృతి దృశ్యాలు ఆదినారాయణగారికి గొప్ప కవుల కవిత్వాలను గుర్తు చేస్తుంటాయని వారి యొక్క రచన శైలిని అభినందించారు. అందుకే ఈ 'భ్రమన కాంక్ష' సమరకాంక్షవంటిదే అన్నారు.

'తిరిగే తుమ్మెదకే తేనె దొరుకుతుంది' అనేది ఈ భ్రమణకాంక్ష యొక్క విస్తృత అర్థం (Tag Line). అంటే ఒక తుమ్మెద తేనెను సంపాదించాలి అంటే తనచుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను తిరిగి పూలలోని మకరందాన్ని సేకరించి తేనెను సేకరించాలి. అలా తిరిగి తేనెను సంపాదిస్తేనే దాని జీవితానికి ఒక అర్థం, పరమార్థం ఉంటుంది. అదేవిధంగా ఒక మనిషి కూడా తాను స్వేచ్ఛను, ప్రశాంతతను కోరుకున్నప్పుడు వారికి యాత్ర మాత్రమే ఉపశమనం కలిగిస్తుందని ఆదినారాయణగారి అభిప్రాయం. అవే మాటలను గురించి వివరిస్తూ అమ్మంగి నడిచి నడిచి శరీరం అలసట చెందిన కొద్దీ మనసులో రెట్టింపు ఉత్సాహం పుట్టుకొస్తున్నది అంటే అది కేవలం శుష్క ప్రయాణానికి సంబంధించిన వ్యవహారం కాదు. ఆ ప్రయాణం వెనుక ఒక ఉద్దేశ్యం ఉంటుంది. ఒక అన్వేషణ ఉంటుంది. లక్ష్యం ఉంటుందని ఆదినారాయణగారి యాత్ర ముఖ్య ఉద్దేశం గురించి ఆయన ప్రయాణాన్ని, గమ్యాన్ని గురించి ఈ వ్యాసంలో వివరించారు.

లోక సంచారి అనేవాడు ఒంటరిగా తిరుగుతాడు, ప్రపంచాన్ని ప్రేమిస్తాడు, తనకు పరిచయమైన ప్రతీవారి మీద అనంతమైన స్నేహభావాన్ని కురిపిస్తుంటాడు. లోక సంచారి హృదయంలోని ఈ స్నేహ భావమే అతనికి నిత్యం మధుర స్మృతుల్ని కలిగిస్తుంది. ఆదినారాయణ భారతీయ యాత్ర సాహిత్యకారుడయిన రాహుల్ సాంకృత్యాయన్ నుండి స్ఫూర్తి పొందినవారు. ఆయన యాత్రను గురించి వివరిస్తూ ఆదినారాయణగారు రికార్డుల కోసం యాత్ర చేయలేదు, జీవితాన్వేషణలో భాగంగా చేస్తూ వచ్చిన యాత్రలివి అని వివరించారు. వారి ప్రయాణంలో

జీవితాన్వేషణ ఉంది కాబట్టే వారి జీవిత ప్రయాణమూ, ప్రయాణ జీవితమూ అద్వైత సిద్ధిని పొందగలిగాయని తాత్విక దృష్టితో సమీక్షించారు.

అందుకే చివరలో కఠోర తపస్సు ద్వారా ఒక తెలుగు వాడు విశ్వమానవుడైన క్రమం ఎంతో గర్వించదగ్గదన్నారు. వ్యక్తి తాను నిర్వర్తించే కర్తవ్యం ద్వారానే సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలుగుతాడు. ఆదినారాయణ గారిని తెలుగువారి రాహుల్ సాంకృతయన్ అని పిలవాలని, జాతిని గౌరవించుకునేందుకు అలా పిలవడం అవసరం అంటున్నారు అమ్మంగి. ఈ వాక్యాలలో అమ్మంగి గారి శైలి, విమర్శక వ్యక్తిత్వం, విమర్శనా దృక్పథం స్పష్టమవుతున్నాయి.

'ఈ పుస్తకాన్ని ఎన్నిసార్లు చదివినా మళ్ళీ చదవ బుద్ధేస్తుంది. అనుభూతి చెక్కుచెదరదు. మళ్ళీ మళ్ళీ వెంటాడుతునే ఉంటుంది. మనసులో మెదులుతూనే ఉంటుంది. ఈ రచనలోని పాత్రలతోపాటు పాఠకుడు కూడా పర్యటనానందం, అనుభవం పొందుతాడుట'[92] అని 'భ్రమణకాంక్ష' గ్రంథ ప్రత్యేకతను గురించి ప్రకృతి వర్తనను గురించి పాఠకుల కళ్ళకు కట్టినట్లు వివరించారు. జీవితంలో ఎవరికి ఎప్పుడు ఏ వెలితి ఏర్పడ్డా, దాన్ని భర్తీ చేసే శక్తి వారి జీవిత సాహిత్యాలకు ఉంది. ఆదినారాయణగారికి కూడా జీవితంలో ఏదో వెలితి ఏర్పడ్డట్టుంది. అందుకే భిన్నమైన జీవితానుభవాల అన్వేషణలో యాత్రలకు బయలుదేరారు. ప్రతివ్యక్తి జీవితంలో, సమాజంలో సాహిత్యానికి ఉన్న శక్తిని, సాహిత్యం యొక్క స్థానాన్ని గురించి తెలుసుకోవాలి అన్నారు. ఈ మాటల ద్వారా అమ్మంగికి సాహిత్యం పట్ల ఉన్నటువంటి అభిలాష అర్థమవుతుంది. అందుకే విమర్శలో కూడా సాహిత్యాన్నే కేంద్ర బిందువుగా చేసుకున్నారు.

అమ్మంగికి సాహిత్యంపైన ఎంత మక్కువ ఉన్నా గ్రంథాన్ని సమీక్షించేటప్పుడు సాహిత్య సంబంధమైన విషయాలను మాత్రమే కాకుండా కావ్యంలో ఉన్నటువంటి చారిత్రక, భౌగోళిక, సంగీత విషయాలను కూడా చర్చిస్తున్నారు.

ఒకవిధంగా చెప్పాలంటే విమర్శకుడు అనేవాడు ఖచ్చితంగా రచయిత మనస్తత్వాన్ని రచనా శిల్పాన్ని అర్థం చేసుకోగలగాలి. ఆ విధంగా చేసినప్పుడే విమర్శకుని సమీక్షకు గుర్తింపు లభిస్తుంది.

---

[92] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 39

ఆ విమర్శ ప్రతిపాదనల ద్వారా కావ్య విలువలు కూడా పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ విషయంలో అమ్మంగి గారి విమర్శక వ్యక్తిత్వం సాఫల్యత పొందిందని చెప్పాలి.

అమ్మంగి ఆదినారాయణగారి **'స్త్రీ యాత్రికులు'**[93] అనే పుస్తకం మీద మరో వ్యాసం రాశారు. క్రైస్తవ మత ప్రచారమే ఉద్దేశంగా ప్రపంచపు పైకప్పు అని పేరుపొందిన టిబెట్ రాజధాని లాసాను చేరుకోవాలని ప్రయత్నాలు జరిగాయి. సుసీరిన్ హార్డ్ అనే డాక్టర్ స్త్రీ యాత్రికురాలు తన భర్త మరియు కొడుకుతో కలిసి టిబెట్ సరిహద్దులు చేరుకున్నా ఆమె సర్వస్వం కోల్పోయి తిరిగి ఒంటరిగా కెనడా చేరుకుంటుంది. ఫ్రాన్స్ కు చెందిన అలెగ్జాండ్రా డేవిడ్ నీల్ మాత్రం బిచ్చెగత్తె వేషంలో చాలా కష్టాలుపడి లాసా చేరుకుంటుంది. ఇట్లా ఈ గ్రంథంలో ఇరవయ్యొనిమిది మంది స్త్రీ యాత్రికుల అనుభవాలను ఆదినారాయణగారు రాసినందుకు వారిని అమ్మంగి అభినందించారు. ఇటువంటి కథనాలే మన జ్ఞానాన్ని పెంచుతాయని విమర్శకుని ఉద్దేశ్యం.

[93] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం–సమకాలీన స్పందన. పుట. సం. 215

# అధ్యాయం-4

# పీఠికలు – ముందుమాటల విశ్లేషణ

## 4.0. పరిచయం

ప్రాచీన కాలంలో కావ్యాలకు కవులు అవతారికల రూపంలో పీఠికలు రాసుకునేవారు. అదే పద్ధతిని తర్వాత కాలంలో గ్రంథ పరిచయంకోసం ఆధునికులు ఉపయోగించారు. మొదట ఎవరి కావ్యాలకు వారే పీఠికలు రాసుకున్నప్పటికీ మెల్లమెల్లగా ఇతర కవులు కూడా వేరొకరి కావ్యాలకు ముందుమాట రూపంలో రచనలోని ప్రత్యేకతను గురించి రాయడం ప్రారంభమైంది. 'అవతారికలు స్వయంగా కృతి కర్తలు రాసినవి కాగా పీఠికలను గ్రంథ రచయితలే కాక ఇతరులు కూడ రచిస్తున్నారు. వాటిలో కవిత్వ సంబంధమైన పరామర్శకు అవకాశమున్నట్లుగనే వీనియందు కూడ సాహిత్య విమర్శకు తావుకలదు. 'కావ్యావతారికలలో కేవల లక్షణచర్చకు మాత్రమే ప్రాధాన్యముండినది కాని ఆధునిక పీఠికలలో లక్ష్య పరిశీలనము ప్రాముఖ్యము వహించినది. కవిపరిచయమేకాక కావ్య పరిచయము వీనియందు ముఖ్యమైనది'[94] అని ప్రముఖ విమర్శకులు ఎస్.వి. రామారావు గారు పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం మొదలుకొని నేటి వరకు అనేక ప్రామాణికమైన పీఠికలు, ముందుమాటలు వెలువరించినవారు ఎందరో ఉన్నారు.

తెలుగు సాహిత్య విమర్శలో నేడు పీఠికలు గణనీయమైన స్థానం సంపాదించుకున్నాయి. పీఠిక ముఖ్య ఉద్దేశం కవిని, కావ్యాన్ని పాఠకులకు పరిచయం చేయడం. తెలుగులో ఇది పీఠిక, ముందుమాట, తొలిపలుకు, పరిచయం, మున్నుడి, ఉపోద్ఘాతం, అవతారిక, ఆముఖము, ప్రస్తావన, ప్రకాశిక, ప్రవేశిక, ప్రశంస, ఆశీస్సు, ఆమోదము, యోగ్యతాపత్రం మొదలైనవి నామాంతరాలతో వ్యవహరింపబడుతుంది. తెలుగు సాహిత్యంలో పీఠికలపై 'తెలుగు పీఠిక' అనే అంశంపై డి. చంద్రశేఖర్ రెడ్డిగారు సమగ్ర పరిశోధన చేసి పీఠిక స్వరూప స్వభావాలను, ఉత్పత్తి వికాసాలను గురించి ఏంతో సమగ్రంగా విశ్లేషించారు. "ఒక గ్రంథానికి ముందు ఆధారాలు, చరిత్ర, పరిధి, ప్రణాళిక పద్ధతి, ప్రయోజనం, లక్ష్యం మొదలైన వాటిని వివరిస్తూ సహకరించిన వారికి కృతజ్ఞతలు చెప్తూ ఆ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే అధిక సమాచారాన్ని అందించే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచన పీఠిక. ఇది వచన రూపంలోగానీ, పద్య రూపంలోగానీ ఉండవచ్చు. దీనిని

[94] రామారావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ – విమర్శ అవతరణ వికాసం, పుట. 298.

గ్రంథకర్తగానీ, ఇతరులుగానీ రాయవచ్చు."[95] ఈ నిర్వచనాన్ని బట్టి ఒక రచన రాయడానికి ముందుగా సమకూర్చుకున్న ప్రణాళిక, వస్తు సామాగ్రి, రాసేటప్పుడు సహాయ సహకారాలందించిన వారికి కృతజ్ఞతలు చెప్పడం వంటి విషయాలను పీఠికాకర్త మాత్రమే కాకుండా, ఇతరులు కూడా రాయవచ్చని తెలుస్తుంది.

కావ్యంలోని వస్తువు, శిల్పము, కావ్యతత్త్వము, సౌందర్య దృష్టిని వివేచించి, కావ్యార్థాలను ఔచిత్యయుక్తంగా సమన్వయించి, కావ్య పరమార్థాన్ని ఆవిష్కరించడం, రసధ్వన్యాదులను వివరించటంవంటి అంశాలకు పాముఖ్యతను ఇవ్వడం ముందుమాటలలో చూడవచ్చు. కొన్ని ముందుమాటలు ప్రత్యేకంగాను అభినందన రూపంగానూ ఉన్నాయి. విభిన్న ప్రక్రియలకు సంబంధించిన పూర్వాపరాలను చర్చించిన ముందుమాటలు కొన్ని ఉన్నాయి. అమ్మంగి రాసిన ముందుమాటలన్నీ కూడా సునిశిత విమర్శనా దృష్టితో సమకాలిన సాహిత్యాన్ని పఠితలకు పరిచయం చేసేవిధంగా ఉన్నాయి. ఇలాంటి పద్ధతులన్నింటినికూడా అమ్మంగి వేణుగోపాల్ గారు ముందుమాటలు రాయడంలో పాటించారు.

ఏదైనా ఒక గ్రంథానికి ముందు ఆ గ్రంథాన్ని గురించి అందులోని విశేషాలను, గ్రంథ నేపథ్యాన్ని వివరించే పరిచయాత్మక విశ్లేషణనే పీఠిక లేదా ముందుమాట అంటారు. పీఠిక రచయితకు, పాఠకునికి ఇద్దరికీ ఉపయోగపడుతుంది. ముందుమాటలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి గ్రంథ రచయిత రాసుకునేది. రెండు ఇతరులు రాసేవి. గ్రంథ రచయిత రాసిన ముందుమాటలో అయితే రచయిత తాను ఏ ఉద్దేశంతో రచన చేశాడు, తన కావ్యం ద్వారా ఏ సందేశాన్ని ఇవ్వదలచుకున్నాడు అన్న విషయాలను తెలియజేస్తాడు. అదే ఒకరు రాసిన గ్రంథానికి వేరొకరు ముందుమాట రాస్తే ఆ గ్రంథంలో కవి ఏ ధోరణిలో రాశాడు, రచనా శైలి ఎలా ఉంది, గ్రంథంలో చదవదగ్గ విషయాలు ఏమి ఉన్నాయి, కవి ఇంకా నేర్చుకోవలసిన అంశాలేమిటి, ఏ అంశం మీద పట్టు సాధించాలి మొదలైన అన్ని అంశాలను కూడా ముందుమాటలో వివరిస్తారు.

ప్రాచీనకవులు తమ గ్రంథాలకు 'అవతారిక' రూపంలో కావ్యారంభంలో ముందుమాట రచించేవారు. ప్రస్తుతకాలంలో గ్రంథాలకు, కావ్యాలకు ముందుమాటలనేవి ఇంచుమించుగా

[95] డి. చంద్రశేఖరరెడ్డి, తెలుగు పీఠిక, పుట. సం. 33

తప్పనిసరి అయ్యాయి. బహుశా ఆధునిక తెలుగు సాహిత్యంలో ముందుమాటలు లేకుండా కావ్యాలు, గ్రంథాలు వెలువడటం లేదనేంతగా ముందుమాటలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అందుచేత వర్ధమాన కవులు, రచయితలు, ప్రసిద్ధకవులు కూడా తమ తమ పుస్తకాలకు పీఠిక వ్రాయించుకోవడం అలవాటుగా ఒక ప్రాచీన, నవీన సంప్రదాయంగా మారింది. ప్రాచీన కవులు తమ గురించి, తమ గ్రంథం గురించి తామే వ్రాసుకొనేవారు. ఆధునిక కవులు ఒక సాహితీ విమర్శకుని దగ్గరకో లేక పేరొందిన కవి దగ్గరకోవెళ్లి 'పీఠిక లేదా ముందుమాట' రాయించుకోవడానికి ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఈ పీఠిక, ముందుమాటల ద్వారా కవికి, కావ్యానికి ఎంతో కొంత గుర్తింపు లభించేందుకు అవకాశాలు ఉన్నాయి.

## 4.1. అమ్మంగి ముందుమాటల విశ్లేషణ

అమ్మంగి పీఠికలు ముందుమాటలలో కావ్య పరమార్థాన్ని, కావ్య అంతర్గత రహస్యాలను వివరణ దృష్టితో పరిశీలించి విశ్లేషించడం కనిపిస్తుంది. ముందుమాటలో సహృదయులకు ఆనందప్రధానమే ముఖ్య ధ్యేయమన్న విధంగా విషయ పరిజ్ఞానాన్ని అందించారు. వినూత్నమైన విషయాలను ప్రతి కావ్యములో, విమర్శలలో వ్యక్తీకరించడమే ఆశయంగా అమ్మంగి పీఠికా రచన సాగింది.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఆధునిక ప్రక్రియలైన గేయకావ్యాలకు, కవితా సంపుటాలకు, నాటకాలకు, నవలలకు, కథానికలకు, యాత్రా చరిత్రలకు, పరిశోధన సిద్ధాంత గ్రంథాలకు, విమర్శనా వ్యాస సంకలనాలకు, ఇంచుమించుగా వారికి సమకాలికంగా తెలుగులో వెలువడుతున్న అన్ని సాహిత్య ప్రక్రియలకు ముందుమాటలు రాయడం జరిగింది. వీటన్నింటినీ విడివిడి భాగాలుగా విభజించి విశ్లేషించడం మూలంగా అమ్మంగి ముందుమాటలలో ప్రదర్శించేటటువంటి శిల్పనైపుణ్యాన్ని గుర్తించవచ్చు.

1. నవలలకు రాసిన ముందుమాటలు
2. కథా సంపుటాలకు రాసిన ముందుమాటలు
3. కవితా సంపుటాలకు – సంకలనాలకు రాసిన ముందుమాటలు
4. పద్య కవితా సంపుటానికి రాసిన ముందుమాట

5. పరిశోధన గ్రంథాలకు రాసిన ముందుమాటలు

6. అనువాద గ్రంథాలకు రాసిన ముందుమాటలు

## 4.1.1. నవలకు రాసిన ముందుమాట

అమ్మంగి వేణుగోపాల్ గారు నవలలకు సంబంధించి ఒక్క నవలకు మాత్రమే ముందుమాటను రాయడం జరిగింది. రాసింది ఒక్క నవలకే అయిన నవలా లక్షణాలను దృష్టిలో ఉంచుకొని నవలలో చిత్రించబడిన మనోవైజ్ఞానిక అంశాలలు, సామాజికాంశాలను గురించి ఏంతో సమగ్రంగా చర్చించి విశ్లేషించడం జరిగింది.

### 4.1.1.1. మనోయాత్ర : అంపశయ్య నవలకు రాసిన ముందుమాట

అంపశయ్య నవీన్ గా తెలుగు సాహితీ క్షేత్రంలో గుర్తింపు పొందిన దొంగరి మల్లయ్య రాసిన **"అంపశయ్య"** నవల ఎనిమిదవ ముద్రణకు అమ్మంగి వేణుగోపాల్ గారు **"మనోయాత్ర"**[96] అనే శీర్షికతో ముందుమాట రాసారు. ఈ ముందుమాటలో మనోవైజ్ఞానిక దృక్పథ ఆవిర్భావ వికాసాలను గురించి వివరిస్తూ నవలలో నవీన్ గారు చిత్రించినటువంటి చైతన్య స్రవంతి శిల్పాన్ని గురించి, సామాజిక అంశాలను గురించి, వర్గ సంబంధమైన విషయాలను గురించి వైవిధ్యభరితంగా విశ్లేషించారు.

అంపశయ్య నవలలో ఏ వయస్సు వారినైనా యవ్వనంలోకి లాక్కునిపోయే అయస్కాంత శక్తి ఉందని, నవల నిత్య నూతనంగా వెలగడానికి గల కారణాన్ని ముందుగానే తెలియజేసారు అమ్మంగి. చలం, బుచ్చిబాబు, శ్రీశ్రీల సాహిత్యం మూలంగా ప్రభావితమై రచనా ప్రస్థానం ప్రారంభించిన అంపశయ్య నవీన్ గారు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయేటటువంటి చైతన్య స్రవంతి శిల్ప ధోరణిలో 'అంపశయ్య' నవలను రచించారు. ఈ నవల ఆధారంగా దేశ విదేశాల్లో ఎన్నో పురస్కారాలు అందుకుని నవల పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న గొప్ప సాహిత్యకారుడు అంపశయ్య నవీన్.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఈ అంపశయ్య నవలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే తాను ఒక నిర్ణయానికి వచ్చి ముందుమాట రాయడం ప్రారంభించారనిపిస్తుంది. అందుకే ఈ

[96] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 56

నవలలో మనోవైజ్ఞానిక కోణం ఉన్నట్టే, సామాజిక అంశమూ ఉందని నిర్ధారించగలిగారు. నవలలో సామాజిక అంశాన్ని బలపరిచిన పాత్ర 'రత్తి'. 'యౌవన ప్రాదుర్భావ దశనుంచి, మరణందాకా ముఖ్యమైన పరిణామాలు రవి నేపథ్య కథనం ద్వారా చిత్రితమైన పాత్ర ఇదొక్కటే'[97] అంటారు అమ్మంగి.

ఈ పరిశీలనా ధోరణిని గమనిస్తే అమ్మంగిలో నూతన పరిశోధన సిద్ధాంత దృష్టి కేంద్రీకృతమయిందని అర్థమవుతుంది. ఇదివరకు అంపశయ్య నవలపై విమర్శనాత్మక పరిశోధనలు చేసిన, సమీక్షలు రాసిన పండితులు, విమర్శకులు అంతా కూడా నవలలో ఉన్న మనోవైజ్ఞానిక, చైతన్య స్రవంతి శిల్పం గురించి, ఆత్మన్యూనతా భావం గురించి ప్రస్తావించారే తప్ప ఆ నవలలో ఉన్న సామాజిక అంశాలను గురించి చర్చించే ప్రయత్నం చేయలేదు. ఆ సామాజికాంశాల కోణాన్ని పాత్రతో సహా ఉదాహరణ పూర్వకంగా అమ్మంగి సిద్ధాంతీకరించారు.

అమ్మంగి తెలిపిన ఈ సామాజికాంశాలు పాఠకులు అంపశయ్య నవలను లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ఈ సామాజిక అంశాన్ని గురించి అమ్మంగి ఎంతో విశ్లేషణ పూర్వకంగా వివరిస్తూ "స్త్రీవాద కోణం నుంచి, వ్యభిచార వృత్తికోణం నుంచి, వర్గ దోపిడి కోణం నుంచి మనోవైజ్ఞానిక దృక్కోణం నుంచి చర్చోప చర్చలకు అవకాశం ఉన్న ఉదంతమిది"[98] అంటూ రత్తి పాత్ర ఇతివృత్తం గురించి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇంకోసారి రవి వంటి ఉన్నత విద్యావంతుణ్ణి, చలంలాంటి స్త్రీవాద రచయితని ఆరాధించేవాణ్ణి, స్త్రీలపట్ల కొత్త భావాలతో, ఆదర్శాలతో మెలగాలనుకునే సంస్కారవంతుణ్ణి– మామూలు మగవాణ్ణి చేసి నగ్నంగా నిలబెట్టిన శక్తివంతమైన పాత్ర 'రత్తి' అంటూ రత్తి పాత్రకు న్యాయం చేకూరే విధమైన వాక్యాలలో రత్తి పాత్ర ఔన్నత్యాన్ని వివరించారు. ఇందులో ప్రత్యేకంగా నవలా నాయకుడయిన రవి పాత్రను ఉద్దేశించి కాకుండా రత్తి పాత్రకు న్యాయం చేకూర్చే స్థానంలో ఉండి తన విమర్శను కొనసాగించారు.

ఈ నవలలో సామాజిక అంశాలే కాకుండా వర్గ స్వభావానికి సంబంధించిన సంఘర్షణాయుతమైన సన్నివేశాలు కూడా ప్రధాన పాత్రను పోషించాయన్నారు. నవలలో శిల్పాన్ని బలోపేతంచేసే

---

[97] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 61

[98] అదే. పుట. సం. 61

సంఘటనలు కొన్ని ఉన్నాయని ప్రతిపాదించి నవలలోని సామాజిక అంశాలను పరిశీలించాలి అనిపించేలా, పాఠకుడిలో నవలపట్ల ఆలోచన రేకెత్తించి ముందుమాటను ముగించారు.

### 4.1.2. కథా సంపుటాలకు రాసిన పీఠికలు–ముందుమాటలు

అమ్మంగి వేణుగోపాల్ గారు కథా సంపుటాలకు రాసిన ముందుమాటలు పాఠకులను కథాప్రపంచంలోకి తీసుకుపోతాయి. కథను విశ్లేషించే విధానంలో కథ ఇతివృత్తం ఏమిటి అన్న విషయం నుండి కథా ప్రయాణం ఏ విధంగా సాగింది, కథ మలుపు తిరిగిన క్షణాలు, సన్నివేశాలను గురించి స్పష్టంగా వివరించారు.

#### 4.1.2.1. తారుమారు కథల సంపుటి

దేవులపల్లి కృష్ణమూర్తి రచించిన 'తారుమారు' కథల సంపుటికి **"పందిరిని అల్లుకుంటున్న కథానికలు"**[99] అనే శీర్షికతో ముందుమాట రాసారు. ఈ ముందుమాటలో కథా ఇతివృత్తాలను ఎంతో అద్భుతంగా విశ్లేషించారు. ముందుమాటను రాసే క్రమంలో ఎక్కడా కూడా అస్పష్టతకు, తడబాటుకు స్థానం కల్పించకుండా కథలలో ఉన్న ఇతివృత్తాన్ని చిత్రించారు. కృష్ణమూర్తి కథానికలలో ఊహాత్మక జీవిత చిత్రణకాక తన అనుభవ పరిధిలోకి వచ్చే జీవితచిత్రణలే ఎక్కువగా ఉంటాయని చెప్పారు. రచయిత కల్పనా దృష్టితో రాసిన రచనలకంటే వాస్తవికతను ప్రదర్శించేటువంటి రచనలు చేయడం ద్వారా ఎక్కువ గుర్తింపు పొందేందుకు అవకాశం ఉంటుంది. వీరి కథలలో దేశీయమైన వాతావరణం, సహజమైన సన్నివేశాల మధ్య సంభావ్యత పుష్కలంగా ఉంటుంది కాబట్టే తెలుగు సాహిత్యంలో మెల్లమెల్లగా కృష్ణమూర్తి గారి కథలు విస్తృతిని పొందుతున్నాయని చెప్పవచ్చు.

కృష్ణమూర్తిగారి కథానికలలో కొట్టొచ్చినట్టు కనిపించేది వాస్తవికతనేనని అమ్మంగి అంటున్నారు. కృష్ణమూర్తిగారి కథలలో కాల్పనికతపాలు తక్కువగా ఉండి సామాజిక వాస్తవికత ఎక్కువగా ఉంటుందన్న విషయం ముందుమాటను చదువుతుంటే అర్థమవుతుంది. కృష్ణమూర్తిగారు రెవెన్యూ శాఖలో తహసిల్దారుగా పనిచేసినవారు కావటం మూలంగా ప్రతిరోజూ ఎంతోమందితో

[99] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 210

మాట్లాడి వారి హావభావాలను, మానసిక స్థితిని పరీక్షిస్తుండేవారు. దాని కారణంగానే తాను చూసిన మానసిక, భౌతిక జీవితాలను వస్తువుగా స్వీకరించి రాసిన కథలే ఎక్కువగా ఉన్నాయి.

కృష్ణమూర్తిగారి కథలలో కొంతమేరకు ఆత్మకథాత్మకత చోటుచేసుకుంటుందన్నారు. కృష్ణమూర్తికి డెబ్బయి సంవత్సరాల వయస్సులో తనకు తెలిసిన జీవితాన్ని చెప్పాలన్న కుతూహలం ఎక్కువగా వుంటుందే తప్ప, కీర్తిప్రతిష్ఠల యావ ఉండదని అమ్మంగి పలికిన వాక్యాలు కృష్ణమూర్తిగారు ఈ వయస్సులో రచనలు చేసేది వారి ఆత్మ సంతృప్తి కోసమే కాని కీర్తిప్రతిష్టలు సంపాదించుకోవడం కోసం కాదన్న విషయం అవగతమవుతుంది. ఆధునిక యుగంలో చాలామంది యువ రచయితలు అందరూ కూడా అవార్డులకోసం, రివార్డుల కోసం పేరు ప్రతిష్ఠలకోసమే సాహిత్యాన్ని ఆధారంగా చేసుకుని రచనలు చేస్తున్నారని కొన్ని కావ్యాలను, కథలను, నవలలను చదువుతుంటే అర్థంమవుతుంది. అలాంటి ఏ ఆర్భాటం లేకుండా కృష్ణమూర్తి రచనలు చేస్తున్నారని అమ్మంగి నిర్వచించిన విధానం అహ్లాదకరంగా ఉంది.

కృష్ణమూర్తి ఏనాడూ నేలవిడిచి సాము ఎక్కడా చేయలేదంటూ వారి కథలలో ఉన్న వాస్తవికత రూపాన్ని తెలియజేసారు. అమ్మంగి వివరించినట్టు కథ ఊహా ప్రపంచంలో విహరించే విధంగా కాకుండా వాస్తవికతను ప్రతిబించే విధంగా ఉండాలన్న విషయం స్పష్టంగా గోచరిస్తుంది. కృష్ణమూర్తిగారు తులనాత్మక కథనం ద్వారా కథలను రెండు కోణాలలో ప్రదర్శించటంలో సాఫల్యం సాధించిన సన్నివేశాలను కథలను కూడా అమ్మంగి తన వ్యాఖ్యలను జోడించి ఎంతో అద్భుతంగా వివరించారు.

అన్ని విధాలుగా కథలను పరిశీలించారు కనుకనే దేవులపల్లి కృష్ణమూర్తిగారి కథానికలు తీగలు సాగి పందిరిని అల్లుకుంటున్నాయని చెప్పగలిగారు. తీగలు సాగుతున్న పందిరి చెట్టు రోజు రోజుకు ఏ విధంగా అయితే విస్తృతం అవుతుందో కృష్ణమూర్తిగారి సాహిత్య కృషి కూడా తెలంగాణ మట్టివాసనతో కళాత్మకం చెందుతుందని ఈ ముందుమాట ద్వారా అర్థం చేసుకోవచ్చు. కృష్ణమూర్తిగారు తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని, వాస్తవిక జీవితాన్ని చిత్రించటంలో సాఫల్యం పొందారని అందుకు ఈ 'తారుమారు' కథల సంపుటిలోని కథలే నిదర్శనమని అమ్మంగి పేర్కొన్నారు.

#### 4.1.2.2. బెత్తెడు జాగ కథల సంపుటి

రావుల పుల్లాచారి రాసిన **“బెత్తెడు జాగ”** కథా సంపుటికి అమ్మంగి వేణుగోపాల్ గారు **“మానవ అనుబంధాల అల్లిక”**[100] అన్న శీర్షికతో ముందుమాట రాసారు. ఈ శీర్షికతో ముందుమాట రాయడానికి ప్రధాన కారణం పుల్లాచారిగారు వారి కథల ద్వారా జంతువులను కూడా మానవ ప్రపంచంలోకి తీసుకువచ్చి మనుషులతో జంతువులు ఎంత అన్యోన్యంగా కలిసి జీవిస్తాయో అన్న విషయాన్ని ఈ కథా సంపుటి ద్వారా తెలియజేసినందుకే అమ్మంగి ఈ శీర్షికతో ముందుమాట రాసారు. కథా సంపుటిలో సామాజిక కుటుంబ జీవితం ప్రతిష్ఠితమై, మనషి జీవితంలో మూగజీవుల పాత్ర ఏవిధంగా ఉంటుందో తెలియజెప్పే సన్నివేశాలను ఎంతో అద్భుతంగా చిత్రించారు.

పుల్లాచారి పిల్లి, కోతి, మేక, బర్రె మొదలైన పెంపుడు జంతువులు మనిషితో గడిపే క్షణాలను కథా వస్తువులుగా ఎంచుకున్నారు. ముందుమాట చదువుతున్నంతసేపు కథా సంపుటిలోని మానవ అనుబంధాలతో మమేకమైపోయిన మూగజీవుల ప్రాణస్పందనలు చదివే పాఠకుడిలో ఉత్కంఠ చెలరేపుతాయి. ఎక్కడా కూడా కథ ఇతివృత్తాన్ని వివరించే క్రమంలో అమ్మంగి విమర్శలో అస్పష్టత కనిపించదు. అమ్మంగి ఈ కథలను క్షుణ్ణంగా పరిశీలించి కథలకు అలంకారశాస్త్ర సూత్రాలను అన్వయించి ‘ఆట’ కథలో రసదృష్టితో పోల్చదగ్గ అంశాలు ఉన్నాయన్నారు.

కథలోని ఇతివృత్తాన్ని మూడు భాగాలుగా విభజించి కథను మలుపుతిప్పిన సంఘటనలకు రసాన్ని అన్వయించి అద్భుతంగా విశ్లేషించారు. అందులో మొదటి రసం ‘ఆట’ కథలో కోతిని ఆడించటం ద్వారా ప్రేక్షకులలో కలిగే ఆనందంలో హాస్య రసం ఉందని, రెండవది కోతుల గుంపులు హఠాత్తుగా ప్రజల మధ్యకు వచ్చి సర్కసులో ఉన్న కోతిని ఎత్తుకెళ్ళడంలో బీభత్స రసం సృష్టించారని, మూడవది గుంపులో వెళ్ళిపోయిన కోతి తర్వాత మళ్ళీ తిరిగి వచ్చినప్పుడు ఆ కోతిలో జనం ఆంజనేయస్వామిని చూసుకోవడంలో అద్భుతరసాన్ని సృష్టించాడని అమ్మంగి ఎంతో అద్భుతంగా వివరించారు. ఇక్కడ ఒక విషయాన్ని అమ్మంగి గమనించలేకపోయారు గుంపులో వెళ్ళిన కోతి తిరిగి వచ్చాక యజమాని దీనస్థితిని చూసి చలించిపోయి పరుగుపరుగున గుడిలోకి వెళ్ళి కొబ్బరి నీళ్ళున్న చెంబు తెచ్చి యజమాని మొఖాన చిలకరించి తట్టిలేపిన సందర్భంలో కరుణ రసం

---

[100] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 216

సృష్టించబడింది. ఏది విశ్లేషించినా రావుల పుల్లాచారి కథలలో నాటకీయత కూడా పుష్కలంగా ఉండి, సామాజిక అనుబంధాలకు పెద్దపీట వేసారని, హింసకు అహింసకు మధ్య ప్రమాదానికి – వినోదానికి మధ్య నడిచే కథలు కూడా ఉన్నాయని అర్థమవుతుంది.

కథలను రాయడంలో పుల్లాచారిగారు జీవితాన్ని నిశితంగా పరిశీలించి, సంవిధాన శిల్పంతో, నైపుణ్యం ప్రదర్శించారని పాఠకుల హృదయాలలో ఆర్ద్రతను నింపే సన్నివేశాలు, సంఘటనలు వీరి కథలలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్న విషయం ముందుమాట ద్వారా స్పష్టంగా గోచరిస్తుంది.

### 4.1.3. కవితా సంపుటాలకు – సంకలనాలకు రాసిన ముందుమాటలు

ఆధునిక సాహిత్య విమర్శలో ముందుమాటల పాత్ర అద్వితీయమైందని చెప్పవచ్చు. ఏదైనా ఒక గ్రంథానికి సంబంధించిన మొత్తం విషయాన్ని క్లుప్తంగా పరిచయం చేస్తూ అందులోని గుణదోషాలను వివేచించి సూచ ప్రాయంగా రాసే పత్రాన్ని పీఠిక లేదా ముందుమాట అంటారు. అమ్మంగి వేణుగోపాల్ గారు ఎన్నో కవితాసంపుటాలకు, సంకలనాలకు ముందుమాటలు రాయడం జరిగింది.

#### 4.1.3.1. ఈ నేల వెన్నెల కాయనీ : కవితా సంపుటి

హైదరాబాద్ కవుల వేదిక మిత్రులంతా కలిసి ప్రచురించిన **"ఈ నేల వెన్నెల కాయనీ"**[101] అన్న కవితా సంకలనానికి **"కవి కవిత్వం"** శీర్షికతో అమ్మంగి వేణుగోపాల్ గారు ముందుమాట రాసారు.

హైదరాబాదులోని విభిన్న ప్రాంతాలలో నివసిస్తున్న కవులు ప్రతినెల చివరి ఆదివారం విజయశ్రీ కాలనీ కమ్యూనిటీహాలులో కవిత్వంకోసం కలుసుకుని, కవిత్వంలో పలకరించుకొని, కవిత్వంతో కరచాలనం చేసుకొని, కష్ట సుఖాలను పంచుకున్నట్లుగా కవిత్వాన్ని పంచుకోవడమనేది 'మిత్రమండలి, నెలనెలా వెన్నెల' వంటి గొప్ప సంస్థల సంప్రదాయాన్ని కొనసాగించటమే అవుతుందన్నారు. ఈ హైదరాబాద్ కవుల వేదిక చేస్తున్న కృషికి ఫలితంగా వెలువడిన సంకలనమే **'ఈ నేల వెన్నెల కాయనీ'.**

---

[101] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 22

అమ్మంగి ఈ ముందుమాటలో కవితా సంకలనానికి సంబంధించిన అంశాలను విశ్లేషించేకంటే ముందు కవితా సంకలనం వెలువడడానికి గల కారణాలను చారిత్రాత్మక ఇతివృత్తాన్ని పాఠకులకు తెలియజేసి తరువాత కవితా సంకలన ఆవశ్యకతను వివరించారు. ముందుగా కవిత్వం నుంచి ప్రారంభించి తెలంగాణ పోరాట ఉద్యమంలో కవిత్వం సృష్టించిన ఉత్తేజం, కవిత్వ పాత్రను గురించి ఎంతో పరిశీలనా దృష్టితో వివరించడం జరిగింది.

కవిత్వంలో భాష అనే సంకేతాల సముదాయం భావంలోకి వికసించి అనేక రంగులను, పరిమళాలను వెదజల్లుతుంది. సాధారణంగా వ్యవహారంలో వస్తుగతంగా ఉండే భాష, కవిత్వం దగ్గరకు వచ్చేసరికి ఎక్కువ సౌందర్యాన్ని, సాంకేతికతను, లోతును సంతరించుకుంటుందని కవిత్వంలో, సాహిత్యంలో భాష స్థానాన్ని తెలిపి భాషకే గుర్తింపు తెచ్చేటువంటి సాహిత్యాన్ని గురించి అమ్మంగి ప్రస్తావించాడు. ఈ వివరణ ద్వారా పాఠకులకులలో ఒక కొత్తలోకాన్ని అనుభవంలోకి తీసుకొచ్చాడు. 'భాష– ఒక మానవ వనరు. అదే రచయిత పవరు' అంటూ భాష స్థానాన్ని వివరించాడు.

కవికి భాషమీద పట్టు ఉన్నప్పుడే భాష కూడా ఒక మానవ వనరుగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఒక మనిషి ఇంకో మనిషితో తన భావాలను పంచుకోవాలంటే ఖచ్చితంగా భాష అవసరం. మౌఖికంగా భావ ప్రసరణ సాగినప్పుడు భాషలో లోపాలు ఉన్నా శ్రోతలకు సమాచారం చేరుతుంది. అదే కవిత్వం ద్వారా చెప్పాలనుకున్నపుడు భాష మీద తగుమాత్రం అవగాహన అవసరం. అందుకే భాషను ప్రకృతి మనిషికి ఇచ్చిన మానవ వనరుగా గుర్తించగలిగారు. భాష అనేది రాను రానూ మనషిలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. ఆ ఆలోచనల పర్యవసానంగానే సాహిత్యం ఉద్భవించింది. ఈ సాహిత్యానికి మూలం భాషనే అయినా భాషకు కూడా సాహిత్యం ద్వారానే సౌందర్యం వస్తుందంటూ అద్భుత వాక్యాల ద్వారా పాఠకులను భాషాశాస్త్ర ప్రపంచంలోకి తీసుకెళ్ళారు.

ఈ ముందుమాటలో ఎక్కువగా అమ్మంగి కవిత్వంలో రచయితకి ఉండే స్వేచ్ఛను గురించి ప్రస్తావించారు. 19వ దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ప్రజాస్వామ్య ధోరణులు ఆధునిక సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ఆధునిక కవిత్వం వ్యావహారిక ధోరణులను సమకూర్చుకొని,

సరళతరం పొంది, వచనాన్ని కవిత్వాన్ని పునాదులుగా చేసుకుందని వచన కవిత్వ ఆవిర్భావ వికాసాలను గురించి తెలియజేశారు. ఈ కవితా సంకలనంలో తెలంగాణకు సంబంధించిన భావకవిత్వం ఎలా ఉండబోతుందన్న ప్రశ్నకు సమాధానం దొరుకతుందని ఎంతో బలంగా విశ్వసిస్తున్నారు. అందుకే ఈ సంకలనం ఏది ఏమైనా తెలంగాణ సంస్కృతితో మమేకమై గతవైభవగానం చేయడం ఖాయమంటూ పాఠకుల హృదయాలలోని తెలంగాణ అస్తిత్వ భావనను మరొక్కసారి తట్టిలేపారు.

ఈ సంకలనంలో తెలంగాణ ఉద్యమ కవిత్వం ఉంది, దైనందిన జీవితం ఉంది, సరిహద్దు అవతలి సంఘటనల పట్ల సానుభూతి, తండ్రీ బిడ్డల అనుబంధం ఉంది, అమ్మ ఉంది, సౌభ్రాతృత్వం ఉంది, స్త్రీవాదం ఉంది, స్మృతి కవిత్వం ఉంది మొత్తంగా జీవితమంత విశాలమైన వైవిధ్యం ఉందని ఈ వైవిధ్యమే జీవ లక్షణం అయ్యిందని సంకలనంలోని సజీవ పార్శ్వాలను అమ్మంగి వేణుగోపాల్ ఎంతో అద్భుతంగా వివరించారు. ఇన్ని విధాలుగా ఈ కవితా సంకలనాన్ని అర్థం చేసుకోవడానికి కారణం అమ్మంగికి తెలంగాణపట్ల ఉన్న అభిమానమే కారణమని చెప్పవచ్చు.

కవిత్వాన్ని కవితా రూపంలోనే పరిశీలించి విశ్లేషించడం ఈ ముందుమాటలలో కనిపిస్తోంది. కవితా పంక్తులు అప్రయత్నంగానే ఉటంకించి వాటి విశ్లేషణల ద్వారా కవికి చిరకీర్తిని తెచ్చే విధంగా అమ్మంగి ముందుమాటలు సాగుతున్నాయి.

### 4.1.3.2. మిన్నంటి ఎగరటానికి : కవితా సంపుటి

దాసోజు జ్ఞానేశ్వర్ రచించిన 'మిన్నంటి ఎగరటానికి' అనే కవితా సంపుటికి **"పరకాయ ప్రవేశం తెలిసిన కవి"**[102] అనే శీర్షికతో అమ్మంగి ముందుమాట రాశారు. దాసోజు జ్ఞానేశ్వర్ తెలంగాణ ప్రాంతానికి చెందిన కవి, రచయిత. ప్రస్తుత కాలంలో అటు పద్య కవిత్వాన్ని ఇటు వచన కవిత్వాన్ని సమదృష్టితో సంధించదగ్గ కవులలో చాలా కొద్దిమందిలో ఈయన ఒకరు. అందుకనే అమ్మంగివారు దాసోజు జ్ఞానేశ్వర్ ని 'తెలంగాణ సవ్యసాచి' అని కొనియాడారు.

జ్ఞానేశ్వర్ తన కవిత్వంలో గతవైభవాన్ని మీటి, పునర్నిర్మాణాన్ని చాటి వస్తు వైవిధ్యాన్ని, శిల్ప వైవిధ్యాన్ని ప్రదర్శించగలిగేవాడుగా అమ్మంగి ఈ ముందుమాటలో పేర్కొన్నారు. అలాగే ఇంతవరకు

[102] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 223

తనకున్న కవితా శక్తిని ఈ **'మిన్నంటి ఎగరటానికి'** అనే కవితా సంపుటితో మరింత గాఢతరం చేయడానికి పాఠకుల ముందుకు వస్తున్నాడని జ్ఞానేశ్వర్ కవిత్వంలో ఉండే గాఢతని గురించి వివరించారు.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఏ ముందుమాటను కూడా ఆసక్తి లేనట్టుగా, వ్యాస శిల్పం లోపించే విధంగా రాయలేదు. ఇది వారి విమర్శక వ్యక్తిత్వానికి నిదర్శనం. వారు ముందుమాట రాసే క్రమంలో కవి పేరు పొందినవాడా లేక అసలే గుర్తింపు లేనివాడా అన్న విషయాన్ని ఏమాత్రం కూడా చూడకుండా కవి రాసిన కవిత్వంలో దాగిన శిల్ప నైపుణ్యాన్ని వెలికి తీసి ఇక్కడ కవి చిత్రించిన శిల్పం బాగుంది అంటూ వివరించి, విశ్లేషించి శిల్ప విమర్శకు ప్రాధాన్యం ఇచ్చారు.

మిన్నంటి ఎగరటానికి కవితా సంపుటిలో ఉన్నటువంటి ప్రాంతీయ అభిమానం గురించి, ప్రకృతి కవిత్వం గురించి, శిల్ప కళకు సంబంధించిన విషయాలను గురించి, కవిత్వంలో దాగిన ప్రతీకారవాదం గురించి, భూగోళంలో ఉన్న శాస్త్రీయ దృక్పథానికి సంబంధించిన కవితలను గురించి అన్ని అంశాలను అమ్మంగి విమర్శనాత్మకంగా పరిశీలించి పాఠకులకు తెలిపే ప్రయత్నం చేశారు. కవితా సంపుటిలో దాగిన ప్రతీ అంశాన్ని కూడా క్షుణ్ణంగా పరిక్షించినట్లు కనిపిస్తుంది. ఈ ముందుమాటలో కవిత్వాన్ని, శిల్పాన్ని పరిశీలించడంలో ఎంత ప్రాముఖ్యతను అయితే కనబరిచారో కవిని గురించి వివరించడంలో కూడా అంతే ఆసక్తిని చూపారు. 'జ్ఞానేశ్వర్ ఉపరితలం మీద పల్టీలు కొట్టే కవి కాదు. అంతర్దృష్టి వున్న కవి' అనడంలో కవి కవిత్వంలో దాగి ఉన్నటువంటి అంతర్దృష్టిని వ్యక్తీకరించిన తీరు అద్భుతంగా ఉంది.

### 4.1.3.3. గంగాళం : కవితా సంపుటి

పప్పుల రాజిరెడ్డి రచించిన 'గంగాళం' కవితా సంపుటికి **"జీవజల"**[103] అనే శీర్షికతో ముందుమాట రాశారు. జీవజల అంటే కుండలో నీరు ఉన్నంతసేపు అది జ్వలిస్తూనే నీటిని చల్లగా చేస్తూ తాగిన వారికి దాహం తీరుస్తుంది. అలాగే ఈ గంగాళం కవితా సంపుటి ఉన్నంతసేపు దానిని చదివిన పాఠకులకు కవితా దాహాన్ని తీరుస్తూనే ఉంటుందనే అర్థం వచ్చేలా అమ్మంగి ఈ శీర్షికను పెట్టారు. కవి రాసిన **'గంగాళం'** అనే కవితా సంపుటిలోని కవిత్వం కొత్త కుండలోని నీళ్ళలాగా

[103] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. 227

పాఠకుల దాహం తీరుస్తుందంటూ కుండకు ఉండే లక్షణాన్ని కవిత్వానికి అన్వయిస్తూ ఈ ముందుమాట రాశారు. ఈ ముందుమాటలో అమ్మంగి గార్డెన్ చైల్డ్ రాసిన 'మానవుడే చరిత్ర నిర్మాత' అన్న గ్రంథంలోని వాక్యాలను ఉదహరిస్తూ రాజిరెడ్డి కవిత్వాన్ని అభినంధించారు.

తెలంగాణ క్షుద్రశక్తుల ఆధీనంలో ఉన్నప్పటి బలహీన క్షణాలలో ఉరితాళ్లకో అగ్నికీలలకో ఆహుతై అమరులైన యువతీ యువకులు తెలంగాణ ఉద్యమంలో ఉప్పెనలు సృష్టించడం మన కళ్ళముందు జరిగిన మనకు తెలిసిన మన చరిత్ర. తెలంగాణ ఉద్యమ చరిత్రను కళ్లకు కట్టినట్లు చిత్రించిన ఈ '**గంగాళం**' కవితా సంపుటి గురించి వివరిస్తూ, కవి ఉద్యమంలో మమేకమై రాసిన కవితా సన్నివేశాలను అమ్మంగి గుర్తు చేశారు.

అమ్మంగి తన ముందుమాటలోనే రాజిరెడ్డి కవిత్వాన్ని పరిశీలించి కవికి కుల వృత్తులపైన, కుల వృత్తికి సంబంధించిన పరిశ్రమల మీద అభిమానం ఉందంటూ, కవితలలో ఉన్న ఎత్తుగడలను ఉదాహరణగా వివరించడమనేది ఒక సూక్ష్మ పరిశీలనగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు తెలంగాణలో కుల వృత్తుల పాచుర్యం అధికంగా ఉండేది, అందులో భాగంగా ఒకప్పుడు వర్ధిల్లిన కుమ్మరి పరిశ్రమ మీద రాజిరెడ్డి ప్రత్యేక అభిమానం చూపాడని చెప్పారు. అందుకే తన గంగాళం శీర్శికలోనే కుండ ప్రస్తావన తీసుకువచ్చినట్లు అమ్మంగి పేర్కొన్నారు.

అమ్మంగి ఈ కవితా సంపుటి ద్వారా పాఠకులకు ఒక భరోసా ఇస్తున్నారు అదే 'రాజిరెడ్డి కవిత్వంతోపాటు ఈ ముందుమాట కూడా అచ్చవుతుంది. అయినా పాఠకులు ముందుగా చదువవలసింది కవి కవిత్వాన్నే' అంటూ కవి రచనా శైలి అద్భుతంగా ఉందన్న విషయాన్ని ముందుగానే పసిగట్టి వివరించారు.

### 4.1.3.4. తట్టెడుమట్టి – పిడికెడు పుణ్యం : కవితా సంపుటి

తెలంగాణ ప్రాంత అభిమానం బలంగా ఉండి వైవిధ్యపూరితమైన కవితలు రాసిన వారు 'వల్సపైడి'. వారి యాభై కవితల వచన కవితా సంపుటికి అమ్మంగి **"పూల లాలిత్యం వజ్ర కాఠిన్యం"**[104] అనే శీర్షకతో ముందుమాట రాశారు.

[104] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 298

ఈ ముందుమాట ద్వారా వల్సపైడికి తెలంగాణ ప్రాంతంపట్ల ఉన్న అభిమానాన్ని ముందుగా వివరించారు. వల్సపైడి రాసినటువంటి కవితా సంపుటాలను మొదట పరిచయం చేస్తూ ఆ కవితలలోని ప్రత్యేకతలు అందులో కవి కవిత్వీకరించినటువంటి అంశాలను గురించి చర్చించడం జరిగింది. ఈ ముందుమాటలో కవిజీవిత విమర్శా లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా రచయిత జీవిత నేపథ్యాన్ని, వ్యక్తిత్వాన్ని వివరిస్తూ కవితా సంపుటి గురించి మాత్రమే కాకుండా కవి రాసిన కావ్యాల ప్రత్యేకత ఏమిటి, కవి రచన దృక్పథం ఏ విధంగా సాగిందనే విషయాలను ముందుగా పరిచయం చేశారు. వల్సపైడి సాహిత్య కృషి కేవలం ఏ ఒక్క ప్రక్రియకు పరిమితం కాకుండా విభిన్న ప్రక్రియలలో సాగిందని చెప్పారు. ఈ విధంగా తెలంగాణా సాహిత్యంకోసం అవిశ్రాంతంగా కృషి చేస్తూ ఉండటం మూలంగా యువ రచయితలు సమాజంపట్ల తమ బాధ్యతను నిర్వహించేందుకు అవకాశం ఉందని వివరించారు.

కవిగా గుర్తింపు తెచ్చుకున్న వల్సపైడి పరిశోధకుడిగా కూడా గుర్తింపు పొందినవారు. ఆయన 'ఆకురాలిన వసంతం-పరిశీలన' అన్న అంశంపైన కాకతీయ విశ్వవిద్యాలయం నుండి 2008 లో ఎమ్. ఫిల్ పట్టా పొందారు. ఆ పరిశోధనా సిద్ధాంత వ్యాసానికి ప్రొఫెసర్. బన్న ఐలయ్యగారు ముందుమాట రాసారు. ఆ ముందుమాటలో ఐలయ్యగారు వల్సపైడి గురించి వివరిస్తూ 'పైడి నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు, తనకున్న ఉత్తమ సంస్కారాన్ని విద్యార్థులలో పెంపొందించడం కోసం నిరంతరం తపిస్తూ సమాజానికి ఉత్తమ పౌరుల్ని అందించడానికి కృషి చేస్తున్న వాడు, కవిత్వమే కాక నాటికలనూ రాసి సృజనాత్మకతకు పదునుబెడుతున్న సాహితీ పిపాసి' అంటూ వాస్తవికత ప్రతిబింబించే మాటలు రాశాడు. ఐలయ్యగారు తెలిపిన విషయాలనే అమ్మంగి కూడా స్వీకరించి రచనా శిల్పంలోని కొత్త రూపాన్ని తనదైన శైలిలో అభివర్ణించారు. వల్సపైడి గురించి ఇద్దరు వివరించిన అంశాలు కూడా అన్వయం చేకూరే విధంగా ఉన్నాయి.

అమ్మంగి తెలుగు సాహిత్య విమర్శలో తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకునేందుకు కృషి చేస్తున్నవారు. ఆయన విమర్శ ఎలాంటిది అంటే విమర్శలో పెద్ద పెద్ద కొటేషన్లు చెప్పి పాఠకులను తికమకపెట్టే విమర్శ కాదు. తన సాహిత్యం మాదిరిగానే ఆయన సాహిత్య విమర్శ కూడా సుతిమెత్తగా ఇతరుల మనసులను ఏమాత్రం కూడా బాధపెట్టే విధంగా ఉండదు. చెప్పే విషయాన్ని కొన్ని

వాక్యాలలో అయినా సంపూర్ణ అర్థం వచ్చే విధంగా చెప్తున్నారు. అందుకే తెలంగాణ కవి అయిన వల్సపైడి కవితాసంపుటిలోని సారాన్ని అంతా కూడా ఈ ముందుమాటల్లో వచ్చే విధంగా వివరించారు.

### 4.1.3.5. నివురు : కవితా సంపుటి

కొత్త కోణంలో ఆలోచించి కవితలు రాసినటువంటి జి. శ్రీరామమూర్తి(నిజం) కవితలకు అమ్మంగి **"సముద్ర స్పర్శ"**[105] అనే శీర్షికతో ముందుమాట రాశారు. కవికి భాషమీద పట్టు ఉందని, నవ పద సృష్టిమీద ఇష్టం ఉందని రచనా శైలిని గురించి వివరిస్తూ, కవిత్వంలోని పద ప్రయోగంలో ఎంతో సృజన శక్తి కనిపిస్తుందని, కవిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి సహృదయ దృష్టితో పరిశీలించి అమ్మంగి పాఠకులకు తెలియజేస్తున్నారు.

కవి సమాజంలో జరుగుతున్న సంఘటనలకు ప్రభావితమై కవిత్వం రాసి తరువాతి తరాల వారిని తన సాహిత్యం ద్వారా మేల్కొలిపే ప్రయత్నం చేస్తారు. అదే ధోరణిలో నిజం గారు కూడా సమాజంలో రామాయణ కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు కూడా దిన దినము వివక్షతకు గురవుతున్న స్త్రీ జాతి దీన స్థితిని చూసి చలించిపోయి వారి అభ్యున్నతికై కవిత్వం రాసారు. ఇలా రాసే క్రమంలో కవిలో ఆశావాద ధోరణి ఎక్కువయింది.

నిజం కవిత్వంలో వైవిధ్యానికి కొరత లేదని స్పష్టంగా తెలియజేస్తున్నారు. కవిత్వమనేది పాఠకుల హృదయాలలో చలనం కలిగించే విధంగా ఉండాలి; లేదా కవిత్వం చదువుతున్నంతసేపూ పాఠకుడు కవితా ప్రపంచంలో చక్కర్లు కొట్టే విధంగా ఉండాలి. అటువంటి శైలి శ్రీరామమూర్తిగారి రచనలలో పుష్కలంగానే ఉంది. వీరి కవిత్వం ఏ ఒక్క అంశానికో పరిమితం కాకుండా నాటి సమాజంలో జరుగుతున్న విభిన్న దురాచారాలను, దురాగతాలను, సంఘటనలను చిత్రిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నారు. కవిత్వం ద్వారా చెప్పదలుచుకున్న నిజాలను నిక్కచ్చిగా చెప్పి సమాజంలోని లోపాలను ఎత్తి చూపడంలో ఏమాత్రం రాజీ పడడం లేదు. అదే విషయాన్ని అమ్మంగివారు కూడా ముందుమాటలో ఇలా ప్రస్తావించారు. 'ఎన్నెన్నో శతాబ్దాల పోరాటాల, త్యాగాల, మహోద్యమాల ఫలితంగా తయారైన ప్రజాస్త్రం ప్రజాస్వామ్యం. కానీ అది ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న ప్రజా

[105] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ – వైవిధ్యం. పుట. సం. 277

శత్రువులైన నియంతల చేతి ఆయుధమయిందంటున్నారు నిజం. అనుదిన పరిణామాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న అనేకానేక సంఘటనల విశ్లేషణ అనంతరం నిజం తేల్చిన నిజమిది'[106] అంటూ కవి ప్రయాణించిన ఉద్వేగపూరిత దారిలోనే అమ్మంగి ప్రయాణించారని చెప్పవచ్చు. ఇక్కడ ఈ వాక్యాలలో మన కళ్ళకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఉద్యమం ఏదో కాదు మన తెలంగాణ ఉద్యమమే. ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సంపాదించుకున్న ప్రజాస్వామ్యం నేటి సమాజంలో ఎక్కడా కనిపించటం లేదని కవి వాపోయారు. ఎంత మంది నుండి స్వాతంత్ర్యం సంపాదించుకున్నా తెలంగాణ రాష్ట్రం మాత్రం ఏదో ఒక రూపంలో తిరిగి మళ్ళీ నియంతల చేతుల్లోకే వెళుతుందని శ్రీరామ మూర్తి చెప్పిన వాక్యాలు అక్షర సత్యాలనే చెప్పవచ్చు.

ఈ అంశాలనే అమ్మంగి ముందుమాటలో విశ్లేషించటం ద్వారా విశాఖ సముద్రంలోని కెరటాలలాగా నిజం సాహిత్య ప్రభావం తెలుగు దేశంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందనే ఆశావాదం పాఠకులలో కూడా కలుగుతుంది. నిజం తేల్చిన నిజాలను అమ్మంగి కూడా అంగీకరిస్తున్నారు. నిజం కవిత్వానికి గుర్తింపు సంపాదించి పెట్టే విధంగా ముందుమాట రాసారు. ఈ ముందుమాట కవితా సంపుటిపై విమర్శనాత్మకంగా చేసే సమీక్షలాగా ఎంతో అద్భుతంగా ఉంది. అమ్మంగి ముందుమాటలు అన్నీ కూడ దాదాపు నైతిక విమర్శన పద్ధతిలోనే సాగాయి.

### 4.1.3.6. విహారం : దీర్ఘ కావ్యం

బి.ఎస్. రాములుగారు రాసిన **"విహారం"** అనే దీర్ఘ కావ్యానికి అమ్మంగిగారు **"పరిణత వాక్యమే కవిత్వం"**[107] అన్న శీర్షికతో ముందుమాట రాశారు. అమ్మంగి కావ్యాలకు ముందుమాటలు రాయడంలో కొంత ప్రత్యేకతను కనబరుస్తారు. వారు రాసినటువంటి ముందుమాటలు, పీఠికలు విమర్శా ప్రస్థానంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. ముందుమాటలోనే అమ్మంగి కావ్యం యొక్క ఆంతర్యం మొత్తాన్ని కళ్లకు కట్టేవిధంగా తెలుపుతున్నారు. అలాగే కావ్యాన్ని తప్పకుండా చదవాలనే ఆసక్తి పాఠకులలో కలిగే విధంగా విశ్లేషణ సాగుతుంది.

---

[106] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ – వైవిధ్యం. 2018. పుట. సం. 283.

[107] అదే. పుట. సం. 294

సాధారణంగా విమర్శకుడు కావ్యాలకు ముందుమాట రాయాలంటే ముందుగా ఆ కావ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆ కావ్యంలో ఉన్న తత్వాన్ని అర్థం చేసుకుని, అందులోని భావాన్ని, తాత్పర్యాన్ని పాఠక లోకానికి తెలిపేందుకు ప్రయత్నించాలి. కావ్యంలో ఉన్నట ప్రత్యేకతలను ముందుమాట ద్వారానే తెలిసేలా చేయాలి. అలా చేయాలి అంటే విమర్శకుడికి కావ్యాన్ని నిశితంగా పరిశీలించే గుణం ఉండాలి. భావాన్ని వ్యక్తీకరించే సామర్థ్యం ఉండాలి. ఈ లక్షణాలు అమ్మంగిలో కొంత ఎక్కువగానే ఉన్నాయని చెప్పాలి. అందుకే బి.యస్. రాములు విహారం దీర్ఘ కావ్యంలో ఉన్న ప్రత్యేకతలు ముందుమాటలోనే వ్యక్తం అయ్యేలా కావ్యం చదవాలనే ఆసక్తి పెరిగేలా రాసారు. కావ్యానికే గుర్తింపు తెచ్చే కోణంలో ఈ ముందుమాట సాగిందనడంలో సందేహంలేదు.

కావ్యానికి ముందుమాట రాయమనగానే కేవలం కావ్యం గురించి మాత్రమే వివరించకుండా కావ్యకర్త సాహిత్య జీవన ప్రయాణాన్ని మొదట తెలిపి తాను ముందుమాట రాసే కావ్యంలో మిగతా కావ్యాలలో కవి దృక్పథం ఏ విధంగా ఉందనే విషయాన్ని విశ్లేషించారు. బి.యస్. రాములు ఒక ప్రత్యేకమైన వ్యక్తి అని, అన్వేషణ ఆయనలో ఉన్న శక్తి అని చెప్పడంలో ఇతర ఆలోచనలకు తావు లేకుండా రాములు గారు సాహిత్య శక్తిగా ఎదిగిన క్రమం అర్థమవుతుంది. రాములుగారు క్రియాశీల రచయితగా విరసంలో పాల్గొని దానికే పరిమితం కాకుండా ఒక సమూహం నుండి మరొక సమూహంలోకి ప్రయాణం చేస్తూ వచ్చారు కనుకనే ఎప్పుడు ఎక్కడ వ్యక్తివాది కాకుండా 'సంఘం శరణం గచ్ఛామి' అన్న ప్రవచనాన్ని జీవలక్షణంగా చేసుకుని ముందుకు సాగిపోతూ తర్వాతి తరాలకు ఆదర్శంగా నిలిచి తాత్విక నాయకుడుగా ఎదిగిన క్రమాన్ని తెలియజేశారు.

ఆధునిక సాహిత్యంలో మారుతున్న సమాజానికి అనుకూలంగా తెలుగు సాహిత్యం వివిధ ప్రక్రియల ద్వారా నూతన మార్పులను కాంక్షిస్తూ సమాజ ప్రయోజనానికి, శ్రేయస్సుకు తోడ్పడుతుంది. ఇలాంటి క్రమపరిణామంలో తెలుగు సాహిత్యంలో బి.యస్. రాములుగారు తన రచనల ద్వారా సమాజంలోని ఏదో ఒక ఇతివృత్తాన్ని, సంఘటనని తన కవితా వస్తువుగా ఎంచుకుని ఆ సందేశాన్ని ప్రజలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. 'విహారం' దీర్ఘ కావ్యానికి రాసిన ఈ ముందుమాటను అమ్మంగి విమర్శనా వ్యక్తిత్వానికి ఒక మచ్చుతునకగా భావించవచ్చు. బి.యస్.

రాములుగారి తాత్విక దృక్పథం గురించి వివరించే క్రమంలో ఆయన విమర్శనా శైలి ఎలా ఉందనే విషయం మనకు స్పష్టమవుతుంది.

ప్రపంచంలో మేధావులుగా చెప్పుకునే వాళ్ళు చాలామందే ఉన్నారు. సగటు మేధావి మనస్తత్వం సగటుజీవి మనస్తత్వానికి పూర్తిగా భిన్నంగా ఉంటుందన్న కవి అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. పేదల కడగండ్లపట్ల సానుభూతి వర్షించని మేధోపజీవుల మనస్తత్వాన్ని అమ్మంగి విమర్శించాడు. ఇదే కోణం అమ్మంగి గారి దృష్టి సంఘంపట్ల ఎలా ఉందనే విషయాన్ని తెలియజేస్తుంది. ప్రతిఒక్క తాత్వికుడు తనదైన ఆలోచనా శక్తితో తత్వశాస్త్రాన్ని బలోపేతం చేస్తున్నారని తత్వశాస్త్ర దృష్టితో సమాజహితం కోరే వ్యక్తులను గురించి ఇందులో వివరించాడు. ఈ విధమైన తత్వాలను బోధించే వారిలో ఖలీల్ జిబ్రాన్ ఒకరని చెప్పాడు. అందుకే ఖలీల్ జిబ్రాన్ తత్వాలు, మెరుపులు బి.యస్. రాములు గారి విహారంలో కనిపిస్తాయి వినిపిస్తాయని వివరించిన తీరు అద్భుతంగా అనిపిస్తుంది.

బి.యస్. రాములు తాను కొన్ని తాత్విక గ్రంథాలు రచించానని చెప్పుకున్నటువంటి సందర్భాలను ఉదాహరణల ద్వారా వివరించారు అమ్మంగి. కవిని పరిణత మానవునిగా చేసేది తత్వశాస్త్రం, ఆ తత్వశాస్త్రం ప్రతిపాదించేటువంటి ఉత్తమ సాహిత్య విలువలు బి.యస్. రాములు కావ్యాలలో ఉన్నాయన్నారు. విశ్వనాథుడు చెప్పినటువంటి 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్న ప్రతిపాదన బి.యస్. రాములుగారి సాహిత్యంలో చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఈ విధంగా విహారం దీర్ఘ కావ్యానికి అమ్మంగి వేణుగోపాల్ గారు రాసిన ముందుమాట ద్వారా రాములుగారి కావ్య రచనా వ్యక్తిత్వమనేది పరిణతి పొంది కవితా సంపుటి అంతా సాహిత్య విలువలతో నిండి ఉన్నదనే భావన పాఠకులలో కలుగుతుంది. అందుకే 'పరిణత వాక్యమే కవిత్వం' అంటూ కవిత్వానికి ఒక కొత్త నిర్వచణాన్నిచ్చారు అమ్మంగి. ఇది ఎవరి కవిత్వానికైనా వర్తిస్తుంది.

### 4.1.4. పద్యకవితా సంపుటికి రాసిన ముందుమాట

అమ్మంగి వేణుగోపాల్ గారు వచన కవితా సంపుటాలకు మాత్రమే కాకుండా పద్యకవితల సంపుటికి కూడా ముందు మాట రాసారు. **"కృషీవలుని పంట"**[108] అనే శీర్షికతో రంగారెడ్డి జిల్లా

[108] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 345

ధారూరు మండలానికి చెందిన మేటికవి శ్రీ దోరవేటిగా గుర్తింపు పొందిన వి. చెన్నయ్యగారి **'అంజలి–2'** అనే పద్యకవితా సంపుటానికి ముందుమాట రాసారు. అమ్మంగి పద్యకవితా సంపుటానికి రాసిన మొదటి ముందుమాటని చెప్పవచ్చు.

'అంజలి–2' పద్యకవితా సంపుటికి ముందుమాట రాయడానికంటే ముందు అమ్మంగి పద్యకవిత్వాన్ని రాయాలంటే ఉండాల్సిన ప్రధాన లక్షణాలను గురించి మొదటగా వివరించారు. సంప్రదాయ కవిత్వం రాసేవారికి ఉండాల్సిన లక్షణాలలో ప్రధానమైన భాషా పాండిత్యం, ఛందోజ్ఞానం, అలంకార శాస్త్ర పరిచయం తప్పనిసరి అన్నారు. అర్థగౌరవంతో కూడిన కవిత్వం రాయటానికి సమకాలీన జీవన చైతన్యం ఉండాలంటూ పద్యకవితా రచనకు ఉండాల్సిన లక్షణాలను ఎంతో చక్కగా వివరించారు. అమ్మంగి పద్యకవితా లక్షణాలను అద్భుతంగా వివరించినప్పటికి వారు ఇంతవరకు పద్యకావ్యాన్ని రాయలేదు. బహుశా నేటి ఆధునిక సాహిత్యంలో పద్యంకంటే వచనంలోనే భావ ప్రసరణ బాగుంటుందని విశ్వసించి ఉండవచ్చు. అయితే వారు హైస్కూల్ లో చదివే రోజుల్లో అప్పుడప్పుడు పద్యకవిత్వం రాశారు.

దోరవేటి నేటి ఆధునిక కాలంలో పద్యకవిత్వంలో ఆరితేరిన వారు. ఇప్పటికి ఆయన అనేక ప్రక్రియలలో రచనలు చేసినా పద్యకవిత్వంలోనే ఎంతో ప్రఖ్యాతిపొంది ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. దోరవేటి అంజలి సంపుటిలో ఏ ఒక్క అంశానికో పరిమితం కాకుండా భిన్న రకాలైన ఇతివృత్తాలను, సామాజిక అంశాలను తన పద్యం ద్వారా వెలిబుచ్చే ప్రయత్నం చేశారు. ప్రాచీన కాలంలోని కవులు, ఆధునిక కవులు, ఉద్యమకారులను గురించి వివరిస్తూ, దైవ స్తోత్రాలను కూడా తమ కవిత్వంలో ప్రస్తావించారు.

దోరవేటి కవిత్వంలో చిత్రించిన ప్రముఖుల జీవిత చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నా సామల సదాశివ గారి గూర్చి రాసిన 'యాది' ఇతివృతం సమగ్ర చిత్రాన్ని పొందలేకపోయిందని సహృదయపూర్వకంగా తెలిపారు. ముందుమాటలో ఈ విషయాన్ని ప్రస్తావించటం మూలంగా పాఠకులు కూడా ముందుమాట రాసిన విమర్శకుడు కావ్యంలోని అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి ప్రతిపాదించారని విశ్వసించడానికి అవకాశం ఉంది.

దోరవేటి కాళోజీ కవిత్వంలో మౌఖిక స్వభావంతో అలరారే జానపద ధోరణి ఉందని పద్యరూపంలో చెప్పిన విషయాన్ని అమ్మంగి ఎంతో అద్భుతంగా పాఠకులకు చేరవేసారు. దోరవేటిలో ఉన్న తెలంగాణ ప్రాంతీయ భావాన్ని, వాదాన్ని అమ్మంగి కూడా సహృదయంతో స్వీకరించి చిత్రించిన విధానం బాగుందని మెచ్చుకున్నారు. దోరవేటి కవిత్వంలో సూక్తి ప్రధానమైన వాక్యాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. "సుభాషితాలు విరివిగా వుండే శతక సాహిత్యం యువతరానికి దూరం కావటం వల్ల నాగరికులుగా మారలేకపోతున్న క్రమాన్ని గుర్తించవచ్చు" అంటూ అత్యాధునిక సమాజంపట్ల అమ్మంగి అసంతృప్తిని వ్యక్తం చేశారు.

మనిషి సాంఘికజీవిగా మారటానికి సంస్కారవంతమైన మాటతీరు అత్యవసరమని తెలిపిన కవి భావాలను అమ్మంగి ఎంతో స్పష్టంగా ముందుమాట ద్వారా వ్యక్తీకరించడం సృజనాత్మకంగా ఉంది. ఈ విధంగా పద్యకవిత్వంతో సమాజానికి హితము చేకూర్చే కావ్యరచన చేస్తున్న దోరవేటి సాహిత్య కృషి వారికి సత్ఫలితాన్నివ్వాలని కోరుకుంటూ హృదయపూర్వకంగా కవిని అభినందిస్తున్నారు.

### 4.1.5. పరిశోధన గ్రంథానికి రాసిన ముందుమాట

అమ్మంగి వేణుగోపాల్ కథా కావ్యాలకు, నవలలకు, కవితా సంపుటాలకు, పద్యకావ్యాలకు అనువాద గ్రంథాలకు ముందుమాటలు రాసినట్లుగానే విశ్వవిద్యాలయాలలో పరిశోధన జరిగి ప్రచురితమయిన సిద్ధాంత గ్రంథానికి కూడా ముందుమాట రాసారు. **'వేమన కబీరు కవిత్వం–తులనాత్మక పరిశీలన'** అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టర్ జ్యోతిరాణి గారు పరిశోధన గ్రంథాన్ని వారు పుస్తక రూపంలో ప్రచురించారు. ఆ పరిశోధన గ్రంథానికి అమ్మంగి వేణుగోపాల్ గారు **"సమాంతర సాహిత్యంలో సమస్కంధులు"**[109] అనే శీర్షికతో సమగ్రమైన ముందుమాట రాశారు. వేమన కబీరులు భిన్న కాలాలలో వేరే వేరే ప్రదేశాలలో జన్మించినప్పటికి ఇద్దరి సాహిత్య కృషి ఒకేవిధంగా ఉంది. అందుకే పరిశోధకురాలు జ్యోతిరాణి వీరిద్దరి సాహిత్యాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి ఎంచుకుని పరిశోధనలో కృతకృత్యులయ్యారు.

[109] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 113

సమాజంలో ఉన్న మతాలు, తెగల దురాచారాలను విమర్శిస్తూ ఆధ్యాత్మికవాదానికి బలం చేకూరుస్తూ సంఘంలోని రుగ్మతలను రూపుమాపడానికి నిత్యం కృషి చేసిన కబీరుదాసు ఉత్తరప్రదేశ్ లోని పవిత్రమైన గంగానది ఒడ్డున గల వారణాసిలో జన్మించారు. పుట్టుకతోనే అనాథ అయిన కబీరును ముస్లిం దంపతులు పెంచారు. ఈయన తన జీవన ప్రయాణంలో భారతీయ తత్వశాస్త్రానికి కొత్త రూపురేఖలు ఇచ్చారు. కబీరుదాసు ఆ కాలంలో ఉత్తర భారతదేశంలో హిందువులు, ముస్లింల మధ్య జరుగుతున్న మత వ్యతిరేక పోరాటాలను నిర్మూలించేందుకు ఎంతో కృషి చేశారు. ఈ విధమైన ఆధ్యాత్మిక భావనను, జ్ఞాన సంపదను ప్రజలలో నింపిన కబీరుదాసు క్రీ.శ. 1518లో మరణించారు. ఈ కబీరుదాసు హిందీలో భోదించిన సూక్తులు నేటి ఆధునికతకు అద్దంపట్టే విధంగా ఉన్నాయి. కబీరుదాసు తరువాత జన్మించిన వేమన కూడా సమాజ హితం కోరి పద్యాలు రాసారు.

ప్రజాకవిగా, సంఘసంస్కరణాభిలాషిగా, కులాన్ని, మతాన్ని నిరసించిన మానవతావాదిగా తెలుగు భాషకు ఎనలేని సేవచేసిన మహనీయుడుగా తెలుగువారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన కవి వేమన. నీతిని వ్యంగ్యంగా చెప్తూ సమాజాన్ని చైతన్యవంతం చేసిన ప్రభోధకుడు ఆయన. తెలుగువారు మాత్రమే కాకుండా ప్రపంచ సాహితీవేత్తలందరితో మెప్పింపబడిన వేమన సాహిత్యాన్ని తులనాత్మక పరిశోధన చేయడానికి పూనుకున్నందుకు పరిశోధకులు ధన్యులు.

నీతి పద్యాలలోని జీవిత సత్యాలు ఎంత సార్వజనీనమైనవిగా, సార్వకాలికమైనవిగా భావింపబడుతున్నా, పై ప్రజాకవులు సమకాలీన స్థితిగతుల ఆధారంగానే వాటిని బోధిస్తూ వచ్చారంటూ సమాజ హితంకోరే ఆదర్శ కవులుగా వారిని గౌరవించారు అమ్మంగి. అలాగే వారిద్దరూ మధ్యయుగాల రాచరిక వ్యవస్థకు చెందిన వారని, ఇద్దరి కాలాలలోని ప్రజా జీవితంలో కొద్దిపాటి తేడాలే తప్ప మౌలికమైన తేడాలుండకపోవచ్చునని వివరించాడు.

ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, మత, తాత్విక పరిస్థితుల రీత్యా వేమన కబీరుల మధ్య తులనాత్మక పరిశోధనకు నూటికి నూరుశాతం అవకాశాలున్నాయని వివరించిన తీరులో అమ్మంగి తులనాత్మక పరిశోధన లక్షణాలను ఎంత సమగ్రంగా అవగాహన చేసుకున్నారో అర్థమవుతుంది. అలాగే వేమన కబీరులు ఇద్దరు సర్వమానవ సౌభ్రాతృత్వం కోరినవారు కావడం

మూలంగా డాక్టర్ జ్యోతిరాణిగారు వీరిని యుగ పురుషులని ప్రస్తుతించడం కేవలం స్వభావోక్తి మాత్రమేనని అమ్మంగి వ్యాఖ్యానించడం ఎంతో సమంజసంగా ఉంది.

విశిష్టాద్వైత మతప్రవక్త రామానుజాచార్యుల నుండి రామానందుడు రామనామ తారక మంత్రోపదేశం పొందాడని అంటారు. ఉత్తర భారతదేశంలో దాన్ని ప్రచారం చేసిన రామానందుని నుండి కబీరు ఆ భావాలను పొందాడని భావిస్తారు. అందుకే కబీరు రామ భక్తుడయినాడని చెప్తారు. కబీరు రామనామస్మరణ చేస్తే, లంబికా యోగి శిష్యుడైన వేమన శివనామస్మరణ చేస్తాడు. ఇందులో వైష్ణవ, శైవ భేదాలేవి లేవని కూడా అమ్మంగి వివరించడం ఉత్తమ పరిశీలనగా చెప్పవచ్చు.

తులనాత్మక పరిశీలనకోసం దేన్నిబడితే దాన్ని పరిశోధనా అంశంగా స్వీకరించటానికి వీలుండదు. ఆ అంశాల మధ్యన పొంతన ఎంతఉంటే పరిశోధనకు అంతగా అవకాశం ఉంటుంది. 'ఒక యుగములోని కవులను గాని, ఒక ప్రక్రియను అవలంబించిన కవులనుగాని, ఒకే వస్తువును స్వీకరించిన కవులనుగాని తారతమ్య నిరూపకముగా సమాలోచన చేయుట ఉచితము. వివిధ భాషా కవులలోని సామ్య వైషమ్యముల పరిశీలన కూడ కావ్య ప్రమాణ నిర్ణయమునకు తోడ్పడును'[110] అని ఎస్వీ. రామారావుగారు తులనాత్మక విమర్శ నిర్వచనం ఇచ్చారు.

వేమన, కబీరులు ఇద్దరూ కవులే. కావ్యం, నాటకం కాకుండా ముక్తాకాలు అనదగ్గ శతక పద్యాలను వేమన రాయగా, దోహా, సాఖీ వంటి ముక్తక రూపాలలో కబీరు సందేశాలను అందించారు. ఇద్దరు సామాన్య పాఠకులుగా శ్రోతలను ఉద్దేశించే తమ కవిత్వాన్ని చెప్పారు. ఇద్దరి కవిత్వ భాష సరళంగా, అపండిత శైలిలోనే సాగింది. ఇద్దరి కవిత్వమూ ఆశు సంప్రదాయానికి చెందిందే కావటం గమనార్హం. ఇద్దరూ కూడా మత సంబంధమైన దురాగతాలమీద, సంఘంలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాల మీద విరుచుకుపడ్డవారు కావటం మరో అనుకూల అంశం. ఇద్దరి మధ్య ఉన్న సారూప్య సంబంధాన్ని సమతౌల్యాన్ని వివరించి పరిశోధనకు అనుకూలమైన అంశాన్నే పిహెచ్. డి పట్టాకోసం గ్రహించినట్లు అమ్మంగి సమర్థించారు.

హైదరాబాదులో, ఇతర తెలంగాణ జిల్లాలలోని పౌరులలో చిన్నప్పటి నుంచే మాతృభాషతో పాటు ఇతర భాషల బీజాలు పడతూ ఉంటాయి. మెదళ్ళలో తెలుగు – ఉర్దూ, తెలుగు – హిందీ,

---

110 రామారావు. ఎస్వీ, తెలుగులో సాహిత్య విమర్శ–అవతరణ వికాసం. పుట. సం. 10.

మౌఖిక నిఘంటునిర్మాణం అసంకల్పితంగా సాగుతూ ఉంటుందని అందులో నుండి ఒక అనువాదకుడు ఎదుగుతూ వుంటాడని వివరించారు. దీనితో అనివార్యంగా వ్యక్తిలో తులనాత్మక స్వభావమనేది ఏర్పడుతుందంటూ తులనాత్మక పరిశోధనకు ఉపయోగపడే కవిత్వ పరిశోధనా బీజాలను గురించి ఎంతో స్పష్టంగా విమర్శకులు వివరించడం జరిగింది. అంటే తెలంగాణ ప్రాంతం బహు భాషల నిలయమయిన కారణంగానే పరిశోధకులలో తులనాత్మక పరిశీలనకు బీజాలు మొలకెత్తుతున్నాయని వివరించిన క్రమం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

అలాగే జన్మరీత్యా ఒక ప్రాంతానికి చెందినవాడు మొదట భారతీయుడుగా, ఆ తర్వాత విశ్వమానవుడుగా రూపొందటానికి జీవితంలో ఉన్న సమానత్వం ఒక ప్రాతిపదిక అవుతుంది. పరస్పర వ్యవహారం మూలంగా అవగాహన మూలంగా ఏర్పడే జ్ఞానం సమన్వయ దృక్పథాన్ని ఏర్పరుస్తుందని, అదే తులనాత్మక జ్ఞానానికి పునాదులు వేస్తుందని జ్ఞాన సమన్వయ దృక్పథం గురించి విశ్లేషించారు.

తులనాత్మక పరిశోధన చేసే పరిశోధకులకు తాము పరిశోధనాంశంగా స్వీకరించే అంశాల మీద, ప్రక్రియల మీద అధికారముండాలి. ఎందుకంటే పరిశోధకులకు వారు ఎంచుకున్న అంశంపై అధికారం లేకపోతే ఆ పరిశోధన ఉన్నతస్థాయి విలువలను అందుకోలేక అథమస్థానం పొందుతుంది. అప్పుడు ఆ సిద్ధాంత గ్రంథంలో సూత్రీకరించిన అంశాలు కూడా నైతిక విలువలను కోల్పోతాయి.

తులనాత్మక పరిశోధనలో పైకి ఒకటే అనిపించిన రెండు సమాన స్థాయి ఉప అంశాలు అందులో అంతర్గతంగా ఉంటాయి. ఈ అంశాలకు సంబంధించిన సాదృశ్య వైదృశ్యాలను విశ్లేషించి వివరంగా చెప్పగలిగినప్పుడే ఆ పరిశోధన రాణిస్తుంది. అట్లా స్థాపించబడ్డ సిద్ధాంతం సాహితీ క్షేత్రంలో నిలిచిపోవటమే కాక, భవిష్యత్తులో దాన్ని ఆధారంగా చేసుకుని మరిన్ని పరిశోధనలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిశోధన మెలకువలను వివరించాలంటే విమర్శకుడికి పరిశోధనపట్ల స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. అమ్మంగికి పరిశోధనపట్ల సిద్ధాంత గ్రంథ రచనపట్ల సమగ్ర అవగాహన ఉన్నది కాబట్టే పరిశోధనా గ్రంథానికి ఉండాల్సిన

లక్షణాలను గురించి చెప్పగలిగారు. అమ్మంగి విమర్శకుడుగానే కాకుండా పరిశోధకుడుగా కూడా తనదైన ముద్ర వేసారు.

### 4.1.6. అనువాద గ్రంథాలకు రాసిన ముందుమాటలు

జలజం సత్యనారాయణ హిందీలో జయశంకర్ ప్రసాద్ రాసినటువంటి “ఆంసూ”(కన్నీరు) అనే కావ్యాన్ని తెలుగులోకి **“వేదన”** అనే పేరుతో అనువదించారు. ఆ కావ్యానికి అమ్మంగి **“మూలానికి ప్రాణం పోసిన అనువాదం”**[111] అనే శీర్షికతో ముందుమాట రాయడం జరిగింది.

ఈ ముందుమాటలో అమ్మంగి తెలంగాణ ప్రాంతాన్ని ‘బహుభాషా సమాజాల సంగమం తెలంగాణ’ అని పేర్కొన్నారు. ఎందుకంటే ముస్లింలు, మహారాష్ట్రులు, కన్నడిగులు తెలంగాణలోని అన్ని జిల్లాలలోను ఇరుగుపొరుగుగా ఉంటారు. హైదరాబాదులో అయితే గుజరాతీలు, మార్వాడీలు, బెంగాలీలు, తమిళులతో పాటు హిందీ ధారాళంగా మాట్లాడేవారు కూడా ఉంటారు. అందుకే హైదరాబాదుకు చిన్న భారతదేశం అనే పేరు వచ్చింది. ఈ వాతావరణంలో పుట్టిపెరిగిన ప్రతీ తెలంగాణ పౌరుడిలో బాల్యం నుంచే ఒక అనువాదకుడు ఉంటాడంటూ తెలంగాణ ప్రాంతం గురించి తెలంగాణ గురించి తెలంగాణ రాజధాని హైదరాబాద్ ప్రాంతం గురించి ఈ ముందుమాటలో వివరించడం జరిగింది. అమ్మంగి అన్నట్లు హైదరాబాద్ నిజంగానే బహుభాషా సమాజాల సంగమం. అందుకే ఈ ప్రాంతంలో పుట్టినటువంటి జలజం సత్యనారాయణగారిపైన ప్రాంత ప్రభావం ఉండడం వల్లనే ఆయన హిందీ కావ్యాన్ని అనువాదం చేయగలిగారని పేర్కొన్నారు.

స్వేచ్ఛానువాదం సులభం అనే మాట ఒకటుంది. కాని ఇది నిగ్రహంతో కూడుకున్న పని. మూలకవిని అర్థం చేసుకోవడం ఒక ఎత్తయితే లక్ష్యభాషలోకి స్వేచ్ఛానువాదం చేస్తున్నప్పుడు నేలవిడిచి సాము చేయకుండా జాగ్రత్తపడాలి. అలాగని కవితా మూల్యాలులేని పొడి అనువాదం చేస్తే తేలిపోతుంది. కాబట్టి కవితా మూల్యాలకు మూల వ్యక్తిత్వానికి భంగం వాటిల్లకుండా తన స్వభావసిద్ధమైన కవితా లౌల్యం అనువాదితాంశాలలోనికి ప్రవేశించకుండా జాగ్రత్త పడ్డప్పుడే ఆ అనువాదం సఫలమవుతుంది. సత్యనారాయణగారు కొన్ని నిర్దిష్ట సామాజిక లక్ష్యాలతో కృషి చేస్తున్నవారు కావటం వల్ల సిద్ధాంతాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు.

---

[111] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 336

సత్యనారాయణగారు ఆంగ్లంతోపాటు హిందీ, ఉర్దూ భాషలలో కూడా నిష్ణాతులు. అందుకే ఆయన జయశంకర్ ప్రసాద్ హిందీలో రచించిన "ఆంసూ"(కన్నీరు) కావ్యాన్ని 'వేదన' పేరుతో తెలుగులోకి అనువాదం చేసి మూల గ్రంథానికి ప్రాణం పోశారని శీర్షిక ప్రాయంగా ఎంతో వివరంగా అమ్మంగి కావ్య ప్రత్యేకతను, అనువాదకుడి గొప్పతనాన్ని, సామర్థ్యాన్ని వివరించడం జరిగింది. కవి అనువాదంలో వర్తమానం నుంచి గతంలోకి వెళ్లి కథనం చేయడమనేది ఒక పద్ధతి. ఇది సాధారణంగా కథకులు, నవలా రచయితలు అనుసరించే పద్ధతి. అలాంటి పద్ధతినే జయశంకర్ ప్రసాద్ అనుసరించాడని అమ్మంగి మూల గ్రంథకర్త కావ్య రచనాపద్ధతిని గురించి వివరించారు. ఆ విధానం ఆధారంగానే అనువాదకుడు మూల గ్రంథానికి గుర్తింపు తెచ్చారని వివరించారు.

'వేదన' కావ్యంలోని కొన్ని సంఘటనలు సన్నివేశాలు నాటక రూపానికి నిదర్శనంగా ఉన్నందున అమ్మంగి వేదన కావ్యాన్ని నాటకంగా భావించాడు. ఈ కావ్యంలోని కొన్ని వాక్యాలు రాయప్రోలు సుబ్బారావు ప్రతిపాదించిన 'అమలిన శృంగారానికి' సిద్ధాంతానికి వర్తించేవిగా ఉన్నాయని వివరించారు. ఈ వాక్యాలను పరిశీలిస్తే విమర్శకునిగా అమ్మంగి విమర్శనా దృష్టి ఏవిధంగా ఉందో గ్రహించవచ్చు. వేదన కావ్యానువాదం ఎక్కువగా మూలవిధేయంగా సాగిందని, అనువాదకుడు మూల కవిని గౌరవించాడని అమ్మంగి పేర్కొన్నారు.

కవిత్వ అనువాదం ఎప్పుడూ క్లిష్టమైన కార్యమని అనువాదకుడిగా గుర్తింపు తెచ్చుకున్న అమ్మంగికి బాగా తెలుసు. వేదన కావ్యానువాదం సూర్యరశ్మిని వడబోసి వెన్నెల కాసినట్లుగా సాగిందనే అతి మధురమైన పంక్తులలో ఈ అనువాద కావ్య వైశిష్ట్యాన్ని అమ్మంగి వర్ణించారు. అనువాదకుని గొప్పతనాన్ని గురించి వివరిస్తూ "A Translation is no translation. Unless it gives the music of a poem along with the words of it". 'అనువాదం అనేది మూలంలోని మాటలకు దగ్గరగా ఉండి, కవితలోని సంగీతాన్ని వినిపించకపోతే అది అనువాదమే కాదు' అని 'Millington' అనే పండితుడి నిర్వచనం. ఇవి అనువాదం విషయంలో సత్యనారాయణగారి 'వేదన' కావ్యానికి వర్తిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అనువాదం ద్వారా జలజం సత్యనారాయణగారు జయశంకర్ ప్రసాద్ కు యోగ్యమైన నివాళిని సమర్పించారని అమ్మంగి తన సహృదయ విమర్శనా దృక్పథాన్ని చివరి వాక్యాలలో వివరించాడు.

అమ్మంగి వేణుగోపాల్ కవి, పరిశోధకుడు, అనువాదకుడు అయినందున ఈ అనువాద గ్రంథానికి ఇంత అద్భుతంగా ముందుమాట రాయగలిగారు. ఏ విమర్శకుడు అయిన అనువాద గ్రంథాల విషయంలో సాధ్యమైనంతవరకు లోపాలను ఎత్తిచూపే ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే అనువాదకుడు మూల గ్రంథంలో ఉన్న భావాలు అనువాద గ్రంథంలో స్పష్టంగా వివరించలేకపోవడమే అందుకు ప్రధాన కారణం. కానీ అమ్మంగి ముందుమాటలో అలాంటి కువిమర్శలకు స్థానం కల్పించకుండా తాను ముందుమాట ద్వారా అనువాదకుడిని, అనువాద గ్రంథాన్ని అభినందించారు.

రచయిత తన రచనలో అవలంభించిన రచనా శైలి విధానాన్ని పాఠకులకు తెలియజేస్తూ, రచయిత విధి విధానాలను నిరూపించడానికి ప్రయత్నించినట్టుగా ముందుమాటలలో కనిపిస్తుంది. ఒక ప్రణాళికలాగా అమ్మంగి ప్రతి ముందుమాటలో కూడా ఆరంభంలో కవి గురించి, కవి రచనా వ్యక్తిత్వం గురించి వివరించిన తరువాతనే కవి రచించిన కావ్య ప్రస్తావన చేస్తున్నారు. ఈ లక్షణాన్ని ఒక ప్రత్యేకమైన విమర్శనా కోణంగా చెప్పుకోవాలి. విమర్శకుడు ముందుగా కవిని గురించి వివరించిన తర్వాత కావ్య ప్రస్తావన చేయాలనే సిద్ధాంతాన్ని అమ్మంగి తన మాటల ద్వారా దృఢపరుస్తున్నారు.

## అధ్యాయం–5

# అమ్మంగి వేణుగోపాల్ – విమర్శక వ్యక్తిత్వం

### 5.0. పరిచయం

ప్రతి విమర్శకునికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. రచయిత ఆత్మను, అతని రచనలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకునే సహృదయత విమర్శకునికి ఉండాలి. అలాంటి సహృదయ దృష్టి అమ్మంగిలో పుష్కలంగా ఉంది. భారతీయ ఆలంకారికులు సహృదయతకు ప్రాధాన్యతను ఇచ్చినట్లుగానే అమ్మంగి తన విమర్శలో సహృదయ దృక్పథానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. అనౌచిత్యాలను లేదా దోషాలను పేర్కొంటూనే, కవి/రచయిత ఆత్మను దర్శించి, దాన్ని పాఠకుల చెంతకు చేర్చడంలో విమర్శకుని సహృదయత వెల్లడవుతుందని చెప్పవచ్చు.

అమ్మంగి వేణుగోపాల్ గారి విమర్శక వ్యక్తిత్వం వైవిధ్యంతో కూడినట్టిది. కవి కోణం నుంచి కాక రచనా కోణం నుండి సహృదయ భూమికతో సాహిత్య విమర్శ సాగాలని భావించే సహృదయ విమర్శకుడు అమ్మంగి. "సాహిత్యానికి ఒక అంచు కవీ–వేరొక అంచు సహృదయుడూ. ఈ రెండు బిందువులూ ఒక చోటుకి వచ్చినప్పుడు సహృదయ చక్రమేర్పడుతుంది. సాహిత్యానుభవమంతా దీనిలో అంతర్భవించిందే. ఇదే సరస్వతీ తత్వము'[112] అని కోవెల సుప్రసన్నాచార్య పలికిన వాక్యాలు అక్షర సత్యాలై అమ్మంగి సహృదయ దృక్పథానికి సారథియై నిలుస్తున్నాయి. అమ్మంగి విమర్శక వ్యక్తిత్వాన్ని పరిశీలించాలంటే వ్యాసాలలో విమర్శన శైలిని, పరిశోధనాత్మక దృష్టిని భాగాలుగా విభజించి పరిశీలించాలి.

1. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో కవితాత్మక శైలి.
2. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో విశ్లేషణ.
3. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో పరిశోధనాత్మక దృష్టి.
4. వివిధ ప్రక్రియలో కనిపించే పరిశీలన దృష్టి.
5. ప్రాంతీయ సాహిత్య విమర్శ.

---

[112] సహృదయ చక్రము. సుప్రసన్నాచార్య. కోవెల, భూమిక.

## 5.1. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో కవితాత్మక శైలి

అమ్మంగి గారు కవిగా ప్రసిద్ధి చెందినవారు. కవిగా వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణరావు పురస్కారంతో, తెలుగు విశ్వవిద్యాలయం 'ప్రతిభా' పురస్కారంతో, తెలంగాణ సారస్వత పరిషత్తువారు 'డాక్టర్. సింగిరెడ్డి నారాయణరెడ్డి(సినారె)' సాహిత్య పురస్కారంతోనూ సత్కరించారు. అమ్మంగి విమర్శన సంబంధమైన వ్యాసాలలో ప్రధానంగా కవిత్వ శైలి కనిపిస్తుంది. చేకూరి రామారావు వంటి విమర్శకులు 'విమర్శ వ్యాసాలలో కవిత్వం ఉండకూడదని' పేర్కొంటూ వచ్చారు. చాలావరకు తెలుగు విమర్శకులు వచనంలోనే వ్యాసాలను రాస్తుంటారు. కానీ అమ్మంగి వంటి అతి తక్కువ మంది విమర్శకులలో మాత్రమే అవసరమైన ఘట్టములలో కవిత్వ శైలిని గమనించవచ్చు. "అవసరమైన చోట కవితాత్మక వచనాన్ని ఉపయోగించడం అమ్మంగి వేణుగోపాల్ ప్రత్యేకత"[113] అని పలికిన విమర్శకులు లక్ష్మణ చక్రవర్తి గారి ప్రతిపాదన కూడా ఈ కవితాత్మక శైలికి సమగ్రతను చేకూరుస్తుందని చెప్పవచ్చు.

సాహిత్య సందర్భం సమకాలీన స్పందన అనే విమర్శన గ్రంథంలోని చాలా వ్యాసాలలో అమ్మంగి కవితాత్మక శైలి కనిపిస్తుంది. ప్రజాకవి కాళోజీ పై రాసిన వ్యాసానికి పెట్టిన **"నీడను విడిచి వెళ్లిన చెట్టు"**[114] అన్న శీర్షిక కూడా కవితాత్మకంగా ఉండటం వారికి కాళోజీ యందున్న అభిమానాన్ని సూచిస్తుంది. అంటే చెట్టువంటి కాళోజీ మరణించినప్పటికీ ఆయన ఆశయం అనే నీడ మాత్రము ఎల్లప్పుడూ ప్రజలతో ఉండిపోతుందని వ్యాస శీర్షక అర్థం. ఈ వ్యాసం 'కాళోజీ గుండె ఒక చెరువు'. ఈ చెరువు నుండే కన్నీరు ఊటగా పారి ప్రజల కార్య క్షేత్రాన్ని పండించింది. అందుకే 'కాళోజీ అంటే కన్నీరు' అనే వాక్యాలతో ప్రారంభమవుతుంది. ప్రజల కష్టాలను చూసి చలించి కన్నీరు కార్చినవాడు ప్రజాకవి కాళోజీ. ఇట్టి బాధతో కూడిన కవి వ్యక్తిత్వాన్ని అమ్మంగి గారు కవితాత్మకంగా చెప్పినప్పుడే అది పాఠకుల మీద ప్రభావం చూపుతుందని వారు విశ్వసించి ఉండవచ్చు.

---

[113] తెలుగు సాహిత్యవిమర్శ దర్శనం. సంపాదకులు: లక్ష్మణ చక్రవర్తి. సి.హెచ్, సంపత్కుమారాచార్య. కోవెల. పుట. సం. 708

[114] సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 9

గురజాడను గూర్చిన వ్యాస శీర్షిక **"భావితరాల సమకాలికుడు గురజాడ".**[115] ఇది గురజాడ అప్పారావు గొప్పదనాన్ని చూపించడానికి ఉద్దేశించినటువంటి శీర్షిక. గురజాడ కాలమురీత్యా నిన్నటివాడే అయినప్పటికీ, నేటి తరానికే కాదు రేపటి తరానికి కూడా సమకాలికుడని అతని భావాలు ఆధునికమైనవని అమ్మంగిగారు చెప్పడం ఎంతో సమంజసంగా ఉంది. 'కన్యాశుల్కం తెలుగుజాతి రాగద్వేషాల రంగస్థలం'[116] అన్న ఒక్క వాక్యం చాలు, ఆ సుప్రసిద్ధ నాటకాన్ని ప్రేమించిన వాళ్లతో పాటు, వ్యతిరేకించిన వారు కూడా ఉన్నారని తెలియజేయడానికి అమ్మంగి ఈ శీర్షిక పెట్టి ఉండవచ్చు. ఇన్ని సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ఇంకా సాహిత్య రంగస్థలం మీద కన్యాశుల్కం నాటకంపై చర్చలు జరుగుతూనే ఉండడం, గురజాడ భావితరాలకు అందించిన అమూల్య కానుకగా కన్యాశుల్కం నాటకాన్ని చెప్పుకోవచ్చని అమ్మంగి అంటున్నారు.

'చార్మినార్ ఔన్నత్యం, దాశరథి కవిత్వం ఈ రెండు తెలంగాణను చారిత్రకం చేశాయి' అంటూ మొదలవుతున్నది **"అతడు దాశరథి"**[117] వ్యాసం. దాశరథి జీవితం తెలంగాణతో హైదరాబాద్ నగరంతోని ముడిపడి ఉంది. హైదరాబాదు రాష్ట్రం ముస్లిం రాజుల చరిత్రతో సంబంధం కలిగినటువంటిది. హైదరాబాదు రాష్ట్రం ముస్లిం రాజుల చరిత్రతో ముడిపడినటువంటిది. అందుకే చార్మినార్ అన్న మాట చాలాబాగా కుదిరిందని చెప్పవచ్చు.

సహృదయ సాహిత్య విమర్శ వైవిధ్యం గ్రంథంలో **"కవి కవిత్వం"**[118] అన్న వ్యాసంలో "భాష ఒక మానవ వనరు. రచయిత పవరు" అంటారు అమ్మంగి. భాష గొప్పదనాలలో ఒకటి అది మనిషి సహజమైన శక్తి కావటం. అదే భాష రచయిత శక్తిని బహిర్గతం చేసే ప్రక్రియ కావటం సాహిత్యంలో గుర్తించవచ్చు అంటున్నారు. ఇది విమర్శలో ఒక నూతన ప్రతిపాదనగా గుర్తుండిపోతుందని చెప్పవచ్చు.

---

115 సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 14

116 అదే. పుట. సం. 14

117 అదే. పుట. సం. 27

118 సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 22

**“తెలుగువారి మహా యాత్రికుడు”**[119] అన్న వ్యాసం ఎల్లప్పుడు ఏదో ఒక ప్రాంతంలో ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి ప్రయాణం చేస్తూ ఉండే ఆదినారాయణగారి గొప్పదనాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ వ్యాసం నిత్య యాత్రికుని ప్రయాణాల వైశిష్ట్యాన్ని వివరిస్తుంది. ‘చుక్క చుక్కతో సముద్రం, అడుగు అడుగుతో గమ్యం’ అంటూ వ్యాసం ఆరంభమవుతుంది. అనగా ఆదినారాయణ గారి ప్రయాణాలకు సముద్రం, నేల అనే తేడాలేమి లేవనే విషయం అవగతమవుతుంది. ‘నిరంతర ప్రయాణాలతో అలసిన నా పాదాలు సప్త సముద్రాల తీరల్లోని అలల ఒడిలో అలసట తీర్చుకున్నాయంటు’ (భ్రమణకాంక్ష ముందుమాట) యాత్రలోనే జీవితాన్ని దర్శించిన ఆదినారాయణ గారి యాత్ర గొప్పదనాన్ని అమ్మంగి చాలా అద్భుతంగా విశ్లేషించారని చెప్పవచ్చు.

బి.యస్. రాములు దీర్ఘ కావ్యానికి **“పరిణత వాక్యమే కవిత్వం”**[120] అన్న శీర్షికతో ముందుమాట రాసారు. కవిత్వానికి సంబంధించిన అంశాలను కవితాత్మకంగా చెప్పినప్పుడే విమర్శకు విశిష్టత చేకూరుతుంది. ఈ వ్యాసంలో కవిత్వ లక్షణాల గురించి వివరిస్తూ అన్ని వాక్యములు కవిత్వం కాజాలవన్న అమ్మంగి గారి అభిప్రాయం ఎంతో సమంజసంగా ఉంది. అంటే పరిపక్వములైన, జీవితానుభవంతో కూడిన వాక్యాలే కవిత్వం కాగలుగుతాయని వారి అభిప్రాయం. వీరి అభిప్రాయం ప్రకారం రాములు గారి కవిత్వం పరిపక్వత పొందినదన్న భావన స్పష్టమవుతుంది.

**“అలిశెట్టి ప్రభాకర్ సృజన శక్తి”**[121] అన్న వ్యాసం గ్రాఫ్ పేపర్ మీద జీవితాన్ని చిత్రించిన వాడు అలిశెట్టి ప్రభాకర్. ‘తెర వెనుక పొంచివున్న మృత్యువును ఫోటో తీసినవాడు ప్రభాకర్. ఒక క్షణానికి కూడా విరామమివ్వక కాలాన్ని కవిత్వీకరించినవాడు ప్రభాకర్’ అంటూ అలిశెట్టి ప్రభాకర్ వ్యక్తిత్వాన్ని, కవితా వైశిష్ట్యాన్ని వివరిస్తూ సాగిపోతుంది వ్యాసారంభం. అలిశెట్టి ప్రభాకర్ స్వయంగా చిత్రకారుడు, ఫోటోగ్రాఫర్. క్షయ వ్యాధితో చిన్న వయస్సులోనే మరణించినవాడు. అందుకే ఆయన వ్యక్తిత్వాన్ని అమ్మంగి ఈ రకంగా కవితాత్మక విమర్శన శైలిలో వర్ణించారని చెప్పవచ్చు.

---

119 సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 38

120 అదే. పుట. సం. 294

121 అదే. పుట. సం. 65

## 5.2. అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో విశ్లేషణ

అమ్మంగి వేణుగోపాల్ విమర్శన వ్యాసాలలో కనిపించే మరొక లక్షణం విశ్లేషణాత్మక ధోరణి. ఈ విశ్లేషణాత్మక ధోరణి వారు 1990 లో వెలువరించినటువంటి **'అవినాభావం'** సంపుటి నుండి కనిపిస్తుంది. **'గురజాడ సంస్కర్త హృదయం-ఒక పరిశీలన"**[122] వ్యాసంలో కథానాయకుడైన రంగనాథయ్యర్ పాత్ర చిత్రణ విషయంలో గురజాడ అన్యాయం చేశారని అమ్మంగి విశ్లేషించి చెప్పారు. వేశ్యావృత్తిని వ్యతిరేకించిన రంగనాథయ్యర్ పాత్రను ఇట్లా విశ్లేషించారు. 'రంగనాథయ్యర్ ఉద్యమంలో అరివీర భయంకరుడే. వేశ్యావృత్తి నిర్మూలన విషయంలో అతి నియంకుశుడే. ఈ దీక్ష నిప్పులాంటి ఆయన చిత్తశుద్ధి నుంచి పుట్టిందే. సరళ (లేదా చందర్) వలలో చిక్కుకొనక పూర్వం కనిపించే అయ్యర్ ప్రవర్తనలో చిత్తశుద్ధి లోపించిన అంశం ఏది మనకు కనిపించదంటారు'. ఈ వాక్యాలలో రంగనాథయ్యర్ పాత్రలోని మనస్తత్వ విశ్లేషణ కనిపిస్తుంది. సంఘసంస్కణ విషయంలో రంగనాథయ్యర్ లక్ష్యం చాలా స్పష్టంగా ఉన్నదని, అతని నిజాయితీని శంకించే అవసరం లేదని అమ్మంగి అంటున్నారు.

అమ్మంగి విశ్లేషణతో సరళ, చందరులు కలిసి చేసిన కుట్రలో రంగనాథయ్యర్ చిక్కుకొనిపోయాడని స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఈ విశ్లేషణ మూలంగా సంస్కర్త హృదయంలో గురజాడ గారు సంఘసంస్కర్తలపట్ల వ్యతిరేకతను చూపారనే భావన స్పష్టంగా గోచరిస్తుంది. కానీ అమ్మంగి ప్రతిపాదనలను అంపశ్య నవీన్ గారు కొంత వ్యతిరేకించారు. 'అసలు గురజాడకు సంస్కర్తలమని చెప్పుకునే వారి పైననే నమ్మకం లేదని, అపహాస్య భావం ఉన్నదన్నారు. అయ్యర్ పాత్రపట్ల అందుకే సానుభూతి చూపలేదని అన్నారు కానీ గురజాడకు సంస్కర్తలమని చెప్పుకునే వారిపట్ల ఎన్నడూ సానుభూతి లేదు. ఎందుకంటే వాళ్లలో చాలామంది కుహనా సంస్కరణ వాదులేనన్న గురజాడ అభిప్రాయాన్ని అమ్మంగి గ్రహించకపోవడం ఆశ్చర్యమే అంటున్నారు'.[123] కానీ నవీన్ గారి ఈ అభిప్రాయంతోనే ఏకీభవించడానికి ఆస్కారం లేదు.

---

[122] అవినాభావం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 1

[123] పాలపిట్ట మాస పత్రిక. ఫిబ్రవరి. 2018. పుట. సం. 14

దేశమంటే ఎంతో ప్రేమ ఉన్న గురజాడ దేశ ప్రజల శ్రేయస్సు కోరే వేశ్యావృత్తిని సమర్థించాడని లేదా వేశ్యలకు వేరే ఆధారం కల్పించిన తరువాత వేశ్యావృత్తి నిర్మూలన ఉద్యమం చేస్తే బాగుండేదని వారి అభిప్రాయం కావచ్చు. ఏది ఏమైనా గురజాడ సమాజంలోని సంఘసంస్కర్తలను దృష్టిలో ఉంచుకొనే ఈ సంస్కర్త హృదయం రచించారని అగీకరించాల్సిన విషయం.

**"నవలా రచయితగా కుటుంబరావు–ఒక పరిచయం"**[124] అన్న విమర్శనా వ్యాసంలో అమ్మంగి కొడవటిగంటి కుటుంబరావు నవలల్లో ఒక 'మూస' పాత్ర ఉంటుందని విశ్లేషించారు. 'కుటుంబరావు చాలా నవలలో కథానాయకుడు జీవితాన్ని ముఖాముఖి ఎదుర్కొంటాడు. ఈ పోరాటంలో కథానాయకుడు చాలావరకు నిరాయుధుడు. అగ్రవర్ణానికి సంబంధించిన అభిమానంతో పాటు, బలమైన అంతరాత్మ కలిగి ఉండటం కూడా ఈ నాయకుడి ప్రత్యేకత' అన్న వాక్యాలలో అమ్మంగి గారి విశ్లేషణ ఎంత క్షుణ్ణంగా ఉందో తెలుస్తుంది. సమకాలీన మానవ జీవితాన్ని సుసంపన్నం చేసేదే సాహిత్యంగా భావించి కొడవటిగంటి కుటుంబరావు రచనలు చేశారని అమ్మంగి అభిప్రాయపడ్డారు. ఇట్లా పాత్రకు, శిల్పానికి సంబంధించి ముఖ్యమైన నవలల్లో ఉన్నటువంటి లక్షణాలలోని సమాన ధర్మాలను అమ్మంగి బాగా విశ్లేషించారని చెప్పవచ్చు.

దేవులపల్లి రామానుజరావుగారి సేవాతత్వం, నిజాయితీ, విద్యారంగానికి వారుచేసిన సేవ, సాహితీ వ్యక్తిత్వం వంటి వాటిని గురించి **"విన్నంత–కన్నంత"**[125] అన్న వ్యాసంలో విశ్లేషించారు. ఏ ఒక్కరి రచన మీద ఆధారపడకుండా ఇల్లిందుల సరస్వతిదేవి, ముదిగొండ వీరభద్రమూర్తి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, ఆబిదల్ ఖాన్ వంటి వారు రాసిన అభిప్రాయాల ఆధారంగా రామానుజరావుగారి జీవితాన్ని విశ్లేషించి చెప్పారు. విశ్లేషణ మూలంగా రామానుజరావుగారి వ్యక్తిత్వంలోని అనేక అంశాలు పాఠకులకు తెలియవస్తున్నాయి.

[124] అవినాభావం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 9

[125] సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 11

సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారి గురించి రాసిన **"జాతి జనులు గర్వించే చరిత్రకారుడు"**[126] అన్న వ్యాసంలో మంచి చారిత్రక విశ్లేషణ కనిపిస్తుంది. 'అలెగ్జాండర్ వంటి విదేశీయులు దండయాత్రలు చేసింది, నాటకీయ సంఘటనల మధ్య మొగలు చక్రవర్తులు స్థిరమైన పరిపాలన అందించింది. ఉత్తర భారతదేశం కావడం వల్లనేమో పాశ్చాత్యులకు కూడా భారతదేశం అంటే ఉత్తర భారతదేశం అనే దృష్టే ఉండేది. మన భారతీయ చరిత్రకారులు కూడా ఇదే అభిప్రాయాన్ని ప్రామాణికంగా తీసుకున్నారు. మొన్న మొన్నటి వరకు వీరు తెలుగు వాళ్లను మద్రాశీలని పొరపడ్డారు'. ఈ వాక్యాలలో ఉత్తరాది వాళ్లు దక్షిణాది వాళ్లను తక్కువ దృష్టితో చూశారని, అసలు వాళ్ళ దృష్టిలో తెలుగువారే లేరని అమ్మంగి అంటున్నారు. సుంకిరెడ్డి గారి చారిత్రక పరిశోధన ద్వారా తెలంగాణ సమాజానికి, తెలుగుదేశానికి ఎంతో చారిత్రకత సిద్ధించిందని చెప్పవచ్చు.

జ్ఞానపీఠ అవార్డు పొందిన రావూరి భరద్వాజ రచించిన **"పాకుడురాళ్లు"** నవల విషయంలో కథానాయిక మంజరి జీవితాన్ని అమ్మంగి గారు **"పాకుడురాళ్ల మట్టి వాసన"**[127] వ్యాసంలో విశ్లేషించారు. 'ప్రేమరాహిత్యం అనేది స్త్రీకి ఆత్మహత్య సదృశ్యం. తన అంతం కోసం, నటన చాతుర్యం కోసం, డబ్బు కోసం ప్రేమిస్తున్నట్టు నటించే వాళ్ళ మధ్య ఖైదీగా మగ్గిపోయింది మంజరి. అగ్రశ్రేణి తారగా ఆమె సాధించుకున్న స్థానం నుంచి ఎత్తివేయడానికి కుట్రలు మొదలయ్యాయి' అంటూ కథానాయిక మంజరి పాత్రను గురించి అమ్మంగి వివరించారు. సమాజ మనస్తత్వం మరియు సినీ పరిశ్రమలోని పరిస్థితులు రెండూ మంజరికి ఎట్లా శత్రువులైనాయో చాలాబాగా తెలిపారు.

అమ్మంగి విమర్శ విశ్లేషణతోనే ప్రారంభమయ్యింది. వ్యాసంలో చెప్పదలుచుకున్న విషయాన్ని ముందుగానే నిర్ణయించుకుని వ్యాసాన్ని ప్రారంభించడం వారి వ్యాసాలలో కనిపిస్తున్న ప్రధాన లక్షణం. అదేవిధంగా చెప్పే విషయాన్ని ఒక క్రమానుగత పద్ధతిలో చెప్పడం మూలంగా విమర్శన వ్యాసాలలో విమర్శలో స్పష్టత సిద్ధిస్తుంది.

[126] సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 189

[127] సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 194

## 5.3. అమ్మంగి వేణుగోపాల్ వ్యాసాలలో పరిశోధనాత్మక దృష్టి

"నవలా రచయితగా గోపిచంద్" అన్న అంశం మీద అమ్మంగి వేణుగోపాల్ పరిశోధన చేసి పిహెచ్. డి డిగ్రీ పొందారు. ఆయా నవలలను వివరంగా పరిశోధించారు. రచయిత గోపిచంద్ సమన్వయవాది అని అమ్మంగి తన పరిశోధనలో తేల్చి చెప్పారు. హేతువాదిగా ఉన్న గోపిచంద్ ఆధ్యాత్మికవాదిగా మార్పు చెందాడని పరిశోధన ద్వారా నిరూపించారు.

ఆ తరువాత వారు రాసిన అనేక వ్యాసాలలో పరిశోధనా దృష్టి కనిపిస్తుంది. **"సహృదయ సాహిత్య విమర్శ వైవిధ్యం"** లో పరిశోధనకు సంబంధించినటువంటి మరికొన్ని వ్యాసాలున్నాయి. వాటిలో **"మ్రోయు తుమ్మెద-నారాయణరావు, తెలంగాణలో కవి సమ్మేళనాలు"** ముఖ్యమైనవని చెప్పవచ్చు.

**"మ్రోయు తుమ్మెద-నారాయణరావు"**[128] అన్న వ్యాసంలో మ్రోయుతుమ్మెద నవలలో నాయకుడు హిందుస్తానీ సంగీతవేత్త నారాయణరావు గురించి పరిశోదనాత్మకంగా విశ్లేషించారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన నారాయణరావు పుట్టుకతో అనాథ. ఆయన తల్లిదండ్రులు ఎవరో తెలీదు. ఊరివాల్లు చేరదీసి పెంచారు. పెరిగిన తర్వాత అతడు హిందుస్థానీ సంగీతవేత్త కాగలిగాడు. ఇతని ప్రతిభకు ఆశ్చర్యపోయి విశ్వనాథ సత్యనారాయణ ఇతనికి శిష్యుడయ్యాడు. అంతే కాక ఇతని జీవిత విశేషాలను తెలుపుతూ **"మ్రోయుతుమ్మెద"** అనే నవలనుడు రాయగలిగారని అమ్మంగి నిరూపించారు. నారాయణరావు రాసుకున్న ఉర్దూ కవితలను కూడా సేకరించి వివరించారు. అంతే కాక మ్రోయుతుమ్మెద నవల ఆధారంగా విశ్వనాథ సత్యనారాయణ కరీంనగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేసిన కాలం నాటి వారి జీవిత విశేషాలను కూడా చెప్పగలిగారు. అంతే కాక తెలంగాణ చరిత్రను, ప్రత్యేకతను కూడా తెలియజేశారు.

**"తెలంగాణలో కవిసమ్మేళనాలు"**[129] అన్న వ్యాసంలో అమ్మంగి తొలిసారిగా శాతవాహన రాజు హాలుని కాలంలో తెలంగాణలో కవి సమ్మేళనాలు జరిగాయని చెప్పారు. ప్రాకృత భాషలో రాయబద్ధ గాథలను హాల చక్రవర్తి తన రాజ్యంలోని కవుల నుంచి సేకరించారన్నారు. హాలుడు

---

128 సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 25

129 అదే. పుట. సం. 74

చక్రవర్తి కావడం వలన కవులు, కవయిత్రులు అతని ఆస్థానానికి వచ్చి తమ గాథలను వినిపించేవారని, అట్లా కవిసమ్మేళనాలు మొట్టమొదట క్రీ.శ. ఒకటవ శతాబ్దంలో తెలంగాణలో జరిగాయని అమ్మంగి చారిత్రక దృష్టితో వివరించారు. "హాలునికి ఉన్న 'కవివత్సలుడు' అన్న బిరుదు కూడా ఈ ప్రతిపాదనను ధ్రువపరుస్తున్నదని" కూడా అమ్మంగి నిరూపించే ప్రయత్నం చేశారు. ఆ తరువాత తెలంగాణలో కాల క్రమంలో జరిగిన కవిసమ్మేళనాలను గురించి కూడా వివరించారు. ఇవన్నీ చాలా వరకు కొత్త అంశాలేనని చెప్పవచ్చు.

## 5.4. వివిధ ప్రక్రియలలో కనిపించే పరిశీలనా దృష్టి

సాహిత్య వికాసానికి దోహదం చేసేవి ప్రక్రియలు, సాహితీ విలువలను పెంచేవి ప్రక్రియలే. అలాంటి ప్రతీ ప్రక్రియపై అమ్మంగి తనదైన శైలిలో విమర్శ వెలువరించారు. ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, నాటకం,కథ,కథానిక మొదలైన అన్ని ప్రక్రియలను గురించి అమ్మంగి వేణుగోపాల్ వ్యాసాలు రాసారు.

(అ). నవల

(ఆ). నాటకం

(ఇ). కథ

(ఈ). కవిత్వం

(ఉ). వ్యాసం

(ఊ). మినీ కవిత

## (అ). నవల

అంపశయ్య నవీన్ గారి గొప్ప నవల అంపశయ్య మీద **'సాహిత్య సందర్భం సమకాలీన స్పందన'** అన్న పుస్తకంలో **"మనోయాత్ర"**[130] అన్న శీర్షికతో వ్యాసం రచించారు. 'ఏ వయస్సులో ఉన్నవారినైనా యవ్వనంలోకి లాక్కుపోయే అయస్కాంత శక్తి కొన్ని రచనలకే ఉంటుంది. తెలుగులో నవీన్ అంపశయ్య (1969) ఆ కొన్నింటిలో ఒకటి' అని ఈ వ్యాసం ప్రారంభమవుతుంది.

[130] సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. వేణుగోపాల్. అమ్మంగి, పుట. సం. 56

దీన్నిబట్టి యువతీ యువకుల ప్రపంచం చుట్టూ ఈ నవల నడుస్తుందని మనం అర్థం చేసుకుంటాం. ఈ నవలలోని చైతన్య స్రవంతి పద్ధతిని వారు బాగా విశ్లేషించారు. సామాజిక ప్రయోజనాన్ని కూడా రచయిత మరిచిపోలేదని వివరించిన క్రమంలో కవి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకుని సాహిత్యం పై కూడా పట్టుసదించారన్న భావన స్పష్టమవుతుంది. నవలను విశ్లేషించే క్రమంలో కవి జీవితాన్ని కొన్ని సందర్భాలలో అర్థం చేసుకున్నారనిపిస్తుంది. అట్లా అంపశయ్య నవలలో చైతన్య స్రవంతి, సామాజిక ప్రయోజన శిల్పంతో ఈ నవలను రాశారని అమ్మంగి ఆయన పరిశీలనలో వెల్లడించారు.

## (ఆ). నాటకం

నాటకం దృశ్య శ్రవ్య విభాగానికి చెందినా సాహిత్య ప్రక్రియ. నాటక లక్షణాలను వివరించినంత సులభంగా నాటకాన్ని విశ్లేషించలేము. నాటకాన్ని విమర్శనా దృష్టితో విశ్లేశించాలని నిర్ణయించుకున్నప్పుడు నాటక పూర్వ పరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. నిశిత పరిశీలన అనంతరమే విమర్శకు పూనుకోవడం అమ్మంగి విమర్శక వ్యక్తిత్వ లక్షణం. ఏ ప్రక్రియ అయినా దాని నేపథ్యం చెప్పడం అమ్మంగి వేణుగోపాల్ ధోరణి.

ఆర్. విద్యాసాగర రావు రాసిన **'క్షంతవ్యులు'** నాటకాన్ని విశ్లేషించడానికి **"ఆర్. విద్యాసాగర్ రావు క్షంతవ్యులు' నాటకం: ఒక పరిశీలన"**[131] చెప్పేటప్పుడు కూడా దృశ్య, శ్రవ్య నాటకాలను గురించి, రేడియో నాటకాలను గురించి ప్రస్తావించారు. తెలంగాణలో మంత్రి శ్రీనివాసరావు వంటి దర్శకులు చేసిన సేవను గురించి కూడా పరిచయం చేశారు. క్షంతవ్యులు నాటకంలోని ఏడు పాత్రల మధ్య ఉన్న వైవిధ్యాన్ని గురించి వివరించారు. సంసార బాధలు, ప్రేమ సమస్య, సాటి మనుషుల మీద అనుమానాల మధ్య నలిగేవారంతా క్షంతవ్యులేనన్న నాటక రచయిత అభిప్రాయాన్ని అమ్మంగి గారు ఏకీభవించారు.

---

131 వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 16

## (ఇ). కథ

కథ లేక కథానిక విషయమై కూడా అనేక వ్యాసాలను అమ్మంగి రాశారు. తెలంగాణ కథ క్రీ.శ. పందొమ్మిది వందల (1900) ప్రాంతంలో పుట్టిందని, తొలి రచయిత్రి బండారు అచ్చమాంబ అని అమ్మంగి భావిస్తున్నారు.

అమ్మంగి కథలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలు అన్నే కూడా మూల కథను గురించి పరిచయం చేయడం, అందులోని సారాంశాన్ని వ్యాస మధ్య భాగంలో విశ్లేషించడం కనిపిస్తుంది. కథా విశ్లేషణలో లోతైన అధ్యయనం ఉండడం అమ్మంగి విమర్శలోని ప్రత్యేకత. "**కథా రచయితగా నెల్లూరి కేశవస్వామి**"[132] అన్న వ్యాసంలో హైదరబాదు పాతబస్తీలోని చరిత్ర సంస్కృతులను బాగా చిత్రించిన రచయితగా వీరిని అందరూ ప్రశంసిస్తారు. 'పసిడి బొమ్మ' కథలో ఒక వేశ్యతో ఇద్దరు వ్యక్తుల యొక్క ప్రవర్తన ఎట్లా పరస్పర విరుద్ధంగా ఉన్నదో చెప్తారు. పురుషస్వామ్య సమాజంలో చివరకు చివరకు నష్టోయేది స్త్రీయేనని చెప్పడం జరిగింది. "కేశవస్వామి రాసిన 'యుగాంతం' పెద్ద కథ మాత్రమే కాక చారిత్రక డాక్యుమెంటు" అని అంటున్నారు. ఇందులో రైతాంగ పోరాటం, నిజాం పరిపాలన, రజాకార్ల హత్యాచారాలు, అధికారుల దోపిడీ వంటి అనేక అంశాలు ప్రస్తావనకు వస్తున్నాయి. నిజాం లొంగిపోయిన తరువాత వారం రోజులు తెలంగాణలో, హైదరాబాదులో ప్రజలు ఎదుర్కొన్న కష్ట నష్టాలను ఈ కథలో చూడవచ్చు.

"**సుడిగుండాల నదిని ఎదురీదిన సురమౌళి**"[133] అన్న వ్యాసంలో సురమౌలి రాసిన "అంగురుపొద్దు" (సాయంకాలం) కథానిక కూడా ఒక చారిత్రక డాక్యుమెంట్ వంటిదేనని చెప్పవచ్చు. 1953లో ఆలంపురంలో జరిగిన "ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభల నేపథ్యంల... నిరక్షరాస్యుడైన శ్రమజీవి మల్లయ్య దృక్కోణం" నుండి ఈ కథ రాయబడిందని అమ్మంగి వివరిస్తున్నారు. వీరిదే మరో కథ "ముక్కోటి బలగమోయి" అన్న కథ కూడా చారిత్రక డాక్యుమెంట్ వంటిదేననీ చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ సందర్భంలో (1/11/1956) ఆ మొదటి రోజే సీమాంధ్రుల ప్రవర్తనను కళ్లకు కట్టినట్టు ఇందులో వివరించారని చెప్పవచ్చు.

---

[132] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 103

[133] అదే. పుట. సం. 134

## (ఈ) కవిత్వం

కవిత్వం గురించి విశ్లేషించడం అంటే కవిత్వంపై కవిత్వం రాయడం కాదు, అందులోని లోతుల్ని విశ్లేషించడం అని విశ్వసించే విమర్శకుడు అమ్మంగి. కవిత్వ పరిశీలనలో కూడా విస్తృత అధ్యయనమే లక్ష్యంగా అమ్మంగి పరిశోధించారు. కవిత్వ ప్రక్రియలలో వివిధ రచనలను అమ్మంగి విశ్లేషించిన తీరు సహృదయ పాఠకులకు సాహిత్య సంపదను అందించేలా ఉంది. పద్య కవిత్వం తీసుకుంటే గంగుల శాయిరెడ్డి రచించిన 'కాపు బిడ్డ' కావ్యాన్ని **"కాల స్థలాలకతీతం కాపుబిడ్డ కావ్యం"**[134] అన్న వ్యాసంలో పరిశీలించారు. ఈ కావ్యం 1937లో రాయబడినప్పటికీ ఈ రోజుకు కూడా వర్తించే కఠిన సత్యాలు మరియు జీవిత సత్యాలు ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

"నీ కులమందు జన్మించిన యా జమీన్
దారులు గానరు నీ తాపమెళ్ల" అంటూ

కుల దృష్టిని కాక వర్గ దృష్టిని ప్రదర్శించారు శాయిరెడ్డి అని అమ్మంగి విశ్లేషించారు. ఈ సందర్భంలో అమ్మంగిలో కులం, మతం పట్ల ఉన్న అవగాహన అర్థం అవుతుంది.

వచన కవితా ప్రక్రియ విషయంలో దిగంబర కవి జ్వాలాముఖి రాసిన కవిత్వాన్ని **"మరణమొక అసందర్భం"**[135] అన్న వ్యాసంలో వివరించారు. "జ్వాలాముఖి జీవ లక్షణమైన వక్తృత్వం కవిత్వంలోకి ప్రవేశించడంతో వారి కవితల నిడివి బాగా పెరిగింది" అన్న అమ్మంగి ప్రతిపాదన సమగ్రంగా ఉందని చెప్పవచ్చు. 'సూర్యస్నానం' వంటి పెద్ద కవితలు ఇందుకు ఉదాహరణలు వివరించడం మూలంగా అమ్మంగి విమర్శన వ్యక్తిత్వం ఎంత స్పష్టంగా ఉన్నదో అర్థమవుతుంది. అలాగే స్త్రీవాది అయిన మందవరపు హైమావతి వచన కవిత్వాన్ని గురించి **"ముక్కలైన మనసుకు అక్షర రూపం"**[136] అన్న వ్యాసంలో వివరించారు. శీర్షిక ప్రధానమైన ఈ వ్యాసంలో అమ్మంగి హైమావతి రాసిన 'నిషిద్ధాక్షరి' కవిత సంపుటిలోని వాక్యాలను వివరిస్తూ "పితృస్వామ్యంలోని వివాహ వ్యవస్థ స్త్రీని నిస్సహాయులను చేయడాన్ని ఈ సంపుటిలోని చిత్రించారు

---

134 వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 5

135 వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 163

136 అదే. పుట. సం. 200

కవయిత్రి అని విశ్లేషణా పూర్వకంగా అమ్మంగి వివరించారు. స్త్రీవాది అయిన హైమావతి కవిత సంపుటిలోని అంశాలను వివరిస్తున్న సందర్భంలో విమర్శకుడు కవయిత్రి దృక్కోణం నుండి వివరిస్తారనే భావన స్పష్టమవుతోంది.

## (ఉ) వ్యాసం

అమ్మంగి నవల, నాటకం, కథ, కవిత్వంతో పాటుగా విమర్శకులపై కూడా విమర్శన వ్యాసాలు రాయడం జరిగింది. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన బాలగోపాల్ గారు రాసిన 'రూపం–సారం' సాహిత్య వ్యాసాలు సంపుటిని సమీక్షిస్తూ "**హక్కుల పోరాటాల ఉక్కు మనిషి**"[137] అన్న వ్యాసం రాశారు.  మార్క్సిజం ద్వారా ఖండిచవలసిన భూస్వామ్య దోపిడీని, సంప్రదాయ వాదులు విశ్వాసాలు ఖండించలేవంటాడు బాలగోపాల్. యండమూరి వీరేంద్రనాథ్ రాసిన చేతబడి వంటి అవాస్తవికమైన అంశాల ఆధారంగా 'తులసి దళం' వంటి నవల రాశారని ఖండించిన వ్యక్తి బాలగోపాల్. కొడవటిగంటి కుటుంబరావు కథలను "యుద్ధ సంస్కృతికి అద్దం పట్టిన కథలు" అంటున్నారు బాలగోపాల్. మొత్తం మీద బాలగోపాల్ రాసిన ఏ వ్యాసం చూసినా అందులో రాజీలేని మార్క్సిస్టు నిబద్ధత కనిపిస్తుందని అమ్మంగి అంటున్నారు.

రాచమల్లు రామచంద్రారెడ్డి సంవేదన పత్రికలో రాసిన వ్యాసాలను "**అభ్యుదయ సాహిత్య శక్తి రారా**"[138] అన్న వ్యాసంలో పరిశీలించారు.  'రారా మధ్యతరగతి మిథ్యా విలువలను ఖండించారని' అమ్మంగి అభిప్రాయపడ్డారు. శ్రీ శ్రీ తరువాత అపారమైన కవిత్వ శక్తి ఉన్న తిలక్ ను ప్రశంసిస్తూనే ఆయన ప్రదర్శించిన తిరోగమన భావాలను ఖండించడానికి వెనుకాడలేదు. కె.వి. రమణారెడ్డి రాసిన 'మహోదయం' గ్రంథాన్ని 'గురజాడ మీద విజ్ఞాన సర్వస్వం' అంటూ అభిమానంతో పేర్కొంటూనే 'రమణారెడ్డి శైలి బరువుగా ఉన్నదని' విమర్శించారు అమ్మంగి పేర్కొన్నారు. ఇక్కడ ఇద్దరు విమర్శకులను గురించి ఒకే వ్యాసంలో వివరించినా అమ్మంగి ఏ ఒక్క విమర్శకుడిని కూడా సమర్థించడానికి పోనుకొలేదు. అభిప్రాయాలు ఏవైనా ఇద్దరు విమర్శకుల ప్రతిపాదనలు గురజాడ పట్ల ఉన్న అభిమానాన్ని ప్రకటిస్తున్నాయన్న భావన అమ్మంగిలో కలిగి ఉండవచ్చు.

---

[137] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 110

[138] అదే. పుట. సం. 204

## (ఊ). మినీ కవిత

మినీ కవితల విషయంలో అలిశెట్టి ప్రభాకర్ ను మించినవారు లేరని అమ్మంగి అభిప్రాయంగా భావించవచ్చు. **"అలిశెట్టి ప్రభాకర్ సృజన శక్తి"**[139] వ్యాసంలో కొన్ని మినీ కవితలను చూడవచ్చు.

"నగరాలలో
అత్యధికంగా
అత్యద్భుతంగా
అస్థిపంజరాల్ని
చెక్కే
ఉలి
ఆకలి"[140] వంటి కవితలను కోట్ చేసి విశ్లేషించారు.

"రక్తమంత చిక్కగా, కన్నీళ్ళంత నిజాయితీగా ఉండే కవిత్వం" మనకు అలిశెట్టి ఇచ్చిపోయాడన్నారు.

డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు కూడా మినీ కవితలు రాసినవారే. వీటిని **"సినారె ముక్తకాలు"**[141] అన్న వ్యాసంలో అమ్మంగి పేర్కొన్నాడు. అమ్మంగి సినారె గారిని తాత్వికమైన ప్రపంచపదుల ద్వారా తత్వబోధ చేస్తున్న మహా కవి అని కొనియాడారు.

"అంత కడివెడు పాలపై ఒ
క్కింత మీగడ పెరినట్లుగా
మనకు మిగులును గతము లోపలి
మంచి అదియే సంప్రదాయం"[142]

---

[139] అదే. పుట. సం. 65

[140] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 67

[141] అదే. పుట. సం. 165

[142] అదే. పుట. సం. 168

అంటూ సంప్రదాయాన్ని సంప్రదించే లఘు కవిత ప్రచారంలో ఉన్నది. వీరి ప్రపంచపదులు ఐదు పాదాల లఘు కవితలు. ఈ ఐదు పాదాలు...

1. తాత్విక చిత్రణ
2. సత్యబోధ
3. మానవ స్వభావ చిత్రణ
4. చైతన్య పరిచేవి

అని నాలుగు రకాలుగా ఉన్నాయని అమ్మంగి పరిశీలన ద్వారా తెలియజేశారు.

ఇట్లా అన్ని ప్రక్రియలలో మనకు అమ్మంగి గారి విమర్శన వ్యక్తిత్వం ప్రస్ఫుటం అవుతున్నదన్న నిర్ణయానికి రావచ్చు.

## 5.5. ప్రాంతీయవాద సాహిత్య విమర్శ

అమ్మంగి వారి సాహిత్య విమర్శక వ్యక్తిత్వంలో ప్రధానంగా గుర్తించదగినది వారి విమర్శలో ప్రాంతీయ కవులు, రచయితలు, వైతాళికులు, పీఠికా కర్తలపట్ల ఉన్న అభిమానం. విమర్శకులుగా సాహిత్య విమర్శా రంగంలోకి అడుగిడినప్పుడు అమ్మంగి ప్రాంతీయవాద సాహిత్య విమర్శపై మక్కువ చూపలేదు. ఏ ప్రాంత సాహిత్యకారులైన వారి సాహిత్య విలువలను బట్టి విమర్శ కొనసాగించేవారు. తెలంగాణ ఉద్యమం తరువాత అమ్మంగి విమర్శలో ప్రాంతీయ వాద విమర్శా లక్షణాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే తెలంగాణ ప్రాంత భావన రాకముందు విశిష్ట కవులు అంటే ఆంధ్రా కవులే అన్నంతగా ప్రచారం పొందేలా చేశారు ఆంధ్రా పాలకులు. తెలంగాణలో కూడా ఎంతోమంది గొప్ప కవులున్నారు, తెలంగాణ ప్రాంతం నుండి కూడా గొప్ప సాహిత్యం వెలువడిందనే సత్యాన్ని వారు గ్రహించలేదు. ప్రాంతీయ అస్తిత్వ స్పృహ మూలంగా అమ్మంగిలో కూడా ఈ విధమైన ప్రశ్నలు మెదిలాయనే భావన అమ్మంగి గారి కొన్ని వ్యాసాలను పరిశీలిస్తుంటే అర్థమవుతుంది. ఇందుకు ప్రాంతీయ అభిమానమే ప్రధాన కారణంగా తెలుస్తుంది.

ఇటీవలి కాలంలో వెలువడిన సాహిత్యంలో, సాహిత్య విమర్శలో ప్రాంతీయ స్పృహ అనేది ఒక బలమైన పాత్రను పోషిస్తుందని చెప్పాలి. సాహిత్యంలో కవులు, కవయిత్రులు మాత్రమే కాకుండా, విమర్శకులు కూడా ప్రాంతీయ అస్తిత్వం గల సాహిత్యాన్ని ప్రచారం చేసేందుకు ఎక్కువ

ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతంలో ఉద్యమ సమయంలో ప్రాంతీయ అస్తిత్వ స్పృహ ఉధృతంగా కనిపిస్తుంది. ప్రతి విమర్శకుడు, కవి, రచయిత తమ ప్రాంతీయ సాహిత్యంపైననే ఎక్కువ మక్కువ చూపించి, ప్రాంతీయ అస్తిత్వానికి తమ విమర్శ, సాహిత్యం ద్వారా ప్రాణ ప్రతిష్ఠ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధమైన సాహిత్యం మూలంగా తెలంగాణ ప్రాంత మూలాలను పరిరక్షించుకునేందుకు అవకాశం ఉంది.

"వ్యక్తి ప్రవృత్తికీ వ్యవస్థకూ మధ్యగల అంతరము అనాదినుంచీ ఉన్నదే. సమాజంలో ఉంటున్న వ్యక్తి తన ప్రవృత్తిని వ్యవస్థాబద్ధం చేసుకొని ప్రవర్తనను రూపొందించుకోవాలని సమాజం నిర్దేశిస్తుంది. అందుకై ప్రచారమూ, సంప్రదాయసిద్ధమై ఆచారాలూ, కట్టుబాట్లు, వంశగౌరవం, కుటుంబ గౌరవం వంటివి. ఆచరణలో వ్యక్తి, వ్యవస్థ నిర్దేశించిన ఆదర్శాన్ని అందుకోలేకపోయినప్పుడు అస్తిత్వవాదం ప్రారంభమవుతుంది. వ్యవస్థకంటే వ్యక్తి ధర్మానికి అంటే వ్యక్తి వైశిష్ట్యానికీ, స్వేచ్ఛకూ సహజ వికాసానికి ప్రాధాన్యాన్నిస్తుంది అస్తిత్వవాదం" అని ఆర్.ఎస్. సుదర్శనం గారు పేర్కొన్నారు.

ఏ మానవుడికి అయినా సంఘంలో అతనికి ఉండే ఉనికిని బట్టే అతని చైతన్యం ఉద్భవిస్తుంది గాని అతని చైతన్యాన్ని బట్టి ఉనికి ఉద్భవినిచదు. ప్రతి వర్గమూ, కులమూ అలాగే ప్రాంతం కూడా ఒకానొక ప్రత్యేక అస్తిత్వంతో మాట్లాడడం అధునికానంతర సాహిత్యంలో ప్రత్యేకంగా గుర్తించదగిన పరిణామం.

"ప్రాంతీయ వాద సాహిత్య విమర్శ అనేది రచయిత సృజనలో దేశ కాల స్థాన పరిమితులు వ్యక్తమవుతూనే దాన్ని సామాజికం చేయడమో, సార్వజనీనం చేయడమో, సార్వకాలీనం చేయడమో కనిపిస్తుంది. అయితే స్థల, కాల, దేశ పరిమితిని రచనలో వెతకడం రచయిత చెప్పుకునే '*నాస్టాల్జియా*'ని నేటివిటీ దృష్టితో పరిశీలించడం వంటి వాటి వలన సాహిత్య విమర్శలో ప్రాంతీయ దృక్పథం ప్రవేశించింది. తమది తాము రక్షించుకోవాలనే తాపత్రయంలో భాగంగానే ప్రాంతీయ, జాతీయ స్పృహలు బయలుదేరాయి. తెలుగు సాహిత్య విమర్శలో ఈ దృష్టితో కూడిన ప్రాంతీయ వాద విమర్శ తెలంగాణలో మొదట ప్రారంభమైంది అని చెప్పారు"[143] డా. లక్ష్మణ చక్రవర్తి పేర్కొన్నారు.

---

[143] 'తెలుగు సాహిత్య విమర్శ దర్శనం'. లక్ష్మణ చక్రవర్తి. పుట. 154

అమ్మంగి వారి సాహిత్య విమర్శక వ్యక్తిత్వం కూడా మొదట ప్రాంతీయ అస్తిత్వానికి ప్రాధాన్యతను ఇవ్వకపోయినా తెలంగాణ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కారణంగా వారి విమర్శలో కూడా ప్రాంతీయ అస్తిత్వ వాద స్పృహ కనిపిస్తుంది.

విమర్శనాత్మక దృష్టి లేని పరిశోధన పరిశోధనాత్మక దృష్టి లేని విమర్శ మనుగడను సాధించవు. సేకరించిన విషయ సమాచారాన్ని విశ్లేషించడం పరిశోధన అయితే, ఒక రచనను అనేక కోణాలలో విశ్లేషించడం విమర్శ అవుతుంది.

తెలంగాణ అస్తిత్వ ఉద్యమ సాహిత్య విశ్లేషణను మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సాహిత్యాన్ని కూడా విశ్లేషించింది. తెలంగాణ నుంచి కూడా ఏ మాత్రం తక్కువ కాని సృజనాత్మక సాహిత్యం వెలువడిందని చాటడానికి తెలంగాణ విమర్శ ప్రయత్నం చేసింది.

ప్రాంతదర్శి కాని వాడు, క్రాంత దర్శి కాలేడని అమ్మంగి అన్నారు. తన ప్రాంతం పట్ల అభిమానం ఉన్నప్పుడే కవి ఆ ప్రాంత జనుల సమస్యల పట్ల స్పందించి కవిత్వం రాయగలడు.

తెలంగాణ ఉద్యమం తర్వాత తెలంగాణ అస్తిత్వ భావనతో తమ భాషా, సాహిత్య, సాంస్కృతిక, చరిత్రలపైన ఇక్కడి కవులు, విమర్శకులు ప్రత్యేక శ్రద్ధ చూపెట్టారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ "త్రి దశాబ్ది ఉత్సవాలలో" భాగంగా నిర్వహించిన "మూడు దశాబ్దాల తెలుగు సాహిత్యం" అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగించిన డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి గారు "సాహిత్యంలో ప్రాంతీయ వాదం" పై ప్రసంగిస్తూ "తెలంగాణ సాహిత్యంలో ప్రాంతీయ వాదం ప్రస్ఫుటించిందని, దీనికి చారిత్రక నేపథ్యం ఉందని పేర్కొన్నారు. ప్రాంతీయ వాదం రాజకీయ ఉద్యమంతోనే బలపడుతుందనే విషయాన్ని తెలంగాణ ఉద్యమం నిరూపించిందని, ఉత్తరాంధ్ర సాహిత్యంలోనూ ప్రాంతీయ వాదం కనిపించినప్పటికీ అది వాదంగా బలపడలేదని వివరించారు". ఈ ధోరణి కారణంగానే సాహిత్యంలో ప్రాంతీయ వాదం ప్రస్ఫుటించినట్లుగానే సాహిత్య విమర్శలో కూడా ప్రాంతీయ వాదం మొదలైందని అమ్మంగి నిరూపించారు.

### 5.5.1. రామదాసు (కంచర్ల గోపన్న)

తెలంగాణ చరిత్రకు నిలువెత్తు నిదర్శనం 'రామదాసు'. తెలంగాణ భక్తి కవిత్వానికి అక్షర రూపం కల్పించి తన గానం ద్వారా భక్తి తెలంగాణ ప్రాంతాన్ని పావనం చేసిన భక్తరామదాసు గురించి అమ్మంగి **"గోలకొండ వజ్రం రామదాసు"** వ్యాసంలో వివరించారు. నిజాం బందీఖానాలో మృత్యు వాతావరణంలో తన మానసిక స్థితిని కాపాడుకోవడానికి రామదాసుకు రాముడొక రక్షణ మంత్రమయ్యాడన్నారు. పాట ప్రాణమయి, రాముడిని తండ్రిగా, సీతమ్మను తల్లిగా భావించి మనసులో ఒక కుటుంబాన్ని నిర్మించుకున్న గొప్ప భక్తుడు రామదాసు అన్నారు.

'గోలకొండ రాజ్యపుగనుల్లో దొరికిన కోహినూర్ వజ్రం బ్రిటిష్ రాణి కిరీటంలో బందీ అయింది. గోలకొండ కోటలో బందీ అయిన రామదాసు సాహిత్య సంగీతాలు మట్టిలో వజ్రాలయ్యాయి. అవి జాతి వజ్రాలై ప్రకాశించాలంటే సమిష్టికృషి, సంకల్పశక్తి అవసరమని' అమ్మంగి ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంతో భావకత ఉంటేతప్ప ఒక విమర్శకుని నుండి ఇలాంటి వాక్యాల ప్రయోగం జరగదు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో అమ్మంగి భక్త రామదాసులోని శక్తిని తెలియజేస్తూ ప్రజలందరూ ఉద్యమంలో సమష్టిగా పోరాడాలనే సందేశాన్ని ఇచ్చారు. ఈ వ్యాసం ప్రాంతీయ సాహిత్య కృషికి నిదర్శనంగా నిలుస్తుంది.

అమ్మంగి విమర్శన గ్రంథాలలోని వ్యాసాలలో విశ్లేషణ, వివరణ, విమర్శ, వివేచన, పరిశీలన, అనుశీలన, సమీక్షా విధానాలు విశిష్టంగా కనిపిస్తున్నాయి. విశ్లేషణలో శాస్త్ర సమన్వయం, వివరణలో సమగ్రత, విమర్శలో నిజాయితీ, వివేచనలో ఆలోచనా శక్తి, పరిశీలనలో నిశిత దృష్టి, అనుశీలనలో క్రమ వికాసం, సమీక్షలో స్పష్టత అమ్మంగి ప్రత్యేక విమర్శన వ్యక్తిత్వమని ఈ వ్యాసాలను పరిశీలిస్తుంటే అర్థమవుతుంది.

### 5.5.2. కవల పిల్లలతల్లి హైదరాబాద్!

అమ్మంగిగారు తెలంగాణ ప్రాంత కవుల మీదనే కాక తెలంగాణ ప్రాంతం మీద కూడా అస్తిత్వ సాహిత్య విమర్శ కొనసాగించారు. చార్మినార్ ఔన్నత్యాన్ని చాటే వ్యాసాలు తెలంగాణ చరిత్ర సంబంధమైన వ్యాసాలను కూడా రాశారు. 'ఎవరిమీద కత్తివేటు పడ్డా నేను కదిలిపోతాను! ఈ ప్రపంచపు బాధంతా నా హృదయంలోనే ఉంది' అని మహబాబ్ అలీ కవి పలికిన వాక్యాలు

హైదరాబాద్ కు స్పష్టంగా వర్తిస్తాయనే చెప్పాలి. శాంతి సౌభాగ్యాల పునాదుల మీద ఏర్పడిన నగరం హైదరాబాద్. ఎందరో నిరంకుశుల పరిపాలన మూలంగా ఎన్నో అవస్తలు పడిందని అమ్మంగి ప్రాంతీయాభిమానాన్ని చాటుకున్నారు.

భారతీయ సంస్కృతీ నాగరికతలకు కేంద్రబిందువు హైదరాబాద్ అని కొనియాడారు. ఎందరో కవులు హైదరాబాద్ పై కవిత్వంరాస్తూ రాజధాని ఢిల్లీ ముందు హైదరాబాదును తలెత్తుకునేలా చేశారన్నారు. ఇక్కడ జీవించే హిందూ, ముస్లింల ఐక్యతను గురించి **"కవల పిల్లలతల్లి హైదరాబాద్!"**[144] వ్యాసంలో ఎంతో అద్భుతంగా వివరించారు. దేశంలో ఏ ప్రాంతానికిలేని చరిత్ర తెలంగాణలోని హైదరాబాద్ కి ఉంది. ఎందుకంటే ఇక్కడి ప్రజలు కుల, మత, వర్గ భేదాలతో కాకుండా ప్రాంతీయ అస్తిత్వ శ్వాసతో జీవిస్తారు గనుక. అందుకే అమ్మంగి ఇలా అంటున్నారు 'సముద్రాలు దాటివెళ్ళిన సంతానం కోసం ఎదురుచూసే తల్లులెందరికో కన్నతల్లి హైదరాబాద్. అంతే కాదు, ఏ పాప ఏడ్చినా తన బిడ్డేనని పరిగెత్తే తల్లి హైదరాబాదేనని' తల్లి హృదయంతో హైదరాబాద్ ను పోల్చారు. తమ ప్రాంతంపట్ల ఎంతో ప్రేమ, అభిమానం ఉంటేగాని ఇలాంటి పదప్రయోగం రాదు. అమ్మంగి విమర్శకులుగా కూడా తెలంగాణ అస్తిత్వాన్ని పరిరక్షించే వ్యాసాలు రాయడం తెలంగాణా సాహితీవేత్తల అదృష్టమనే చెప్పాలి.

### 5.5.3. దాశరథి కృష్ణమాచార్యులు

నిజాం రాజు పరిపాలనా కాలంలో తెలంగాణ ప్రాంత ప్రజలను తన సాహిత్యం ద్వారా జాగృతం చేసి తెలంగాణను చిరస్మరణీయం చేసిన దాశరథి కృష్ణమాచార్యులను గురించి అమ్మంగి **"అతడు దాశరథి"**[145] వ్యాసంలో రాసారు. ఈ వ్యాసంలో తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయేటువంటి సాహిత్యాన్ని అందించిన దాశరథి ఉద్యమ వ్యక్తిత్వాన్ని అమ్మంగి ఎంతో అద్భుతంగా వివరించారు. ఈ వ్యాసారంభం నుండి ముగింపు వరకు ప్రాంతీయవాద సాహిత్య విమర్శ లక్షణాలు చాలానే ప్రస్ఫుటమవుతాయి. అందుకు కారణం విమర్శకుడు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి చలించడమే అనిపిస్తుంది.

---

[144] ణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం 242

[145] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 27

### 5.5.4. కాళోజీ నారాయణరావు

నిజాం పాలనా కాలంలో నిజాం అరాచకాలకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తన కలం, గళం ద్వారా తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు కాళోజీ నారాయణరావు. ఆనాడు నిజాం పాలనలో బలైపోయిన ప్రజల కోసం వారి హక్కుల కోసం కలమెత్తి, గళమెత్తి ముందుకొచ్చి ఉద్యమాలను ఊపిరిగా నడిపిన ప్రజావాది. తన జీవితం మొత్తాన్ని తెలంగాణకు అంకితం చేసిన వైతాళికుడాయన. రాజకీయ, సాంఘిక చైతన్యాల సమాహారం ఆయన సిద్ధాంతం. తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం ప్రతిధ్వనిగా పిలువబడి, ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజల మనిషి, మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి. పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణకిచ్చిన మపనీయుడు, వైతాళికుడు కాళోజీ. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా కలం ఎత్తినవాడు. మొత్తంగా కాళోజీ స్వాతంత్ర్యసమరయోధుడు, తెలంగాణా ఉద్యమరుడు. అంతటి ఉద్యమస్ఫూర్తి ఉన్నటువంటి కాళోజీ నారాయణరావుగారి ఉద్యమ వ్యక్తిత్వాన్ని అమ్మంగివారు విశ్లేషించడం జరిగింది.

**"నీడను విడిచివెళ్లిన చెట్టు కాళోజీ"**[146] అన్న వ్యాసంలో కాళోజీ నారాయణరావుగారి కవిత్వాన్ని విశ్లేషణాత్మక రీతిలో పరిశీలించారు. ఈ వ్యాసంలో అమ్మంగివారు కాళోజీ గారిని తెలంగాణ ఉద్యమ గుండెచప్పుడుగా భావించి కాళోజీ ఒక గుండె చెరువు అన్నారు. ఆ చెరువు నుండి కన్నీరు ఊటగా పారి ప్రజా క్షేత్రాన్ని పండించిందని, అందుకే కాళోజీ అంటేనే కన్నీరు అంటూ ఆర్ధ్రతా భావంతో పలికారు. కాళోజీ గుండెనే ఒక చెరువుగా భావించి ఆ చెరువే తెలంగాణ ప్రజలకు జీవనాధారం అన్న విధంగా, తెలంగాణ ఉద్యమంలో అయినా తెలంగాణలో అయినా అందరి కన్నీరు కాళోజీ గుండె నుండి ఉద్భవించాయని ఎంతో అద్భుతంగా అమ్మంగి వివరించారు.

'జరిగినదంతా చూస్తూ ఎరగనట్లు పడి ఉండగ, సాక్షీభూతున్ని గాను సాక్షాత్తు మానవున్ని' అని పలికిన కాళోజీ మనస్తత్వాన్ని అమ్మంగి ఈ వ్యాసంలో వివరించారు. అమ్మంగి కాళోజీని సామాన్యమైన వ్యక్తిగా భావించలేదు, ఆయనను ఒక మహాత్ముడిగా భావించారు. కాళోజీ మరణం ఒక అసందర్భమని చేవగల ప్రతి మాటలో, జీవమున్న ప్రతి పాటలో సాకారం కాని ఒక స్వప్నం

---

[146] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 9

కోసం కాళోజీ బతుకుతూనే ఉంటారని తన భావాలకే కాదు, తన శరీరానికి కూడా మరణం లేదని నిరూపించిన వ్యక్తి, శక్తి కాళోజీ అంటూ కాళోజీలో ఉన్న శక్తిని గురించి సహృదయ పాఠకలోకానికి అమ్మంగి వేణుగోపాల్ తెలియజేశారు.

"**తెలంగాణ అంతరాత్మ కాళోజీ**"[147] అన్న వ్యాసంలో కాళోజీ భావధార ప్రజాక్షేత్రాల చుట్టూపారుతూ వచ్చిందనే మాటతో సమాజంలో కాళోజీ ఏవైపు పయనించాడో అన్న విషయాలను ప్రవాహంతో పోల్చి చెప్పారు. కొత్త కొత్త పద ప్రయోగాలతో అర్థం సులభంగా అవగతమయ్యేలా వివరించారు.

కాళోజీని ప్రభావితం చేసిన తత్వవేత్తలలో "ఆల్బర్ట్ స్విట్జర్" ఒకరు అని పేర్కొన్నారు. ఈ మాటలో కాళోజీ ప్రభావం అమ్మంగి వారిపై ఏ మాత్రం ఉందో ఊహించవచ్చు. కాళోజీ భాషారూపంలోని ఆధునికతకు మాత్రమే కాక భావరూపంలోని ఆధునికతకు కూడా పెద్దపీట వేసాడని చెప్పాడు. రైతుపక్షం ఉండటమంటే సమస్త ప్రజానీకం వైపు ఉండటమే అనే పంక్తుల ద్వారా వేణుగోపాల్ కాళోజీ గారి పక్షం నుంచి పలికిన మాటలేనని అర్థమవుతుంది.

'కాళోజీ కమ్యూనిస్టుకాకున్నా కర్షక కార్మిక పక్షపాత వైఖరికి లోటులేదు' అంటూ కాళోజీని ఒక కర్షక పక్షపాతి అని, కళ ప్రజలకోసమని నమ్మినవాడు ప్రజల పక్షం వహిస్తాడంటారు. అందుకే కాళోజీ గారి చాలా కవిత్వాలలో వర్గ దోపిడీని ప్రశ్నించే పంక్తులు అప్రయత్నంగానే వ్యక్తమవుతాయని పేర్కొన్నారు.

అమ్మంగి కాళోజీ జీవితాన్ని ఆయన వ్యక్తిత్వాన్ని కొన్ని భాగాలుగా విభజించి విశ్లేషించారు. అందులో మొదటిది దగాకోరు రాజకీయాలు త్యజించి ప్రజాకీయాలు అన్న మాటతో ప్రజల పక్షం వహించడం. అయితే రెండవది కాళోజీ మైత్రి. కాళోజీ చెలిమిని అంటే మైత్రిని సాధారణ స్నేహబంధంగా చూడలేదు ఉన్నత స్థాయి అనుబంధంగా నిర్వహించుకుంటూ వచ్చాడని 'దేవతలెరుగని దివ్యానుభవం మైత్రి' అని కాళోజీ ఇచ్చిన నిర్వచనం ప్రపంచంలో ఏ కవి ఇవ్వలేదంటూ కాళోజీలోని రెండవ పార్శ్వాన్ని ఎంతో అద్భుతంగా వివరించాడు.

[147] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. పుట. సం. 89

ప్రజల హక్కులకు ప్రపంచ పౌరుల హక్కులకు భంగం కలిగినప్పుడు కాళోజీ తెలుగు పౌరుడిగానే కాకుండా ప్రపంచ పౌరుడుగా కూడా స్పందించాడని వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కుల గురించి చర్చించాడు. "పెద్దపెద్ద పత్రికలు ప్రజాస్వామ్యవాదులు మౌనం వహించిన ఘట్టంలో ప్రజలకు ప్రాథమిక హక్కులను గుర్తు చేసిన కంఠస్వరం కాళోజీది"[148] అని సామాన్యుని హక్కుల గురించి కాళోజీ పేర్కొన్న అంశాలను గురించి చర్చించారు. ఈ మాటల్లో వేణుగోపాల్ గారికి సామాన్యుని యొక్క ప్రాథమిక హక్కుల పట్ల, సామాన్యుల పట్ల ఉన్న అభిలాష అర్థమవుతుంది. విమర్శ అంటే కేవలం విమర్శించడమే కాదు వ్యక్తి, రచయితల హక్కుల గురించి కూడా చర్చించడమనే విషయం ఈ మాటలలో గుర్తించవచ్చు.

### 5.5.5. సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె)

ఆధునికాంధ్ర తెలంగాణ కవుల్లో నిత్యనూతన మూర్తిగా సంప్రదాయాన్ని జీర్ణించుకున్న అభ్యుదయ కవి, సినీగేయ రచయిత డాక్టర్ సి. నారాయణరెడ్డి. అమ్మంగి వేణుగోపాల్ గారికి పాఠాలు నేర్పిన ఆత్మీయ గురువు సినారెగారు. అమ్మంగి నారాయణరెడ్డిగారి నుండి పొందిన సాహిత్య పరిజ్ఞానంతోనే నేడు తెలంగాణ సాహిత్యకారులు, విమర్శకులలో అగ్రస్థానంలో నిలిచారు. అమ్మంగి సినారె సాహిత్య పరిజ్ఞానాన్ని, వారి పరిశోధనా గ్రంథాన్ని పలు కోణాలలో పరిశీలిస్తూ విమర్శనా దృష్టితో వ్యాసాలు రాసారు.

**"విశ్వంభర విశ్లేషణ"** వ్యాసంలో సినారెగారి **'విశ్వంభర'** కావ్యంలోని ఆధునికత, సమాజ వాస్తవికత, వైజ్ఞానిక సంబంధ విషయాలను గురించి విశ్లేషించారు. సాహిత్య పరిశోధకుడిగా విశ్వవిద్యాలయ స్థాయిలో గుర్తింపు పొందిన సినారెగారు రచయితగా జ్ఞానపీఠ పురస్కారం పొంది పాఠకుల మన్ననలతో తెలుగు సాహిత్యంలో చెరగని ముద్రవేసారు. 'విశ్వంభర' పద్యకావ్యానికి సినారెగారు 1988 సంవత్సరంలో భారతదేశంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు.

ఆదిమ దశ నుంచి ఆధునిక దశ వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలో సినారెగారు వివరించారు. అమ్మంగి ఈ ప్రస్థానాలను గురించి వివరిస్తూ 'మనిషి సాధన త్రిముఖం కళాత్మకం

---

[148] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట.సం. 10

వైజ్ఞానికం ఆధ్యాత్మికం అని కవి ప్రస్తావనలో స్పష్టం చేసిన వాక్యాలను విశ్లేషించి మనిషి తన వ్యక్తిత్వ సాధన కోసం చేసే ప్రయాణంలో ఈ మూడూ క్రమంగా ఎదురయ్యే మజిలీలు' అని జీవన ప్రయాణానికి ఉండాల్సిన లక్షణాలను వివరించారు.

అదేవిధంగా విశ్వంభరలో పైన పేర్కొన్న కళాత్మకం, వైజ్ఞానికం, ఆధాత్మిక అంశాలతో పాటు సజీవ వాదం (Affirmation of life), కాంతి కాంక్ష (Aspiration for light), శబ్ద చేతన (Consciousness of Sound) అన్న మూడు అంశాలు కూడా ప్రధానంగా కనిపిస్తాయని వివరించి అవి ఏవిధంగా కావ్యంలో ప్రస్ఫుటమయ్యాయో పరిశీలనాత్మకంగా విశ్లేషించారు. సంపూర్ణ జీవన అవగహణకై కవిపడ్డ తపన ఈ కావ్యంలో ప్రతిఫలించిందన్నారు.

అమ్మంగి 'అవినాభావం' వ్యాస సంపుటికి ముందుమాట రాసిన కేతు విశ్వనాథరెడ్డిగారు "విశ్వంభరలోని వైజ్ఞానిక దృష్టినీ, ఆధునికతనూ, సమాజవాస్తవాన్ని పరామర్శించిన వేణు అవి కార్యరూపాన్ని ఎలా సంతరించున్నాయా విశ్లేషించకపోవడం కొంత ఆశ్చర్యంగానే కనిపిస్తుందన్నారు".

ఇక్కడ కేతు విశ్వనాథరెడ్డిగారు అమ్మంగి విశ్లేషణను సమర్థిస్తూనే వైజ్ఞానిక అంశాలను ఇంకాస్త ఎక్కువ విశ్లేషించి ఉంటే బాగుండేదని ఆ విషయాన్ని అమ్మంగి ఎలా మరిచిపోయాడోనని తెలియజేసారు. ప్రధానంగా విశ్వంభర కావ్య విశ్లేషణలో అమ్మంగి సాఫల్యత సాధించారనే చెప్పాలి.

**"ఆధునికాంధ్ర కవిత్వం–సినారె పరిశోధన"** వ్యాసంలో నారాయణరెడ్డిగారి విశిష్ట పరిశోధనా గ్రంథం అయిన 'ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయము, ప్రయోగము' గ్రంథంలోని సంప్రదాయ కవిత్వం, ఆలంకారిక అంశాలను, సినారెగారి నూతన ప్రయోగాలను గురించి విశ్లేషించారు. ఈ సిద్ధాంత గ్రంథ పరిశీలనలో అమ్మంగిలోని పరిశోధకుని లక్షణం ప్రస్ఫుటమవుతుంది. ఈ గ్రంథంలో సినారె 'సంప్రదాయంపై జరిగే మార్పే ప్రయోగమని' నిర్వచించారన్నారు. సంప్రదాయాన్ని కొత్తపుంతలు తొక్కించే ఈ మార్పు సాహిత్యంలో అంగీకారమేనని సినారెగారి నూతన ప్రతిపాదనలను అమ్మంకి సమర్థించారు. ఎనిమిది అధ్యాయాలుగల ఈ సిద్ధాంత గ్రంథం సినారెగారి మౌలిక ప్రజ్ఞకు సాక్ష్యంగా నిలుస్తుందని గ్రంథ వైశిష్ట్యాన్ని, పరిశోధన సామర్థ్యాన్ని వివరించారని చెప్పవచ్చు.

**“సినారె ముక్తకాలు”** వ్యాసంలో సినారెగారు రచించిన ముక్తక గేయ కావ్యాలను గురించి ఆ కావ్యాలలోని శైలి సౌందర్యాలను గురించి విశ్లేషించారు. మొదటగా వ్యాసారంభంలో ముక్తక కావ్యాలకి ఉండాల్సిన లక్షణాలను వివరిస్తూ వచన కవితకి, ముక్తాక కావ్యానికి సినారె ఏవిధంగా నిర్వచనమయ్యారో వివరిస్తూ “డాక్టర్. సి. నారాయణరెడ్డి అంటే వచన కవిత, సినారె అంటే ముక్తకం. ‘సి’ అంటే సముద్రం. ‘నా’ అంటే స్వార్థం– అంటే మనిషి, ‘రె’ అంటే కిరణం. సముద్రానికి, ఆకాశానికి మధ్య ఉన్న మనిషి కథనే సినారె కవిత్వం.” అని సినారె పేరులోని పరమార్థాన్ని తెలియజేశారు.

**‘సమదర్శనం’** అనే ముక్తక కావ్యం గురించి వివరిస్తూ ఇందులోని ముక్తకాలు ఊహాలోకంనుంచి పుట్టినవి కావని, భౌతిక సత్యాలను చెప్పే కవితలని లేదా గేయాలని అన్నారు.

**ప్ర'పంచపదులు’** కావ్యం సినారె సృష్టించిన కొత్త ఛందస్సు మాత్రాగణాలతో విలక్షణమైన సృజనాత్మకతను కలిగి ఉన్నాయన్నారు. ప్రపంచపదులులో సినారె నాలుగు రకాల ప్రపంచ పదులను స్పష్టం చేశారని అందులోని తాత్విక చిత్రణ, సత్యభోధ, మానవ స్వభావ చిత్రణ, చైతన్యపరిచేవని ఆ మార్గాలను వివరించారు.

ఇట్లా ఒక్కక్క ముక్తక కావ్యాన్ని గురించి సమగ్రంగా విశ్లేషిస్తూ ఒక్కొక్క ముక్తకాన్ని మౌక్తికంగా రూపొందించిన సినారె మనకు సరికొత్త ముత్యాల సరాలను అందించారని ముక్తక కావ్య రచనలో సినారెని ముందు వరుసలో నిలిపారు.

చివరగా సినారెగారు ఈ లోకాన్ని విడిచి వెళ్ళినప్పుడు **“వారిని మరచిపోవటం చాలా కష్టం”** అనే శీర్షికతో వ్యాసం రాసారు. ఈ వ్యాసంలో సినారెగారి జీవన సాహిత్యరేఖలను వివరిస్తూ కవిగా, పరిశోధకుడుగా, అధ్యాపకుడిగా ఆయన పొందిన సాఫల్యతను వివరిస్తూ వారి సాహితీ వ్యక్తిత్వాన్ని తెలియజేసారు. ఈ వ్యాసంలో కవిజీవత విమర్శ లక్షణాలను పాటిస్తూ వ్యాసాన్ని ముగించారు. అలాగే వ్యాసంలో గురువులపై శిష్యులకు ఉండే గౌరవం ఎలాంటిదనే విషయాన్ని తెలిపారు. సాహితీలోకం ఇలాంటి వ్యక్తిని కోల్పోవడం విషాదకరమని చింతించారు.

ప్రాచీనులలో ప్రాచీనుడు, ఆధునికులలో ఆధునికుడయిన డాక్టర్ సి.నారాయణరెడ్డిగారిని గురించి అమ్మంగి పరిశీలనా దృష్టితో వివరించి వారి సాహిత్య కృషికి నీరాజనం తెలిపారు.

### 5.5.6. సామల సదాశివ

పాండిత్యాన్ని కూడా జీర్ణించుకుని సరళ సుందరమైన వ్యక్తీకరణలతో తన భావాలను పాఠకులతో పంచుకున్న సామల సదాశివగారి సాహిత్య కృషిని గురించి, సంగీత సంస్కారాన్ని గురించి అమ్మంగి ఎన్నో వ్యాసాలు రాశారు. ప్రతి వ్యాసంలో సదాశివగారిపట్ల ఉన్న అభిమానాన్ని ప్రదర్శిస్తూనే ఆయన సాహిత్య సంగీతసేవను గురించి కొనియాడారు.

**"సవ్యసాచి సదాశివ"**[149] వ్యాసంలో అటు సాహిత్యానికి ఇటు సంగీతానికి సదాశివగారు చేసిన కృషిని వివరిస్తూ సదాశివగారిని తెలుగు సాహిత్యంలో సవ్యసాచిగా కొనియాడారు. 'తెలుగులో జానపద వాగ్గేయకారుడైన అన్నమయ్యను శాస్త్రీయ సంగీతకారునిగా మార్చి అపోహలు పడుతున్నారని' సదాశివగారు పలికిన వాక్యాలను గుర్తు చేశారు. ఇక్కడ సదాశివగారు శాస్త్రీయ సంగీతం కంటే జానపదుల సంగీతమే పురాతనమైనదని, సాహిత్య విలువలు గలదిగా కొనియాడిన సందర్భాలను వివరించారు. శాస్త్రీయ ధోరణిని ప్రేమించే వ్యక్తులు చాలావరకు స్థిర అభిప్రాయాలు కలిగినవారై ఉంటారు. కానీ, సంగీతంలో మాధుర్యాన్ని కోరుకునే సదాశివ భావాలు చాలావరకు మానసిక అనుభవం ఆధారంగా వ్యక్తం చేసినవని సదాశివగారి సంగీత సంస్కారాన్ని గురించి విశ్లేషించారు.

**"సంగీత సాహిత్యాల వారధి, సారధి"**[150] వ్యాసంలో సదాశివగారు సాహిత్యం, సంగీతాలలో జాతీయస్థాయి వ్యక్తిత్వం గలవారని కొనియాడారు. ఎంతోమంది కవులు పుట్టనూవచ్చు, గిట్టనూవచ్చు. అందరిలో కొందరే ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంటారు. అలా ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయే వ్యక్తిత్వం ఉన్న సాహితీకారుడే సామల సదాశివగారు. సదాశివగారు సాహిత్యాలను, సంగీతాన్ని, ఉర్దూ తెలుగు సాహిత్యాలను తులనాత్మకంగా వివరించి చెప్పే వారధి, సారధీ మన నుండి దూరంకావడం విషాదకరమన్నారు

[149] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 300

[150] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 312

**"సంగీత సంస్కృతికి నీరాజనం సదాశివ స్వరలయలు"**[151] వ్యాసంలో సామల సదాశివగారి 'స్వరలయలు' గ్రంథంలోని సంగీత విషయాలను గురించి చర్చించారు. హిదుస్తానీ శాస్త్రీయ సంగీతానికి అంజలి ఘటించిన అపూర్వ గ్రంథం 'స్వరలయలు' అని గ్రంథ వైశిష్ట్యాన్ని కొనియాడారు.

**"స్వరలయల ముచ్చట్లు సదాశివ అక్షరాలు"**[152] వ్యాసంలో స్వరలయలు గ్రంథానికిగానూ సామల సదాశివగారికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఇవ్వాటమంటే ఇటు సాహిత్యాన్ని, అటు సంగీతాన్ని సత్కరించడమే అన్నారు. అలా అనడానికి కూడా ప్రధాన కారణం ఉందనే చెప్పాలి. ఎందుకంటే ఉర్దూ కవితా రహస్యాలను అటు ఉర్దూ పాఠకులకు, తెలుగు పాఠకులకు వందలాది వ్యాసాలను అందించిన ఏకైక సాహితీవేత్త సామల సదాశివగారు మాత్రమే. అంతటి నిరాడంబర వ్యక్తిత్వం కలిగిన వ్యక్తినికి గురించి అమ్మంగి అంతే గొప్పగా విశ్లేషించారు.

అజరామయమైన శాస్త్రీయ సంగీతాన్ని, కవిత్వాన్ని శ్రద్ధగా విని అర్థం చేసుకుని ప్రజల చెంతకు చేర్చిన అరుదైన సహృదయులు సామల సదాశివగారిని గురించి వారి సంగీత సాహిత్య పరంపరను గూర్చి **"సదాశివ సంగీత సంస్కారం"**[153] వ్యాసంలో వివరించారు. తెలుగు దేశానికి పరిచయంలేని శాస్త్రీయ సంగీత ప్రపంచాన్ని మన ఇంటి వాకిట్లోకి తీసుకొచ్చిన గొప్ప శాస్త్రీయ, హిందుస్తానీ సంగీతకారుడు సదాశివగారని ఆయన సంగీత సంస్కారాన్ని వివరించారు.

ఈ విధంగా అమ్మంగి సామల సదాశివగారిని విభిన్న కోణాలలో పరిశీలించి, పరిశోధించి ఆయన సంగీత సాహిత్యాల కృషిని, ప్రాంతీయాభిమానాన్ని గురించి అద్భుతంగా వివరించారు.

## 5.5.7. శంకరయ్య

తెలంగాణలోని వికారాబాదు ప్రాంతానికి చెందినా సంఘసంస్కరణ భావాలు కలిగిన 'శంకరయ్య' గారిని గురించి ప్రాంతీయ అస్తిత్వ భావాలు ఉట్టిపడేలా అమ్మంగి **"ఆర్తి తీర్చిన స్ఫూర్తి దాత"**[154] అనే అనే వ్యాసంలో రాయడం జరిగింది. శంకరయ్యగారిలోని మానవతా విలువల

---

[151] అదే. పుట. సం. 320

[152] అదే. పుట. సం. 316

[153] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 270

[154] వేణుగోపాల్. అమ్మంగి, సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం. పుట. సం. 332

సంపదను గురించి, వారిలోని సమాజ అవగాహనను గురించి వివరించారు. 'తానూ, తన పిల్లలు, తన కుటుంబం అంటూ స్వార్థ వలయంలో జీవించే కోట్లాది మందిలో, ముందు సమాజం, ఆ తర్వాతనే కుటుంబం అన్న లక్ష్య శుద్ధితో జీవించే శంకరయ్య సారు వికారాబాదు సమాజానికి మొదట్లో ఒక వింతనే అయినా తరువాత స్థానబలంతో ప్రజలలో చైతన్యం జీసుకొచ్చిన ఆశాజ్యోతి' అని ప్రాంతీయ భావనతో శంకరయ్యగారి కృషిని కొనియాడారు.

శంకరయ్యగారు ప్రధానంగా ఉద్యమ జీవి అన్నారు. ఆయన ఉద్యమ జీవి కనుకనే వికారాబాదు ప్రాంతం అంత సస్యశ్యామలంగా ఉంది, లేకుంటే పటాన్ చెరులాగ కలుషిత జలంతో కన్నీరు పెట్టేదని అమ్మంగి వివరించిన వాక్యాలను పరిశీలించిన ప్రతి పాఠకునిలో ప్రాంతీయ అభిమానం కలుగుతుంది. కొన్ని దశాబ్దాలపాటు ఉద్యమ జీవితం గడిపిన వ్యక్తి నిశ్శబ్దంలోకి జారిపోవడం విషాదకరమని శంకరయ్యగారు లేని ప్రాంతీయ సమాజాన్ని ఊహించుకోలేమని కలతచెందారు.

### 5.5.8. పెన్నా శివరామకృష్ణ

కవిగా, పరిశోధకుడిగా, సంపాదకుడిగా ప్రసిద్ధిపొందిన పెన్నా శివరామకృష్ణ సాహిత్య కృషిని గురించి **"వైరుధ్యాల మధ్య దీపం వెలిగించిన పెన్నా"**[155] వ్యాసంలో వివరించారు. హైకూ రచయితాగా గుర్తింపు పొందిన పెన్నా శివరామకృష్ణ పరిశోధనలో కూడా సముచిత స్థానం సంపాదించారన్నారు. 'ప్రణయం పక్కన మరణం పొంచి ఉన్నప్పుడు కూడా కవిగా తన జీవన తాత్వికతను గానం చేసే కవి హృదయుడు శివరామకృష్ణ' అన్నారు.

[155] వేణుగోపాల్. అమ్మంగి, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన. పుట. సం. 171

# సింహావలోకనం

తెలుగులో సాహిత్య విమర్శ ఒక పెద్ద సమస్యగా పరిణామం చెందింది. తెలుగు సాహిత్యంలో కూడా ప్రాచీన ఆధునిక సాహిత్యాలను గూర్చి విమర్శ శాఖోపశాఖలుగా వెలువడుతుంది. సాహిత్యం, సాహిత్య సిద్ధాంతాలు, సామాజిక సూత్రాల మీద తగుమాత్రం అవగాహన, అధికారం ఉన్నవారు మాత్రమే విమర్శకులుగా చలామణి అవుతారు. అలాంటి కొద్ది విమర్శకులలో అమ్మంగి వేణుగోపాల్ ఒకరు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో విమర్శకులు చాలామందే ఉన్నా సాహిత్య సృజనకు దీటుగా విమర్శలు రావడం లేదని భావించి అమ్మంగి గారు విమర్శారంగంలోకి అడుగుపెట్టారు. నిర్మొహమాటంగా విమర్శ చేయడం, ప్రతికూల అంశాలను కూడా వెల్లడి చేయడం, రచనల్లోని గుణదోషాలను రెండింటినీ చర్చించడం వీరి వ్యాసాలలో పరిశోధనలో న అంశాలు.

అమ్మంగి వేణుగోపాల్ గారు తెలుగు సాహితీలోకంలో ఒక ప్రత్యేక విమర్శనా వ్యక్తిత్వంతో సాహిత్య విమర్శలో తనదైన స్థానాన్ని నిలుపుకొన్న సహృదయ విమర్శకులు. వీరి విమర్శలోని సృజనాత్మకత చెప్పే విషయానికి ఆత్మీయతా ముద్రవేస్తుంది. సహృదయ పాఠకుడు కావ్యాన్ని చదివి ఆనందిస్తాడు. సహృదయుడైన విమర్శకుడు కావ్యపఠనం వల్ల తనకు కలిగిన రసానందాన్ని వివేచించుకుని సాహిత్యతత్వ ప్రతిపాదనకు పూనుకుంటాడు. ఇక్కడే కవికి, సహృదయ పాఠకునికి మధ్య విమర్శకుడు ప్రవేశించి సృజనలోని సౌందర్యాన్ని విశ్లేషించి, తన వివేచనకు అందిన రసరమణీయ అంశాలను వివరిస్తాడు. కావ్యగత భావాన్ని స్పష్టంచేసి, దానికి విలువకట్టి, సాహిత్యంలో దానికొక స్థానాన్ని నిర్ణయిస్తాడు. స్థూలంగా సాహిత్య విమర్శకుని కర్తవ్యమిది. ఈ కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించారు కనుకనే అమ్మంగి సహృదయ విమర్శకులుగా, నిరాడంబర విమర్శకులుగా గుర్తింపు పొందారు.

అమ్మంగి గారు రాసిన ముందుమాటలలో, వ్యాసాలలో ఎక్కడ కూడా అస్పష్టత కనిపించదు. కవికి భావ తీవ్రత ఎంత ముఖ్యమో, విమర్శకునికి భావ స్పష్టత అంతే ఆవశ్యకంగా ఉండాల్సిన గుణం. వీరు కవిగా ప్రసిద్ధులు కావడం మూలంగా విమర్శలో భావ తీక్షణతో పాటు, సరళ భాషను ఉపయోగించి చెప్పే విషయాన్ని సూటిగా మనసులో నాటుకునేలా చెప్పడం జరిగింది.

విమర్శకులుగా ఏ కవి కావ్యం చదివినా, ఆ కవితో, కావ్యంతో తన్మయతను అనుభవించడం మూలంగా వీరి వ్యాసాలలో విశ్లేషణకు న్యాయం చేకూరింది. విమర్శకులుగా తాననుభవించిన రసానందాన్ని, అంతే ఆనందదాయకంగా పాఠకుల చెంతకు చేర్చాలనుకోవడం వీరి విమర్శలో ప్రధాన ధ్యేయంగా కనిపిస్తుంది.

ఎవరి మెప్పుకోసమో విమర్శను కొనసాగించకపోవడం మూలంగా న్యాయమని భావించిన ప్రతీ అంశాన్ని విమర్శలో వ్యక్తీకరించే ప్రయత్నం చేయడంతో కవికి, కావ్యానికి సమగ్రత చేకూరుతుంది. అమ్మంగి గారు వారి అభిరుచికి తగిన విధంగా సహృదయత వీడకుండా సాధ్యమయినంతవరకు నిరాడంబర విమర్శను కొనసాగించారు. కొన్ని సందర్భాలలో అభివ్యక్తిలో సంయమనం పాటించడం వీరి ప్రత్యేక పద్ధతిగా చెప్పవచ్చు. కవి జీవితకాలంలోని సామాజిక స్థితిగతులు, రాజకీయ వాతావరణం, ప్రజల ఆలోచనలు కవిని ఏ విధంగా ప్రభావితం చేస్తాయన్న విషయాన్ని గుర్తించడంలో అమ్మంగి నిష్ణాతులు.

అమ్మంగి వేణుగోపాల్ గారి విమర్శా ప్రస్థానం శిల్పగతమైన చర్చతో ప్రారంభమై, వస్తుగతమైన చర్చగా వికాసాన్ని పొందింది. వారు రాసిన విమర్శనా వ్యాసాలను పరిశీలించి వారి విమర్శనా శైలిలోని వైవిధ్యాన్ని గుర్తించాను. ఒకవైపు రచయితని మెచ్చుకుంటూనే అతని లోపాలను చెబుతూ వాటికి తగిన పరిష్కార మార్గాలను కూడా సూచించడం అమ్మంగి విమర్శలోని విశిష్ట లక్షణంగా చెప్పవచ్చు.

# ఉపయుక్త గ్రంథసూచి

# (Bibliography)

## ఆధార గ్రంథాలు:


1. అరుణకుమారి. జి, ***తెలుగు కవిత్వం-భవిష్యద్దర్శనం***, హైదరాబాదు: వి. చైతన్యకరన్ రెడ్డి, 2009.
2. చంద్రశేఖరరెడ్డి. దుర్గంపూడి, ***తెలుగు పీఠిక.*** హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్, 1990.
3. నమస్తే తెలంగాణ దిన పత్రిక – బతుకమ్మ, 2013 జనవరి 06.
4. నారాయణ రెడ్డి. సింగిరెడ్డి, ***ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు: ప్రయోగములు***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2011.
5. నిత్యానందరావు. వెలుదండ, ***విశ్వవిద్యాలయాలల్లో తెలుగు పరిశోధన.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 2013.
6. బాలగోపాల్. ***రూపం-సారం***. హైదరాబాదు బుక్ ట్రస్ట్, 2011.
7. బాలశ్రీనివాస మూర్తి. గుమ్మన్నగారి, ***సమకాలీన వాదాలు-సాహిత్య విమర్శ.*** 2002.
8. మస్తాన్. అల్లూరి, ***రాచపాలెం సాహిత్య విమర్శ-చారిత్రక అధ్యయనం.*** పరిశోధన సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం, 2021.
9. యాకుబ్. ***తెలుగు సాహిత్య విమర్శలో రా.రా మర్గం.***
10. రామచంద్రారెడ్డి. రాచమల్లు, ***సారస్వత వివేచన*** **(సాహిత్య వ్యాసాలు).** ప్రొద్దుటూరు: యువ సాహితీ, రారా స్మారక సమితి సంయుక్త ప్రచురణ, 2012.
11. రామారావు. ఎస్వీ, ***తెలుగులో సాహిత్య విమర్శ.*** హైదరాబాద్: పసిడి ప్రచురణలు. 2017.
12. రామారావు. చేకూరి, ***చేరాతలు సాహిత్య విమర్శ-పరామర్శ.*** 1991.
13. రాములు.బి.యస్, ***ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణ కథ నవల.*** హైదరాబాదు: విశాలసాహిత్య అకాడమి, 2017.

14. లక్ష్మణ చక్రవర్తి. సి.హెచ్, ***ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు.*** హైదరాబాదు: ఆంధ్రవిద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, 2005.

15. లక్ష్మణ చక్రవర్తి. సి.హెచ్, సంపత్కుమారాచార్య. కోవెల,(ప్ర. సంపాదకులు) ***తెలుగు సాహిత్యవిమర్శ దర్శనం.*** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2016.

16. లక్ష్మీకంతం. పింగలి, ***సాహిత్య శిల్ప సమీక్ష.*** హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, 2016.

17. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, ***విమర్శా శిల్పం.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2002.

18. వేణుగోపాల్. అమ్మంగి, ***అవినాభావం.*** హైదరాబాదు: జయమిత్ర పబ్లికేషన్స్, 1990.

19. వేణుగోపాల్. అమ్మంగి, ***సహృదయ సాహిత్య విమర్శ – వైవిధ్యం.*** హైదరాబాదు: జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, 2018.

20. వేణుగోపాల్. అమ్మంగి, ***సాహిత్య సందర్భం సమకాలీన స్పందన.*** హైదరాబాదు: జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, 2012.

21. శ్రీనివాసరావు. శ్రీరంగం. ***శ్రీ శ్రీ సాహిత్యం–మూడు*** (వచన విభాగం),1990.

22. సిమ్మన్న. వెలమల, ***తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు.*** హైదరాబాదు: నవోదయ బుక్ హౌస్, 2005.

23. సుజాతారెడ్డి. ముదిగొండ, ***అభ్యుదయ సాహిత్య విమర్శ*** (రెండవ ముద్రణ). హైదరాబాదు : రోహిణి పబ్లికేషన్స్. 2004.

24. సుదర్శనం. ఆర్.ఎస్, ***సాహిత్య నేపథ్యం*** (వ్యాసావళి). రాజమండ్రి: శ్రీ రత్న ప్రింటర్స్, 1989.

25. సుప్రసన్నాచార్య. కోవెల, ***సహృదయ చక్రము*** (భూమిక) వరంగల్: శ్రీవాణీ ప్రచురణలు.


26. సూర్యప్రకాశరావు. రాయరావు, అమ్మంగి వేణుగోపాల్ రచనలు – సమగ్ర పరిశీలన. మేడ్చల్. రంగారెడ్డి. ప్రభాత శశి సాహిత్య వేదిక, 2016.

**పత్రికలు:**

1. వెంకటేశ్వర్లు, గుడిపాటి. (సంపా) పాలపిట్ట మాస పత్రిక. హైదరాబాదు : 2010.

**అంతర్జాలం:**

1. www.Google.com
2. www.Youtube.com



# అనుబంధం - 1

**ప్రముఖ కవి, పరిశోధకులు, విమర్శకులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ గారితో పరిశోధకుడు 11.12.2022 వ తేదీన జరిపిన ముఖాముఖి...**

1. **కవిగా ప్రసిద్ధులైన మీరు విమర్శ వైపు ఎలా వచ్చారు?**

   **జ.** 1967-1968లో నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం. ఏ (తెలుగు) మొదటి సంవత్సరం చదివుతున్నాను. నా సహాధ్యాయి కన్నసామిగారు సాయంత్ర సమయంలో 'ఆంధ్రజనత' దినపత్రికలో పనిచేసేవారు. పత్రిక ఎట్లా తయారవుతుందో, అందులో జర్నలిస్టుల పాత్ర ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో అప్పుడప్పుడు నేను అక్కడికి వెళ్ళేవాణ్ణి. ఒకరోజు వారు తమ పత్రికకోసం సమీక్ష రాసివ్వమని ఎదిరె చెన్నకేశవులు గారి 'పొట్టకోసం' కథల సంపుటినిచ్చారు. నేను వారి కోరికమేరకు సమీక్ష రాసిచ్చాను వారు పత్రికలో వేశారు. అది వారికి నచ్చటంతో మరికొన్ని పుస్తకాలకు సమీక్షలు రాయించారు. ఇట్లా 1967లో 'సృజన' పత్రికవారు నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితా రచనపోటీలో ప్రథమ బహుమతి పొందిన నేను కొన్ని నెలల తర్వాత విమర్శరంగంలోకి కూడా ప్రవేశించటం జరిగింది.

2. **మిమ్మల్ని ప్రభావితం చేసిన విమర్శకులు ఎవరు?**

   **జ.** నిస్సందేహంగా రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా) గారే నన్ను ప్రభావితం చేసిన తొలి విమర్శకులు. ఆర్.ఎస్. సుదర్శనం గారి వ్యాసాలు కూడా నన్ను బాగా ఆలోచింపజేశాయి.

3. **మీరు పూర్తిగా ఆధునిక సాహిత్యాన్నే విమర్శించడం జరిగింది. ప్రాచీన కవుల మీద, ప్రాచీన సాహిత్యం మీద విమర్శ చేయకపోవడానికి కారణం?**

   **జ.** మలివిడత ఉద్యమ సమయంలో పోతనను తెలంగాణ కవేనని మళ్ళీ నిరూపించుకోవలసిన ఆగత్యం ఏర్పడింది. అప్పుడు 'సూర్య' దినపత్రికలో నేను రాస్తూ వచ్చిన 'దస్తూరి' కాలంలో ఒకటిరెండు వ్యాసాలు రాశాను. వారానికో కొత్తపుస్తకం వస్తున్న

ఈ కాలంలో విమర్శకుడు తన దృష్టిని ఆధునిక సాహిత్యం మీద కేంద్రీకరించటమే సరైనదని విశ్వసిస్తాను.

**4. తెలంగాణ నుండి మంచి విమర్శ రావడం లేదనే వాదన వినిపిస్తోంది. దానికి మీరేమంటారు?**

**జ.** తెలంగాణ విమర్శకులు తెలంగాణ సాహిత్యంమీద మంచి విమర్శనా వ్యాసాలే వెలువరిస్తున్నారు. దినపత్రికల సాహిత్య అనుబంధాలలో వస్తున్న వ్యాసాలే ఇందుకు తార్కాణం. విశ్వవిద్యాలయాల తెలుగు శాఖల్లో జరుగుతున్న పరిశోధనలు కూడా ఇందుకు నిదర్శనంగా నిలుస్తాయి.

**5. తెలంగాణ రాష్ట్రావతరణానంతరం తెలంగాణ నుండి వెలువడుతున్న విమర్శపట్ల మీ అభిప్రాయం?**

**జ.** తెలంగాణ రాష్ట్రావతరణ అనంతరం వస్తున్న విమర్శ చాలావరకు

- **i.** సమకాలికంగా వెలువడుతున్న పుస్తకాలకు పీఠికల రూపంలో విమర్శ వస్తున్నది.
- **ii.** విస్మృత తెలంగాణ రచయితలను వెలుగులోకి తెచ్చే రూపంలో విమర్శ వస్తున్నది.
- **iii.** ఆయా ప్రసిద్ధ కవుల, రచయితల జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంలో వెలువడే వ్యాసాల రూపంలో ఉంటున్నది.
- **iv.** తెలంగాణ సాహిత్య అకాడమి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కవిలె, మరసం (మంజీరా రచయితల సంఘం), తెరసం(తెలంగాణ రచయితల సంఘం), హైదరాబాదు కవుల వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి, తెలంగాణ ప్రచురణలు, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక వంటి సంస్థలు సాహిత్య విమర్శను వెలువరించటంలో గొప్ప కృషి చేస్తున్నాయి. రచయితలు వ్యక్తులుగా చేస్తున్న కృషి కూడా తక్కువేం కాదు. జరుగుతున్న కృషిపట్ల నాకు సదభిప్రాయమే ఉంది.

**6. ప్రస్తుత కాలంలో తెలంగాణలో మీకు నచ్చిన విమర్శకులు?**

**జ.** పేర్లు చెప్పటం సాధ్యం కాదు. చాలామంది ఉన్నారు. వ్యక్తులే కాక విశ్వవిద్యాలయాలు, తెలంగాణ సాహిత్య అకాడమి వంటి సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయి.

**7. భవిష్యత్తు విమర్శకులు, వారు రాసే విమర్శ ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?**

**జ.** విమర్శకుని ఆత్మ 'జ్ఞానం'. ఈ జ్ఞానం విస్తృతాధ్యయనం వల్ల వస్తుంది. ముఖ్యంగా పాశ్చాత్య విమర్శకులను చదవకుండా ఎవరూ ఆధునిక సాహిత్య విమర్శకులు కాలేరు. భవిష్యత్తు విమర్శ 'కామన్ సైన్సు' ఆధారంగాకాక, జ్ఞానం ఆధారంగా, సాహిత్య అనుభవం ఆధారంగా ఉండాలని కోరుకుంటున్నాను.

**8. ఉదాత్త లక్ష్యంతో, ఉద్యమ ఉధృతితో వచ్చిన అస్తిత్వ ఉద్యమ సాహిత్యం, విమర్శ తెచ్చిన మార్పులు, సాధించిన ఫలితాలు ఏమిటి?**

**జ.** తెలంగాణ ఉద్యమం 2001 ప్రాంతం నుండి సాహిత్యపరంగా ఎన్నో విజయాలు సాధించింది.

- **i.** తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర సంస్కృతుల ఔన్నత్యాన్ని నిరూపించిందీ ఉద్యమం.
- **ii.** పాల్కురికి సోమనను తెలంగాణ ఆదికవిగా ప్రతిష్ఠించిందీ ఉద్యమం.
- **iii.** తెలంగాణ ఉద్యమకారులు ప్రాంతం అంతటా తిరిగి, ప్రచారంచేసి సాధించిన అస్తిత్వ చైతన్యం ఫలితంగా సాంస్కృతికంగా తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు ఘనమైన ఉత్సవాలుగా మారినై. ఈ పండుగల మీద, మేడారం వంటి జాతరల మీద వ్యాసాలూ, గ్రంథాలు ప్రచురితమైనాయి.
- **iv.** తెలంగాణ విమర్శకుల నిశితమైన వాదనల మూలంగా 'తెలంగాణాలో సాహిత్యం లేదు, కవులు లేరు' వంటి వాదనలు మరుగునపడ్డాయి.
- **v.** తెలంగాణ పాట, ధూం ధాంల శక్తి అనితరసాధ్యమైనదని రుజువయింది.
- **vi.** ప్రపంచ తెలుగు మహాసభలు తెలంగాణకు గర్వకారణంగా నిలవటమే కాక, ఈ ప్రాంతం అన్ని ప్రక్రియలలో (నాటకం మినహా) తలమానికంగా ఉందన్న సత్యాన్ని రుజువు చేశాయి. వైతాళికుల జయంతుల సందర్భంగా, రాష్ట్ర అవతరణ సందర్భంగా కవులను, రచయితలను, కళాకారులను, శాస్త్రజ్ఞులను ప్రభుత్వం సన్మానించింది.

9. మీ దృష్టిలో మంచి విమర్శ అంటే?

**జ.** నిష్పాక్షికము, సంస్కారవంతము అయిన సాహిత్యాత్మకమైన తీర్పే విమర్శ.

10. విమర్శకు, పరిశోధనకు మధ్య ఉన్న స్థూలమైన తేడా ఏమిటి?

**జ.** ఒక రచనలోని మంచిచెడ్డలను విశ్లేషించి, వివేచించి చూపేది విమర్శ. విమర్శనా సూత్రాలను యాంత్రికంగాకాక సృజనాత్మకంగా అన్వయించి చెప్పినప్పుడు విమర్శ రాణిస్తుంది. W.H. హడ్సన్ అనే విమర్శకుని అభిప్రాయం ప్రకారం 'విమర్శ అంటే తీర్పు.' మార్క్సిజం, మనోవైజ్ఞానిక శాస్త్రం, అస్తిత్వవాదం– వంటి వాటి మూలంగా సాహిత్య విమర్శలో కూడా ఎన్నో మార్పులు సంభవించాయి.

ఒక రచనలోని కొత్త అంశాన్ని కనిపెట్టడం, నిర్వచించడం, నిరూపించడం, ఒక సైద్ధాంతిక చట్రంలో బంధించి చెప్పటం పరిశోధన. ప్రాచీన గ్రంథాలకు సంపాదకత్వం వహించినవారు రాసిన విపుల పీఠికలన్నీ పరిశోధనలే. ఆధునిక వైతాళికుల రచనల మీద తెలంగాణ రచయితలు సరికొత్త పరిశోధనలు ప్రచురిస్తున్నారు.

11. నాటకం మీద కేవలం ఒకే ఒక్క వ్యాసాన్ని రాశారు. అందుకు కారణం?

**జ.** తెలంగాణ రచయితల నాటకాలు నాకు దొరకలేదు. అదీకాక నేను కవిత్వం, నవల, కథానిక, విమర్శ ప్రక్రియలకు మాత్రమే పరిమితమయ్యాను.

12. కవిగా ప్రసిద్ధులైన మీరు పద్యకావ్యం లేదా పద్యకవిత్వం రాయకపోవడానికి కారణం?

**జ.** బహుశా ఎనిమిదవ తరగతిలో(1960) ఉండగానే మా తెలుగు పండితులు నందగిరి అనంతరాజశర్మ గారి ప్రోత్సాహంతో పద్యాలు రాశాను. ఇది భారత రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిగారి మరణం (1966) దాకా కొనసాగింది. విశ్వవిద్యాలయ విద్య ఆధునిక దృష్టిని ఇచ్చింది. సహాధ్యాయి ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి ఇవి పద్యాల రోజులు కావని వచనకవిత్వాన్ని పరిచయం చేశాడు. 1967లో 'సృజన' వారి కవితా రచన పోటీలో రాసిన వచనకవిత (చీకటిలో బతుకునీడ)కు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి వచ్చింది.

13. **ప్రస్తుతం మీరు ఏమైనా విమర్శనా వ్యాసాలు రాస్తున్నారా..? ఇంకొక విమర్శన వ్యాస సంపుటి వెలువడడానికి అవకాశం ఉందా?**


**జ.** వ్యాసాలు రాస్తున్నాను. మరో విమర్శవ్యాసాల సంపుటి తప్పకుండా వస్తుంది.

# అనుబంధం - ౨



వైజ్ఞానిక పాత్రల సృజన
తొలి తెలంగాణ నవల 'ఆశాదోషం'
ప్రకృతి మూల స్వరూపమే 'లక్ష్మీదేవి'
భూమి గురుత్వాకర్షణ శక్తి
పాండితీ సౌహృదం
ఋషిత్వం, దేశభక్తి కలబోతే 'కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని'
నిత్య సాహితీ వసంతుడు 'నిత్యానందుడు'
నీలగిరి, తెనుగు పత్రికల శతాబ్ద స్ఫూర్తి
75
आज़ादी का अमृत महोत्सव
మూసీ
MUSI
Samputi : 25
Sanchika : 10
Pages : 64
Rs. 20
August 2022
UGC Care List
Approved Journal
మూసీ
25
వసంతాలు


1



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

సంపుటి : 25 సంచిక : 10
ఆగస్టు - 2022
'శుభకృత్' శ్రావణ మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM
Printed and Published by
**B. Anantha Laxmi**
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075
విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

వైజ్ఞానిక పాత్రల సృజన ... ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు 7
తొలి తెలంగాణ నవల 'ఆశాదోషం' ... డా. భీంపల్లి శ్రీకాంత్ 13
మాయాజాలం (బందారం కథలు - 9) ... డా. నందిని సిధారెడ్డి 15
ప్రకృతి మూల స్వరూపమే 'లక్ష్మీదేవి' ... డా. సాగి కమలాకర శర్మ 19
పద్య మనోహరం - 33 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 22
భారతీయీకరణ3 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
భూమి గురుత్వాకర్షణ శక్తి - గణపతి 26
పాండితీ సౌహృదం ... డా. శ్రీరంగాచార్య 27
ఋషిత్వం, దేశభక్తి కలబోతే 'కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని' ... ఎ. శ్రీనాథ్ 29
శ్రీ ఆంధ్ర రత్న ద్యుతులు (గ్రంథాంతరంగం-15) ... ఘట్టమరాజు 33
నిత్య సాహితీ వసంతుడు 'నిత్యానందుడు' ... డా. టి. శ్రీరంగస్వామి 37
నీలగిరి, తెనుగు పత్రికల శతాబ్ది స్ఫూర్తి ... డా. నుగ్గునూతల యాకయ్య 41
శతక కవి - మాటూరి వెంకటేశం ... డా. పెబ్బేటి మల్లికార్జున్ 43
సామాజిక వాస్తవికతకు ప్రతిబింబం-కాలువ మల్లయ్య సాహిత్యం...డా. వేల్పుల కుమారస్వామి 45
అమ్మంగి సహృదయ సాహిత్య విమర్శ - విహంగ వీక్షణం ... గడ్డమీది మల్లేశం 51
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 26 ... టి. లక్ష్మీనారాయణ 55

### కవితలు

అమృతమయం ... అవధాని భానుప్రకాశాచార్య - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; స్నేహాలు ... కోట్ల వెంకటేశ్వర రెడ్డి - 6; నిరంతరం ... డా. ఎన్. గోపి - 12; లేనిచోట ... రామ్ పెరుమాండ్ల - 12; వికాస రేఖలు ... గురిజాల రామశేషయ్య - 14; సముద్రం నా గురువు ... డా. తండు కృష్ణ కౌండిన్య - 31; కల్లోల కూడలి ... డా. వడ్కాపురం కృష్ణ - 32; మంచి మనస్కుడు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 36; నాగళ్ళకు సంకెళ్ళు .. అన్నవరం దేవేందర్ - 40; పంచ కంద పద్యాంజలి ... కట్ట రంజిత్ కుమార్ - 50; మరణం ... కందుల శ్రీను - 50; జగద్గురోర్హారతి ... డా. వొజ్జల శరత్‌బాబు - 62.

### సమీక్షలు

తాత్త్విక జ్ఞానానికి గ్రంథాలయం 'నీహారిక గజళ్ళు' .. కళ్ళెం నవీన్ 54
సాగి కమలాకర శర్మ మూడు గ్రంథాల ఆవిష్కరణోత్సవం 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

# అమ్మంగి సహృదయ సాహిత్య విమర్శ – విహంగ వీక్షణం

**గడ్డమీది మల్లేశం,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి. ఫోన్ : 709 5252 232

ఆధునిక సాహితీ వనంలో విభిన్న ప్రక్రియలలో రచనా వ్యాసంగం కొనసాగించి తనకంటూ ఒక గుర్తింపు సంపాదించుకున్న అమ్మంగి వేణుగోపాల్ గారిని తెలంగాణ సాహిత్య విమర్శకులలో ఒకరిగా చెప్పుకోవాలి. రచయితగా, పరిశోధకుడుగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా ప్రసిద్ధి పొందిన అమ్మంగి వేణుగోపాల్ జనవరి 20, 1948వ సంవత్సరంలో వికారాబాదు జిల్లాలోని, ఆలంపల్లి గ్రామంలో రుక్మిణమ్మ, మదనయ్య అనే దంపతులకు జన్మించారు.

పదిహేను ఏళ్ళకే రచనా వ్యాసంగంలో అడుగు పెట్టిన అమ్మంగి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన గౌరవ పురస్కారాలు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ప్రతిష్ఠాత్మకమైన కాళోజీ నారాయణరావు పురస్కారం అందుకున్న తొలి రచయిత అమ్మంగి వేణుగోపాల్.

విమర్శకుడిగా అమ్మంగి వేణుగోపాల్ గారు తన విమర్శనాత్మక శక్తికి రోజు రోజుకూ పదును పెడుతూ సహృదయ విమర్శకుడిగా తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో సాహిత్య విమర్శ ఒక పెద్దవ్యవస్థగా పరిణామం చెందింది. తెలుగు సాహిత్యంలో కూడా ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను గురించి శాఖోపశాఖలుగా విమర్శలు వస్తూనే ఉన్నాయి. అయితే సాహిత్యం, సాహిత్య సిద్ధాంతాలు, సామాజిక సూత్రాల మీద తగుమాత్రం అవగాహన అధికారం ఉన్నవారు మాత్రమే విమర్శకులుగా చలామణి అవుతారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో విమర్శకులు చాలామంది ఉన్నా సాహిత్య సృజనకు దీటుగా మాత్రం విమర్శలు రావడం లేదని భావించి విమర్శారంగంలోకి అడుగుపెట్టారు అమ్మంగి. వారిలో ఉన్న విమర్శ సాహిత్య సృజనను పాఠకలోకానికి పరిచయం చేయడమే తన కర్తవ్యంగా అమ్మంగి తన విమర్శను కొనసాగిస్తున్నారు.

ఒక గ్రంథంలోని ఔచిత్య, అనౌచిత్య విషయాలను, ధ్వని విశేషాలను, శయ్యా సౌభాగ్యాలను, వస్తు నిర్మాణ సౌష్ఠవాన్ని, పాత్రపోషణ, సన్నివేశ కల్పనలు మొదలైన గ్రంథంలోని సర్వవిషయాలను కూలంకుషంగా చర్చించి సాహిత్యంలో ఆ గ్రంథానికి ఉన్న స్థానాన్ని నిర్ణయించడాన్ని సాహిత్య విమర్శగా పేర్కొనవచ్చు. అలాగే లౌకికాలైన దేశ, కాల, వ్యక్తిత్వాలకు దూరంగా ఉండే విషయ చర్చ కూడా విమర్శగా పరిగణించవచ్చు. వీటన్నిటినీ పరీక్షించిన తరువాతనే విమర్శకుడు ఒక గ్రంథాన్ని లేదా కావ్యాన్ని సమీక్షించేందుకు పూనుకుంటాడు. ప్రతి విమర్శకునికి ప్రధానంగా ఉండాల్సిన లక్షణం సహృదయత. సహృదయత అంటే వైయక్తికమైన ప్రశంసలకు, స్వీయ వ్యక్తిత్వానికి, పక్షపాతాలకు గురి కాకుండా



రచయిత పయనించిన బాటలోనే ప్రయాణించి రచనలోని సౌందర్యాత్మకమైన విషయాలను వెల్లడించి పాఠకుల హృదయాలలో భావానుభూతిని కలిగించడం. సహృదయత ప్రగాఢంగా గల సాహిత్య విమర్శకుడు ఏ సందర్భంలో కూడా స్వీయ ఆవేశాలకు లోనుకాకుండా సమతౌల్యంతో భావావేశ రాహిత్యంగా తన విమర్శను కొనసాగిస్తాడు. ఆ విమర్శ దేశ, కాల, వ్యక్తిత్వాలకు అతీతంగా సాగే సద్విమర్శగా గుర్తింపు పొందుతుంది.

కవి తన అనుభవాల్ని కార్యరూపంలో ఉంచితే, సహృదయ విమర్శకుడు దాన్ని పరామర్శించి కావ్యంలో కవి నిక్షేపించిన శిల్పాన్ని గుర్తించి పాఠకుల చెంతకు చేరుస్తాడు. ఇంకా చెప్పాలంటే సహృదయ విమర్శకుడు అనేవాడు కావ్యంలోని భావానుభూతిని పొంది, ఆ అనుభూతికి ఆధారమైన కావ్యగత శిల్ప విషయాలను పరామర్శ చేస్తాడు. ఈ లక్షణాలన్నింటిని పరిశీలించిన అమ్మంగి 1967లో సమీక్షలతో విమర్శ రంగంలో అడుగుపెట్టారు. "నవలా రచయితగా గోపీచంద్" (1988) అన్న సిద్ధాంత గ్రంథంతో పరిశోధన రంగంలోకి ప్రవేశించారు. విమర్శకు సంబంధించినంత వరకు 'అవినాభావం' (1990) వారి తొలి విమర్శనా గ్రంథం. అనంతరం 'గోపీచంద్ జీవితం–సాహిత్యం' (2010) శత జయంతి నివాళి మోనోగ్రాఫ్, 'సాహిత్య సందర్భం సమకాలీన స్పందన' (2012), వట్టికోట ఆళ్వారుస్వామి రచనలు – ఒక పరిశీలన (2014), సహృదయ సాహిత్య విమర్శ–వైవిధ్యం (2018) అన్న వ్యాస సంపుటులను ప్రచురించారు.

పైన తెలిపిన విమర్శనా గ్రంథాలను గురించి వివరించడం అనేది ఒక పరిశోధన సిద్ధాంత గ్రంథం అవుతుంది. అందుకే "సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం" (2018) అన్న సాహిత్య విమర్శ వ్యాస సంపుటిని గురించి మాత్రమే చర్చించదలచాను. ఈ వ్యాస సంపుటిలో మొత్తం 62 వైవిధ్యభరితమైన వ్యాసాలు ఉన్నాయి. ఈ సంపుటిని తెలంగాణ జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, హైదరాబాదు వారు 2018లో ప్రచురించారు.

అమ్మంగి వేణుగోపాల్ గారు ఈ వ్యాస సంపుటి ఆరంభంలోనే అద్భుతమైన వ్యాసాలతో పాఠకులను సహృదయ పూర్వకంగా సాహిత్య విమర్శలోకి ఆహ్వానిస్తున్నారు. పరిశోధననే ప్రమాణంగా జీవిస్తున్నవారు కావడం మూలంగానేమో అమ్మంగి మొదటి వ్యాసాన్ని ఒక పరిశోధనా గ్రంథంలో నిక్షిప్తమైనటువంటి సత్యాన్వేషణలు, విజ్ఞాన సంబంధమైన విషయాలను గురించి వివరించారు. 'ఆధునికాంధ్ర కవిత్వం-సినారె పరిశోధన' అన్నది మొదటి వ్యాసం. ఈ వ్యాసంలో సి. నారాయణరెడ్డిగారి "ఆధునికాంధ్ర కవిత్వము : సంప్రదాయము, ప్రయోగములు" అన్న పరిశోధన గ్రంథం గురించి ఆ సిద్ధాంత గ్రంథంలో ఉన్నటువంటి సాహిత్య విశేషాలు గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు.

సంప్రదాయంపై జరిగే మార్పే ప్రయోగమని భావించిన సినారె గారి వ్యక్తిత్వాన్ని వారు తమ సిద్ధాంత గ్రంథంలో చేసినటువంటి నూతన ప్రయోగాలను గురించి అమ్మంగి ఈ వ్యాసంలో వివరించారు. వేణుగోపాల్‌గారికి సినారె గారంటే ఎంతో గౌరవం. ఎందుకంటే అమ్మంగి వారికి పాఠాలు నేర్పిన సాహిత్య గురువు సి. నారాయణరెడ్డిగారు. వారిపై ఎంతో గౌరవం ఉన్నప్పటికీ ఈ వ్యాసంలో పరిశోధకునికి సంబంధించిన వ్యక్తిత్వ విశేషాలను గురించి ఏమాత్రం కూడా విశ్లేషించకుండా పరిశోధనా గ్రంథంలో ఉన్న ఆధునికతను గురించి మాత్రమే చర్చించారు. అదే అమ్మంగిలో ఉన్న సహృదయ దృక్పథం అని చెప్పవచ్చు. ఎన్ని కోణాలనుండి పరిశీలించినా 1962లో వెలువడినటువంటి ఈ సిద్ధాంత పరిశోధనా గ్రంథం అన్ని విధాలుగా సమగ్రతను సంపాదించుకుంది అని ప్రతిపాదించిన తీరు అద్భుతంగా ఉంది.

రెండవ వ్యాసం మొదటి వ్యాసానికి ఎలాంటి పొంతన లేని గంగుల శాయి రెడ్డి గారు రాసిన 'కాపుబిడ్డ' పద్యకావ్యం గురించి. ఈ కాపు బిడ్డ కావ్యం గ్రామీణ నేపథ్యంలో నిసర్గమైన వాతావరణంలో సాగిన ఒక 'శ్రమోపనిషత్తు' అని కావ్యంలో కవి చిత్రించినటువంటి కర్షక జీవితాన్ని సజీవంగా ఉంచి పాఠకుల చెంతకు చేర్చారు అమ్మంగి. ఈ కావ్యం ద్వారా శాయిరెడ్డి గారు సమాజంలో అత్యధిక సంఖ్యాకులైన వ్యవసాయదారుల జీవితాన్ని చిత్రించటానికి నిజాయితీగా ప్రయత్నించారు అని చెప్పడంలో కవి అంతరాత్మను అర్థం చేసుకున్న తీరు స్పష్టం అవుతుంది. ఏ ప్రక్రియను ఎంచుకున్నా అమ్మంగి విమర్శకుడిగా ఆ కవిలో లేదా ప్రక్రియలలో ఉన్నటువంటి మహోన్నతమైన అంశాలను మాత్రం కచ్చితంగా విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నారు. శాయిరెడ్డి తన కావ్యాన్ని మొదట పౌరాణిక సందర్భాలతో ప్రారంభించినప్పటికీ ముగింపుకు వచ్చేసరికి భౌతిక ప్రపంచంలోకి ప్రయాణించి కావ్యాన్ని ముగించారని అమ్మంగి తెలిపారు.

పరిశోధనా గ్రంథాల మీద రాసిన వ్యాసాలే కాకుండా ఈ సంపుటిలో పరిశోధనలు చేసి నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించిన వ్యాసాలు కూడా ఉన్నాయి. "తెలంగాణాలో కవి సమ్మేళనాలు" అన్న వ్యాసంలో క్రీ.శ.ఒకటవ శతాబ్దంలోనే తెలంగాణాలో తొలి కవి సమ్మేళనాలు జరిగాయనడానికి ఆధారాలు ఉన్నాయంటారు అమ్మంగి. అందుకు ఉదాహరణగా శాతవాహన రాజైన హాలుడు 273 మంది కవులు రచించిన 700 గాథలను కవుల సమ్మేళనం ద్వారా సేకరించి సంకలనంగా రూపొందించి 'గాథా సప్తశతి' అన్న గ్రంథాన్ని వెలువరించి ఉంటాడని వివరించిన తీరు తెలంగాణ ప్రాంత వాసులలో తొలి సారిగా చారిత్రక సువాసనను రాజేసే విధంగా ఉంది. ఇలా నిర్ధారించడానికి ప్రధాన కారణం క్రీ.శ. 946 కాలం నాటి కరీంనగర్ జిల్లాలో జినవల్లభుడు వేయించిన కుర్క్యాల(బొమ్మల గుట్ట) శాసనమే తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనమని వివరించారు. అంటే తెలంగాణలో రెండువేల సంవత్సరాల క్రితమే కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాలలో గాని, మెదక్ జిల్లా కొండాపూర్ లో గాని తొలి కవి సమ్మేళనాలు జరిగి వుంటాయని అమ్మంగి చారిత్రక ఆధారాలతో వివరించారు.

తెలంగాణలోని చారిత్రక ఆధారాలను సమగ్రంగా విశ్లేషించిన తరువాత తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు చెందిన హిందుస్తానీ సంగీత దిగ్గజం అయిన నారాయణరావుగారి జీవిత ఇతివృత్తం ఆధారంగా వెలువడినటువంటి "మ్రోయుతుమ్మెద" నవలను గురించి పరిశోధనాత్మకంగా విశ్లేషించారు. ఈ వ్యాసాన్ని 'మ్రోయుతుమ్మెద : నారాయణరావు' (ఒక విస్మృత సంగీత విద్వాంసుని జీవితం) అనే శీర్షికతో రాయడం జరిగింది. ఈ మ్రోయుతుమ్మెద నవలను తెలుగు సాహిత్యరంగంలో అహంకారాన్ని ఒక అలంకారంగా ధరించి, సంప్రదాయ హైందవ భావాలను ప్రచారం చేయటానికి సాహిత్యాన్ని ఒక వారధిగా ఎంచుకున్నటువంటి విశ్వనాథ సత్యనారాయణగారు రచించారు. విశ్వనాథ సత్యనారాయణగారు 1960 ప్రాంతంలో తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో అధ్యాపక వృత్తిని కొనసాగించిన సమయంలో నారాయణరావుగారి ఆధ్యాత్మిక ప్రభావం విశ్వనాథగారిపై పడిందని ఆ కారణంగానే నారాయణ రావుగారినే నవలా నాయకునిగా చేసుకుని మ్రోయుతుమ్మెద నవలను రాసారని అమ్మంగి పేర్కొన్నారు. నారాయణ రావుగారి జీవిత సంగీతాలను వస్తువుగా తీసుకుని విశ్వనాథ రాసిన ఈ నవల ఆ మహా సంగీతవేత్తకు

గొప్ప నివాళి అని తెలంగాణ ప్రాంత వ్యక్తుల గొప్పతనాన్ని తెలియజేసారు వేణుగోపాల్. అందుకే మ్రోయుతుమ్మెద ఒక విలక్షణ సంగీత విద్వాంసుని జీవితం ఆధారంగా రాయబడ్డ అర్ధ వాస్తవిక, అర్ధ కాల్పనిక నవలని చెప్పగలిగారు.

"తెలంగాణ చిరస్మరణీయులు"అన్న వ్యాసంలో ప్రాచీన కాలంలోని గుణాఢ్యుని నుంచి ఆధునిక కవిత్వం మీద తనదైన ముద్ర వేసి తెలంగాణ అస్తిత్వాన్ని చాటి చెప్పినటువంటి అలిశెట్టి ప్రభాకర్, ప్రొఫెసర్ జయశంకర్ గారి వరకు తెలంగాణ చరిత్రలో నిలిచేపోయే చిరస్మరణీయుల సేవలను, వారు సాధించిన విజయాలను గురించి విశ్లేషించారు. అదే విధంగా 'తెలంగాణ అంతరాత్మ కాళోజీ' అన్న వ్యాసంలో తెలంగాణ ఉద్యమంలో భాషారూపంలోని ఆధునికతకు మాత్రమే కాకుండా భావరూపంలోని ఆధునికతకు పెద్ద పీట వేసినటువంటి కాళోజి నారాయణ రావుగారు ప్రజలందరి ఆత్మ, తెలంగాణ అంతరాత్మ అంటూ కాళోజి గారిలో ఉన్న ప్రజాదృష్టి, ఉద్యమ స్ఫూర్తిని గురించి వివరించిన తీరు గొప్పగా ఉంది. అదేవిధంగా 'తెలంగాణ ఉద్యమ కవిత్వం-మలిదశ' అన్న వ్యాసం 'చరిత్ర రచనలో సాహిత్యాత్మ', 'గోలకొండ'అన్న వ్యాసాలలో కూడా తెలంగాణ చరిత్ర, సాహిత్యం, ఉద్యమ స్ఫూర్తిని గురించి ఎంతో స్పష్టంగా వివరించారు. భిన్న ప్రక్రియలపై వ్యాసాలు రాసినప్పటికీ తెలంగాణ ప్రాంతం, తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమం, సాహిత్యం మీదనే ఎక్కువ వ్యాసాలు రాయడం జరిగింది.

ఈ విధంగా అమ్మంగి వేణుగోపాల్ గారు రాసినటువంటి ప్రతి విమర్శనా వ్యాసం కూడా పరిశోధనా విలువలను పుష్కలంగా కలిగి ఉన్నాయని చెప్పవచ్చు. వేణుగోపాల్ గారు పరిశోధనా గ్రంథాలపైన, పద్యకావ్యాలపైన, పరిశోధనా పూర్వకంగా రాసిన వ్యాసాలే కాకుండా ఈ వ్యాస సంపుటిలో కావ్యాలకు, యాత్రా చరిత్రలకు, కవితా సంపుటాలకు రాసిన ముందుమాటలు, చారిత్రక గ్రంథాలపైన సమీక్షలు చాలానే ఉన్నాయి. ముందుమాటల విషయానికి వస్తే ప్రతి ముందుమాటను కూడా స్పష్టంగా, సమగ్రంగా పాఠకుల దృష్టిని ఆకర్శించే విధంగా చెప్పారు. దేవులపల్లి కృష్ణమూర్తి, రావులపుల్లాచారి గార్ల కథా సంపుటాలకు, దాసోజు జ్ఞానేశ్వర్, పప్పుల రాజిరెడ్డి, నిజం, బి.యస్. రాములు, వల్సపైడి, దోరవేటి చెన్నయ్యల కవితా సంపుటాలకు, తెలుగువారి మహాయాత్రికుడు ఆదినారాయణ గారి యాత్రా చరిత్రకు, ఎ.వి.యన్. రాజు, జలజం సత్య నారాయణ గారి అనువాద గ్రంథాలకు అమ్మంగి వేణుగోపాల్ గారు రాసిన ముందుమాటలు అన్నీ కూడా కవిలో, రచయితలో, యాత్రికునిలో, అనువాదకునిలో ఉన్నటువంటి సాహిత్య జిజ్ఞాసను విశ్లేషించిన తీరు విమర్శకుల మన్ననలు పొందే విధంగా ఉన్నాయి.

తెలంగాణ ప్రముఖుల వ్యక్తిత్వ సాహిత్య చిత్రణలను తెలంగాణ వైతాళికులు అయిన కాళోజి నారాయణరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, దేవులపల్లి రామానుజరావు, పొట్లపల్లి రామారావు, బిరుదురాజు రామరాజు, సామల సదాశివ గారి గొప్పతనాన్ని గురించి వారి వ్యక్తిత్వాలను గురించి ఎంతో అద్భుతంగా ఈ సంపుటిలో వివరించారు.

కేవలం కవులను గురించి విశ్లేషించడం మాత్రమే కాకుండా అమ్మంగి కవయిత్రులు, ఉత్తమ వ్యకిత్వం కలిగిన స్త్రీలను గురించి కూడా వ్యాసాలను రాసారు. అందులో తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల వ్యక్తిగా కృషి చేసిన శ్రీమతి జ్వలిత గారిని గురించి, వ్యథార్థ - జీవుల యధార్థ కథల రచయిత్రి కరుణ, జీవితాన్ని చదివితే వచ్చిన జ్ఞాన ప్రభావంతో సాహిత్య రంగంలోకి ప్రవేశించి సమ సమాజం దిశగా సంకల్పశక్తితో అడుగులు వేస్తున్నటువంటి కనక సుగుణ గారిని గురించి ఎంతో చక్కగా వివరించారు.

ఈ గ్రంథ పరిధిలో లేని మరొక మంచి పరిశోధన గూర్చి పేర్కొనటం అవసరం. తెలుగుభాషలోనే కాక, ఇతర దేశాల్లోనూ, విదేశీ భాషలలోనూ వచనకవితా ప్రక్రియ ఆవిర్భావవికాసాలను గూర్చి అమ్మంగి వేణుగోపాల్ ఒక సుదీర్ఘ సమగ్ర వ్యాసం రచించారు. దీన్ని 'విజేత' సంస్థ వారు "సాహితీసుధ" గ్రంథంలో 2018లో ప్రచురించారు. ఈ విధంగా సహృదయ విమర్శకులుగా అమ్మంగి వేణుగోపాల్ గారు రాసినటువంటి ప్రతివ్యాసం, ప్రతి ముందుమాట కూడా సాహిత్య విలువలు పొందినవిగా ఉండి రచనలకు శోభను కలిగించే విధంగా ఉన్నాయి. వారి సహృదయత కారణంగానే నేటికి అనేకమంది ఆధునిక యువకవులు అమ్మంగి వారితో కావ్యాలకు ముందుమాటలు, కావ్యాలపై సమీక్షలు రాయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సహృదయ దృష్టితో రాసినటువంటి ఈ విమర్శనా వ్యాసాలు అన్నీ కూడా సహృదయ పాఠకుల దాహం తీర్చేందుకు తెలుగు నేలంతా ప్రవహిస్తున్నాయి. పాఠకులలో పఠనాసక్తిని పెంచి విజ్ఞాన బోధ వైపు పరుగులు తీస్తున్నాయి.

**ఉపయుక్త గ్రంథ సూచిక**

1. రామారావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ. హైదరాబాదు : పసిడి ప్రచురణలు, 2007.

2. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. విమర్శా శిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2002.

3. వేణుగోపాల్, అమ్మంగి. సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం. హైదరాబాద్: జయమిత్ర సాహిత్య,సాంస్కృతిక వేదిక, 2018.

4. వేణుగోపాల్, అమ్మంగి. సాహిత్య సందర్భం-సమకాలీన స్పందన. హైదరాబాదు:జయమిత్ర సాహిత్యసాంస్కృతిక వేదిక, 2012.

# అనుబంధం - 3



**కవి, సాహిత్య విమర్శకుడు అమ్మంగి వేణుగోపాల్ గారితో ...**